ఈనాడు

విజయవాడ 28-12-2025 ఆదివారం సిటీ సంపుటి 52 . సంచిక 138

THE LARGEST CIRCULATED TELUGU DAILY

రూ. 8-00 పేజీలు 18+28

www.eenadu.net

Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru

భీమ Pure Since 1925

100 ఇయర్స్ ఆఫ్ భీమ

టుగెదర్ ఫ్యూరెవర్

"టుగెదర్ ఫ్యూరెవర్" అనేది గత 100 సంవత్సరాల భీమ ప్రయాణంలో, తన గౌరవనీయమైన వినియోగదారులు మరియు భాగస్వాములతో కలిసి నడిచిన అనుబంధానికి ప్రతీక. ఈ "కలిసి ఉండటం" అనే భావమే భీమను తరతరాలుగా అజరామరమైన వారసత్వంగా నిలిపింది. 1925 నుండి "కలిసి ఉండే" ఈ బంధం, భీమ యొక్క మూల విలువ అయిన "పరిశుద్ధత" ద్వారా మరింత బలపడింది.

శతాబ్దం పాటు భీమ కేవలం ఒక ఆభరణాల సంస్థ మాత్రమే కాదు — అది అనేక "కలిసిన క్షణాల కథల"లో భాగమైంది. వధువు కన్నుల్లో మెరిసే ఆనందం నుండి, నూతన శిశువు తొలిసారిగా ధరించే ఆభరణం వరకు, భీమ సృష్టించిన ప్రతి మాణిక్యం తరతరాల ఉత్సవాలు, ప్రేమ, సంప్రదాయాలను సాక్ష్యంగా చూసింది. విశ్వాసం మరియు పరిశుద్ధతపై నిలబడిన ఈ నిలకడైన బంధం, 1925 నుండి భీమను కేవలం ఒక పేరు కాకుండా ప్రతి కుటుంబంలో అత్యంత ముద్దైన జ్ఞాపకాల్లో భాగంగా మార్చింది .

తన 100వ వార్షికోత్సవం సందర్భంలో, భీమ ఈ "కలిసి ఉండటం మరియు పరిశుద్ధత" అనే విలువల పట్ల తన నిబద్ధతను మరింతగా పునరుద్ఘాటిస్తోంది — 100 సంవత్సరాలకు మించి, ఎప్పటికీ, నిరంతరం మీతో కలసి శుద్ధంగా ఉండాలనుకుంటుంది.

అందుకే మేము ఎల్లప్పుడూ "టుగెదర్ ఫ్యూరెవర్ – మీతో కలసి" ఉంటాము.

భీమ యొక్క అద్భుతమైన 100 సంవత్సరాల సినిమాను చూడటానికి స్కాన్ చేయండి.



BHIMA

FORMERLY BHIMA

విజయవాడ: బందర్ రోడ్, ఎమ్ . జి రోడ్, గేట్‌వే హోటల్ పక్కన, ఫోన్ : 0866-2481531 / 7411554074 | రాజమండ్రి : గోకవరం బస్టాండ్ ఎదురుగా, లక్ష్మీవారపు పేట - 533101 , ఫోన్ : 0883-2460100 / 9606973326

బెంగళూరు · ఉడుపి · హసన్ · మంగళూరు · శివమొగ్గ · చెన్నై · హోసూర్ · బెళగావి · హుబ్బళ్ళి | bhimagold.com

ఈనాడు


విజయవాడ 28-12-2025 ఆదివారం సిటీ సంపుటి 52 . సంచిక 138
THE LARGEST CIRCULATED TELUGU DAILY
రూ. 8-00 పేజీలు 18+28 www.eenadu.net
Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru

సువాసనల వెనక ప్రమాదాలు!




ఉతికిన దుస్తులు మరింత తాజాగా ఉండాలని... సువాసన వెదజల్లాలని ఫ్యాబ్రిక్ కండిషనర్లను వినియోగిస్తాం. అయితే అవి ఎంత సురక్షితమనే విషయాన్ని మాత్రం విస్మరిస్తాం. వాటితో ప్రమాదకరమైన రసాయనాలు శరీరంలోకి వెళతాయని, ఆరోగ్య సమస్యలు వస్తాయని నిపుణులు చెబుతున్నారు.

ఫ్యాబ్రిక్ సాఫ్ట్‌నర్లలోని కాటియోనిక్ సర్ఫెకెంట్లు దుస్తులను మృదువుగా మారుస్తాయి. కానీ వాటిలోని క్వాటర్నరీ అమ్మోనియం సమ్మేళనాలు (క్వాట్స్), వోలటైల్ ఆర్గానిక్ కాంపౌండ్స్ (వీఓసీ), సింథటిక్ ఫ్రాగ్రెన్స్, సిలికాన్స్ తదితరాల వల్ల అలర్జీ, ఆస్తమా, ఇతర శ్వాసకోశ సమస్యలు తలెత్తుతాయి. వీటి నుంచి వచ్చే వాసన పీల్చడం వల్ల దీర్ఘకాలిక బ్రాంకైటిస్ వచ్చే ప్రమాదముంది. కొందరిలో తలనొప్పి, తల తిరగడం, శ్వాస ఆడకపోవడం వంటి సమస్యలు ఎదురవుతాయి. తొలిదశలో ఈ లక్షణాలను గుర్తించలేక... రోజువారీ ఒత్తిడి లేదా అలసటగా తోసిపుచ్చుతారు. పిల్లలు, సున్నితమైన చర్మం ఉన్నవారిలో దురద, దద్దుర్లు, వాపు వంటివీ వస్తాయి.



- ఫ్యాబ్రిక్ సాఫ్ట్‌నర్లు బెంజైల్ అసిటేట్, క్లోరోఫామ్, ఇథనాల్ వంటి వీఓసీలను విడుదల చేస్తాయి. ఇవి ఊపిరితిత్తులు, వాయునాళాలకు నష్టం చేస్తాయి.
- కొన్ని వీఓసీల వల్ల దీర్ఘకాలంలో నరాలు దెబ్బతినడం, థైరాయిడ్, రోగనిరోధక శక్తి తగ్గడం, క్యాన్సర్ వంటి సమస్యలు వచ్చే అవకాశం ఉంది.



- సువాసన కోసం వినియోగించే కృత్రిమ కారకాల్లో 'థాలేట్లు' అనే రసాయనాలుంటాయి. ఇవి ఈస్ట్రోజన్, టెస్టోస్టిరాన్ స్థాయిలను దెబ్బతీస్తాయి. దీంతో సంతానోత్పత్తి సమస్యలతో పాటు మానసిక ఆరోగ్యం ప్రభావితమయ్యే అవకాశముందని అధ్యయనాలు చెబుతున్నాయి.
- జీవక్రియపై ప్రభావం చూపడం ద్వారా బరువు పెరగడం, ఇన్సులిన్ నిరోధకతకు కారణమవుతాయని నిపుణులు చెబుతున్నారు.

(మిగతా 6లో)

సర్దుబాటే మంత్రం

మదనపల్లె జిల్లా ఏర్పాటుతో అన్నమయ్యలో మిగిలేవి 3 నియోజకవర్గాలే

వైఎస్సార్ కడపలోకి రాజంపేట, తిరుపతిలోకి రైల్వేకోడూరు, మదనపల్లెలోకి రాయచోటి • అలా సర్దకపోతే కష్టం

• సీఎం దృష్టికి తీసుకెళ్లిన అధికారులు • నేడు తుది నిర్ణయం



జిల్లాలు, మండలాల పునర్విభజనపై మంత్రులు, అధికారులతో సమీక్షిస్తున్న సీఎం చంద్రబాబు

ఈనాడు - అమరావతి

జిల్లాల పునర్విభజనలో పీటముడి పడింది. నాలుగు నియోజకవర్గాల్లోని 19 మండలాలతో మదనపల్లె జిల్లా ఏర్పాటు తర్వాత.. ప్రస్తుత అన్నమయ్య జిల్లా మూడు నియోజకవర్గాలతో రాష్ట్రంలో చిన్న జిల్లాగా మిగులుతోంది. శనివారం సీఎం చంద్రబాబు వద్ద జిల్లాల పునర్విభజనపై జరిగిన సమావేశంలో దీనిపై చర్చ జరిగింది. ప్రత్యేక జిల్లాగా కొనసాగించలేని పరిస్థితి, చిన్న జిల్లాల కారణంగా ఇప్పటికే తెలంగాణలో ఎదురవుతున్న ఇబ్బందులపై చర్చించారు. రాజంపేట నియోజకవర్గాన్ని వైఎస్సార్ కడపలో, రైల్వేకోడూరు నియోజకవర్గాన్ని తిరుపతి జిల్లాలో, రాయచోటిని కొత్తగా ఏర్పాటు చేసే మదనపల్లె జిల్లాలో కలిపేందుకు ఉన్న అవకాశాల్ని పరిశీలించాలని అధికారులు ప్రతిపాదించారు. దీనిపై ప్రాంతాల వారీగా దూరాలతో సమగ్ర నివేదిక తయారు చేయాలని సీఎం సూచించారు. జిల్లాలు, రెవెన్యూ డివిజన్లలో మార్పుచేర్పులకు సంబంధించి ప్రభుత్వం గత నెల 27న ప్రాథమిక నోటిఫికేషన్ ఇచ్చింది. నెల రోజులపాటు అభ్యంతరాలు స్వీకరించింది. రాష్ట్రవ్యాప్తంగా వచ్చిన 927 అభ్యంతరాలపై సీఎం, మంత్రులు, అధికారులు శనివారం చర్చించారు. కొన్నిచోట్ల మార్పుచేర్పులు సూచించారు. వీటన్నింటిపై ఆదివారం మరోసారి సమగ్రంగా చర్చించి, తుది నిర్ణయం తీసుకోనున్నారు. 29న మంత్రివర్గ సమావేశంలో ఆమోదించి, 31న తుది నోటిఫికేషన్ జారీ చేస్తారు.

గ్రేటర్ల ఏర్పాటుకు సమయం చాలదు

గ్రేటర్ విజయవాడ, గ్రేటర్ తిరుపతిల ఏర్పాటుపై అధికారులు సమగ్ర ప్రజంటేషన్ ఇచ్చారు. వీటి ఏర్పాటుకు సీఎం చంద్రబాబు కూడా సానుకూలత వెలిబుచ్చారు. అయితే జనగణన నేపథ్యంలో ఏర్పాటుకు సరిపడా సమయం కూడా లేదు. ఇందులో కలిపేందుకు ప్రతిపాదించిన (మిగతా 6లో)

విద్యతోనే పేదరికంపై విజయం

ఎన్టీఆర్ విద్యాసంస్థల వార్షికోత్సవంలో సీఎం చంద్రబాబు 3లో

ఎంజీనరేగా రద్దుపై ఆందోళన పథం

5 నుంచి దేశవ్యాప్త నిరసనలు

రైతు చట్టాల మాదిరిగా భారీ పోరు

కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ ఏకగ్రీవ తీర్మానం

ఇది మరో పెద్దనోట్ల రద్దులాంటిది: రాహుల్

మోదీ సర్కారు ప్రజాగ్రహాన్ని చూస్తుందన్న ఖర్గే



నరేగాను పరిరక్షించుకుంటామని సీడబ్ల్యూసీ సమావేశంలో నేతలతో ప్రమాణం చేయిస్తున్న మల్లికార్జున ఖర్గే. చిత్రంలో సోనియా, రాహుల్

ఈనాడు, దిల్లీ: యూపీఏ పాలనలో తీసుకువచ్చిన 'మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం' (ఎంజీనరేగా) స్థానంలో కేంద్ర సర్కారు తెచ్చిన కొత్త చట్టంపై జనవరి 5 నుంచి దేశవ్యాప్తంగా పెద్దఎత్తున ఆందోళన చేపట్టాలని కాంగ్రెస్ పార్టీ నిర్ణయించింది. వీబీ జీ రామ్ జీ పేరుతో తెచ్చిన చట్టాన్ని కేంద్ర సర్కారు వెనక్కి తీసుకునేలా ఈ పోరాటం కొనసాగించనుంది. శనివారం ఇక్కడి ఇందిరాభవన్‌లో పార్టీ అధ్యక్షుడు మల్లికార్జునఖర్గే, అగ్రనేతలు- సోనియాగాంధీ, రాహుల్‌గాంధీల ఆధ్వర్యంలో జరిగిన పార్టీ అత్యున్నత విధాన నిర్ణాయక మండలి.. కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) సమావేశం ఈమేరకు ఏకగ్రీవంగా తీర్మానం చేసింది. ఉపాధి హామీ పథకానికి మద్దతుగా నాయకులంతా ప్రమాణం చేశారు. ఎట్టిపరిస్థితుల్లోనూ మహాత్మాగాంధీ ఉపాధి హామీ పథకాన్ని రక్షించుకుంటామని, గ్రామీణ కూలీల హక్కులను, మహాత్మాగాంధీ పేరును కాపాడతామని శపథం చేశారు. సంబంధిత శాఖ మంత్రితోగానీ, మంత్రివర్గంతోగానీ చర్చించకుండా ప్రధాని మోదీ ఎంజీనరేగాను రద్దు చేయాలని ఏకపక్షంగా నిర్ణయించారని, ఇది కూడా మరో పెద్దనోట్ల రద్దులాంటిదేనని లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ విమర్శించారు. ప్రజాస్వామ్యం, సమాఖ్య వ్యవస్థపై జరిగిన పెనుదాడిగా దీనిని అభివర్ణించారు. సమావేశానంతరం విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రాల నుంచి, పేదలనుంచి డబ్బు లాగేసుకొని (మిగతా 6లో)

రప్పా రప్పా అని రెచ్చిపోతే జైలే

- జగన్ పుట్టినరోజు పేరిట పేట్రేగిపోయిన వైకాపా మూకలు
- నడిరోడ్డుపై పొట్టేళ్లను నరుకుతూ.. జగన్ చిత్రాలకు రక్తతర్పణలు
- ప్రజలను భయపెట్టేలా కత్తులతో రోడ్లపై ప్రదర్శన
- **16** కేసులు.. **63** మంది అరెస్టు
- పలువుర్ని రోడ్లపై నడిపిస్తూ కోర్టుకు తీసుకెళ్లిన పోలీసులు

ఈనాడు, అమరావతి: వైకాపా అధినేత జగన్‌మోహన్‌రెడ్డి పుట్టినరోజు సందర్భంగా ఉన్మాదంతో పేట్రేగిపోయిన వైకాపా నాయకులు, కార్యకర్తలపై పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు. రాజకీయం ముసుగులో రౌడీయిజాన్ని, అరాచకాన్ని ఏ మాత్రం ఉపేక్షించేది లేదంటూ కఠిన హెచ్చరికలు పంపిస్తున్నారు. ఈ నెల 21న, ఆ తర్వాత రాష్ట్రంలోని పలుచోట్ల వైకాపా నాయకులు, కార్యకర్తలు, కొందరు రౌడీషీటర్లు, నేరచరితులతో కలిసి నడిరోడ్డుపైన పెద్ద పెద్ద కత్తులు, తల్వార్లు చేత పట్టుకుని ప్రదర్శనలిస్తూ, పొట్టేళ్లను నరుకుతూ, ఆ రక్తంతో జగన్ ఫ్లెక్సీలకు అభిషేకం చేస్తూ, 2029లో రప్పా రప్పా నరుకుతామని ప్రజలను తీవ్ర భయభ్రాంతులకు గురిచేశారు. ఆ చిత్రాలు, వీడియోలను సామాజిక (మిగతా 3లో)



తూర్పు గోదావరి జిల్లా నల్లజర్ల చెక్‌పోస్టు నుంచి ప్రభుత్వాసుపత్రి వరకు నిందితులను నడిరోడ్డుపై నడిపిస్తూ తీసుకెళ్తున్న పోలీసులు

నల్లజర్లలో వైకాపా శ్రేణుల అరాచకం
- ఏడుగురి అరెస్టు 3లో

జగన్ ఫ్లెక్సీలకు రక్తాభిషేకం.. ఉన్మాదానికి పరాకాష్ఠ
- ప్రతి నేరస్థుడినీ నడిరోడ్డుపై నిలబెడతాం
- హోం మంత్రి అనిత హెచ్చరిక



వైకుంఠ ఏకాదశికి తిరుమల సన్నద్ధం

- నేటి నుంచి జనవరి 7 వరకు ఎస్ఎస్‌డీ టోకెన్ల రద్దు
- జనవరి 2 నుంచి సర్వదర్శనాలకు అనుమతి

తిరుమల, న్యూస్‌టుడే: వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో తితిదే విస్తృత ఏర్పాట్లు చేపట్టింది. మంగళవారం వేకువజామున ఆలయాన్ని తెరిచి, స్వామివారికి ఏకాంతంగా పూజాది కైంకర్యాలు నిర్వహించనుంది. అనంతరం భక్తులకు వైకుంఠ ద్వారం ద్వారా దర్శనాలను ప్రారంభిస్తుంది. జనవరి 8న రాత్రి 12 గంటల వరకు మొత్తంగా పది రోజులపాటు భక్తులను ఈ మార్గంలో అనుమతించనుంది. ఈ పర్వదినాల సందర్భంగా ప్రముఖులు పెద్దసంఖ్యలో వస్తారన్న అంచనాలతో (మిగతా 6లో)

న్యాయమూర్తుల కళ్లకు గంతలు కట్టలేరు



హైకోర్టు సీజే ధర్మాసనం ఘాటు వ్యాఖ్య

తప్పుదోవ పట్టించేందుకు యత్నించిన అధికారికి రూ.2.5 లక్షల ఖర్చుల విధింపు

భవన యజమానులూ రూ.2.5 లక్షలు చెల్లించాలని ఆదేశం

ఈనాడు, అమరావతి: 'న్యాయదేవతకు గంతలు కట్టి ఉండొచ్చు.. న్యాయమూర్తులకు కాదు' అని హైకోర్టు ఘాటుగా వ్యాఖ్యానించింది. వాణిజ్య అవసరాల కోసం నిర్మిస్తున్న భవనాన్ని నివాస గృహం కోసమంటూ కోర్టును తప్పుదోవ పట్టించేందుకు యత్నించిన పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం పురపాలక సంఘం అప్పటి కమిషనర్‌పై సీజే నేతృత్వంలోని ధర్మాసనం ఆగ్రహం వ్యక్తం చేసింది. ఖర్చుల కింద రూ.2.5 లక్షల సొంత సొమ్ము చెల్లించాలని కమిషనర్‌ను, మరో రూ.2.5 లక్షలు చెల్లించాలని భవన యజమానులను ఆదేశించింది. ఆ మొత్తాన్ని రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ద్వారా అంధులు, బధిరుల సంక్షేమం కోసం వినియోగించాలని స్పష్టం చేసింది. వాణిజ్య నిర్మాణం కోసం (మిగతా 6లో)

లోపలి పేజీల్లో

జనగణన కాగానే గ్రేటర్ విజయవాడ, గ్రేటర్ తిరుపతి ప్రక్రియ
సర్వే పూర్తయ్యేవరకు డీలిమిటేషన్ చేపట్టకూడదని కేంద్రం ఆదేశాలు: మంత్రి నారాయణ

కుల, మత విభేదాలు లేని యువతతోనే ప్రగతి సాధ్యం
విజ్ఞానంతో కూడిన విద్యకు ప్రాధాన్యం ఇవ్వండి
సిద్ధార్థ విద్యాసంస్థల స్వర్ణోత్సవంలో జస్టిస్ లావు నాగేశ్వరరావు


క్యాటరాక్ట్ బాధితుల్లో సూపర్ బగ్!
7.8 శాతం మందిలో గుర్తింపు
విచ్చలవిడిగా యాంటీబయాటిక్స్ వాడకంతోనే..

అంతా అధికారులే చూసుకుంటారు!

కల్తీ నెయ్యి వ్యవహారంతో నాకేం సంబంధం?

సిట్ అధికారుల ప్రశ్నలకు భూమన సమాధానం

రెండున్నర గంటలపాటు విచారణ



ఈనాడు- తిరుపతి, న్యూస్‌టుడే, తిరుపతి (నేరవిభాగం): తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదం తయారీకి కల్తీ నెయ్యి సరఫరా కేసులో శనివారం కీలక పరిణామం చోటుచేసుకుంది. జగన్ పాలనలో తితిదేలో తొలుత ప్రత్యేక ఆహ్వానితుడిగా, 2023 ఆగస్టు నుంచి వైకాపా అధికారం కోల్పోయే వరకు పాలకమండలి ఛైర్మన్‌గా ఉన్న భూమన కరుణాకరరెడ్డిని సీబీఐ నేతృత్వంలోని సిట్ అధికారులు ప్రశ్నించారు. తిరుపతి భూదేవి (మిగతా 6లో)

పాఠాలు ఉచితం.. కొలువులు సులభం

ఇది పల్లెటూరి కోడింగ్

- **500** మంది ఉద్యోగాల సాధనలో కీలకపాత్ర

సాఫ్ట్‌వేర్ మెలకువలు బోధిస్తున్న ఐఐటీయన్



ఈనాడు డిజిటల్, నరసరావుపేట, న్యూస్‌టుడే, వినుకొండ

ఐఐటీ బాంబేలో ఎంటెక్.. మంచి ప్యాకేజీతో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం.. అమెరికాలో పనిచేసిన అనుభవం.. ఇలాంటి నేపథ్యం ఉన్నవాళ్లు స్వదేశానికి వచ్చాక ఏం చేస్తారు? ఇంకా భారీ ప్యాకేజీతో బెంగళూరులోనో, హైదరాబాద్‌లోనో స్థిరపడాలనుకుంటారు. కానీ, పల్నాడు జిల్లా వినుకొండ మండలం విఠంరాజుపల్లికి చెందిన రామాంజిరెడ్డి అందరిలా ఆలోచించలేదు. యువ గ్రాడ్యుయేట్లు, పోస్ట్ గ్రాడ్యుయేట్లు నిరుద్యోగులుగా మిగిలిపోతుండటంపై మథనపడ్డారు. 'విద్య ఇతరులకు కూడా ప్రయోజనం చేకూర్చాలి' అని తల్లిదండ్రులు ఇచ్చిన సలహాతో ప్రేరణ పొంది గురువుగా మారారు. తాను వర్క్ ఫ్రం హోం చేస్తూనే ఖాళీ సమయంలో గ్రామీణ ప్రాంత యువతకు ఉచితంగా కోడింగ్ పాఠాలు నేర్పిస్తున్నారు. ఇప్పటివరకు 500 మందికి పైగా విద్యార్థులు గూగుల్, అమెజాన్, అడోబ్ తదితర కంపెనీల్లో భారీ ప్యాకేజీలతో ఉద్యోగాలకు ఎంపికయ్యేలా కృషి చేసి వారి జీవితాల్లో వెలుగులు నింపారు.

■ 39 ఏళ్ల రామాంజిరెడ్డి విద్యాపరంగా ప్రతిభావంతులు. ఎలక్ట్రానిక్స్‌లో బీటెక్ (మిగతా 6లో)



కోడింగ్ నేర్చుకుంటున్న విద్యార్థులు

విద్యతోనే పేదరికంపై విజయం

- నన్ను ఐఏఎస్ అవ్వాలన్నారు.. కానీ రాజకీయాలు ఎంచుకున్నా
- ఎన్టీఆర్ విద్యాసంస్థల పురోగతిలో భువనేశ్వరి కృషి భేష్
- తండ్రి పట్టుదలే ఆమెకు అబ్బింది..
- వార్షికోత్సవంలో సీఎం చంద్రబాబు



డిగ్రీ విద్యార్థిని కుసుమకు కృత్రిమ చేతిని అందిస్తున్న సీఎం చంద్రబాబునాయుడు. చిత్రంలో ఎన్టీఆర్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ భువనేశ్వరి

ఈనాడు, హైదరాబాద్-న్యూస్‌టుడే, మెయినాబాద్: ''పేదరికాన్ని జయించాలంటే సరైన ఆయుధం చదువు ఒక్కటే. ఇందులో విజయం సాధిస్తే సంపద ఆటోమేటిక్‌గా వస్తుంది. విద్యార్థులందరూ లక్ష్యాలను నిర్దేశించుకొని, వాటిని సాధించేందుకు కృషి చేయాలి' ' అని ముఖ్యమంత్రి చంద్రబాబు పిలుపునిచ్చారు. కాలేజీ రోజుల్లో తనను చాలామంది ఐఏఎస్ అవ్వాలని సూచించినా.. తాను మాత్రం రాజకీయాలనే ఎంచుకున్నానని చెప్పారు. యూనివర్సిటీలో చదువుతూనే శాసనసభ్యుడిగా గెలిచి.. రెండేళ్లలో మంత్రిని కూడా అయ్యానన్నారు. హైదరాబాద్ గండిపేటలోని ఎన్టీఆర్ ట్రస్టు విద్యా సంస్థల వార్షికోత్సవానికి శనివారం ఆయన ముఖ్య అతిథిగా, మేనేజింగ్ ట్రస్టీ, తన సతీమణి భువనేశ్వరితో కలిసి హాజరయ్యారు. జ్యోతి వెలిగించి వార్షికోత్సవాన్ని ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. ''చిన్న మొక్కగా 131 మంది విద్యార్థులతో మొదలైన ఎన్టీఆర్ విద్యాసంస్థలను నేడు పెద్ద వృక్షంగా మార్చారు. ప్రస్తుతం 1641 మంది చదువుతున్నారు. ఈ పురోగతిలో భువనేశ్వరి కృషి ఎంతో ఉంది. ఎన్టీఆర్ మాదిరిగా ఆమెకు పట్టుదల ఎక్కువ. ట్రస్టు, విద్యా సంస్థలను సమర్థంగా నడిపిస్తున్నారు. నేను సీఎంగా, పార్టీ అధ్యక్షుడిగా పనిచేస్తుంటే.. ఆమె భార్యగా, తల్లిగా, ట్రస్టీగా, హెరిటేజ్ ఎండీగా పలు పాత్రలను సమర్థంగా నిర్వహిస్తున్నారు. ఆమెను మనస్ఫూర్తిగా అభినందిస్తున్నాను. ఈ సంస్థను సెంటర్ ఫర్ ఎక్సలెన్స్‌గా తయారు చేయడానికి నా సహకారం ఎప్పుడూ ఉంటుంది.

గండిపేటలో గురుతులెన్నో..

గండిపేటకు వస్తే చాలా పాత విషయాలు గుర్తొస్తాయి. అప్పట్లో తెదేపా కేంద్ర కార్యాలయం ఇక్కడే ఉండేది. నాడు రాజకీయ నాయకులకు శిక్షణ ఇచ్చిన ఈ ప్రాంతంలో ఇప్పుడు విద్యాసంస్థలు నెలకొల్పి భావిపౌరులకు పాఠాలు బోధిస్తున్నాం. ఈ విద్యాసంస్థల్లో చదువుకున్న నలుగురు గ్రూప్-1కు, ముగ్గురు జూనియర్ సివిల్ జడ్జి పోస్టులకు ఎంపికయ్యారు. దేశంలోని ప్రముఖ విద్యాసంస్థల్లో 29 మందికి సీట్లు వచ్చాయి. ఎన్టీఆర్ ట్రస్టు ద్వారా 10 లక్షల మందికి రక్తదానం చేశారు. 273 మంది థలసీమియా బాధిత చిన్నారులకు ఉచితంగా రక్తమార్పిడి చేశారు. సంజీవని క్లినిక్‌ల ద్వారా 22 లక్షల మందికి వైద్యం చేయించారు. ప్రకృతి విపత్తు బాధితులకు సాయం, రక్షిత తాగునీటి సరఫరా వంటి సేవలు ట్రస్టు అందిస్తోంది.

టెక్నాలజీ దేశ గతినే మార్చింది..

అప్పట్లో సెల్‌ఫోన్ గురించి మాట్లాడితే ఎగతాళి చేశారు. ఈ రోజు టెక్నాలజీ దేశ గతినే మార్చింది. ఐటీ, ఇతర రంగాల వృద్ధితో తలసరి ఆదాయంలో తెలంగాణ టాప్‌లో నిలిచింది. విద్యార్థులు ఆధునిక టెక్నాలజీ, గ్లోబల్ నాలెడ్జిని సముపార్జించుకోవాలి. నా ఆశ అంతా మీ మీదే. తెలంగాణలో 2047 విజన్ తయారు చేశారు. ఏపీలో కూడా స్వర్ణాంధ్ర 2047 పేరుతో ప్రణాళిక తయారు చేశాం. అప్పటికి తెలుగు రాష్ట్రాలు ఒకటి రెండు స్థానాల్లో ఉండాలంటే నేటి విద్యార్థులే అందుకు సాధకులు'' అని చంద్రబాబు పేర్కొన్నారు.

విద్యార్థులే అంబాసిడర్లు: నారా భువనేశ్వరి

ఎన్టీఆర్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి మాట్లాడుతూ.. ''మానవ సేవే మాధవ సేవ అని దివంగత ఎన్టీఆర్ నమ్మారు. అందుకు అనుగుణంగానే ట్రస్టు పనిచేస్తోంది. పేద, అనాథ పిల్లలకు ఉచిత విద్యను అందిస్తున్నాం. సివిల్ సర్వీసు అకాడమీ ద్వారా యూపీఎస్సీ పరీక్షలకు శిక్షణ ఇప్పిస్తున్నాం. స్త్రీశక్తి ద్వారా పేద మహిళలకు ఉపాధి కల్పిస్తూ.. శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. ఎన్టీఆర్‌కు ఇదే మేమిచ్చే నివాళి. ఈ విద్యా సంస్థలకు విద్యార్థులే అంబాసిడర్లు'' అని అన్నారు.

తరలి వచ్చిన పలు పార్టీల నాయకులు

అమరావతి నుంచి హెలికాప్టర్‌లో వచ్చిన చంద్రబాబు దంపతులను విద్యార్థులు ఘనంగా స్వాగతించారు. తరగతి గదుల పైనుంచి పూలవర్షం కురిపించారు. మొదట చంద్రబాబు కాలినడకన తిరుగుతూ స్కూల్ ప్రాంగణాన్ని పరిశీలించారు. చంద్రబాబునాయుడును కలిసేందుకు పలు పార్టీల నాయకులు, కార్యకర్తలు తరలివచ్చారు. వార్షికోత్సవంలో ట్రస్టు సీఈవో కె. రాజేంద్రకుమార్, సీవోవో గోపి, అకడమిక్ డైరెక్టర్ ఎంవీ రామారావు, హెరిటేజ్ ఫుడ్స్ డైరెక్టర్ సాంబశివరావు, ప్రిన్సిపల్ ఎస్‌జేరెడ్డి, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

రామారావు కుటుంబసభ్యులను ఫోన్‌లో పరామర్శించిన సీఎం

రాజధాని రైతు కుటుంబానికి అండగా ఉంటామని ధైర్యం చెప్పిన చంద్రబాబు



సీఎం చంద్రబాబుతో ఫోన్‌లో మాట్లాడుతున్న రామారావు భార్య రాజ్యలక్ష్మి. చిత్రంలో రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి నారాయణ, ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్

తుళ్లూరు, న్యూస్‌టుడే: అనారోగ్య సమస్యలతో బాధపడుతూ గుండెపోటుతో మృతి చెందిన రాజధానిలోని మందడం గ్రామానికి చెందిన రైతు దొండపాటి రామారావు (రాములు) కుటుంబసభ్యులను ముఖ్యమంత్రి చంద్రబాబు శనివారం ఫోన్‌లో పరామర్శించారు. రామారావు భార్య రాజ్యలక్ష్మి, కుమారుడు వాసుబాబు, తమ్ముడు సత్యనారాయణతో మాట్లాడారు. రాజధాని నిర్మాణానికి భూములు ఇచ్చిన రైతు మృతి చెందడం బాధాకరమని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. అండగా ఉంటామని ధైర్యం చెప్పారు. రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ, తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్‌తో కలసి శనివారం రామారావు మృతదేహానికి నివాళులు అర్పించారు. అంతకు ముందు కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ నివాళులు అర్పించారు.

■ మందడం గ్రామం మీదుగా నిర్మించనున్న ఎన్-8 రహదారిలో ఇళ్లు, స్థలాలు కోల్పోతున్న వారితో మంత్రి నారాయణ, ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్ గ్రామంలోని సీఆర్డీఏ కార్యాలయం వద్ద శుక్రవారం మధ్యాహ్నం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పాల్గొన్న మందడం గ్రామానికి చెందిన రామారావు ఒక్కసారిగా కుప్పకూలి పోయారు. ఆయన్ను వెంటనే మంత్రి నారాయణ తన కాన్వాయ్‌లోని కారులో మణిపాల్ ఆసుపత్రికి పంపించారు. అనంతరం కొద్దిసేపటికే రాములు మృతి చెందారు. గతంలోనే రాములు రెండు సార్లు గుండెకు సంబంధించిన శస్త్రచికిత్స చేయించుకొన్నారని, అనారోగ్యంతో బాధపడుతున్నారని ఆయన కుటుంబసభ్యులు తెలిపారు. శుక్రవారం ఉదయం కొంత అస్వస్థతకు గురయ్యారని చెప్పారు.

ఆర్టీఐ కమిషనర్‌గా వీఎస్‌కే చక్రవర్తి



ఈనాడు, అమరావతి: రాష్ట్ర సమాచార కమిషనర్‌గా సీనియర్ పాత్రికేయుడు వీఎస్‌కే చక్రవర్తి ఎంపికయ్యారు. ఆయనకు 21 సంవత్సరాలు పాత్రికేయుడిగా పనిచేసిన అనుభవం ఉంది. ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన ఇటీవల జరిగిన కమిటీ సమావేశంలో చక్రవర్తిని ఈ పదవికి ఎంపిక చేశారు. ఆయన స్వస్థలం తూర్పుగోదావరి జిల్లాలోని టిక్కవోలు. తెలుగు విశ్వవిద్యాలయం నుంచి జర్నలిజంలో పోస్ట్‌గ్రాడ్యుయేషన్ చేశారు. ఉత్తమ సినీ విమర్శకుడిగా గతంలో నంది అవార్డు అందుకున్నారు.

ప్రపంచ తెలుగు మహాసభలకు హాజరుకానున్న సీఎం చంద్రబాబు

ఈనాడు, అమరావతి: ఆంధ్ర సారస్వత పరిషత్తు ఆధ్వర్యంలో జనవరి 3, 4, 5 తేదీల్లో శ్రీసత్యసాయి స్పిరిచ్యువల్ సిటీ ప్రాంగణంలో జరగనున్న మూడో ప్రపంచ తెలుగు మహాసభల చివరి రోజైన 5న సాయంత్రం 5 గంటలకు జరిగే సమాపనోత్సవానికి సీఎం చంద్రబాబు హాజరు కానున్నట్లు పరిషత్తు అధ్యక్షులు గజల్ శ్రీనివాస్ శనివారం తెలిపారు. తెలుగు మహాసభలకు సంబంధించి ప్రత్యేక సంచిక ఆంధ్రమేవ జయతే, మహాసభల పోస్టల్ కవర్‌ను ఈ సందర్భంగా సీఎం ఆవిష్కరిస్తారని సమన్వయకర్తలు పి.రామచంద్రరాజు, వాసిరెడ్డి విద్యాసాగర్ తెలిపారు.

నేడు అయోధ్యకు సీఎం చంద్రబాబు

సీఎం చంద్రబాబు ఆదివారం ఉదయం హైదరాబాద్‌లో బయలుదేరి 11 గంటలకు అయోధ్య వెళతారు. మధ్యాహ్నం 2:30 గంటల వరకు రామ మందిరంలో ఉంటారు. మధ్యాహ్నం మూడు గంటలకు అక్కడి నుంచి బయలుదేరి అమరావతి చేరుకుంటారు.

30న విదేశాలకు: సీఎం చంద్రబాబు ఆయన సతీమణి భువనేశ్వరితో కలిసి వ్యక్తిగత పర్యటనపై ఈ నెల 30న విదేశాలకు వెళుతున్నారు. జనవరి 4న తిరిగి అమరావతి చేరుకుంటారు. ప్రస్తుతం మంత్రి లోకేశ్ కుటుంబ సభ్యులతో కలసి విదేశీ పర్యటనలో ఉన్నారు.

రప్పా రప్పా అని రెచ్చిపోతే జైలే

(మొదటి పేజీ తరువాయి)

మాధ్యమాల్లో వైరల్ చేస్తూ బెదిరిస్తున్నారు. వీరిపై అందిన ఫిర్యాదుల ఆధారంగా పోలీసులు రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 16 కేసులు నమోదు చేశారు. శ్రీసత్యసాయి జిల్లాలో 6, అనంతపురంలో 6, చిత్తూరులో 3, తూర్పుగోదావరి జిల్లాలో 1 కేసు నమోదయ్యాయి. ఆ కేసుల్లో మొత్తం 100 మందికి పైగానే నిందితులున్నారు.

ఉన్మాద చర్యలకు పాల్పడేవారికి హెచ్చరిక

నేరపూరిత కుట్రతో వ్యవస్థీకృతంగానే వీరంతా ఇలాంటి ఉన్మాద చర్యలకు పాల్పడుతున్నట్లు దర్యాప్తులో గుర్తించారు. వారిలో 63 మందిని అరెస్ట్ చేసి, న్యాయస్థానంలో హాజరుపరిచారు. పరారీలో ఉన్న వారి కోసం గాలిస్తున్నారు. మరికొందరికి నోటీసులిచ్చి విచారించారు. కొందర్ని నడిరోడ్డుపై నడిపించుకుంటూ ప్రదర్శనగా తీసుకెళ్తూ వారు ఎంతటి అరాచకశక్తుల్లో ప్రజలందరికీ తెలిసేలా చేస్తున్నారు. తూర్పుగోదావరి జిల్లా నల్లజర్ల మండలం తూర్పుచోడవరంలో అందరూ చూస్తుండగా పెద్ద కత్తితో పొట్టేలు తల నరికి ఆ రక్తంతో జగన్ చిత్రమున్న ఫ్లెక్సీకి అభిషేకం చేసి రెచ్చగొట్టేలా వ్యాఖ్యలు చేసిన ఏడుగుర్ని శనివారం అరెస్టు చేసి రోడ్డుపై నడిపించుకుంటూ కోర్టుకు తీసుకెళ్లారు. శ్రీసత్యసాయి జిల్లా ముత్యాలవాండ్లపల్లిలో ఓ గర్భిణిపై దాడి చేసిన అజయ్‌దేవ్‌ను కదిరి ప్రధానరోడ్లపై నడిపించుకుంటూ పోలీసుస్టేషన్‌కు తీసుకెళ్లారు. ఇలాంటి కఠిన చర్యలతో ఉన్మాదమూకలకు తీవ్ర హెచ్చరిక పంపిస్తున్నారు.

■ శ్రీసత్యసాయి జిల్లా కనగానపల్లె మండలం భానుకోటలోని ప్రభుత్వ పాఠశాల వద్ద ఈ నెల 21వ తేదీ రాత్రి పొట్టేలు తల నరికి, ఆ రక్తంతో జగన్ ఫ్లెక్సీకి అభిషేకం చేయటమే కాకుండా ప్రజల్ని తీవ్ర భయభ్రాంతులకు గురిచేశారు. ఈ వ్యవహారంలో వైకాపా నాయకులు సద్దల బాలరాజు, గుంతపల్లి సుధాకర్, వడ్డే గోవింద్, సద్దల రాకేశ్ తదితరులపై కేసు నమోదు చేసి 13 మందిని అరెస్టు చేశారు. వీరందరికీ న్యాయస్థానం రిమాండ్ విధించింది.

■ ధర్మవరం పట్టణంలోని శివరామ్‌నగర్‌లో రౌడీషీటర్‌తో కలిసి అరాచకం సృష్టించటమే కాకుండా పొట్టేలును నరికి జగన్ చిత్రపటానికి రక్తాభిషేకం చేసిన 8 మందిని అరెస్ట్ చేశారు. న్యాయస్థానంలో వారికి రిమాండ్ విధించింది. ఇలా పలు కేసుల్లో 63 మందిని అరెస్టు చేశారు.

■ '2029లో మా ప్రభుత్వం వచ్చాక గంగమ్మ జాతరలో పొట్టేలు నరికినట్టే ప్రతిపక్షం వారిని రప్పా రప్పా నరుకుతాం' అంటూ శ్రీసత్యసాయి జిల్లా రామగిరి మండలం పోలేపల్లి గ్రామంలో పేట్రేగిపోయిన 10 మంది నిందితుల్ని అదుపులోకి తీసుకుని వారికి బీఎన్ఎస్ సెక్షన్ 35 కింద నోటీసులిచ్చారు.

పైశాచిక చర్యలను ఉపేక్షించం

–హరీష్‌కుమార్ గుప్తా, డీజీపీ

ఉన్మాద, పైశాచిక చర్యల ద్వారా రాష్ట్రంలో అలజడులు, అశాంతి సృష్టించాలని ప్రయత్నిస్తే ఏ ఒక్కర్నీ ఉపేక్షించేది లేదు. నడిరోడ్డుపై కత్తులతో ప్రదర్శన చేసిన వారిని, పొట్టేళ్లను నరుకుతూ చిత్రపటాలకు రక్తాభిషేకం చేసిన ప్రతి ఒక్కర్నీ గుర్తించాం. వీరందరిపైనా కేసులు నమోదు చేశాం. చట్టప్రకారం చర్యలు తప్పవు.

సిఫార్సుల వలలో పడొద్దు

- శ్రీవారి దర్శనాలకు నకిలీ లేఖలతో దళారుల మోసాలు
- తిరుమల వచ్చి ఇబ్బందులు పడుతున్న భక్తులు

తిరుమల, న్యూస్‌టుడే: తిరుమల శ్రీవారి దర్శనం, శ్రీవారిసేవా టికెట్లు, లడ్డుప్రసాదం, వసతి గదులు ఇప్పిస్తామంటూ దళారులు భక్తుల నుంచి భారీగా నగదు వసూలు చేస్తున్నారు. కొందరు తాము ప్రజాప్రతినిధులు, తితిదే ఉన్నతాధికారులకు తెలిసిన వారమంటూ నకిలీ సిఫార్సు లేఖలు అంటగట్టి మోసగిస్తున్నారు. ఆ లేఖలతో తిరుమలకు వస్తున్న భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీంతో తితిదే అదనపు ఈవో కార్యాలయంలో అటువంటి వాటిని గుర్తించేందుకు వీలుగా చర్యలు చేపట్టింది. ఈ తరహా మోసాలకు పాల్పడుతున్న వారిపైనా ప్రత్యేకంగా నిఘా ఉంచుతున్నారు.

■ శ్రీవారి దర్శనం, వసతి పేరుతో నకిలీ వెబ్‌సైట్లు సృష్టించి సైబర్ నేరగాళ్లు భక్తుల నగదు దోచుకుంటున్నారు. ఇలాంటి ఘటనలపై పలు ఫిర్యాదులు అందుతున్నాయి. ఈ నేపథ్యంలో వాటి కట్టడికి తితిదే ఐటీ విభాగం, పోలీసులు, సైబర్ క్రైమ్ విభాగం పటిష్ఠ చర్యలు తీసుకుంటున్నాయి. ఎప్పటికప్పుడు నిందితులను అరెస్టు చేసి జైలుకు పంపుతున్నారు.

కేసుల నమోదు ఇలా..

2025లో నవంబరు వరకు తిరుమల వన్‌టౌన్ పరిధిలో 11 కేసులు నమోదు చేసి 20 మందిని, టూటౌన్ పరిధిలో 28 కేసులు నమోదు చేసి 41 మందిని అరెస్టు చేశారు. వారిలో పలువురికి న్యాయస్థానం శిక్షలు విధించింది.

ఇటీవలి ఘటనలు పరిశీలిస్తే..

ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల పేరుతో నకిలీ సిఫార్సు లేఖలు తయారుచేసి భక్తులను మోసగిస్తున్న నాయుడుపేటకు చెందిన బల్లి ప్రవీణ్‌కుమార్, చెంచు బాలాజీలను తిరుమల టూటౌన్ పోలీసులు అరెస్టు చేశారు. శ్రీవారి దర్శనం ఇప్పిస్తామని భక్తులను మోసగిస్తున్న తితిదే ఉద్యోగి మాలే శంకరయ్యను అదుపులోకి తీసుకున్నారు.

దళారుల సమాచారం ఇవ్వాల్సిన నంబర్లు

తిరుమల వన్‌టౌన్ పీఎస్: 94407 96769, టూటౌన్ పీఎస్: 94407 96772, తితిదే విజిలెన్స్ టోల్‌ఫ్రీ 18004254141

అధికారిక వెబ్‌సైట్‌ను మాత్రమే ఆశ్రయించాలి

భక్తులు దళారులు, సైబర్ నేరగాళ్ల వలలో పడకుండా తితిదే అధికారిక వెబ్‌సైట్ https://ttdevasthanams.ap.gov.in ను ఆశ్రయించి ఆర్జితసేవలు, దర్శన టికెట్లు బుక్ చేసుకోవచ్చు. లేకుంటే ఆఫ్‌లైన్‌లో విష్ణునివాసం, శ్రీనివాసం, భూదేవి కాంప్లెక్స్‌లో ఉచిత సర్వదర్శనం టైమ్‌స్లాట్ టోకెన్లను రోజూ తిరుపతిలో పొందొచ్చు. కుదరకపోతే తిరుమలకు చేరుకుని నేరుగా సర్వదర్శనం క్యూలైన్‌లోకి వెళ్లొచ్చు. దర్శనం కల్పిస్తామని ఎవరైనా నగదు అడిగితే పోలీసులకు సమాచారం ఇవ్వాలి.

– శ్రీరాముడు, సీఐ, తిరుమల టూటౌన్

రప్పా రప్పా అంటే 'రఫ్' ఆడించారు

నల్లజర్లలో జగన్ జన్మదిన వేడుకల్లో వైకాపా శ్రేణుల అరాచకం

- పొట్టేలును నరికి, ఆ రక్తంతో జగన్ చిత్రపటానికి అభిషేకం
- ఏడుగుర్ని అరెస్టు చేసి, నడిరోడ్డుపై కిలోమీటరు నడిపించిన పోలీసులు

ఈనాడు– రాజమహేంద్రవరం; న్యూస్‌టుడే– నల్లజర్ల: వైకాపా అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకల్లో వైకాపా శ్రేణుల అరాచకం పెచ్చుమీరుతోంది. తూర్పుగోదావరి జిల్లా నల్లజర్ల మండలం తూర్పు చోడవరంలో శుక్రవారం రాత్రి కొందరు వైకాపా నాయకులు నడిరోడ్డుపై చేరి 'రప్పా రప్పా' అంటూ నినాదాలిస్తూ ప్రజలంతా చూస్తుండగా పెద్ద కత్తితో పొట్టేలు తల నరికారు. '2029లో గంగమ్మ జాతర... రప్పా రప్పా' అని రాసి ఉన్న ఫ్లెక్సీపై ఆ రక్తం చల్లి, జగన్ చిత్రపటానికి రక్తాభిషేకం చేశారు. తప్పతాగి ఆ మత్తులో జై జగన్, జై జై జగన్ నినాదాలు, రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తూ జనాన్ని భయభ్రాంతులకు గురి చేశారు. ఈ అరాచకాన్ని సెల్‌ఫోన్లలో చిత్రీకరించి సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేయటంతో వైరల్ అయ్యాయి. దీంతో పోలీసులు వారిపై కేసు నమోదు చేసి అదుపులోకి తీసుకున్నారు. వైకాపా నాయకులు కొండాబత్తుల సాధు, పొట్టి నవీన్, కనికెళ్ల రవి, అక్కల యేసు, దొడ్డిగర్ల రాజేష్, కత్తుల రమేష్, ఉసురుమర్తి పెద్దసాయికుమార్‌లకు తమదైన శైలిలో విచారించి బుద్ధి చెప్పారు. నిందితులను శనివారం సాయంత్రం తాడేపల్లిగూడెంలోని న్యాయస్థానానికి తరలించే క్రమంలో నల్లజర్ల చెక్‌పోస్టు నుంచి ఆసుపత్రి వరకు కిలోమీటరు దూరం రోడ్డుపై నడిపిస్తూ తీసుకెళ్లారు. జంతువుల పట్ల క్రూరత్వాన్ని నివారించే చట్టం, ఆయుధాల చట్టం కింద వీరిపై కేసులు నమోదు చేసినట్లు డీఎస్పీ దేవకుమార్ తెలిపారు. కోర్టు వీరికి బెయిల్ ఇచ్చింది. అనంతరం నిందితుల నివాసాల్లో పోలీసులు తనిఖీలు చేయగా నాటుసారా దొరికింది. నిందితుల్లో ఒకరైన పొట్టి నవీన్‌పై గతంలో పోక్సో కేసు కూడా ఉంది. ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తూ రెచ్చగొట్టేలా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్పీ డి.నరసింహకిశోర్ హెచ్చరించారు. పోలీసులు ముందు జాగ్రత్త చర్యగా తూర్పు చోడవరంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.



తూర్పు చోడవరంలో నరికిన పొట్టేలుతో జగన్ ఫ్లెక్సీకి రక్తాభిషేకం చేస్తున్న వైకాపా నాయకులు

చలి పులి

ప్రాంతం	కనిష్ఠ	గరిష్ఠ
విజయనగరం	15.0	26.0
అనంతపురం	16.4	29.5
కడప	17.0	27.0
శ్రీకాకుళం	17.0	28.0
కర్నూలు	17.0	31.3
విశాఖపట్నం	17.6	28.4
రాజమహేంద్రవరం	18.0	33.0
విజయవాడ	18.8	29.0
గుంటూరు	20.0	29.0
ఒంగోలు	20.2	29.3
నెల్లూరు	21.3	30.1
తాడేపల్లిగూడెం	27.0	29.0

రక్తాభిషేకం.. వైకాపా ఉన్మాదానికి పరాకాష్ఠ

- అవసరమైతే అరాచక శక్తులకు రాష్ట్ర బహిష్కరణ
- హోం మంత్రి అనిత హెచ్చరిక

ఈనాడు, అమరావతి: 'వైకాపా అధినేత జగన్ పుట్టినరోజు వేడుకల్లో ఆయన ఫ్లెక్సీలకు రక్తాభిషేకాలు చేయడం, ఇంటి ముందు టపాసులు కాల్చొద్దన్నందుకు ఓ గర్భిణి కడుపుపై కాలితో తన్ని వైకాపా నాయకులు దాడి చేయడం ఉన్మాదానికి పరాకాష్ఠ' అని హోం మంత్రి వంగలపూడి అనిత ధ్వజమెత్తారు. ప్రపంచంలో ఎక్కడైనా కత్తులు, తల్వార్లతో కేకులు కోస్తారా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజకీయం ముసుగులో అమానుషాలకు పాల్పడుతున్న వైకాపా నాయకులు, కార్యకర్తల్ని నడిరోడ్డు మీద నిలబెడతామని, అవసరమైతే రాష్ట్ర బహిష్కరణ చేస్తామని హెచ్చరించారు. మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో శనివారం ఆమె విలేకర్లతో మాట్లాడారు. 'అరాచకాలకు పాల్పడ్డ వారి జాతకాలు మా దగ్గర ఉన్నాయి. రాజకీయం ముసుగులో ఉన్మాదులుగా మారిన వైకాపా నేతల్ని వదిలే ప్రసక్తే లేదు. జగన్ పుట్టినరోజు వేడుకల్లో వారు రౌడీయిజాన్ని ప్రదర్శించారు. మూగజీవాల్ని బలిచ్చి రక్తాభిషేకాలు చేయడం అమానుషం. రప్పా రప్పామని నరుకుతాం.. 2029లో ఇదే రిపీట్ అవుతుంది, గంగమ్మ జాతరలో పొట్టేలును నరికినట్టు నరుకుతాం అంటూ నినాదాలు చేయడం వారి నేరపూరిత ఆలోచనకు అద్దంపడుతోంది. ఇలాంటి చర్యలు తప్పని వైకాపా శ్రేణులకు చెప్పలేని జగన్ ఒక మనిషేనా? ఇలాంటి ఫ్యాక్షన్ సంస్కృతి రాష్ట్ర భవిష్యత్తుకు అత్యంత ప్రమాదకరం' అని అనిత పేర్కొన్నారు.

జగన్ ఆదేశాలతోనే వ్యవస్థీకృత నేరాలు

'కళ్యాణదుర్గం, ఉరవకొండ, శింగనమల, రాప్తాడు ఇలా పదికి పైగా నియోజకవర్గాల్లో ఒకే రోజు, ఒకే తరహాలో రక్తాభిషేకాలు, జంతుబలులు జరిగాయి. ఇవన్నీ జగన్ ఆదేశాలతో జరిగిన వ్యవస్థీకృత నేరాలు. మాజీ మంత్రులు పక్కనే ఉండి, ఇలాంటి వాటిని ప్రోత్సహిస్తున్నారు.' అని అనిత మండిపడ్డారు. 19 కేసులున్నా బుద్ధి మారని రౌడీలపై పీడీ చట్టం ప్రయోగిస్తే తప్పేంటని అనిత ప్రశ్నించారు. అనకాపల్లి జిల్లాలో రౌడీ షీటర్లపై పీడీ యాక్ట్ నమోదు చేయడంపై ఆమె స్పందించారు.

జగన్‌పై అభిమానంతోనే రక్తాభిషేకాలు

వైకాపా ఎస్సీ విభాగం అధ్యక్షుడు సుధాకర్‌బాబు

ఈనాడు, అమరావతి: 'వైకాపా అధ్యక్షుడు జగన్‌పై తనకున్న అభిమానాన్ని ప్రదర్శించడానికి ఒక అభిమాని ఎంచుకున్న మార్గం రక్తాభిషేకం. దానికి పుట్టినరోజున రక్తతర్పణలు, బలులు ఇవ్వడమేంటంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడడాన్ని ఖండిస్తున్నాం' అని వైకాపా ఎస్సీ విభాగం అధ్యక్షుడు టీజేఆర్ సుధాకర్‌బాబు అన్నారు. శనివారం ఆయన పార్టీ కేంద్ర కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడారు. 'రాష్ట్రంలో జగన్‌కు రాజకీయంగా, వ్యక్తిగతంగా, సిద్ధాంతపరంగా అభిమానులున్నారు. ఆయనేం చేసినా అభిమానించే వారుంటారు. చంద్రబాబు, బాలకృష్ణ పుట్టినరోజుల సందర్భంగా రాష్ట్రంలో రక్తతర్పణలు జరగలేదా? 2019-24 మధ్య కాలంలో జగన్ హత్యా రాజకీయాలను ప్రోత్సహించారా? బలిదానాలు అడిగారా? శాంతికాముకుడిగా అణగారిన వర్గాలకు విద్య, వైద్యం, ప్రతి ఒక్కరికీ హక్కులు కల్పించేలా అంబేడ్కర్ రాజ్యాంగాన్ని అమలు చేశారు' అని పేర్కొన్నారు.

నెయ్యి నుంచి తలనీలాల వరకూ ప్రతి దాంట్లోనూ కుంభకోణమే

బ్రాహ్మణ కార్పొరేషన్ ఛైర్మన్ బుచ్చిరాంప్రసాద్

ఈనాడు, అమరావతి: వైకాపా ప్రభుత్వంలో శ్రీవారి నైవేద్యాల తయారీలో ఉపయోగించే నెయ్యి మొదలు భక్తులు సమర్పించే తలనీలాల వరకు ప్రతి దాంట్లోనూ కుంభకోణమేనని బ్రాహ్మణ కార్పొరేషన్ ఛైర్మన్ బుచ్చిరాం ప్రసాద్ ధ్వజమెత్తారు. దేవాలయాలు, అర్చకులపై దాడులు నిత్యకృత్యంగా ఉండేవని పేర్కొన్నారు. మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పరకామణిలో చోరీ కేసును చిన్నదిగా జగన్ పేర్కొనడం హిందువుల మనోభావాల్ని దెబ్బతీయడమేనన్నారు.

16 మంది ఐపీఎస్‌లకు పదోన్నతి

- విశాఖపట్నం సీపీ బాగ్చీకి డీజీపీ హోదా
- పలువురు ఎస్పీలకు ప్రమోషన్

ఈనాడు, అమరావతి: ఏపీ క్యాడర్‌కు చెందిన 16 మంది ఐపీఎస్ అధికారులకు రాష్ట్ర ప్రభుత్వం పదోన్నతి కల్పించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ శనివారం వేర్వేరు ఉత్తర్వులు జారీచేశారు. ప్రస్తుతం అదనపు డీజీపీ హోదాలో ఉన్న విశాఖపట్నం నగర పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చీకి డీజీపీ హోదాతో పదోన్నతి లభించింది. డీఐజీలు గోపినాథ్ జెట్టి (విశాఖపట్నం రేంజ్), డాక్టర్ షిముషి వాజ్‌పేయీ (అనంతపురం రేంజ్), ఎస్.సెంథిల్‌కుమార్ (ఆక్టోపస్), డాక్టర్ గజరావ్ భూపాల్ (అంతర్ రాష్ట్ర డిప్యుటేషన్‌లో ఉన్నారు), డాక్టర్ నవదీప్ సింగ్ గ్రేవల్‌కు (కేంద్ర సర్వీసుల్లో డిప్యుటేషన్‌పై కొనసాగుతున్నారు) ఐజీలుగా పదోన్నతి వచ్చింది. కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్‌కు డీఐజీగా పదోన్నతి దక్కింది. ● ఎస్పీలు అద్నాన్ నయీం అస్మీ (పశ్చిమ గోదావరి), ఏఆర్ దామోదర్ (విజయనగరం), డి.నరసింహ కిశోర్ (తూర్పు గోదావరి), వి.హర్షవర్ధన్‌రాజు (ప్రకాశం), ఆర్.గంగాధర్ రావు (సీఐడీ), వి.గీతాదేవి (నిఘా విభాగం)లతో పాటు డి.మేరీ ప్రశాంతి (డీసీపీ, విశాఖపట్నం), వై.రవిశంకర్‌రెడ్డి (కమాండెంట్, ఏపీఎస్పీ విజయనగరం బెటాలియన్), ఐశ్వర్య రస్తోగి (కేంద్ర సర్వీసుల్లో డిప్యుటేషన్‌పై ఉన్నారు)లకు సీనియర్ ఎస్పీలుగా పదోన్నతి లభించింది.

ఈనాడు జీవనయోగం

మనం వర్తమానంలో జీవించడం మానేసి చాలా కాలమే అయింది. నిన్నటి గురించి దిగులు, రేపటి గురించి బెంగలే మనిషిని నడిపిస్తున్న రోజులివి. అన్నం తింటూ ఉంటాడు మనిషి- వేరే ఆలోచిస్తూ ఉంటుంది మనసు. బండి నడుపుతూ ఉంటాయి చేతులు- ఎక్కడో తిరుగుతూ ఉంటాయి ధ్యాసలు. చేతలకూ చేతనకూ పొంతన లేదని, మనిషికీ మనసుకూ పొత్తు కుదరలేదని దాని అర్థం. ఫలితంగా అన్నసారం ఒంటబట్టడం లేదు- దేహానికి! ఒత్తిడి, ఆందోళన, ప్రమాదాల వల్ల సుస్తీతో దోస్తీ చేస్తోంది- మనసు. ఆ రెండింటికీ స్పష్టత లేక జీవనయోగం కాకుండా పోతోంది- బతుకు! వీటన్నింటికీ మంచి ఔషధం, సరైన విరుగుడు- యోగసాధన! మనిషికి తన మనసుతో పొత్తు కలుపుతుంది కాబట్టే- యోగమనే మాటకు పొంతన, కూడిక, కూర్పు... వంటి అర్థాలు చెప్పాయి నిఘంటువులు. కూడి ఉండటమే యోగం! యోగ సాధనతో 'అసంతయమ్, వివిక్తతయు... (శరీరమైన బడలిక, మానసికమైన అనిశ్చితి) కడుపడుపడతాయని భారతం శాంతిపర్వం చెబుతోంది. యోగసిద్ధితో మనిషి 'యుక్త వర్తనుడు' అవుతాడంది ఆనుశాసనికపర్వం. అవసరమైన పనిని, సరైన సమయంలో, చేయాల్సిన పద్ధతిలో చక్కగా పూర్తిచేస్తాడని దాని అర్థం. ఆ మనిషి వర్తమానంలో ఉన్నాడని తాత్పర్యం.

'తర్మ- సముద్రాలిచిన జ్ఞానికి- మనసే ప్రశ్న, జనన హేతువును మదించిన మౌనికి- తనువే ప్రశ్న' అన్నారు సినారె. ఈ తరహా ప్రశ్నలకు, సందేహాలకు భారతీయ యోగశాస్త్ర విజ్ఞానం స్పష్టమైన వివరణలను అందించింది. 'ఆసన, ప్రాణ సంరోధ, ప్రత్యాహార, ధారణ, ధ్యాన, సమాధి' అనే ఆరింటినీ- 'షడంగ యోగ విద్య'గా చెప్పాడు కాళికండంలో శ్రీనాథుడు. అంతకుముందే వాటికి యమ నియమాలను జోడించి 'అష్టాంగ యోగాన్ని' బోధించారు పతంజలి. హఠ, సాంఖ్యాది మరెన్నో సాధనలను ప్రాచుర్యం కల్పించారు మునులు. మన దేశంలోని మహాత్ములూ మహర్షులంతా యోగవిద్యావంతులే. 'భాసుర నిగమ పరిపూర్ణాయ సుతపో వివాసుడు అనుపమ యోగాభ్యాసుడు' అంటూ భాగవతం వర్ణించిన దుర్వాసుడు- వారందరి ప్రతినిధి. యోగాభ్యాసం- మునుల తపస్సులో భాగం. యోగవిద్యలో ఆరితేరిన యోగ్యులను మన మామూలు కొలతలకు అందవు. మైసూర్ మహారాజు ఖరీదైన ఆతిథ్యాన్ని కాదని, పేదింట గంజిని పరమాన్నంలా స్వీకరించారు రమణ 'మహర్షి'. అలాంటి వారినే 'వీతరాగులు' అంది గీత. యోగసూత్రాల్లో పతంజలి చెప్పారామాట.

అది మనకు బాగా అర్థం కావడం కోసమే 'కిరీటం పెట్టుకో' అనే మమకారాన్నీ 'నారచీరలు చుట్టుకో' అనే తిరస్కారాన్నీ ఒకేలా స్వీకరించిన రాముణ్ని రామాయణం పరిచయం చేసింది. మంచిరోజుకని వెళ్లిన మహాయోధులు తమ్ముళ్ల కళ్లెదుట కట్టెల్లా పడిఉండగా, 'నరుడు ఆత్మ ఎవరు' వంటి నూట ఇరవైనాలుగు కఠిన ప్రశ్నలకు గొప్ప స్థిరచిత్తంతో జవాబిచ్చి విశ్వ తాత్త్వికులను విస్మయపరచిన ధర్మరాజును మహాభారతం మన కళ్ల ముందుకు తెచ్చింది. మునులకన్నా జ్ఞానులకన్నా కర్మిష్ఠులకన్నా కూడా- యోగి స్థితి ఉన్నతమైనదని భగవద్గీత తేల్చిచెప్పింది. 'తస్మాత్ యోగీ భవ అర్జున!' అని విజయుణ్ని ఆదేశించింది. అయిన తరవాత 'నా చుట్టాలు నా స్నేహితులు నా కోడి నా కంపటి...' వంటి వెంపర్లాట నుంచి దూరంగా నిలబెట్టింది. కురుక్షేత్రంలో అఖండ విజయాన్ని కట్టబెట్టింది. 'నియమాది సంగుణ్ణి నిలిచిన తత్త్వము విశ్వమంతయు తానగు! తాను విశ్వంబైన తత్త్వమగును' అన్నాడు వేమన 'యోగి'. ఈ సంక్షిప్త యుగంలో మనమంతా అర్థవనులమూ, విశ్వమానవులమూ, యుక్తవర్తనులమూ కావడమే కాలపురుషుడికి మనమిచ్చే గౌరవం! అదే కొత్త సంవత్సర కీలక మలుపులో మనం తీసుకోవాల్సిన నిర్ణయం!




వర్క్- లైఫ్ బ్యాలెన్స్ అంటారు కానీ నేను మాత్రం వర్క్- లైఫ్ ఇంటిగ్రేషన్‌ని నమ్ముతాను. జీవితమైనా ఉద్యోగమైనా అర్థవంతంగా, సంతృప్తినిచ్చేదిగా ఉండేలా చూసుకుంటే ఆటోమేటిగ్గా అవి రెండూ ఒకదానికొకటి సహాయకారి అవుతాయి.

– రతన్ టాటా

వైరభక్తులూ వీరభక్తులే!

భక్తులు రెండు రకాలని... వారిలో కొందరు వీరభక్తులని, మరికొందరు వైరభక్తులని అంటుంటారు. కానీ అది సరికాదు. వైరభక్తులూ వీరభక్తులే. ఇంకా చెప్పాలంటే వీరాతివీర భక్తులు, పరమాత్ముణ్ని వెన్నంటి ఉన్నవాళ్లు. వైరభక్తి కేవలం నటన. మూడు యుగాలను అనితరసాధ్యంగా ప్రభావితం చేసిన నటన. అందుకు కారణం ఒక దైవ ఘటన. పరమాత్ముడు స్వయంగా ఇద్దరు వీర భక్తులకు ఇచ్చిన అపురూపమైన అవకాశం వల్లే ఈ పరిస్థితి తలెత్తింది.

జయవిజయులు వైకుంఠంలోని విష్ణుమూర్తి నివాసంలో ద్వారపాలకులు. ద్వారపాలకులకన్నా యజమానికి వీర భక్తులెవరుంటారు? జయవిజయులు కూడా అక్షరాలా తమ విధిని నిర్వర్తించారు తప్ప విష్ణు భక్తులైన మహానుభావులను ఇబ్బంది పెట్టాలన్న ఉద్దేశం వారికి ఏ కోశానా లేదు. అయితే విధివశాత్తు జరగరానిది జరిగింది. కథ అంతా కొత్త మలుపు తిరిగింది.



అంతర్యామి

జయవిజయులు ఓరోజు విధినిర్వహణ చేస్తుండగా అయిదేళ్ల పిల్లల్లా కనిపిస్తున్న నలుగురు ఆరు ద్వారాలు దాటి ఏడో ద్వారం దగ్గరికి వచ్చారు. నగ్నంగా ఉన్న ఆ పిల్లలు ఎవరో గుర్తించక జయవిజయులు సహజంగానే అడ్డుకున్నారు. దాంతో ఆ నలుగురూ ఆగ్రహించారు. 'మీరు ఈ పుణ్యలోకంలో ఉండటానికి తగరు. భూలోకంలో మనుషులుగా పుట్టాల'ని ఆ ద్వారపాలకుల్ని శపించారు. పిల్లల్లా కనిపించిన ఆ పెద్దలు మహర్షులైన బ్రహ్మ మానసపుత్రులు. సనక సనందనాదులుగా ప్రసిద్ధి చెందినవారు. విషయం తెలిసిన విష్ణుమూర్తి ద్వారం దగ్గరికి వచ్చి జయవిజయులను మందలించాడు. అజ్ఞానం వల్ల పాపం చేశామని గ్రహించిన జయవిజయులు శాపవిముక్తి కోసం మహర్షులను వేడుకున్నా ఫలితం దక్కలేదు. దానికి అంతకుముందు లక్ష్మీదేవి ఇచ్చిన శాపం కూడా తోడైంది. దాంతో వారు తమ ఇష్టదైవం విష్ణుమూర్తికి దూరం కావాల్సివచ్చింది. ఈ ఎడబాటును భరించలేమని, పరమాత్ముడి సన్నిధిలోనే ఉండే మార్గం చెప్పాలని జయవిజయులు సవినయంగా విన్నవించుకున్నారు. అప్పుడు విష్ణుమూర్తి రెండు మార్గాలను సూచించి వాటిలో ఇష్టమైన దాన్ని ఎంచుకొమ్మని చెబుతాడు. వీరభక్తులుగా కొనసాగితే ఏడు జన్మల్లో మోక్షం ప్రసాదిస్తానని, అదే తనతో శత్రుత్వం పెట్టుకుని తన చేతిలోనే చనిపోతే మూడు జన్మలు చాలని వివరించాడు. దాంతో ఏడు జన్మల ఎడబాటుకన్నా మూడు జన్మల శత్రుత్వాన్నే జయవిజయులు కోరుకున్నారు. ఆ పరిస్థితుల్లో వీరభక్తులు ఎవరైనా అదే కదా కోరుకుంటారు? దానికి విష్ణుమూర్తి సమ్మతించాడు. ఫలితంగా జయవిజయులు కృతయుగంలో హిరణ్యాక్ష హిరణ్య కశిపులుగానూ, త్రేతాయుగంలో రావణ కుంభకర్ణులుగానూ, ద్వాపరయుగంలో శిశుపాల దంత వక్త్రులుగానూ జన్మించి విష్ణుమూర్తి చేతుల్లోనే హతమై మోక్షం సంపాదించుకున్నారు. అలా విష్ణుమూర్తి మాటను సార్థకం చేసిన వీరభక్తులయ్యారు. ఇక కలియుగంలో విష్ణు స్వరూపుడైన వేంకటేశ్వర స్వామి ప్రతి ఆలయంలోనూ జయవిజయులు ద్వారపాలకులుగా సాక్షాత్కరిస్తున్నారు. భక్తులు రెండు రకాలు కాదు, ఒకే రకమని నిరూపించి భక్తులందరి విజయాలకు వారు బాటలువేశారు. భక్తులకు అంతకన్నా కావాల్సింది ఏముంటుంది?

– శంకర నారాయణ

మన పరువుకు
మనమే బరువై...



ఎన్నో ఏళ్లుగా భారతీయులకు విదేశాల్లో మంచి పేరుంది. మనవాళ్ల కష్టపడే తత్వాన్ని, నిజాయతీని, మంచి నడవడికను, అంకితభావంతో పనిచేసే తీరును ప్రశంసిస్తుంటారు. కానీ, ఇటీవలి కాలంలో భిన్నమైన పరిస్థితులు ఎదురవుతున్నాయి. ఐరోపా, అమెరికా లాంటి దేశాల్లో పలుచోట్ల కొంతమంది భారతీయుల వ్యవహార శైలిపై తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతున్న ఉదంతాలూ కనిపిస్తున్నాయి. కొందరు ప్రవాస భారతీయుల అతిచేష్టలే మన పరువుకు భంగకరంగా మారుతున్నాయి.

ప్రవాస భారతీయుల్లో కొందరు తమ వేడుకలను జరుపుకొంటున్న తీరుపై పలు దేశాల్లో అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. సినీ హీరోలు, రాజకీయ నాయకులు ఆయా దేశాలకు వెళ్లినప్పుడు అక్కడి ఎన్నారైలు చేస్తున్న హంగామా, భారీ వాహన ర్యాలీలు, సినిమా హాళ్లలో చేసే అల్లర్లు, ఆర్భాటాలు స్థానికుల్లో తీవ్ర అసహనానికి కారణమవుతున్నాయి. సాధారణంగా పాశ్చాత్య సమాజాలకు నిశ్శబ్దంగా నడుచుకోవడం అలవాటు. భారతీయ సమాజంలో ప్రతిదీ సామూహిక ఉత్సవ నేపథ్యంతో ఉండటంతో, తమ ఆనందాన్ని, ఉత్తేజాన్ని, ఉత్సాహాన్ని బాహాటంగా అట్టహాసంగా ప్రదర్శించడం ఒక లక్షణంగా కనిపిస్తుంది. దీని వెనక సామాజిక, సాంస్కృతిక, మానసిక కారణాలు ఎన్నో ఉన్నాయని చెప్పొచ్చు. ప్రవాస భారతీయుల్లో సైతం ఇలాంటి లక్షణాలే కనిపిస్తాయి. ఇతర దేశాల్లోని భారతీయులు తమ అస్తిత్వ సూచికగా ఆయా వేడుకలను తమదైన సాంస్కృతిక శైలిలో నిర్వహిస్తున్న క్రమంలో సంగీత వాద్యాల మోతతో ఊరేగింపులను ఆర్భాటంగా నిర్వహిస్తున్నారు. విదేశీ గడ్డపై అస్తిత్వాన్ని ప్రదర్శించాలనే అంతర్గత వాంఛ, ప్రవాస భారతీయుల మధ్య తమదైన ప్రత్యేకతను చూపించుకోవాలన్న భావన దీనికి కొంత మేర కారణమవుతున్నాయి.



ప్రతిచోటా మరకలే

ఇటీవల లండన్ నగరంలో జరిగిన ఒక సంఘటన తాలూకు వీడియో వైరల్‌గా మారి ఆసియావాసులు, ముఖ్యంగా భారతీయుల అలవాట్ల తీరుతెన్నులను ప్రశ్నించే పరిస్థితి తలెత్తింది. లండన్‌లోని ఒక ఏరియాలో కొంతమంది ఉమ్మి వేసిన ఎరుపురంగు మరకలు డస్ట్‌బిన్‌ల దగ్గర, బైపాస్ దారుల్లో గోడలు, మెట్ల దగ్గర కనిపించాయి. ఆ వీడియోలు వైరల్ అయ్యాయి. మన దేశంలో చాలామందికి పాన్, గుట్కా లాంటివి నమిలే అలవాటు ఉంది. దాన్ని విదేశాలకు వెళ్లిన తరవాత కూడా కొనసాగిస్తున్న వారి వల్ల ఇలాంటి పరిస్థితులు తలెత్తుతుండటం ఆందోళన కలిగిస్తోంది. పాశ్చాత్య ప్రజలు దీన్ని వ్యక్తుల అలవాటుగా కాకుండా ఒక దేశానికి ఆపాదిస్తూ, ఇదొక అవాంఛిత సాంస్కృతిక దిగుమతిగా చిత్రీకరిస్తున్నారు. కొన్ని దశాబ్దాలుగా లండన్, బ్రెంట్ వంటి ప్రధాన నగరాలు మొదలుకుని చిన్న పట్టణాలదాకా ఈ సమస్య పెరిగిపోయిందని బ్రిటిషర్లు నిరసిస్తున్నారు. యూకేలో భారతీయులు ఎక్కువగా స్థిరపడిన ప్రాంతాల్లో ఎరుపు మరకలు విస్తృతంగా కనిపిస్తున్నట్లు గుర్తించారు. ఇటీవలి ఒక నివేదికలో వెంబ్లీ స్టేడియంలోని ఆ మరకలను తొలగించడానికి 30 వేల పౌండ్లను అంటే సుమారు రూ.35 లక్షలకుపైగా ఖర్చు చేసినట్లు వెల్లడించారు. ఆసియా వాసులను, భారతీయులను వారి నైపుణ్యాలు, శ్రామిక శక్తికి గౌరవం ఇచ్చి ఆహ్వానిస్తున్నా, వారిలో కొందరు ఇలా ఇష్టారాజ్యంగా ప్రవర్తించడం ఆమోదనీయం కాదంటున్నారు. మన దేశంలో సైతం కోల్‌కతా, ముంబయి, దిల్లీ, చెన్నై, బెంగళూరు, హైదరాబాద్, నోయిడా, లఖ్‌నవూలాంటి ఏ నగరాన్ని తీసుకున్నా పరిస్థితి దారుణంగా ఉండటం శోచనీయం. కోల్‌కతాలో అద్భుత నిర్మాణంగా పేరొందిన హౌరా బ్రిడ్జి పాన్, గుట్కా మరకల కారణంగా ప్రమాదంలో పడిందని చెబుతున్నారు. హౌరా బ్రిడ్జిని పరిశీలించే ఇంజినీర్లు ఇటీవల ప్రభుత్వానికి అందించిన నివేదికలో ఈ విషయాన్ని స్పష్టం చేశారు. ఎన్నో ఉపద్రవాలను, ప్రకృతి విపత్తులను తట్టుకున్న హౌరా బ్రిడ్జి పాన్, గుట్కా మరకలతో నాశనమయ్యే పరిస్థితి దాపురించింది. పాన్, గుట్కాల్లో ఉండే రసాయనాలు బ్రిడ్జిలోని లోహ భాగాలు తుప్పు పట్టడానికి కారణమవుతున్నాయి. మరోవైపు భారతీయ రైల్వేల పరిస్థితి మరింత దారుణంగా ఉంది. రైల్వే బోగీలు పాన్, గుట్కా మరకలతో అపరిశుభ్రతతో కునారిల్లుతున్నాయి. అధికారిక నివేదిక ప్రకారం, రైల్వేస్టేషన్‌లు, బోగీల్లోని మరకలను తొలగించడానికి ఏటా దాదాపు రూ.1200 కోట్లు ఖర్చవుతున్నట్లు తెలుస్తోంది. బహిరంగ ప్రదేశాల్లో ఉమ్మేసే అలవాటు- అటు నగరాల సౌందర్యాన్ని దెబ్బతీస్తోంది. ఆర్థిక వ్యవస్థకు నష్టాన్ని, ప్రభుత్వ యంత్రాంగానికి అనవసర కష్టాన్ని కలిగిస్తుందనేది స్పష్టం.

మరేం చేద్దాం...?

ఇలాంటి విపరిణామాన్ని ఎదుర్కోవడానికి నగర పాలక సంస్థలు, ప్రభుత్వాలు, స్వచ్ఛంద సంస్థలు కృషి చేస్తున్నా, పౌరుల ప్రవర్తనలో మార్పు రావాలి. ఇప్పటికే ఆయా నగరాల కార్పొరేషన్లు సీసీటీవీల పర్యవేక్షణ వ్యవస్థను ఏర్పాటు చేసి నియమాలను ఉల్లంఘించిన వ్యక్తులపై జరిమానా విధిస్తున్నాయి. సామాజిక అవగాహన పెంచేందుకు కొన్ని ప్రాంతాల్లో 'నో తూతూ క్యాంపెయిన్' పేరిట చర్యలు చేపట్టారు. ఇవేవీ పూర్తిస్థాయి ఫలితాలు అందించలేకపోతున్నాయి. చట్టపరంగా ఇలాంటి చర్యలను 'మైనర్ న్యూసెన్సు'గా గుర్తించారు. కానీ, దీనివల్ల తీవ్రమైన పర్యావరణ, ఆరోగ్యపరమైన సమస్యలు తలెత్తుతున్నాయి. భవనాలు, నిర్మాణాలు, ప్రజారవాణా వ్యవస్థలు, ఇతర మౌలిక వసతులకు నష్టమూ వాటిల్లుతోంది. ఇలాంటి వాటన్నింటినీ పరిగణనలోకి తీసుకోవాలి. ఇతర దేశాల్లో మనకు భారతీయులుగానే గుర్తింపు ఉంటుందని, వ్యక్తులుగా మనం చేసే ప్రతి పనినీ భారత దేశానికే ఆపాదిస్తారన్న సున్నిత విషయాన్ని గుర్తుంచుకోవాలి. విదేశాలకు వెళ్తున్న భారతీయులు తమ వ్యక్తిగత ప్రతిభా సామర్థ్యాలు, నైపుణ్యాలతోనే అక్కడికి ఆహ్వానం అందుకున్నా, వారు తమ దేశానికి ప్రతినిధులమనే సంగతిని మరవద్దు. డాక్టర్లుగా, వ్యాపారులుగా, ఇంజినీర్లుగా, సాఫ్ట్‌వేర్ తదితర వృత్తి నిపుణులుగానే కాకుండా, భారతీయ సంస్కృతికి రాయబారులుగా, భారతీయతకు ప్రతినిధులుగా ఉంటూ జాగ్రత్తగా వ్యవహరించాలి.




డాక్టర్ మామిడి హరికృష్ణ,
అదనపు రిజిస్ట్రార్, తెలంగాణ సహకార శాఖ

తొలి తెలుగు కథలు చదివారా?

ఇప్పుడంటే రచయిత్రులుగా, ప్రచురణకర్తలుగా రాణిస్తున్న ఎందరో మహిళలను చూస్తున్నాం. కానీ శతాబ్దంన్నర క్రితం... చదువుకుంటే స్త్రీలు చెడిపోతారనుకునే సమాజంలో పుట్టిపెరిగి తెలుగులో తొలి కథా రచయిత్రిగానే కాదు స్త్రీవాదిగా కూడా చరిత్ర పుటలకెక్కారు భండారు అచ్చమాంబ. 'తెలుగు జనానా', 'హిందూ సుందరి', 'సావిత్రి' అనే పత్రికలలో 1898 నుంచి ఆమె కథలు ప్రచురితమైనట్లు తెలుస్తోంది. వాటి నుంచి సేకరించిన పది కథలతో 'తొలి తెలుగు కథలు' సంకలనం వచ్చింది. నూటపాతికేళ్ల క్రితం... . అసలు తెలుగులో కథలే లేని రోజుల్లో, స్త్రీల అక్షరాస్యత నామమాత్రంగా కూడా లేని కాలంలో ఆమె ఏం రాసి ఉంటారు? భాష, శైలి, వస్తువు, కథనం... ఎలా ఉండి ఉంటాయి? అన్న ప్రశ్నలకు సమాధానాలు ఈ కథల్లో లభిస్తాయి. స్త్రీ చైతన్యం, విద్యాభివృద్ధి, సమాజంలో మార్పులను ఆశిస్తూ అచ్చమాంబ చేసిన రచనలు ఆధునిక, అభ్యుదయ భావాలకు వేదికలు.


ఈ పుస్తకంలోని ఒక్కో కథా ఒక్కో ఆణిముత్యం. స్త్రీవిద్య పలు సామాజిక సమస్యలను పరిష్కరించగలదని వందేళ్ల క్రితమే చాటిన ధీశాలి అచ్చమాంబ. ఆడపిల్ల పుట్టాలని తండ్రి కోరుకోవడం, పుట్టిన అమ్మాయిని మగపిల్లలతో సమానంగా బడికి పంపి చదివించడం, చదువుకున్న అమ్మాయిని ఒకరు ఇష్టపడి, కట్నం లేకుండా పెళ్లి చేసుకోవడం... 'జానకమ్మ' ఇతివృత్తం. చదువుకుంటే మంచి జీవితం లభిస్తుందని వివరించే కథ ఇది. ఈ అంశంపైనే మరో కథ 'స్త్రీవిద్య' సంభాషణ రూపంలో సాగుతూ భిన్న కోణాల్లో చదువు ప్రాధాన్యాన్ని చర్చిస్తుంది. సంసారాలన్నాక చిన్న చిన్న తగాదాలు సహజం. అవి నిండు జీవితాలను నాశనం చేయకముందే పరిష్కరించుకోవాలని సూచిస్తుంది 'దంపతుల ప్రథమ కలహం'. 'నేను పెండ్లాడిన భార్యను గాని దాసిని గాను' అన్న మాటలతో మొదలయ్యే ఈ కథ భార్యాభర్తలు ఎదుటి వాళ్ల స్వేచ్ఛను కూడా అర్థం చేసుకోవాలని చాటుతుంది. ఒక పురాణకథకు సమకాలీనతను ఆపాదించి పొదుపు ద్వారా సంసారాన్ని స్వర్గంగా ఎలా మార్చుకోవచ్చో చెబుతుంది 'గుణవతియగు స్త్రీ' కథ. దాన గుణం మంచిదే కానీ అది నిజంగా అవసరం ఉన్నవారికే ఇవ్వాలంటుంది 'సత్పాత్రదానం'. ఈర్ష్య, అహంకారం లాంటివి ఎందుకు మంచిది కాదో చెప్పారు 'లలితా శారదలు' అనే పిల్లల కథ ద్వారా. మరో మంచి కథ 'ధనత్రయోదశి'. పేదరికంలో ఉన్నప్పటికీ అత్యాశకు పోకుండా స్వయంకృషిని నమ్ముకున్న జంట కథ ఇది. 'అద్దమును సత్యవతియును' అన్న గల్పిక విభిన్నంగా ఉంటుంది. ఈ ప్రపంచం అంతా అద్దమనీ దాన్ని మనం సంతోషంగా చూస్తే సంతోషాన్నీ, కోపంగా చూస్తే కోపాన్నీ ప్రతిబింబిస్తుందనీ ఒక చిన్న సంఘటన ద్వారా చెబుతారు. చక్కటి వ్యక్తిత్వం, సానుకూల జీవనం... ప్రధానంగా సాగుతాయి ఈ కథలన్నీ.



అచ్చమాంబ కథల్లో భాష గ్రాంథిక శైలితో ఉన్నప్పటికీ చదువుతుంటే తేలిగ్గానే అర్థమైపోతుంది. నేటి ఆంధ్ర ప్రాంతంలో పుట్టి, తెలంగాణలో పెరిగి, మహారాష్ట్రలో నివసించిన అచ్చమాంబకు ఆంగ్లంతో పాటు మరాఠీ, హిందీ, సంస్కృతం, గుజరాతీ భాషలూ వచ్చు. కథలు మాత్రమే కాక ఆమె 'అబలా సచ్చరిత్ర రత్నమాల' పేరుతో చరిత్రలో స్ఫూర్తిప్రదాతలుగా నిలిచిన ధీర వనితల జీవితాలను అక్షరబద్ధం చేశారు. జీవించింది ముప్పై ఏళ్లే అయినప్పటికీ చిరకీర్తి పొందిన అచ్చమాంబ 1901లోనే మచిలీపట్నంలో స్త్రీ సమాజాన్ని నెలకొల్పి ఆచరణలోనూ వనితాచేతనకు బాటలు వేశారు.

– మిహిర

ఈ ఏటి మేటి... నేతారత్నాలు!



అక్కడో బహుమతి ప్రదాన కార్యక్రమం జరుగుతోంది. కొత్త ఏడాదిలోకి ప్రవేశిస్తున్న నేపథ్యంలో 2025లో తమ మాటలూ చేష్టలతో ప్రఖ్యాతిగాంచిన వారికి ప్రత్యేక పురస్కారాలు అందజేస్తున్నారు. వేదికపైనున్న భారీ తెరపై పురస్కార గ్రహీతల ఘనకార్యాల గురించి ఏవీలు ప్రదర్శిస్తూ, వ్యాఖ్యాతలు ఇలా మైకులను బద్దలుకొడుతున్నారు...

స్వయంప్రకటిత శూర రత్న




ఎన్నటికీ గెలవలేని యుద్ధంలో... మొన్నటికి మొన్న మట్టికరచిన పోరాటంలో ప్రగల్భాల వీరుడు. తనకుతానే మోయలేనన్ని పతకాల్ని దిగేసుకున్న శూరుడు. ఓడిన పోరులోనూ పదోన్నతులు పొందిన పైరవీ రత్న. పెద్దరాజ్యం పెద్దన్ననే మాయచేసి, ఆయన మనసులోకి దూరిన మర్మకళారత్న. తినడానికి తిండి లేక సొంత దేశంలో జనం పస్తులుంటున్నా, క్రిప్టోకరెన్సీలతో అంతర్జాతీయ వ్యాపారాలు చేసే సైనిక వ్యాపారి. పోరాటం చేయాల్సిన పదవిలో చేతులెత్తేసినా, పెత్తనం చలాయించే రాజకీయ బేహారి... ఆయనే కన్నీర్ మున్నీర్!

అశాంతి రత్న!



ఫ్లాష్‌బ్యాక్‌లో ఆయనొక శాంతి దూత. నోబెల్ కీర్తి పొందిన స్ఫూర్తిప్రదాత. కట్ చేస్తే- ఇప్పుడు అరాచకానికీ అశాంతికీ రింగ్ మాస్టర్. కుర్రాళ్లు రగిల్చిన రావణకాష్ఠాన్నే సింహాసనంలా మార్చుకున్న మహానుభావుడు. శాంతి సాధన అనే ఎండమావితో అందరినీ నమ్మించి నేరుగా కుర్చీలోకి దిగిపోయిన ప్యారాచూట్ నేత. బయట అల్లకల్లోలం సాగుతున్నా, బీరువాలో భద్రంగా దాచుకున్న శాంతి బహుమతిని చూసి మురిసిపోతూ, మైమరచిపోయే మైనస్ నేత... ఒళ్లంతా అబద్ధాల మైనపు పూత! సాయంచేసిన పక్క దేశం చేతిని కరవడంలో ఆయనకు లేనే లేదు నీతీ నియమం. పుణ్యానికి దక్కిన పదవిని కాపాడుకునేందుకు దేశం చాపకింద అగ్గిని రగిలిస్తూ, హింసను భగ్గుమనిపిస్తున్న జాతిరత్నం. మానవత్వం కాలిపోతుంటే మౌనముద్రలో మునిగిన అశాంతి రత్నం!

పల్టీ రత్న



ఈయన ప్రపంచానికే పెద్దన్నగా పోజులుకొట్టే రోల్డ్ గోల్డ్ కంప్. పేరుకు తగ్గట్లే పొద్దున లేస్తే చేసేవన్నీ తంపులమారి పనులే. తాను నిద్ర లేవనిదే ప్రపంచానికి తెల్లారదనే భ్రమతో నిద్రపట్టక పిచ్చెక్కిపోయే వెర్రినాగన్న. ఆయన ఆలోచన అస్తవ్యస్తం. ఆయన నిర్ణయం గందరగోళం. శుభ్రంగా ఉన్నదాన్ని, ఉన్నపాటున చిందరవందర ఎలా చేయవచ్చన్నది ఆయనను చూసి నేర్చుకోవచ్చు. ఆప్తమిత్రుణ్నీ ఆగర్భ శత్రువుగా చేసుకోవడం కంప్ దొరకు నోటితో పెట్టిన విద్య. ఒక చేత్తో అప్పుల ముష్టెత్తుకుంటూ, మరో చేత్తో ఉగ్రవాదులకు గోరుముద్దలు తినిపించేవారిని చంకనెత్తుకోవడంలో ఆయనది పోటీలేని, సాటిరాని శైలి. పక్కలో బల్లేన్ని సీటుకింద పెట్టుకోవడంలో అసమాన నైపుణ్యాలు సొంతం చేసుకున్న డేర్ డెవిల్ డ్రాక్యులా స్టార్. ఆర్థిక హైవేపై దూసుకెళ్తున్న 'భారతాన్ని' కాదని, దివాళా తీసిన పాపిస్థాన్‌తో పైలాపచ్చీసుగా తిరిగే చంచల స్వభావం ఆయనలో అచంచలం. ముష్కర మురికి కంపునే అత్తరుగా అద్దుకుంటూ కరివేపాక్‌నూ మెయిన్‌కోర్సు కర్రీలా కళ్లకద్దుకుని తినే తింగరితనం మరీ ప్రత్యేకం. తాను చెప్పే మాటల్ని తానే నమ్మక, ఎవర్నీ నమ్మించలేక, చెప్పినదాన్నే చెప్పీచెప్పీ చంపుకొనితినే చర్వితచరణప్రియదాసుడు. ఒక్కమాటపైనా గట్టిగా గంటసేపు నిలబడలేక కిందామీదా పడుతూ తలనిండా బొప్పి కట్టించుకుంటూ, దాన్నే కిరీటంగా నమ్మించే కవరింగ్ స్టార్. ఏదో చేయాలనుని, ఇంకేదో చేయబోయి, మరేదో చేసేసే గందరగోళ గండరగండడు. తానన్న మాటల్ని తానే ఖండఖండాలుగా ఖండించుకుని ఒంటినిండా గాట్లు వేసుకునే ఖండనవీరుడు. నిమిషానికో యూటర్న్‌తో పిల్లిమొగ్గల్తో చిందులేసే పల్టీ స్టార్. పెద్దపెద్ద యుద్ధాల్నీ ఆపానంటూ చిన్నపిల్లల్లా పంచాయతీ పెడుతూ, దొంగ నవ్వులతో చూసేవాళ్లకి కంపరం పుట్టిస్తున్న ది గ్రేట్ హెడేక్ స్టార్! ఆయనే మన కంప్... పసలేని వసపిట్ట మాటల సంప్!

– శ్రీశైల

జీహుజూర్ రత్న



ఆయనకు అప్పగించింది ఒక దేశపు ప్రధాన కుర్చీ! చేసేది ఆ కుర్చీకి సెంట్రీ డ్యూటీ! ఎవరో గెలిచిన కప్పును ఎత్తుకొచ్చి, సంబరాలు చేసుకునే తెలివిమాలిన గుంపులో సీనియర్. ఎవరూ విలువ ఇవ్వకున్నా నామోషీ పడని శెభాష్ షరీబ్. సైనిక నేతకు జీహుజూర్ అనడానికీ మొహమాటపడని మనస్తత్వం. .. వెన్నెముక లేని ఆకారానికి ఉండీలేనట్టుండే అధికారమే అలంకారం!

దగారత్న



అంతర్జాతీయ అరివీర చోరులతో పోటీపడే లోకల్ మేడ్ గ్యాంగ్ లీడర్. తాతల కాలం నుంచి తాగుతున్న అవినీతి నేతి కంపును సువాసనగా నమ్మించజూసే దగారత్నం. దేవుడి గుళ్లో దొంగతనాన్ని కూడా చిన్నదంటూ కొట్టిపారేసే పాడు పెద్దరికం. కత్తిగాట్లను మించిన గొడ్డలిపోట్లతో బాబోయ్ అనిపించే భాయ్‌లకే బడా భాయ్! ఇసుకను, కొండల్ని నలిపి మింగేసే ముఠాకు ఆయన మాటే శాసనం. నూట డెబ్బై అయిదు మైనస్ నూటయాభై ఒకటి ఈక్వల్ టూ పదకొండు వంటి అద్భుత గణిత ఫార్ములాను కనిపెట్టిన అగణిత అద్భుత ప్రతిభ ఆయనకు సహజాభరణం. సీట్ల పతనంలో రికార్డు స్కోరు సాధించి, తన రికార్డును తానే మళ్లీ మళ్లీ బద్దలు కొట్టేందుకు ఉత్సాహంగా ఉవ్విళ్లూరుతున్న ఆయనే మన దగాన్ సార్!


ఎంతెంత దూరం.. శాటిలైట్ పయనం?

హాయ్! బుజ్జీ!

నేస్తాలూ.. శాటిలైట్ల గురించి వినే ఉంటారు కదా! భూమి పైనుంచి మనం రాకెట్ ద్వారా వాటిని అంతరిక్షంలోకి పంపిస్తాం. అవి అక్కడే ఉండిపోయి, మనకు సేవలు అందిస్తాయి. జీపీఎస్ సిగ్నళ్లు, విమానాలు, ఓడల రాకపోకలు, వాతావరణ హెచ్చరికలు, టీవీ, రేడియో ప్రసారాలు వంటి పనులన్నీ సజావుగా సాగేందుకు సాయపడతాయి.

సూర్యుడు నక్షత్రం. సూర్యుడి చుట్టూ తిరిగే వాటిని గ్రహాలు అంటాం. గ్రహాల చుట్టూ తిరిగేవి ఉపగ్రహాలు. అలా చంద్రుడు మన భూమికి ఉపగ్రహం. ఇదంతా ప్రకృతి సిద్ధమైనది. అది కాకుండా మనుషులు తయారు చేసిన కృత్రిమ ఉపగ్రహాలు కూడా ఉంటాయి. ఇవి అంతరిక్షంలో భూమి చుట్టూ తిరుగుతుంటాయి. చాలా దేశాలు ఇలాంటి కృత్రిమ ఉపగ్రహాల్ని అంతరిక్షంలోకి పంపిస్తున్నాయి. ఇవన్నీ విభిన్న పరిమాణాల్లో ఉంటాయి. ఒక చిన్న పరికరం మొదలు, భారీ బెలూన్‌ను మించిన సైజులో కూడా ఉంటాయి. బంతులు, పెట్టెలు వంటి రకరకాల ఆకృతుల్లో ఉంటాయి. టీవీ, రేడియో ప్రసారాలను భూమి మీద మారుమూల ప్రాంతాలకు అందిస్తుంటాయి.

సరే, మనుషులు పంపించే కృత్రిమ శాటిలైట్లు మనకు అంటే భూమికి ఎంత దూరంలో ఉంటాయనేది ఆసక్తికరమైన సందేహం కదూ! అవి చేసే పని, చేయాల్సిన పని సామర్థ్యాన్ని బట్టి ఆ విషయం ఆధారపడి ఉంటుంది. కొన్ని శాటిలైట్లు అయితే భూమి నుంచి 177 కిలోమీటర్ల దగ్గరలోనే ఉండొచ్చు. మరికొన్ని భూమికి బాగా దూరంగా అక్కడెక్కడో 35 వేల కిలోమీటర్లకు పైగా దూరంలో ఉండి సేవలు అందిస్తుంటాయి. మరి, అక్కడెక్కడో ఉండే శాటిలైట్ పని చేయడానికి ఏదో ఒక శక్తి కావాలి కదా, మరెలా? అంతరిక్షంలో ఒంటరిగా ఉండిపోయే శాటిలైట్‌కు తనలో అమర్చిన పరికరాలను పని చేయించడానికి విద్యుత్ శక్తి అవసరమే. భూమికి దూరంగా ఉండే శాటిలైట్‌కు కరెంటు ఎలా అందుతుందనే అనుమానం వచ్చిందా! శాటిలైట్‌కు ముఖ్యమైన శక్తి వనరు సూర్యుడే. దాని బయటివైపు ఉపరితలంలో బోలెడన్ని సోలార్‌సెల్స్‌ను బిగిస్తారు. అవి సూర్యకాంతిని వాడుకుని విద్యుత్‌ను తయారు చేస్తాయి. ఆ కరెంటే శాటిలైట్ బ్యాటరీలను ఛార్జింగ్‌తో ఉండేలా చేస్తుందన్నమాట.



– శ్రీజన్

మ్యాన్ ఆన్ వీల్.. సమస్యలు ఫుల్

- కాలంతో పోటీపడుతూ దూసుకొచ్చే గిగ్‌వర్కర్లు
- కోరుకున్న వస్తువు క్షణాల్లో మన ముంగిటకు..
- రాష్ట్రంలో 3 లక్షల మంది గిగ్ వర్కర్లు
- ఉద్యోగ, సామాజిక భద్రత కల్పించాలని ప్రభుత్వానికి వినతి



ఇంట్లో పిల్లలు చకచకా తిరుగుతుంటే కాళ్లకు చక్రాలు కట్టుకున్నారంటూ సరదా పడతాం.. కానీ, వీళ్లు రోజులో 16 గంటలకు పైగా చక్రాలపైనే తిరుగుతున్నారు. అర్ధరాత్రీ అపరాత్రీ.. ఎండా వానా ఇవేమీ లెక్క చేయరు. కాలంతో సమానంగా పరిగెడతారు. ఉదయం అల్పాహారం నుంచి రాత్రి భోజనం వరకు, ఇంట్లో పప్పూ ఉప్పూ నుంచి పాలు, పెరుగు ఇలా ఏదంటే అది మనం అలా ఆర్డర్ పెడితే ఇలా క్షణాల్లోనే తెచ్చి ఇస్తున్నారు.. మనం వెళ్లాల్సిన చోటకు నిమిషాల్లో తీసుకువెళ్లి దించే రైడర్లున్నారు. వీళ్లే గిగ్ వర్కర్లు. రాష్ట్రంలో ఇలాంటి కార్మికులు సుమారు 3 లక్షల మంది ఉన్నారనేది ప్రాథమిక అంచనా. వీరిలో దాదాపు 30 వేల మంది కేంద్ర ప్రభుత్వ ఈ-శ్రమ్ పోర్టల్‌లో నమోదు చేసుకున్నారు. ఒక ఫుడ్ డెలివరీ సంస్థకు రాష్ట్రంలోని 47 పట్టణాల్లో 30 వేల మందికి పైగా డెలివరీ భాగస్వాములున్నారు.

గిగ్ వర్కర్లు ఏం కోరుకుంటున్నారు?

ప్రభుత్వం నుంచి ఏం కోరుకుంటున్నారని పలువురు గిగ్ వర్కర్లను పలకరించగా.. 'మాకో గుర్తింపు లేదు. మేం ఫలానా అని మాకు ఐడీ కార్డులివ్వాలి' అని మల్లికార్జున్, 'ఉద్యోగ భద్రత కల్పించాలి' అని సునీల్‌కుమార్ చెప్పారు. 'మా అంత అసంఘటితంగా ఇంకెవరూ ఉండరు. రాష్ట్రంలో మేం ఎంతమంది ఉన్నామనే లెక్క కూడా ప్రభుత్వం దగ్గర లేదు. అదీ మా దుస్థితి' అని శంకర్ ఆవేదన వ్యక్తం చేశారు. 'మాకు ప్రమాదం జరిగి తిరగలేకపోతే రూ.లక్ష, చనిపోతే రూ.10 లక్షలు బీమా ఇస్తామని మా కంపెనీలు చెబుతున్నాయి. అందుకు గ్యారంటీ లేదు' అని హరీష్ ఆందోళన వ్యక్తం చేశారు. 'రోజులో 16 గంటలపాటు రోడ్డుపైనే ఉంటున్నాం, ఆరోగ్య సమస్యలొస్తే ఇక మా పరిస్థితి అంతే' అని రాజశేఖరరావు వాపోయారు.

దేశవ్యాప్త సమ్మె

ఉద్యోగ భద్రతతోపాటు ఆరోగ్య బీమా, సరైన వేతనాలు, పారదర్శక ఇన్సెంటివ్‌లు కల్పించాలని, ఐడీ బ్లాకింగ్- పెనాల్టీలు ఆపాలనే డిమాండ్లతో క్విక్ కామర్స్, ఈ-కామర్స్, ఫుడ్ డెలివరీ విభాగాల్లో సేవలందిస్తున్న గిగ్ వర్కర్లు గురువారం దేశవ్యాప్త సమ్మె చేశారు. డిసెంబరు 31న సమ్మెకు ఇండియన్ ఫెడరేషన్ ఆఫ్ యాప్ బేస్డ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ (ఐఫ్యాట్) పిలుపునిచ్చింది.

సమస్యలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టి

- గిగ్ కార్మికులు సహా అసంఘటిత కార్మికుల జాతీయ డేటాబేస్‌ను రూపొందించడానికి కేంద్రం ఈ-శ్రమ్ పోర్టల్‌ను ప్రారంభించింది. ఆరోగ్య సంరక్షణ కోసం 'పీఎం జన్ ఆరోగ్య యోజన'ను, పింఛన్ల కోసం 'పీఎం శ్రమయోగి మాన్-ధన్ యోజన'ను తీసుకువచ్చింది.
- రాజస్థాన్‌లోని గిగ్ వర్కర్ల సామాజిక భద్రత- సంక్షేమం కోసం ప్లాట్‌ఫాం ఆధారిత గిగ్ వర్కర్స్ చట్టాన్ని అక్కడి ప్రభుత్వం 2023లోనే తీసుకువచ్చింది.
- ఝార్ఖండ్‌లో గిగ్ వర్కర్లకు సామాజిక భద్రత కల్పించడంతోపాటు ప్లాట్‌ఫాం కూలీల సంక్షేమం కోసం.. ఝార్ఖండ్ ప్లాట్‌ఫాం బేస్డ్ గిగ్ వర్కర్స్ బిల్లు-2025ను ఆ రాష్ట్ర అసెంబ్లీ గత ఆగస్టులో ఆమోదించింది. గిగ్ వర్కర్ల నమోదుతోపాటు వారి సంక్షేమం కోసం ప్రత్యేకంగా బోర్డును ఏర్పాటు చేస్తారు.

కర్ణాటకలో ప్రత్యేక సంక్షేమ బోర్డు

కర్ణాటకలో గిగ్‌వర్కర్లకు ప్రత్యేక సంక్షేమ బోర్డు, నిధిని ఏర్పాటు చేసే 'కర్ణాటక ప్లాట్‌ఫామ్ ఆధారిత గిగ్ వర్కర్స్ బిల్లు-2025ను తెచ్చారు. గిగ్ వర్కర్లను ప్రత్యేక ఐడీతో నమోదు చేసుకుంటారు. వారికి బీమా చెల్లించేందుకు అగ్రిగేటర్లు ప్రతి లావాదేవీపై 1-5 శాతం మొత్తాన్ని ఈ సంక్షేమనిధికి చెల్లించాలి. ప్రోత్సాహకాలు, కమీషన్‌లాంటివి తగ్గిస్తే.. కారణాలను గిగ్ వర్కర్‌కు తెలియజెప్పాలి. 14 రోజుల ముందు నోటీసివ్వకుండా పని నుంచి తొలగించరాదు. బోర్డు గిగ్ వర్కర్ల కోసం సామాజిక భద్రతా పథకాలను రూపొందిస్తుంది.

తెలంగాణలో..

సుమారు 4 లక్షల మంది గిగ్ వర్కర్ల కోసం రూపొందించిన తెలంగాణ ప్లాట్‌ఫాం ఆధారిత గిగ్ వర్కర్ల (రిజిస్ట్రేషన్, సామాజిక భద్రత, సంక్షేమం) బిల్లు-2025ను మంత్రి మండలి నవంబరు 17న ఆమోదించింది.

- రాష్ట్ర కార్మికశాఖ మంత్రి ఛైర్మన్‌గా గిగ్‌వర్కర్ల సంక్షేమానికి ప్రత్యేకంగా సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయనున్నారు. కేంద్ర, రాష్ట్ర కార్మిక శాఖలు, రవాణా, ఐటీ, ఆర్థిక, వాణిజ్యపన్నుల శాఖల ప్రతినిధులు, గిగ్ వర్కర్ల నుంచి నలుగురు, అగ్రిగేటర్ల నుంచి నలుగురు ప్రతినిధులు దీనిలో సభ్యులుగా ఉంటారు.
- చట్టం అమల్లోకొచ్చిన 45 రోజుల్లోగా అగ్రిగేటర్, గిగ్ వర్కర్లు బోర్డు వద్ద పేర్లు నమోదు చేసుకోవాలి. ప్రత్యేక నిధిని ఏర్పాటు చేసి.. గిగ్‌వర్కర్లకు బీమా, సామాజిక భద్రత, సంక్షేమ పథకాలు, పింఛన్లు, ప్రసూతి సహాయం వంటివి బోర్డు అందిస్తుంది.
- గిగ్‌వర్కర్లకు ఉద్యోగ భద్రత కల్పిస్తారు. వారం రోజుల ముందస్తు నోటీసివ్వకుండా తొలగించరాదు.

ఏపీలో..

పొరుగునున్న కర్ణాటక, తెలంగాణల తరహాలో ఏపీ ప్రభుత్వం కూడా అండగా నిలవాలని గిగ్ వర్కర్లు కోరుతున్నారు.

\- ఈనాడు, అమరావతి

ఆందోళనలో ఉన్నప్పుడు ఈ పని చేయండి



సమస్యలెదురైనప్పుడు కుంగుబాటుకు, ఆందోళనకు గురికాకండి. ఎందుకంటే ఎన్నో తెలివితేటలు, సమయస్ఫూర్తి ఉన్నవారు కూడా ఆందోళనలో ఉన్నప్పుడు ఏ సమస్యనూ పరిష్కరించలేరు. కుంగుబాటు మనల్ని అచేతనులను చేస్తుంది. దానికి బదులు ఏదో ఒక ప్రయత్నమంటూ చేస్తే స్పష్టత వస్తుంది. అందుకే ఆందోళన కలిగినప్పుడు 'పరిష్కారం దిశగా ఇప్పుడు నేను చేయగలిగే ఒకే ఒక్క పని ఏంటి' అని ఆలోచించండి. మీ స్ఫురణకు వచ్చిన పనిని వెంటనే మొదలుపెట్టండి.

\- డేవ్ క్లైన్, లీడర్షిప్ కోచ్

వద్దని చెప్పినా.. అల్లు అర్జున్ వచ్చారు

- సంధ్య థియేటర్ తొక్కిసలాట కేసు ఛార్జిషీటులో వెల్లడి
- 112 పేజీలతో న్యాయస్థానంలో సమర్పించిన పోలీసులు

ఈనాడు, హైదరాబాద్: పుష్ప-2 చిత్రం ప్రీమియర్ షో సందర్భంగా హైదరాబాద్ సంధ్య థియేటర్ తొక్కిసలాట కేసులో చిక్కడపల్లి పోలీసులు నాంపల్లి కోర్టులో ఛార్జిషీటు దాఖలు చేశారు. సినీ నటుడు అల్లు అర్జున్ నిందితుడిగా ఉన్న ఈ కేసులో దర్యాప్తు పూర్తి చేసి ఈ నెల 24న 112 పేజీలతో అభియోగపత్రం సమర్పించారు. అనుమతి లేకున్నా అల్లు అర్జున్ రోడ్డు షో నిర్వహిస్తూ థియేటర్‌కు వచ్చారని స్పష్టం చేశారు. భారీగా అభిమానులు వచ్చే అవకాశమున్నా.. థియేటర్ యాజమాన్యం ముందస్తు ప్రణాళికతో వ్యవహరించలేదని... రద్దీ నియంత్రణలో విఫలమైందని దర్యాప్తులో తేల్చారు. థియేటర్ యాజమాన్యం, ఈవెంట్ నిర్వాహకులు, ప్రైవేటు భద్రతా సిబ్బంది మధ్య సమన్వయం లేదని ప్రస్తావించారు. థియేటర్ లోపల, వెలుపల సామర్థ్యానికి మించి ప్రేక్షకులు, అభిమానులు రావడం, వారిని నియంత్రించేందుకు సరైన ఏర్పాట్లు లేకపోవడం, ప్రవేశం, నిష్క్రమణ మార్గాల్లో అస్తవ్యస్త పరిస్థితులు తొక్కిసలాటకు కారణమని పేర్కొన్నారు. తొక్కిసలాటలో గాయపడ్డ బాధితులు, ప్రత్యక్ష సాక్షులు, పోలీసులు సహా మొత్తం 52 మందిని విచారించి వాంగ్మూలాలు నమోదు చేశారు. సీసీ కెమెరాల్లో దృశ్యాలు, ఆ రోజు సెల్‌ఫోన్లలో చిత్రీకరించిన వీడియోలను తెప్పించి పరిశీలించారు. సాంకేతిక ఆధారాలు సేకరించి కోర్టులో సమర్పించారు.

ఇదీ కేసు నేపథ్యం

గతేడాది డిసెంబరు 4న రాత్రి ఆర్టీసీ క్రాస్‌రోడ్డులోని సంధ్య థియేటర్‌లో పుష్ప-2 చిత్రం ప్రీమియర్ షో వేశారు. ఈ షోకు అల్లు అర్జున్ రావడం, అనంతరం జరిగిన తొక్కిసలాటలో దిల్‌సుఖ్‌నగర్‌కు చెందిన రేణుక మరణించగా.. ఆమె కుమారుడు శ్రీతేజ్ తీవ్ర గాయాలపాలయ్యాడు. కొన్ని రోజుల పాటు కోమాలో ఉన్న శ్రీతేజ్ దాదాపు 10 నెలలు ఆసుపత్రిలో చికిత్స పొందాడు. ప్రస్తుతం ఇంట్లో ఉన్నా చికిత్స కొనసాగుతూనే ఉంది.

మహిళల ఆర్థిక స్వావలంబనలో సీఎస్ఆర్ పాత్ర కీలకం: పురందేశ్వరి



పురందేశ్వరికి జ్ఞాపిక అందిస్తున్న ఇస్రో ఛైర్మన్ నారాయణన్

రాజమహేంద్రవరం (దేవీచౌక్), న్యూస్‌టుడే: మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించడంలో సీఎస్ఆర్ పాత్ర కీలకమని రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. బెంగళూరులో ఆమె అధ్యక్షతన మహిళా సాధికారత పార్లమెంటరీ కమిటీ సమావేశం జరిగింది. మహిళల విద్య, స్వయం ఉపాధి, ఆరోగ్య సంరక్షణ, నాయకత్వ అవకాశాల వంటి అంశాల్లో రక్షణ రంగ పీఎస్‌యూలు సీఎస్ఆర్ ద్వారా చేపడుతున్న కార్యక్రమాలపై చర్చించారు.

ఇస్రో బృందానికి అభినందనలు: పురందేశ్వరి శనివారం ఇస్రో ఛైర్మన్ నారాయణన్‌ను కలిశారు. ఇస్రోలో పీఓఎస్‌హెచ్ చట్టం-2013 అమలును సమీక్షించారు. ఇటీవల చేపట్టిన ప్రయోగం విజయవంతం అయినందుకు శాస్త్రవేత్తల బృందాన్ని ఆమె అభినందించారు.

మీరు కనుసైగ చేస్తే ఎగిరిపోతానా?

అనంతబాబు వ్యాఖ్యలపై ఎమ్మెల్యే శిరీషాదేవి ఆగ్రహం



రంపచోడవరం, న్యూస్‌టుడే: కారు డ్రైవర్ సుబ్రహ్మణ్యాన్ని చంపేసి, డోర్ డెలివరీ చేసిన వైకాపా ఎమ్మెల్సీ అనంతబాబు.. తననూ హతమారుస్తానంటూ బెదిరింపులకు పాల్పడుతున్నారని, కానీ తను భయపడే ప్రసక్తే లేదని రంపచోడవరం ఎమ్మెల్యే శిరీషాదేవి స్పష్టంచేశారు. అల్లూరి సీతారామరాజు జిల్లాలో ప్రశాంతతకు చిరునామాగా ఉన్న తమ నియోజకవర్గంలో.. హత్యా రాజకీయాలకు బీజం పడింది వైకాపా ప్రభుత్వ హయాంలోనేనని మండిపడ్డారు. ఆమె శనివారం ఇక్కడ తెదేపా నాయకులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. ఇటీవల ఎమ్మెల్సీ అనంతబాబు చేసిన వ్యాఖ్యలను ఉటంకిస్తూ, 'అమెరికాలో ఉండి కనుసైగ చేసినా, నేను ఎగిరిపోతానంటూ బెదిరిస్తున్నారు. నేనొక మహిళా ఎమ్మెల్యేనని కూడా చూడకుండా హెచ్చరించడం, వ్యంగ్యంగా మాట్లాడటం ఎంతవరకు సబబు' అని ఆమె ప్రశ్నించారు. ఏజెన్సీలో బినామీల పేరుతో క్వారీలు, రంగురాళ్ల తవ్వకాలు, కలప, గంజాయి దందా చేస్తూ కోట్లకు పడగలెత్తింది ఎవరో అందరికీ తెలుసన్నారు. ఎమ్మెల్యే దంపతులు అవినీతికి పాల్పడుతున్నారంటూ అసత్య ప్రచారం చేస్తే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. వైకాపా హయాంలో పట్టణ, మైదాన ప్రాంతాల్లో అవినీతి సొమ్ముతో అనంతబాబు భూములు కొన్నారని, ఆధారాలతో వాటిని నిరూపిస్తానని చెప్పారు.

తుక్కు మాఫియా తిన్నది రూ.400 కోట్లు

- లెక్కతేల్చిన వాణిజ్య పన్నుల శాఖ
- బోగస్ సంస్థలతో సీజీఎస్టీ పేరిట అక్రమాలు

చిత్తూరు, న్యూస్‌టుడే: ఉమ్మడి చిత్తూరు జిల్లాతో పాటు తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల్లో ఇనుప తుక్కు మాఫియా రూ.400 కోట్ల మేర అక్రమాలకు పాల్పడినట్లు వాణిజ్య పన్నుల శాఖ అధికారులు గుర్తించారు. అమాయకులను బినామీలుగా పెట్టి, వారి పేరిట బోగస్ సంస్థలను రిజిస్ట్రేషన్ చేయించిన ఈ మాఫియా.. సీజీఎస్టీ రిటర్న్స్ పేరిట రూ.కోట్ల కొద్దీ సొమ్ము కాజేసింది. రిజిస్ట్రేషన్‌లో ఉన్నవారి పేరుతో పన్ను చెల్లించాలని తాఖీదులు అందడంతో.. తమ పేరుతో ఓ సంస్థ ఉందనీ, తాము రూ.కోట్లలో పన్ను చెల్లించాల్సి ఉందనీ.. తెలియని ఆ అమాయకులు లబోదిబోమంటున్నారు. చిత్తూరు కేంద్రంగా స్క్రాప్ వ్యాపారి తన అక్రమ సామ్రాజ్యాన్ని నడుపుతూ కొందరి సహకారంతో కర్ణాటక, తమిళనాడు, ఆంధ్ర, తెలంగాణలకు విస్తరించాడు. బినామీ పేర్లతో సరకు విక్రయించి రూ.కోట్లు కొల్లగొడుతూ, కేంద్రానికి చెల్లించాల్సిన సీజీఎస్టీ ఎగ్గొట్టాడు. బోగస్ రిజిస్ట్రేషన్లతో దొంగ బిల్లులు సృష్టించి ఇనుప తుక్కు విక్రయించి రూ.కోట్లలో పన్ను ఎగవేయడంతో పాటు తిరిగి ప్రభుత్వ ధనాన్ని లూటీ చేశాడు. ఆ వ్యాపారి స్థానికంగానే తుక్కు కొని, ఇక్కడే విక్రయించాడు. వీటికి వాస్తవ బిల్లులు లేవు. తమిళనాడు, కర్ణాటకలోని కొందరు వ్యాపారుల నుంచి దాన్ని కొన్నట్లు నకిలీ బిల్లులు సంపాదించాడు. అమాయకుల పేరుతో అక్రమ వ్యాపారం చేసిన ముఠా నాయకుడిని అధికారులు గుర్తించినా, చట్టంలోని లొసుగులతో చర్యలకు వెనకాడుతున్నారు. బోగస్ సంస్థలపై రిజిస్ట్రేషన్ ఉన్న వ్యక్తులు అమాయకులు కావడం, కొందరు అసలు రిజిస్ట్రేషన్‌లో పేర్కొన్న చిరునామాల్లో లేకపోవడంతో అక్రమాలు నిగ్గుతేలినా చర్యలకు వీల్లేకుండా పోయింది. ఈ వ్యాపారికి ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారుల అండ ఉండటంతో సంస్థలను రిజిస్ట్రేషన్ చేయించేటప్పుడు సిబ్బంది క్షేత్రస్థాయిలో పరిశీలించలేదు. దరఖాస్తుదారులు అర్హులేనా, వ్యాపారం చేసే స్తోమత ఉందా అని నిర్ధారించుకోకుండా ఆధార్, పాన్, ఓటీపీలతో రిజిస్ట్రేషన్ చేశారు. ఇందుకు అధికారులు పెద్ద మొత్తంలోనే అవినీతికి పాల్పడినట్లు ఆరోపణలున్నాయి. స్క్రాప్ వ్యాపారి నాడు వైకాపా, నేడు తెదేపాలోని కొందరు నేతలకు భారీగా ముట్టజెప్పినట్లు తెలుస్తోంది. ఈ అక్రమాలపై వాణిజ్య పన్నుల శాఖ జేసీ రవీంద్రనాథ్‌రెడ్డిని సంప్రదించగా 'సీజీఎస్టీ అక్రమాలపై నిబంధనల మేర చర్యలు చేపడుతున్నాం. రూ.400 కోట్ల దాకా అక్రమాలు జరిగినట్లు గుర్తించాం. బోగస్ సంస్థల రిజిస్ట్రేషన్ ఉన్నవారిలో కొందరు ఎక్కడున్నారో తెలియదు' అని చెప్పారు.

వైకుంఠ ఏకాదశికి తిరుమల సన్నద్ధం

(మొదటి పేజీ తరువాయి)

వారికి దర్శనం, వసతి కల్పించేందుకు తిరుమల వ్యాప్తంగా ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసింది. భక్తులకు అవగాహన కలిగించేలా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను అదనపు ఈవో వెంకయ్యచౌదరి అధికారులతో కలిసి పరిశీలించారు. భక్తులు ఎప్పటికప్పుడు తితిదే సూచనలు పాటిస్తూ తిరుమల యాత్రకు ప్రణాళిక రూపొందించుకోవాలని ఛైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో అనిల్‌కుమార్ సింఘాల్ సూచించారు.



భక్తులకు అవగాహన కలిగించేలా వివిధ భాషల్లో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీని పరిశీలిస్తున్న వెంకయ్యచౌదరి, అధికారులు

ఇవీ మార్గదర్శకాలు..

- డిసెంబర్ 30 నుంచి జనవరి 8వ తేదీ వరకు శ్రీవారి ఆలయంలో వైకుంఠ ద్వార దర్శనాలకు అనుమతిస్తారు. మొదటి మూడు రోజులు అంటే.. ఈనెల 30, 31, జనవరి 1వ తేదీలకు సంబంధించి ఇప్పటికే ఈ-డిప్ ద్వారా టోకెన్లు జారీ చేసింది. ఈ టోకెన్లు కలిగిన భక్తులు వారికి కేటాయించిన తేదీల్లో నిర్దేశిత సమయానికి మాత్రమే తిరుమలలోని ఆలయ ప్రవేశ మార్గాలకు చేరుకోవాలి.
- జనవరి 2 నుంచి 8 వరకు సర్వదర్శనం క్యూలైన్ ద్వారా భక్తులకు వైకుంఠ ద్వార దర్శనం కల్పిస్తారు. అయితే, తితిదే ప్రజాసంబంధాల విభాగం, ఎస్వీబీసీ ద్వారా అందించే సమాచారం ఆధారంగా, రద్దీని బట్టి భక్తులు యాత్రా ప్రణాళిక వేసుకోవాలి.
- తిరుపతిలో రూ.300పై అందించే ప్రత్యేక ప్రవేశ దర్శనం (ఎస్ఎస్‌డీ) టోకెన్ల జారీని భక్తుల రద్దీ దృష్ట్యా ఆదివారం నుంచి జనవరి 7 వరకు తితిదే రద్దు చేసింది.
- దర్శనం టికెట్ లేనివారిని క్యూలైన్‌లోకి అనుమతించరు. వారు తిరుమలకు చేరుకున్నా, స్థానిక ఆలయాలు సందర్శించవచ్చు. జనవరి 2 నుంచి మాత్రమే సర్వదర్శనం క్యూలైన్‌లోకి అనుమతిస్తారు.

సువాసనల వెనక ప్రమాదాలు!

(మొదటి పేజీ తరువాయి)

ఇంట్లోనూ కాలుష్యమే...

- ఫ్యాబ్రిక్ సాఫ్ట్‌నర్లలోని వీఓసీ, థాలేట్లు, ఇతర రసాయనాలు ఇంట్లోని గాలిలో పేరుకుపోతాయి. నెలల తరబడి వాయు కాలుష్యానికి దోహదం చేస్తాయి.
- ఇవి దుస్తులపై మైనపు పూతను వదులుతాయి. ఇవి ఫర్నిచర్, పరుపులు, చర్మంపైకి చేరతాయి. ఇవి నీటిని శోషించుకునే గుణాన్ని తగ్గిస్తాయి.
- దుస్తులపై ఉన్న సిలికాన్ అవశేషాలు పూర్తిగా తొలగిపోవడానికి నెలల నుంచి సంవత్సరాలు పడుతుంది. ఆ దుస్తులు వేసుకున్నప్పుడు వాటిపై మిగిలి ఉన్న అవశేషాలు చర్మంపైకి చేరే అవకాశముంది.
- ఇవి ఫార్మాల్డిహైడ్, ఎసిటాల్డిహైడ్ తదితర కాలుష్య కారకాలను మారుస్తాయి. ఇవి అనేక ఆరోగ్య సమస్యలను కలిగిస్తాయి. ఈ రసాయనాలు సులభంగా విచ్ఛిన్నం కావు. నదులు, సరస్సులు, సముద్రాల్లోకి చేరి జలచరాలకూ హాని కలిగిస్తాయి. వీటి అవశేషాలు మట్టిలో త్వరగా కలిసిపోవు.

సంక్లిష్ట రసాయన మిశ్రమాలు...

- ఫ్యాబ్రిక్ సాఫ్ట్‌నర్‌లు 1960లలో మార్కెట్లోకి వచ్చాయి. ఆ సమయంలో లాండ్రీ డిటర్జెంట్లలో కాఠిన్యత ఎక్కువగా ఉండేది. ప్రస్తుతం అందుబాటులో ఉన్న డిటర్జెంట్లు తేలికపాటివి. వీటికి ఫ్యాబ్రిక్ కండిషనర్లు అవసరం లేదని అధ్యయనాలు చెబుతున్నాయి.
- సువాసనలు ఉత్పత్తి చేయడానికి వాటిలో సంక్లిష్టమైన రసాయన మిశ్రమాలు వినియోగిస్తారు. అందులో కొన్ని మాత్రమే సహజ పదార్థాలు. చాలా సింథటిక్ సువాసనలు (ఫ్రాగ్రెన్స్) ప్రయోగశాలలో పెట్రోలియం ఆధారిత సమ్మేళనాల నుంచి తయారవుతాయి.
- దుస్తులు ఉతికిన తర్వాత ఈ రసాయనాలు ఆవిరైపోవు. దుస్తులకు అంటుకుని.. రోజుల తరబడి తాజా సువాసన ఇచ్చేలా రూపొందిస్తారు.
- థాలేట్‌లు.. సువాసన ఎక్కువ సేపు ఉంచేలా తరచూ వాడే రసాయనాలు. సువాసన కలిగించే అణువులు త్వరగా విచ్ఛిన్నం కాకుండా అడ్డుకుంటాయి.

సహజ పదార్థాలే మేలు..

- రసాయనాలకు బదులుగా దుస్తుల సువాసన కోసం సహజ పదార్థాలు వినియోగించవచ్చు.
- వైట్‌వెనిగర్ వాడటం వల్ల దుస్తులు మృదువుగా మారతాయి. దుర్వాసన, అవశేషాలు తొలగుతాయి. అవసరమైతే బేకింగ్ సోడా వాడొచ్చు.
- ఉన్నితో చేసిన డ్రయర్ బాల్స్ సహజంగా దుస్తులను మృదువుగా మారుస్తాయి. ఈ బాల్స్‌కు కొన్ని చుక్కల స్వచ్ఛమైన ఎసెన్షియల్ నూనెలు చేరిస్తే సహజ సువాసనలు వస్తాయి.
- సహజమైన, మొక్కల ఆధారిత డిటర్జెంట్లు వినియోగిస్తే హానికరమైన రసాయనాలు లేకుండా దుస్తులు శుభ్రంగా, మృదువుగా మారతాయి.


వెల్లడించట్లేదు...

చాలా కంపెనీలు సాఫ్ట్‌నర్స్‌లో వినియోగించే పదార్థాలను వెల్లడించట్లేదు. దీంతో అవి బయటకు తెలియడం లేదు. వాటికి బదులుగా సహజ పదార్థాలు ఎంపిక చేసుకుంటే మంచిది.


– డాక్టర్ మధుసూదన పాత్రుడు, ఛాతీ వ్యాధుల వైద్య నిపుణులు

- ఈనాడు, విశాఖపట్నం

అన్నింటికీ ఉంది.. లీప్ యాప్!




పిల్లలు పాఠశాలకు సరిగా వెళ్తున్నారా.. లేదా? వారికి ఏ సబ్జెక్టులో ఎన్ని మార్కులొచ్చాయి? క్లాసులో అత్యధిక మార్కులు ఎన్ని? తమ పిల్లలు ఎన్ని మొక్కలు నాటి వాటిని సంరక్షిస్తున్నారు. ఇలాంటి వివరాలన్నీ తల్లిదండ్రులు ఇట్టే తెలుసుకోవచ్చు. అందుకోసం ప్రభుత్వం లీప్ (లెర్నింగ్ ఎక్సలెన్స్ ఇన్ ఆంధ్రప్రదేశ్) అనే యాప్ తీసుకొచ్చింది. ఇందులోనే వాళ్ల హాజరు, మార్కులు, గ్రీన్ పాస్‌పోర్టు అన్నీ ఉంటాయి. తల్లిదండ్రులు స్మార్ట్‌ఫోన్‌లో ఈ యాప్ డౌన్‌లోడ్ చేసుకుని.. విద్యార్థి అపార్ నంబరు, పుట్టిన తేదీతో లాగిన్ అవ్వగానే ఈ వివరాలన్నీ వచ్చేస్తాయి. ఇటీవల జరిగిన మెగా పేరెంట్ మీట్‌లో తల్లిదండ్రులకు ఈ యాప్ గురించి ఉపాధ్యాయులు వివరించారు. – ఈనాడు, అమరావతి



విద్యుదాఘాతంతో కుమారుడి మృతి.. తట్టుకోలేక తండ్రి బలవన్మరణం

వేమూరు, న్యూస్‌టుడే: విద్యుదాఘాతంతో కుమారుడు మరణించగా, దాన్ని తట్టుకోలేక తండ్రి ఆత్మహత్య చేసుకున్నారు. బాపట్ల జిల్లా వేమూరుకు చెందిన అబ్బూరి వెంకయ్య(49), సునీల్(21) తండ్రీ కుమారులు. ఇద్దరూ వ్యవసాయ కూలీలు. శనివారం సునీల్ పొలంలో ఎరువుల సంచులు దించడానికి వెళ్లాడు. ట్రాక్టర్‌పైనుంచి ఎరువుల్ని దించుతున్నప్పుడు తక్కువ ఎత్తులో ఉన్న విద్యుత్తు తీగలు తగిలి అపస్మారక స్థితికి చేరాడు. అతన్ని ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. సునీల్‌కు సంవత్సరం కిందట వివాహమైంది. భార్య ఎనిమిది నెలల గర్భిణి. కుమారుడి మృతిపై వెంకయ్య వేమూరు ఎస్సై శ్రీనివాసరావుకు ఫిర్యాదు చేశాడు. ఆ విషాదాన్ని జీర్ణించుకోలేక, పోలీసు స్టేషన్‌కు దగ్గరలోని రైల్వే పట్టాలపైకి వెళ్లి రైలు కిందపడి బలవన్మరణానికి పాల్పడ్డాడు.


సునీల్


వెంకయ్య

న్యాయమూర్తుల కళ్లకు గంతలు కట్టలేరు

(మొదటి పేజీ తరువాయి)

ఏలూరు పట్టణాభివృద్ధి సంస్థ నుంచి ఆ నిర్మాణానికి 2024లో అనుమతులు పొందారని పేర్కొంది. ఇప్పుడు ఆ ప్రాంతాన్ని ప్రభుత్వం నివాస జోన్ నుంచి వాణిజ్య జోన్‌గా మారుస్తూ నోటిఫికేషన్ ఇచ్చినందున వాణిజ్య అనుమతులను రద్దు చేయడం లేదని తెలిపింది. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ చల్లా గుణరంజన్‌తో కూడిన ధర్మాసనం ఈ నెల 8న ఈ మేరకు తీర్పిచ్చింది. టీఎస్ఐఎస్ఎన్ఆర్ మణిమంజరి, టీసీహెచ్‌వీ నరసింహారావు భీమవరం సంపతి పురం పరిధిలోని సర్వే నంబరు 99/5, 99/6లో నివాస గృహ నిర్మాణానికి మున్సిపాల్టీ నుంచి 2022 ఫిబ్రవరిలో అనుమతి తీసుకొని షాపింగ్ మాల్ తరహాలో వాణిజ్య నిర్మాణం చేస్తున్నారంటూ శ్రీనివాసకుమార్ వర్మ గతంలో హైకోర్టులో వ్యాజ్యం వేశారు. తమ నిర్మాణం సక్రమమేనని, ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ ఇచ్చేలా అధికారులను ఆదేశించాలని మణిమంజరి, నరసింహారావు వ్యాజ్యం వేశారు. విచారణ జరిపిన హైకోర్టు సింగిల్ జడ్జి.. ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. ఖర్చుల కింద రూ.50 వేలు చీఫ్ జస్టిస్ రిలీఫ్ ఫండ్‌కు చెల్లించాలని మణిమంజరి, నరసింహారావులను ఆదేశించారు. దీనిపై శ్రీనివాసకుమార్ వర్మ దాఖలు చేసిన అప్పీల్‌పై సీజే నేతృత్వంలోని ధర్మాసనం విచారణ జరిపింది. ఆ నిర్మాణ ఫొటోలను పరిశీలిస్తే వాణిజ్య అవసరాల కోసం నిర్మిస్తున్నట్లు అర్థమవుతుందని పేర్కొంది. భీమవరం మున్సిపాల్టీ అప్పటి కమిషనర్ మాత్రం నివాస గృహంగా పేర్కొంటూ కోర్టును తప్పుదోవ పట్టించేందుకు ప్రయత్నించారని ఆక్షేపించింది. సింగిల్ జడ్జి విధించిన రూ.50 వేల ఖర్చులను రూ.5 లక్షలకు పెంచింది.

అంతా అధికారులే చూసుకుంటారు!

(మొదటి పేజీ తరువాయి)

కాంప్లెక్స్‌లోని కార్యాలయంలో రెండున్నర గంటలపాటు ఆయన్ను విచారించారు. 'లడ్డూ ప్రసాదం తయారీకి తమిళనాడులోని దిండిగల్‌కు చెందిన ఏఆర్ డెయిరీ మీ హయాంలోనే కల్తీ నెయ్యి సరఫరా చేసినా.. మీరెందుకు గుర్తించలేదు? ఎందుకు చర్యలు తీసుకోలేదు?' అని కరుణాకరరెడ్డిని ప్రశ్నించింది. టెండర్లు పిలవడం, ఖరారు చేయడం అంతా అధికారులే చూసుకుంటారని, తనకేం సంబంధమని ఆయన ప్రశ్నించారని తెలిసింది. కల్తీ అంశం తన దృష్టికి రాలేదని ఆయన సమాధానమిచ్చారు. 2020లో టెండర్ నిబంధనలను సరళతరం చేయడం వల్లే అర్హత, సామర్థ్యం లేని డెయిరీలు తితిదేకు నెయ్యి సరఫరా చేశాయని, అప్పట్లో ప్రత్యేక ఆహ్వానితుడిగా ఉన్న మీకు దీనిపై సమాచారం లేదా? అని అధికారులు ప్రశ్నించారు. 'సంబంధిత కమిటీలే నిర్ణయం తీసుకుంటాయి. తర్వాత బోర్డులో తీర్మానాలు చేస్తారు. వాటికి మేం ఆమోదం మాత్రమే తెలుపుతామ'ని భూమన బదులిచ్చినట్లు సమాచారం. భక్తుల మనోభావాలతో ముడిపడిన వ్యవహారం కాబట్టి నెయ్యి సరఫరా చేసే డెయిరీల ప్లాంట్లను సక్రమంగా తనిఖీ చేస్తున్నారా, లేదా అని చూడాల్సిన బాధ్యత మీపై ఉంటుంది కదా అని అడగ్గా డెయిరీ నిపుణులు, కొనుగోళ్ల విభాగంలోని అధికారులు, ఉద్యోగులకే ఇందులో ప్రధాన పాత్ర ఉంటుందని భూమన పేర్కొన్నారు. ఏఆర్ డెయిరీకి టెండర్లు కట్టబెట్టాలని మీపై ఎవరైనా ఒత్తిడి చేశారా అని ప్రశ్నించగా నిబంధనల ప్రకారమే వ్యవహరించి ఉంటారని చెప్పారు.

నిబంధనలు ఎందుకు కఠినతరం చేశారు?

'2020లో టెండరు నిబంధనలు సడలించిన తర్వాత మీ హయాంలోనే తిరిగి అంతకుముందు మాదిరిగా నిబంధనలు ఎందుకు కఠినతరం చేశారు? పాల సేకరణ సామర్థ్యం, టర్నోవర్ పెంపునకు ఆమోదం తెలపడానికి కారణమేంట'ని సిట్ ప్రశ్నించగా.. ఇది తన పరిధిలో లేని వ్యవహారమని, అధికారులే చూసుకుంటారని భూమన చెప్పినట్టు తెలిసింది. భోలేబాబా డెయిరీ ప్రతినిధులు మిమ్మల్ని ఎప్పుడైనా సంప్రదించారా.. అని అడగ్గా లేదని బదులిచ్చారు. విచారణకు హైదరాబాద్ నుంచి తిరుపతి వచ్చిన భూమన మధ్యాహ్నం తిరిగి హైదరాబాద్‌కు వెళ్లారు.

ఉద్యోగుల ప్రాసిక్యూషన్‌కు అనుమతి

కల్తీ నెయ్యి కేసులో ప్రమేయం ఉండి ఇప్పటికే ఛార్జిషీట్‌లో నిందితులుగా ఉన్న ఉద్యోగుల ప్రాసిక్యూషన్‌కు అనుమతి ఇవ్వాలని సిట్ అధికారులు గతంలో తితిదేను అడిగారు. సోమవారం 12మంది ప్రాసిక్యూషన్‌కు అనుమతించే అవకాశం ఉంది.

సిట్ అధికారులు శనివారం తితిదే పరిపాలన భవనానికి వచ్చారు. గత ఐదేళ్లలో నెయ్యి కొనుగోళ్లకు సంబంధించిన రికార్డులు పరిశీలించారు. జేఈవో వీరబ్రహ్మంతో సుమారు మూడు గంటలపాటు మాట్లాడారు. కొనుగోళ్లకు సంబంధించిన ఫైళ్ల వివరాలు తెలుసుకున్నారు. అప్పట్లో ఎన్ని లక్షల కిలోల నెయ్యి కొన్నారు? ఏయే ధరలకు టెండర్లు ఖరారు చేశారు? సరఫరా చేసిన సంస్థలేవి? తదితర వివరాలు అడిగి తెలుసుకున్నారు.



10 వేల అడుగులకు సమయం లేదా?

రోజూ 10 వేల అడుగులు నడవడానికి సమయం లేకపోతే అర గంట సేపు వేగంగా నడవండి. లేదా ఫాస్ట్ సైక్లింగ్‌గానీ, స్విమ్మింగ్‌గానీ చేయండి. దీనివల్ల గుండె ఆరోగ్యం మెరుగవుతుంది.

– లూయిసా నికోలా, న్యూరోఫిజియాలజిస్ట్

30న హైదరాబాద్‌లో
'మయన్మార్ తెలుగు తోబుట్టువుల ఆత్మీయ సమ్మేళనం'

ఈనాడు, హైదరాబాద్: బంజారాహిల్స్‌లోని లామకాన్‌లో ఈ నెల 30న సాయంత్రం 6 గంటలకు 'మయన్మార్ తెలుగు తోబుట్టువుల ఆత్మీయ సమ్మేళనం' నిర్వహించనున్నట్లు తెలుగుజాతి ట్రస్ట్ డి.పి.అనురాధ తెలిపారు. ఈ సమావేశానికి విశాఖపట్నానికి చెందిన ఎర్రన్నాయుడు సమన్వయకర్తగా వ్యవహరించనున్నారు. "ప్రస్తుతం మయన్మార్(బర్మా)లో ఉన్న తెలుగువారి తాతముత్తాతలు 150 ఏళ్ల క్రితం ఇక్కడి నుంచి వలస వెళ్లారు. తరతరాలుగా వారు అక్కడే జీవిస్తున్నా 'మేమంతా తెలుగువాళ్లమే' అని గర్వంగా చెబుతుంటారు. ఇప్పుడు తమ తల్లి వంటి దేశాన్ని పలకరించడానికి వారంతా తొలిసారి హైదరాబాద్ వస్తున్నారు" అని డి.పి.అనురాధ పేర్కొన్నారు.

నీళ్లనుకుని పొరపాటున రసాయనమిచ్చిన తల్లి

- రెండు గుటకలు తాగగానే కుమారుడి మృతి
- ఆసుపత్రిలో నీళ్లు దొరక్క ల్యాబులోకి వెళ్లడమే కారణం


గణేశ్

మిర్యాలగూడ పట్టణం, న్యూస్‌టుడే: ఆసుపత్రిలో జ్వరంతో బాధపడుతున్న కుమారుడికి మాత్ర ఇచ్చిన తల్లి.. తాగునీరనుకొని ల్యాబులోని ప్రమాదకర రసాయనాన్ని తాగించడంతో అతను వెంటనే మృతిచెందిన విషాదకర ఘటన శనివారం నల్గొండ జిల్లా మిర్యాలగూడ పట్టణంలో చోటు చేసుకుంది. అనుముల మండలంలోని చిన్న అనుముల గ్రామానికి చెందిన సంద్ర సత్యనారాయణ-రామలింగమ్మ దంపతులకు కుమార్తె, కుమారుడు సంతానం. కుమారుడు గణేశ్(19) హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు కళాశాలలో ఇంటర్ చదువుతున్నాడు. రెండు రోజులుగా అతనికి జ్వరం వస్తుండడంతో ఇంటికి తీసుకొచ్చారు. శనివారం ఉదయం మిర్యాలగూడలోని ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లారు. జ్వరం ఎక్కువగా ఉండడంతో ముందు పారాసిటమాల్ మాత్ర వేయాలని వైద్య సిబ్బంది సూచించారు. దీంతో కుమారుడికి మాత్ర ఇచ్చిన తల్లి తాగునీటి కోసం ఆసుపత్రిలో ఉన్న నీళ్ల క్యాను వద్దకు వెళ్లగా.. అందులో నీళ్లు లేవు. దీంతో తాగునీటి కోసం చూస్తూ ఆ పక్కనే ఉన్న ల్యాబులోకి వెళ్లారు. అక్కడ క్యానులో ఉన్న ఫార్మాల్డిహైడ్ రసాయనాన్ని తాగునీరే అనుకొని బాటిల్‌లో నింపి తీసుకొని వచ్చి కుమారుడికి అందించారు. రెండు గుటకలు తాగిన గణేశ్ వెంటనే మృతిచెందాడు. ఆసుపత్రి యాజమాన్యం తాగునీరు ఉంచకపోవడం, ప్రమాదకర రసాయనాన్ని నిర్లక్ష్యంగా వదిలేయడంతోనే గణేశ్ మృతిచెందాడని ఆరోపిస్తూ బంధువులు ఆందోళన నిర్వహించారు. దీంతో పోలీసులు చేరుకొని వారికి సర్దిచెప్పారు. ఆసుపత్రి నిర్లక్ష్యం వల్లనే తమ కుమారుడు మృతిచెందాడని సత్యనారాయణ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ఇది పల్లెటూరి కోడింగ్

(మొదటి పేజీ తరువాయి)

పూర్తి చేసి, ఐఐటీ బాంబే నుంచి ఎంటెక్ చదివారు. 2006లో అమెరికాకు వెళ్లి అక్కడ ఐటీ రంగంలో పనిచేశారు. రెండేళ్ల తర్వాత బెంగళూరుకు తిరిగొచ్చి ఇంటెల్‌లో సీనియర్ ఆర్కిటెక్ట్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. కరోనా సమయంలో వర్క్ ఫ్రం హోం కావడంతో స్వగ్రామానికి చేరుకున్నారు. పోటీ ప్రపంచంలో ఎలక్ట్రానిక్స్, మెకానికల్, లేదా ఆర్ట్స్.. ఏ బ్రాంచ్ విద్యార్థులకైనా కోడింగ్ ఒక ప్రాథమిక నైపుణ్యంగా మారిన విషయాన్ని గుర్తించారు. దీంతో ఆయన ఎలక్ట్రానిక్స్ చదివినప్పటికీ కోడింగ్‌లోనూ ప్రావీణ్యం సంపాదించారు. స్థానికంగా బీటెక్, ఎంటెక్, ఎంబీఏ, ఎంసీఏ డిగ్రీలు ఉన్నవారు అవసరమైన నైపుణ్యాలు లేక ఉద్యోగాలు పొందడం లేదని గమనించారు. ఉదయం ఉద్యోగం చేస్తూనే తనకు తెలిసిన విద్యను ఇతరులకు నేర్పాలనే ఉద్దేశంతో 2021లో ఇంటి దగ్గర రోజూ సాయంత్రం 5 నుంచి 8 గంటల వరకు సాంకేతిక విద్యలో పాఠాలు బోధించడం మొదలుపెట్టారు. నాన్న ఇందూరి పుల్లారెడ్డి పేరిట ఐపీఆర్ ప్రోగ్రామింగ్ ఇన్‌స్టిట్యూట్ నెలకొల్పి ఆపరేటింగ్ సిస్టమ్స్, సిస్టమ్ డిజైన్, కోడింగ్(డేటా స్ట్రక్చర్స్, ఆల్గరిథమ్స్), ఏఐలో మెలకువలు నేర్పిస్తున్నారు. సాంకేతిక ఉద్యోగాలు పొందడంలో కీలకమైన ఆచరణాత్మక నైపుణ్యాలపై శిక్షణ ఇస్తుండటంతో బీటెక్‌తో పాటు డిగ్రీ విద్యార్థులు ఇక్కడికి వచ్చి కోడింగ్ నేర్చుకుంటున్నారు. ఎంతోమందిని ఉద్యోగార్థులుగా తీర్చిదిద్దుతూ వారి కలలు సాకారం చేస్తున్నారు. 'అమెరికా, చైనా వంటి దేశాల్లో 8వ తరగతి నుంచే పిల్లలకు కోడింగ్ నేర్పిస్తారు. అందుకే వారు ఉద్యోగాలు సాధించడంలో ముందుంటారు. నా కుమారుడికి ఏడో తరగతిలోనే కోడింగ్ నేర్పించాను. ప్రస్తుతం 10వ తరగతి, ఇంటర్మీడియట్ విద్యార్థులకు సైతం తర్ఫీదు ఇస్తున్నాను' అని రామాంజిరెడ్డి చెబుతున్నారు.

వందే భారత్ కోసం ప్రత్యేక కోచ్ డిపో: ద.మ.రైల్వే

ఈనాడు, హైదరాబాద్: దేశంలోని ప్రధాన స్టేషన్ల సామర్థ్యాన్ని రెట్టింపు చేస్తామని రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ ప్రకటించిన 48 స్టేషన్ల జాబితాలో తెలుగు రాష్ట్రాల పరిధిలో హైదరాబాద్, తిరుపతి, విశాఖపట్నం, విజయవాడ రైల్వేస్టేషన్లు ఉన్నాయి. ఈ లక్ష్యాన్ని చేరుకునేందుకు చేపడుతున్న అవసరమైన మౌలిక సదుపాయాల విస్తరణ పనుల్ని ద.మ.రైల్వే శనివారం ఓ ప్రకటనలో తెలిపింది. ప్రధానంగా వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్ల నిర్వహణ కోసం హైదరాబాద్ పరిసరాల్లో ప్రత్యేక కోచ్ డిపోను ఏర్పాటు చేస్తున్నట్లు, హైదరాబాద్ మహానగరం చుట్టూ రీజినల్ రింగ్ రైల్ అభివృద్ధి ప్రతిపాదన ఉన్నట్లు తెలిపింది. "ప్రస్తుతం సికింద్రాబాద్, కాచిగూడ, హైదరాబాద్ మూడు ప్రధాన టెర్మినళ్లు ఉన్నాయి. రద్దీ తగ్గించేందుకు లింగంపల్లి, చర్లపల్లిలను ఉపగ్రహ టెర్మినళ్లుగా అభివృద్ధి పనులు పూర్తయ్యాయి. చర్లపల్లి, లింగంపల్లిలో మెగా అభివృద్ధి: చర్లపల్లి టెర్మినల్‌లో కోచ్ మెయింటెనెన్స్ షెడ్లు, 10 అదనపు లైన్లు, హైలెవల్ ప్లాట్‌ఫారాలు ఇంటర్మీడియట్ ఓవర్ హాలింగ్, పిట్ లైన్లు, మెయింటెనెన్స్ లైన్లు వంటి ఆధునిక సదుపాయాలు ఏర్పాటయ్యాయి. దీంతో ఒకేసారి 10 రైళ్లకు నిర్వహణ చేయవచ్చు. లింగంపల్లి, కాచిగూడల్లో పిట్ లైన్లు, స్టేబ్లింగ్ లైన్ల అభివృద్ధికి సుమారు రూ.120 కోట్ల ఖర్చుతో పనులు జరుగుతున్నాయి. హఫీజ్‌పేట్, హైటెక్ సిటీ, మల్కాజ్‌గిరి, మేడ్చల్, ఉప్పల్, చందానగర్ వంటి ఇతర స్టేషన్ల పునరాభివృద్ధి పనులు జరుగుతున్నాయి" అని వివరించింది.

ఎంజీనరేగా రద్దుపై ఆందోళన పథం

(మొదటి పేజీ తరువాయి)

ఆ మొత్తాన్ని అదానీకి అప్పగించడమే కొత్త చట్టం ప్రధానోద్దేశమని, అందుకే పోరాడాలని నిర్ణయించామని ప్రకటించారు.

అధికారం, ఆర్థిక వనరులు కేంద్రం గుప్పిట్లోనే

"నరేగా పేదలకు పనిహక్కు కల్పించింది. కూలీలకు కనీస వేతనాలు లభించేవి. ఇది పంచాయతీరాజ్ వ్యవస్థకు రాజకీయ నేతృత్వంతోపాటు, ఆర్థిక వనరులు కల్పించింది. ఇప్పుడు మోదీ ఆ హక్కులను తీసేసుకున్నారు. రాష్ట్రాల నుంచి డబ్బు లాగేసుకోవడం ద్వారా సమాఖ్య వ్యవస్థపైనా దాడిచేశారు. ఇప్పుడు కేంద్రమే మొత్తం అధికారం, ఆర్థిక వనరులను గుప్పిట్లో పెట్టుకుంటోంది. ఈ కొత్త పథకం హక్కు ఆధారిత పనిని ధ్వంసంచేస్తుంది. దానివల్ల పేదలకు తీరని నష్టం జరుగుతుంది. అంతా వన్‌మ్యాన్ షో జరుగుతోంది. పేదల డబ్బులు అదానీకి అప్పగించడమే కొత్త పథకం ఉద్దేశం" అని రాహుల్ ధ్వజమెత్తారు.

ఇప్పుడూ దిగిరాక తప్పదు

మూడు సాగు చట్టాలకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా రైతులు, ప్రతిపక్షాలు చేసిన ఆందోళనలకు దిగివచ్చిన కేంద్రం వాటిని ఎలా వెనక్కి తీసుకుందో ఈ కొత్త చట్టం విషయంలోనూ అలాగే చేయక తప్పదని ఖర్గే పేర్కొన్నారు. ప్రతిపక్షాలన్నీ తమకు మద్దతిస్తాయని ఆశాభావం వ్యక్తంచేశారు. "కొవిడ్ సమయంలో ఎంజీనరేగా లేకపోతే లక్షలమంది ప్రాణాలు కోల్పోయేవారు. హక్కు రూపంలో పేదలకు లభించినదానిని మోదీ ప్రభుత్వం లాగేసుకుంది. పేదలు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు. కేంద్రం మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుంది. సాగు చట్టాల రద్దుకోసం రైతులు, ప్రతిపక్షాలు చేసిన పోరాటాలకు తలొగ్గి కేంద్ర ప్రభుత్వం వాటిని ఉపసంహరించుకోవాల్సి వచ్చింది. ఇప్పుడూ అదే పరిస్థితి ఎదురవుతుంది. ప్రపంచంలో నాలుగో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ అవతరించిందని ప్రకటించుకుంటూ పాత పథకాన్ని ఎందుకు రద్దుచేశారు? మీదగ్గర ఇంత డబ్బు ఉన్నప్పుడు, అదానీ, అంబానీలాంటి ధనవంతులు బ్యాంకులనుంచి ఎంత కావాలంటే అంత రుణాలు తీసుకొని వాటిని ముంచుతున్నప్పుడు, గ్రామీణ కూలీలకు ఇవ్వడానికి 30% నిధులు లేవా? పథకం నుంచి జాతిపిత గాంధీ పేరు తొలగించడం తీవ్ర అవమానకరం. మోదీకి గాంధీ కుటుంబం పేరేకాదు చివరకు మహాత్మాగాంధీ పేరు కూడా నచ్చడంలేదు" అని ఖర్గే విమర్శించారు. దివంగత నేతలకు సీడబ్ల్యూసీ నివాళులర్పించింది.

హాజరైన రేవంత్, రాజనరసింహ: సమావేశంలో తెలంగాణ ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి, మంత్రి దామోదర రాజనరసింహ, ఏపీ నుంచి రఘువీరారెడ్డి, గిడుగు రుద్రరాజు తదితరులు పాల్గొన్నారు. ఈ సమావేశం ప్రారంభానికి ముందు ఖర్గే, సోనియా, రాహుల్‌లకు రేవంత్ నమస్కరించి కాసేపు ముచ్చటించారు. ఓవైపు సమావేశం జరుగుతుండగా.. పార్టీకి చెందిన కొందరు కార్యకర్తలు బయట నిరసనలు చేపట్టారు. కర్ణాటక ముఖ్యమంత్రి పదవిని తమ నాయకుడికి కట్టబెట్టాలంటూ ఆ రాష్ట్ర హోం మంత్రి జి.పరమేశ్వరన్ మద్దతుదారులు డిమాండు చేశారు.

నరేగా ప్రారంభించిన గ్రామంలో ఆందోళన నిర్వహించండి

- ఏఐసీసీ అగ్రనేతలకు ఏపీ నేతల ఆహ్వానం

ఈనాడు, దిల్లీ: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం రద్దును వ్యతిరేకిస్తూ కాంగ్రెస్ పార్టీ దేశవ్యాప్తంగా నిర్వహించనున్న ఆందోళనను ఉమ్మడి అనంతపురం జిల్లా బండ్లపల్లిలోనూ నిర్వహించాలని ఏపీసీసీ నాయకులు రఘువీరారెడ్డి, గిడుగు రుద్రరాజులు శనివారం దిల్లీలో జరిగిన సీడబ్ల్యూసీ సమావేశంలో పార్టీ అగ్రనేతలకు విజ్ఞప్తిచేశారు. 'ఉపాధి' చట్టం చేశాక బండ్లపల్లి గ్రామం నుంచి పథకాన్ని ప్రారంభించారని గుర్తుచేశారు. ఇప్పుడు పథకాన్ని రద్దు చేయడాన్ని నిరసిస్తూ జనవరి 5 నుంచి దేశవ్యాప్తంగా ఆందోళన నిర్వహించాలని సీడబ్ల్యూసీ నిర్ణయించిన నేపథ్యంలో ఏఐసీసీ అగ్రనేతలు మల్లికార్జున ఖర్గే, సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ, ప్రియాంకాగాంధీలను ఆ గ్రామానికి ఆహ్వానించినట్లు సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడు గిడుగు రుద్రరాజు విలేకర్లకు చెప్పారు. "కేంద్ర ప్రభుత్వం ఒక పథకం ప్రకారం పేదలకు పని హక్కును దూరం చేస్తోంది. కాంగ్రెస్ పార్టీ చేపట్టే ఆందోళనతో మోదీ ప్రభుత్వం దిగిరాక తప్పదు. ఉపాధి హామీ పథకాన్ని రక్షించేందుకు కాంగ్రెస్ పార్టీ జనవరి 5 నుంచి ఉద్యమాన్ని చేపట్టబోతోంది" అని ఆయన ప్రకటించారు.


మల్లికార్జున ఖర్గేకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న రఘువీరారెడ్డి, గిడుగు రుద్రరాజు

సర్దుబాటే మంత్రం

(మొదటి పేజీ తరువాయి)

పంచాయతీ పాలకవర్గాల పదవీకాలం 2026 ఫిబ్రవరి వరకు ఉంది. వారి నుంచి తీర్మానాలు కూడా రావాలి. అందుకూ సమయం చాలదు. దీంతో తాత్కాలికంగా పక్కన పెట్టాలని.. జనగణన పూర్తయ్యాకే చేపట్టాలని సీఎం సూచించారు.

ప్రజాభిప్రాయానికి అనుగుణంగానే

- గూడూరు ప్రజల అభిప్రాయానికి అనుగుణంగా ఆ నియోజకవర్గంలోని 5 మండలాల్ని శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలో కలపాలని సీఎం స్పష్టం చేశారు.
- ఆదోని మండలాన్ని ఆదోని, పెద్దహరివాణం మండలాలుగా విభజించనున్నారు. మండల కేంద్రం తమకు దూరంగా ఉంటుందని ప్రజలు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. దీంతో కొత్తగా ఏర్పాటయ్యే మండల కేంద్రం కూడా ఆదోనిలోనే ఉంటుంది. అంటే రెండు మండల కేంద్రాలు ఆదోనిలోనే ఉంటాయి.
- అనకాపల్లి జిల్లాలోని నక్కపల్లి సబ్‌డివిజన్ బదులుగా అడ్డరోడ్డు జంక్షన్ పేరుతో రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేయాలని సీఎం సూచించారు. మునగపాక మండలాన్ని అనకాపల్లి డివిజన్‌లో, అచ్యుతాపురం మండలాన్ని అడ్డరోడ్డు జంక్షన్ డివిజన్‌లో చేర్చాలని నిర్ణయించారు.
- రంపచోడవరం కేంద్రంగా ఏర్పాటయ్యే జిల్లాలో ఎలాంటి మార్పుచేర్పులు లేవు.

మార్కాపురం జిల్లాలోకి దొనకొండ, కురిచేడు.. ప్రకాశంలోకి పొదిలి

- దర్శి నియోజకవర్గంలోని దొనకొండ, కురిచేడు మండలాల్ని కొత్తగా ఏర్పాటయ్యే మార్కాపురం జిల్లాలో, మార్కాపురం నియోజకవర్గంలోని పొదిలి మండలాన్ని ప్రకాశం జిల్లాలో కలపనున్నారు.
- కందుకూరు డివిజన్‌లోని ఐదు మండలాల్ని ప్రకాశం జిల్లాకు మారుస్తారు. ఇప్పటి వరకు ఈ డివిజన్‌లో ఉన్న వరికుంటపాడు, కొండాపురం మండలాల్ని కావలి డివిజన్‌లో చేరుస్తారు. కనిగిరి డివిజన్‌లోని మర్రిపాడు, పొన్నలూరు మండలాల్ని కూడా కందుకూరు డివిజన్‌లో చేరుస్తారు.
- అద్దంకి రెవెన్యూ డివిజన్ ఏర్పాటుతోపాటు ఆ డివిజన్‌లోకి అద్దంకి, బల్లికురవ, సంతమాగులూరు, జె.పంగులూరు, కొరిశపాడు మండలాల్ని ప్రకాశం జిల్లాలో విలీనం చేస్తారు.
- శ్రీకాకుళం జిల్లాలోని నందిగం మండలాన్ని పలాస డివిజన్ నుంచి టెక్కలి రెవెన్యూ డివిజన్‌కు మారుస్తారు.
- అనకాపల్లి జిల్లాలోని చీడికాడ మండలాన్ని నర్సీపట్నం డివిజన్ నుంచి అనకాపల్లి డివిజన్‌లో చేరుస్తారు.
- కాకినాడ జిల్లాలోని సామర్లకోట మండలాన్ని కాకినాడ డివిజన్ నుంచి పెద్దాపురం రెవెన్యూ డివిజన్‌లోకి తెస్తారు.
- చిత్తూరు జిల్లా పలమనేరు డివిజన్‌లోని బంగారుపాళ్యం మండలాన్ని చిత్తూరు డివిజన్‌కు, చౌడేపల్లి, పుంగనూరు మండలాల్ని మదనపల్లె రెవెన్యూ డివిజన్‌లోకి మారుస్తారు. పలమనేరు రెవెన్యూ డివిజన్‌లోని సదుం, సోమల మండలాల్ని మదనపల్లె జిల్లాలోని పీలేరు రెవెన్యూ డివిజన్‌లో కలుపుతారు.
- శ్రీసత్యసాయి జిల్లాలో కొత్తగా మడకశిర రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేస్తారు.
- కదిరి రెవెన్యూ డివిజన్‌లోని ఆమడగూరు మండలాన్ని పుట్టపర్తి రెవెన్యూ డివిజన్‌లో విలీనం చేస్తారు. పుట్టపర్తి రెవెన్యూ డివిజన్‌లోని గోరంట్ల మండలాన్ని పెనుకొండ రెవెన్యూ డివిజన్‌లో చేర్చాలని నిర్ణయించారు.



ఇది దాటితే అదృష్టవంతులే..!

కాకినాడ జిల్లా పెద్దాపురం మండలం సూరంపాలెంలో వ్యర్థాలను వేసే రహదారిలో ఉన్న స్తంభం ఇది. విరిగిపోయి ఏ క్షణంలోనైనా పడిపోయేలా ఉంది. ప్రజలు తప్పనిసరైతేనే ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని అటుగా వెళ్తున్నారు. ఈ మార్గంలో ఎక్కువగా పంటపొలాలకు వెళ్లే వారు రాకపోకలు సాగిస్తారు. మట్టి టిప్పర్లూ అధికంగా తిరుగుతాయని స్థానికులు తెలిపారు. ప్రమాదం జరగక ముందే అధికారులు కొత్త స్తంభం ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

– ఈనాడు, కాకినాడ

నేడు ఈనాడు 50, ఈటీవీ 30 వసంతాల వేడుకలు

ఈనాడు, అమరావతి: తెలుగువారి ప్రియపత్రిక 'ఈనాడు' దినపత్రిక 50 వసంతాలు పూర్తి చేసుకుంది. తెలుగు ప్రజల ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచింది. మీటీవీ.. 'ఈటీవీ'ని మూడు దశాబ్దాలుగా తెలుగు ప్రజలు అక్కున చేర్చుకున్నారు. ★ ఈ సందర్భంగా ఈనాడు 50, ఈటీవీ 30 వసంతాల వేడుకలకు విజయవాడ వేదిక కాబోతోంది. నేటి సాయంత్రం 6 గంటల నుంచి నగరంలోని ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియంలో ఈ వేడుకలు ప్రారంభమవుతాయి. ★ సినీ గీతాలు, కడుపుబ్బ నవ్వించే హాస్యం, డ్యాన్స్ పెర్ఫార్మెన్స్‌లతో ఉర్రుతలూగించే పలు కార్యక్రమాలు ఈ వేడుకల్లో ఉంటాయి. ★ ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా హాస్యబ్రహ్మ బ్రహ్మానందం హాజరవుతారు. ప్రముఖ సినీ నేపథ్య గాయనీ గాయకులు విజయ్ ప్రకాష్, నేహా, సమీరా భరద్వాజ్, మంగ్లీ, వాగ్దేవి, రిషిల్, దినకర్, హరిప్రియ, రేవంత్ తదితరులు ప్రధాన ఆకర్షణగా నిలవనున్నారు. ★ సినీనటి మానస చౌదరి, బొమ్మరిల్లు శిరీషలు తమ డ్యాన్స్‌లతో అలరిస్తారు. బుల్లితెర నటి సుమ ఈ వేడుకలకు యాంకర్‌గా వ్యవహరిస్తారు. ★ ఈ కార్యక్రమంలో పాల్గొనాలంటే.. పాస్‌లు తప్పనిసరి. వేడుకల్లో పాల్గొనేవారికి ఇచ్చే పాస్‌తో పాటు ప్రత్యేక ఆకర్షణగా ఇచ్చే రిస్ట్ బ్యాండ్‌లను ధరించిన వారికి మాత్రమే వేడుకల్లో పాల్గొనే అవకాశం ఉంటుంది.



వాహనాల పార్కింగ్ ప్రదేశాలు..

★ ఈ కార్యక్రమానికి విచ్చేసే వారు తమ వాహనాలను స్టేడియం లోపల, బయట నిర్దేశిత పార్కింగ్ ప్రదేశాల్లో నిలపాలి. ★ వీఐపీ పాస్‌లు ఉన్నవారు స్టేడియంలోని 2వ గేటు నుంచి ప్రవేశించి.. ఫుట్‌బాల్ కోర్టు, హ్యాండ్‌బాల్ కోర్టుల్లో పార్కింగ్ చేసుకోవాలి. ★ మిగిలిన పాస్‌లు ఉన్నవారు.. ఏఆర్ గ్రౌండ్స్, కమాండ్ కంట్రోల్ సెంటర్ గ్రౌండ్, బిషప్ అజరయ్య స్కూల్ మైదానంలో వాహనాలను నిలపొచ్చు.



కమ్మేసే దుమ్ము.. కాటేస్తుంది నమ్ము..

వాహనం వెళ్లిందంటే వెనుక వచ్చే వాహనానికి దారి కనపడనంతగా దుమ్ము రేగుతోంది. దారంతా దుమ్ముతో నిండిపోతోంది. ఆఖరికి ఎదురుగా వచ్చే వాహనం ఏదో కనిపించని పరిస్థితి. ఎప్పుడు ప్రమాదం ముంచుకొస్తుందో తెలియని పరిస్థితి. ఇది ఇబ్రహీంపట్నం మండలం దాములూరు వద్ద ప్రమాదకర పరిస్థితి. ఇక్కడ క్వారీలు ఉండడంతో వచ్చిపోయే లారీల వల్ల రహదారిపై బూడిద పేరుకుపోతోంది. కనీసం క్వారీ యజమానులు ధూళి ఎగసిపడకుండా రోడ్డుపై ఎప్పటికప్పుడు నీళ్లు చల్లే చర్యలు కూడా చేపట్టకపోవడం గమనార్హం. –ఈనాడు, అమరావతి



రాంగ్‌రూట్‌లో..

రెవెన్యూ దస్త్రమంటే.. అంత అలుసా?

- నెలలు గడుస్తున్నా పట్టించుకోక రైతన్నల ఇక్కట్లు
- అధికారుల తీరుపై ఎమ్మెల్యే అసహనమే నిదర్శనం

ఈనాడు, అమరావతి

'రెవెన్యూ సేవల దరఖాస్తులను అధికారులు పట్టించుకోవడం లేదు. నెలల తరబడి కార్యాలయాల చుట్టూ తిప్పుకుంటున్నారు. ఆన్‌లైన్ చేసి పాస్ పుస్తకాలు ఇవ్వడం లేదు. రీసర్వే సమస్యల విషయంలో అలసత్వం చూపిస్తున్నారు' అని అన్నది రైతులు, ప్రతిపక్ష నాయకులు కాదు. తాజాగా డీఆర్సీ సమావేశంలో జగ్గయ్యపేట అధికార పార్టీ ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య. క్షేత్రస్థాయిలో ఇలాగే ఉంది. చాలా మంది తహసీల్దార్లు అందుబాటులో లేకపోవడం కనపడటం లేదు.

అన్ని డివిజన్లలో ఇదే కథ...

★ రైతులు పాస్ పుస్తకం కోసం అన్ని పత్రాలు ఇచ్చినా బేరం కుదరనిదే వీఆర్వోలు దరఖాస్తు చేయడం లేదు. చేసినా క్షేత్రస్థాయి నివేదిక ఇవ్వకుండా జాప్యం చేస్తున్నారు. ★

దరఖాస్తు చేసే నెలలోగా పని పూర్తి చేయాలన్న నిబంధన ఉండడంతో చాలా మంది వీఆర్వోలు బేరం కుదిరిన సొమ్ములో సగం ఇస్తేనే దరఖాస్తు చేస్తున్నారు. ఎకరానికి రూ.10వేలకు పైగా తీసుకుంటున్నారు. ★ వీఆర్వోలు ఆలస్యం చేస్తుంటే ఆర్ఐలు, తహసీల్దార్లు, ఆర్డీవోలు ఎందుకు పట్టించుకోవడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కాళ్లరిగేలా మీ చుట్టూ తిరగాలా...

★ జగ్గయ్యపేట నియోజకవర్గంలోని బగడపాటి శ్రీనివాసరావు రెండెకరాల పొలం ఉన్నా రీసర్వేలో 1.83 ఎకరాలు ఉన్నట్లు వచ్చింది. ఏడాది నుంచి అన్ని పత్రాలతో అధికారుల చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోలేదు. ప్రజాదర్బారులో ఎమ్మెల్యేకి అర్జీ ఇచ్చినా స్పందన లేదు. పలుమార్లు పత్రాలు తీసుకుని కార్యాలయానికి రమ్మని తిప్పించుకోవడం తప్ప పరిష్కారం లేదు. ★ ఈ ఏడాది ప్రారంభంలో 13 గ్రామాల్లో రెండో విడత రీసర్వే చేశారు. ఇప్పటివరకు కేవలం 5 గ్రామాల్లో మాత్రమే తహసీల్దార్లు డీఎల్ఆర్(డ్రాఫ్ట్ ల్యాండ్ రిజిస్టర్) ప్రక్రియ చేశారు.

★ జగ్గయ్యపేట మండలం గండ్రాయి, వత్సవాయి మండలం లింగాల, పెనుగంచిప్రోలు మండలం ముచ్చింతాల, ఇబ్రహీంపట్నం మండలం దాములూరు, తిరువూరు మండలం [illegible], మైలవరం మండలం తోలుకోడు, జి.కొండూరు మండలం పినపాక, చెరువుమాధవరంలో ఇప్పటికీ ఈ ప్రక్రియ పూర్తి చేయలేదు. ★ దీంతో గెజిట్ నోటిఫికేషన్ ఆలస్యం అవుతోంది. దాదాపు 15వేల మంది రైతులు క్రయవిక్రయాలు రిజిస్ట్రేషన్ అవ్వక, రుణాలు రాక అవస్థలు పడుతున్నారు.

★ దీనిపై కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ 'రెవెన్యూ సేవల విషయంలో అలసత్వం వహిస్తే అధికారులను ఉపేక్షించేది లేదు. రైతులకు ఇబ్బందులు లేకుండా చూస్తాం' అని తెలిపారు.



ముకుందా.. ముకుందా..

సిద్ధార్థ అకాడమీ ఆఫ్ జనరల్, టెక్నికల్ ఎడ్యుకేషన్ సంస్థ విజయవాడలో శనివారం నిర్వహించిన స్వర్ణోత్సవాలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. - ఈనాడు, అమరావతి

మేధకు పదును.. ప్రయోగాలకు వారధి

విద్యాలయాల్లో కీలకంగా ఇంక్యుబేషన్ అండ్ ఇన్నోవేషన్ సెంటర్లు

ఈనాడు, అమరావతి

1981 - 1996 మిలీనియల్స్ చదువులు... తరగతి గదిలో పాఠ్యాంశాలు వినడం.. ప్రయోగశాలల్లో కృత్యాధార అభ్యాసం.. పరీక్షల్లో ఫలితాలే ప్రామాణికంగా సాగిన తరం.

1997 - 2012 జనరేషన్ జడ్ (జెన్ జడ్) అభ్యాసం.. తరగతుల్లోనే కృత్యాధార పద్ధతుల్లో బోధన. ప్రయోగశాలల్లో ఉన్నంతలో ప్రయోగాలుండేవి.

2013 - 2028 జనరేషన్ ఆల్ఫా.. కృత్యాధార.. ప్రయోగాత్మక బోధనకు పెద్దపీట వేస్తూనే.. ఆవిష్కరణలు, అంకురాలవైపు యువత దృష్టి సారించేలా విద్యాలయాలు ప్రోత్సహిస్తున్నాయి. ఆధునిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని ప్రజోపయోగ ఆవిష్కరణలు చేసేలా, పేటెంట్లు దక్కించుకునేలా తోడ్పాటు అందిస్తున్నాయి.



ఇంక్యుబేషన్ అండ్ ఇన్నోవేషన్ సెంటర్‌లో ఏర్పాట్లు

రూ.లక్షల్లో వెచ్చించి...

ఆయా విద్యాసంస్థలు.. అధునాతన యంత్ర పరికరాలు, కృత్రిమ మేధ అనుబంధ వ్యవస్థలు, అంతర్జాలం, త్రీడీ ప్రింటర్లు.. ఇలా అనేకం సమకూరుస్తున్నాయి. ఇందుకు రూ.50లక్షల నుంచి రూ.3 కోట్ల వరకు వెచ్చిస్తున్నాయి. విట్ ఏపీ, ఎస్ఆర్ఎం, వీవీఐటీ, కేఎల్‌యూ, ఎన్ఆర్ఐటీ తదితర విద్యాలయాలు వేదికగా మారుతున్నాయి. విజ్ఞాన్‌లో తాజాగా రెండు అత్యాధునిక పరిశోధన కేంద్రాలు ఏర్పాటు చేశారు. రామన్ సెన్సార్ సెంటర్లో ఆధునిక సెన్సార్ టెక్నాలజీలు, నానో డివైసెస్, స్మార్ట్ ఇంజినీరింగ్‌పై పరిశోధనలు జరగనున్నాయి. డాక్టర్ లారా సీఈఎం కేంద్రంలో ఎనర్జీ సంబంధిత, బ్యాటరీ టెక్నాలజీ, ఎనర్జీ స్టోరేజీ మెటీరియల్స్‌పై పరిశోధించనున్నారు.

అటల్ టింకరింగ్ ల్యాబ్స్‌తో అలా..

విద్యార్థుల్లో సైన్స్, టెక్నాలజీ, ఇంజినీరింగ్, మ్యాథ్‌మెటిక్స్ పట్ల ఆసక్తి పెంపొందించడానికి కేంద్ర ప్రభుత్వం అటల్ ఇన్నోవేషన్ మిషన్ కింద అటల్ టింకరింగ్ ల్యాబ్స్ ప్రారంభిస్తోంది. కృత్రిమ మేధ, రోబోటిక్స్, త్రీడీ ప్రింటింగ్, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ (ఐఓటీ) వంటి అత్యాధునిక సాంకేతిక నైపుణ్యాలను పాఠశాల విద్యార్థులకు నేర్పించాలన్నది వీటి ఉద్దేశం.

ఇంక్యుబేషన్ అండ్ ఇన్నోవేషన్ సెంటర్... ప్రైవేటు కళాశాలలు, విశ్వవిద్యాలయాల్లో వినిపిస్తోన్న మాట ఇది. ప్రభుత్వ విద్యాలయాల్లో జవహర్ నాలెడ్జి సెంటర్లు, అటల్ టింకరింగ్ ల్యాబ్స్ గురించి విన్న విద్యార్థులు ఇప్పుడు ఈ సెంటర్ల గురించి మాట్లాడుతున్నారు. ఇవి ప్రభుత్వ విశ్వవిద్యాలయాల్లోనూ ఏర్పాటవుతున్నాయి. **ప్రత్యేకత..** విద్యార్థులు, అధ్యాపకుల్లో ఆవిష్కరణలను ప్రోత్సహించడం, కొత్త టెక్నాలజీ ఆధారిత స్టార్టప్‌లు అభివృద్ధి చేయడమే వీటి లక్ష్యం. స్టార్టప్‌లకు మానవ వనరులు, మార్గదర్శకత్వం, నెట్‌వర్కింగ్ అందిస్తాయి. ఉద్యోగాలు, సంపద సృష్టికి తోడ్పడతాయి. ప్రభుత్వ ప్రోత్సాహంతో ఐఐఈ, ఐఐటీ, వర్సిటీలు సైతం ఏర్పాటు చేస్తున్నాయి.

20 ఏళ్ల క్రితమే.. రాష్ట్ర ప్రభుత్వం 2005లోనే డిగ్రీ కళాశాలల్లో జవహర్ నాలెడ్జ్ సెంటర్లు ప్రారంభించింది. కమ్యూనికేషన్ అండ్ సాఫ్ట్‌స్కిల్స్, కంప్యూటర్ అండ్ టెక్నికల్ స్కిల్స్, ఉపాధి కల్పన, పరీక్షలు అండ్ సర్టిఫికేషన్ కోసం అందుబాటులోకి తెచ్చింది.

1.38 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : జిల్లాలో 1.50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యంగా ఉండగా, ఇప్పటి వరకు 19,238 రైతుల నుంచి 1,38,398.320 మెట్రిక్ టన్నులు కొనుగోలు చేసినట్టు పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ సతీశ్ తెలిపారు. రూ.327.21 కోట్లను 24 గంటల్లోగా రైతుల ఖాతాల్లో జమ చేసినట్టు పేర్కొన్నారు. శనివారం ఒక్క రోజే 4,020 మెట్రిక్ టన్నులను కొనుగోలు చేశామని వివరించారు. గత (2024-25) ఖరీఫ్ సీజనులో మొత్తం 1,10,738.800 మెట్రిక్ టన్నులను సేకరించినట్లు వివరించారు.

గ్రేటర్ ఖాయం.. తాత్కాలిక విరామం


జనవరి 1 నుంచి జనగణనతో ఆటంకం

ఈనాడు, అమరావతి: విజయవాడ మహా నగరంగా మారడం ఖాయమైనా కేంద్రం చేపట్టిన జన గణన ప్రతిబంధకంగా మారడంతో ముహూర్తం ఆలస్యమవుతోంది. అధికారులు, నాయకులు గ్రేటర్ విజయవాడ ఏర్పాటుకు సన్నద్ధంగా ఉన్నారు. శనివారం కలెక్టర్ సీఎంను కలిసి గ్రేటర్ ఏర్పాటుపై చర్చించారు. ఇది హడావుడిగా చేసే ప్రక్రియ కాదు. ఆటంకాలన్నీ తొలగిన తర్వాతే గ్రేటర్ ఏర్పాటు చేద్దాం అని సీఎం పేర్కొన్నారు. అధికారులు అన్ని పనులు పూర్తి చేసి సిద్ధంగా ఉండండి అని స్పష్టం చేశారు.

15 నెలలు నిరీక్షించాలి.. 2026 జనవరి 1 నుంచి కేంద్రం దేశ వ్యాప్తంగా జనాభా లెక్కల ప్రక్రియ మొదలు పెడుతోంది. దీని వల్ల నగరంలో పంచాయతీలను విలీనం చేస్తే పట్టణ, గ్రామీణ జనాభా లెక్కల విషయంలో గందరగోళం నెలకొంటుంది. జనాభా లెక్కలు పూర్తి చేసే వరకు డీ లిమిటేషన్ చేయకూడదన్న నిబంధనలు ఉన్నాయి. ఏది చేసినా డిసెంబర్-31 లోగా నోటిఫికేషన్ ఇస్తేనే గ్రేటర్ ఏర్పాటవుతుంది. పంచాయతీలకు నోటీసులు ఇచ్చిన తర్వాత కనీస గడువు 10 రోజులు ఉండాలి. తర్వాత గెజిట్ నోటిఫికేషన్ ఇవ్వాలి. పంచాయతీని రద్దు చేసి నగరపాలికలో విలీనం చేయాలి. ఈ నాలుగు రోజుల్లో నోటిఫికేషన్ ఇవ్వడం, ఈ ప్రక్రియ పూర్తి చేయడం అసాధ్యం. 2027 మార్చి వరకు జనగణన జరుగుతున్న నేపథ్యంలో 15 నెలల తర్వాతే గ్రేటర్ కథ మళ్లీ మొదలవుతుంది.

చపాతీ ముక్క గొంతులో ఇరుక్కుని వృద్ధుడి మృతి

చిట్టినగర్, న్యూస్‌టుడే: చపాతీ ముక్క ఓ వృద్ధుడి ప్రాణం తీసింది. ఈ ఘటన చిట్టినగర్ పరిధి కేఎల్‌రావునగర్‌లో జరిగింది. కుటుంబ సభ్యులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. కేఎల్‌రావునగర్‌లోని 6వ వీధికి చెందిన తోట ప్రసాద్ (80) శుక్రవారం రాత్రి సుమారు 9 గంటలకు చపాతీలు తింటుండగా.. అకస్మాత్తుగా చపాతీ ముక్క గొంతుకు అడ్డుపడింది. దీంతో ఊపిరి తీసుకోవడంలో ఇబ్బంది పడుతూ ఒక్కసారిగా కుప్పకూలిపోయారు. గమనించిన కుటుంబ సభ్యులు ఆ ముక్క తీసేందుకు ప్రయత్నించినా సాధ్యపడలేదు. అనంతరం 108 సిబ్బందికి సమాచారం అందించారు. వారు వచ్చే సరికి ప్రసాద్ ప్రాణాలు కోల్పోయారు. ఆయనకు భార్య, ముగ్గురు సంతానం ఉన్నారు.



ప్రసాద్ (పాతచిత్రం)

దేశాభ్యున్నతికి అంకితమయ్యే సమయమిదే

ఎన్ఏఎస్ అధ్యక్షుడు వినోద్ కె.సింగ్ ✪ ఘనంగా కేఎల్ యూనివర్సిటీ 15వ స్నాతకోత్సవం

కానూరు, వడ్డేశ్వరం (తాడేపల్లి), న్యూస్‌టుడే: దేశాభ్యున్నతికి యువత తమను తాము అంకితం చేసుకునే సమయమిదేనని నేషనల్ అకాడమీ ఆఫ్ సైన్సెస్, ఇండియా అధ్యక్షుడు వినోద్ కె.సింగ్ అన్నారు. శనివారం వడ్డేశ్వరంలోని కేఎల్ డీమ్డ్ విశ్వవిద్యాలయం 15వ స్నాతకోత్సవంలో ఆయన మాట్లాడుతూ గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన విద్యార్థులు ఉద్యోగం కావాలా లేక కెరీర్ కావాలా అని నిర్ణయించుకోవాలన్నారు. ఉద్యోగం మిమ్మల్ని సురక్షితంగా ఉంచుతుంది.. ప్రాథమిక అవసరాలను తీర్చేలా చేస్తుంది.. కానీ కెరీర్‌లో పారిశ్రామికవేత్త కావాలనుకుంటే అందుకు తగిన విధంగా కష్టపడాలని సూచించారు. మరో అతిథి టాటా మెమోరియల్ సెంటర్, ముంబయి ఎండీ, ఐఏపీ పీడియాట్రిక్ హిమాటో- అంకాలజీ విభాగం ఛైర్‌పర్సన్ ప్రొఫెసర్ శ్రీపాద్ బనవల్లి మాట్లాడుతూ జీవితంలో లక్ష్యాన్ని నిర్దేశించుకుని, ప్రేమిస్తే సులభంగా చేరుకోవచ్చన్నారు. వర్సిటీ ఛాన్సలర్ కోనేరు సత్యనారాయణ మాట్లాడుతూ విద్యార్థులు జీవితంలో ఒక ముఖ్యమైన అధ్యాయాన్ని ముగిస్తూ.. బాధ్యత, అవకాశంతో నిండిన మరో అధ్యాయాన్ని ప్రారంభిస్తారన్నారు. 2025లో విద్యాభ్యాసం పూర్తి చేసుకున్న 5 వేలమంది విద్యార్థులకు డిగ్రీ పట్టాలు అందజేశారు. 184 మంది పీహెచ్‌డీ, 700 మంది పోస్టు గ్రాడ్యుయేషన్, 4500 మంది అండర్ గ్రాడ్యుయేషన్ చేసినవారున్నారు. విశేష ప్రతిభ కనబరిచిన 44 మందికి బంగారు పతకాలు, 40 మందికి రజత పతకాలు, నగదు బహుమతులు అందించారు. వైస్ ఛాన్సలర్ జి.పార్థసారథివర్మ మాట్లాడుతూ అత్యధిక వార్షిక వేతనం రూ.75 లక్షలతో విద్యార్థులు కొలువులు సాధించినట్లు చెప్పారు. రిజిస్ట్రార్ కె.సుబ్బారావు, కార్యదర్శి కోనేరు శివకాంచనలత, ఉపాధ్యక్షుడు కోనేరు రాజాహరీన్, బోర్డు సభ్యులు కోనేరు నిఖిల, ప్రో వైస్ ఛాన్సలర్స్, డీన్లు, ఆచార్యులు, అధ్యాపకులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



పట్టాల ప్రదానోత్సవంలో పాల్గొన్న ప్రొఫెసర్ శ్రీపాద్ బనవల్లి, ఛాన్సలర్ కోనేరు సత్యనారాయణ తదితరులు

పరిశోధనాత్మకంగా చదవటం వల్లనే..



అనంతపురానికి చెందిన **గొంది హేమామృత** ఎంటెక్ కంప్యూటర్ సైన్స్ ఏఐ డీఎస్ విభాగంలో 9.92 సీజీపీ సాధించి బంగారు పతకం అందుకుంది. ఉన్నత విద్య చేయాలన్న లక్ష్యంతో పరిశోధనాత్మకంగా చదవటం వల్ల ఈ మార్కులు సాధించారని పేర్కొంది. ప్రయోగశాలలు పరిజ్ఞానం పొందేందుకు దోహద పడ్డాయని తెలిపింది.

టెక్నాలజీపై పట్టు సాధించేందుకు...



గుంటూరుకు చెందిన టి.హారిక ఎంటెక్ సైబర్ సెక్యూరిటీలో 9.92 సీజీపీ సాధించి బంగారు పతకం అందుకుంది. సైబర్ నేరాలను అరికట్టేందుకు ఈ టెక్నాలజీపై పట్టు సాధించేందుకు పీజీ చేశానని చెప్పింది.

ఆశల ఎర.. రూ.84.91 లక్షలకు టోకరా..!

మోసపోయిన వృద్ధుడు

విజయవాడ నేరవార్తలు : ఫేస్‌బుక్‌లో తక్కువ పెట్టుబడులకు ఎక్కువ లాభాలు అనే ప్రకటన చూశారు. విడతల వారీగా రూ.84.91 లక్షలు పెట్టుబడులుగా పెట్టారు. అవి 18 రోజుల్లో రూ.27 కోట్లు అయ్యేసరికి సంబరపడ్డారు. చివరికి సైబర్ నేరగాళ్ల చేతిలో నిలువునా మోసపోయారు. వివరాల్లోకి వెళితే.. విజయవాడ నగర శివారు ప్రాంతానికి చెందిన ఓ వృద్ధుడు (64) బీమా కంపెనీలో ఉన్నతాధికారిగా పనిచేసి రిటైరయ్యారు. గత నెలలో ఫేస్‌బుక్‌లో పెట్టుబడుల ప్రకటన చూసి ఆకర్షితులయ్యారు. ఒక పెట్టుబడుల గ్రూప్‌లో చేరారు. సభ్యులు తమ పెట్టుబడులకు లాభాలు బాగా వస్తున్నాయంటూ ఒకరితో మరొకరు చేసుకునే ఛాటింగ్‌లు చూసి ఆశ పడ్డారు. నవంబరు 2న ఇండియా నివేష్ గ్రూప్ ఇన్వెస్ట్‌మెంట్ ప్రోగ్రాం అనే దానిలో సభ్యుడిగా చేరారు. గ్రూప్ అడ్మిన్లు తనిష్క సనం, దివ్య మెహ్రా, మలాయ్ సమీర్‌లు చెప్పిన మేరకు నవంబరు 2- 19 మధ్యకాలంలో విడతల వారీగా వేర్వేరు సంస్థల్లో రూ.84.91 లక్షలు పెట్టుబడులుగా పెట్టారు. పెట్టుబడుల ఖాతాలో రూ.27 కోట్లు చేరడంతో సంతోషపడ్డారు. వాటిని విత్ డ్రా చేసుకోవాలంటే మరో రూ.10లక్షలు కట్టాలని చెప్పడంతో కంగుతిన్నారు. మోసపోయినట్లు గుర్తించి సైబర్ క్రైం పోర్టల్‌కు ఫిర్యాదు చేశారు. వారు కేసు నమోదు చేశారు.

చాట్ చేసే వారంతా మోసగాళ్లే: గ్రూప్‌లో లాభాలు వచ్చాయంటూ చాట్ చేసే వారంతా సైబర్ నేరగాళ్లకు చెందిన వారేనని పోలీసులు చెబుతున్నారు. అమాయకులను ఆకర్షించేందుకు ఇలా చాటింగ్ చేసి టోకరా వేస్తారని హెచ్చరిస్తున్నారు. రోజుల వ్యవధిలో రూ.లక్షల పెట్టుబడులకు రూ.కోట్లలో ఆదాయం ఇస్తున్నారంటే.. అది కచ్చితంగా మోసమేనని పేర్కొంటున్నారు.

పంట కాల్వలకు 5,402 క్యూసెక్కుల నీరు

ఎన్టీఆర్ కలెక్టరేట్ : ప్రకాశం బ్యారేజీ నుంచి కృష్ణా డెల్టా పరిధిలోని పంట కాలువలకు శనివారం 5,402 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. కృష్ణా తూర్పు ప్రధాన కాలువకు 3,012, కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు 2,304, గుంటూరు ఛానల్‌కు 86 క్యూసెక్కుల చొప్పున ఇస్తున్నారు. కృష్ణా తూర్పు కాలువ నుంచి రైవస్‌కు 1,802, ఏలూరు 708, కేఈబీ 302, బందరు కాలువలకు 200 క్యూసెక్కుల చొప్పున విడుదల చేశారు.

BUSINESS SERVICES

COURIERS

USA,UK, కెనడా, ఆస్ట్రేలియా & ఇతర దేశాలకు పచ్చళ్ళు, స్వీట్స్, బట్టలు, డాక్యు మెంట్స్, మెడిసిన్స్, మొ॥ కొరియర్ చేయబడును. SV Express - ICL కొరియర్. గురునానక్ నగర్, VJA. 94410 27788

BUSINESS OFFER

చిన్న పెట్టుబడితో బయోకోటెడ్ పేపర్ టీ, కాఫీ కప్పులను అమ్మటం ద్వారా మంచి లాభాలను పొందండి. జై భారత్ ఎకోగ్రీన్ ఇండస్ట్రీస్, గొల్లపూడి ✆92907 77776

మంచి రన్నింగ్‌లో ఆదాయం వున్న ప్రముఖ కిచెన్ అప్లయన్సెస్ డీలర్‌షిప్ మంగళగిరి నందు అమ్మకము. ఇన్వెస్ట్‌మెంట్ 25L-30L. ✆ 84649 33085.

PACKERS & MOVERS

Tirumala Packers & Movers an ISO 9001:2015 certified Co. House hold goods shifting any time any where ✆ 97043 64389.

BUILDING CONSTRUCTION

RK కన్‌స్ట్రక్షన్ మెటీరియల్ కాంట్రాక్టర్ మీకు నచ్చే మీరు మెచ్చే విధంగా 100% వాస్తు, లేటెస్ట్ కబోర్డ్స్, క్వాలిటీతో బిల్డింగ్ నిర్మించబడును. ✆ 97043 63336.

TDR
AP & TELANGANA BONDS BUY & SALE
KAMESH
92 92 15 15 15

V.S.కన్‌స్ట్రక్షన్స్ ★ కాంట్రాక్టు పద్ధతిన అన్ని రకాల బిల్డింగ్స్, మెటీరియల్స్‌తో మీరు కోరుకున్న విధముగా కట్టించబడును. అన్ని సివిల్ పనులకు సంప్ర ✆ 95818 26633

WATER PROOFING

Tarun Slab Leakage Works ★ 25 Yrs Exp. ★ 5Yr Waranty ★ Bathroom Leakage Grouting Epoxy Works ✆94940 02285, 99516 07504

EDUCATION

SPOKEN HINDI

Learn Online/ Offline Spoken Hindi/English, French & German Within 30Days. 100% Guarantee For all Ages Free Demo. 98495 42456

HOME TUITIONS

ప్రత్యూష (ఆన్‌లైన్ & హోమ్) ట్యూషన్స్ LKG to PG All Objective సబ్జెక్ట్స్, NEET, IIT ట్యూటర్స్‌కు ✆ 92900 05677, 74165 35749

FINANCIAL SERVICES

మీ ఇళ్ళు, బిల్డింగ్స్ కాంప్లెక్స్‌ల మీద తనఖా పద్ధతిలో రూ.1 వడ్డీకి ఫైనాన్స్ ఇప్పించబడును. వేరే ఏ బ్యాంకులో ఉన్ననూ విడిపించబడును. ✆ 83099 11995.

HOME NEEDS

MOSQUITO SCREENS

మెష్‌డోర్స్, కర్టెన్ రాడ్స్, కర్టెన్స్, కప్‌బోర్డ్స్, UPVC విండోస్ బ్లైండ్స్, వాల్‌పేపర్, Anti Bird మెష్. ఇన్విజిబుల్ గ్రిల్స్, దుర్గా ప్రసాద్. 98495 69111.

PEST CONTROL

Tarun Pest ★25Yrs Exp. 5Yrs Warranty ★ Smell Less ★ Bayers Chemicals (Pest & Other Insects Control). ✆94940 02285, 99516 07504

ప్రియాంక పెస్ట్ & బాత్‌రూమ్ లీకేజీ వర్క్స్ 30 సం॥ అనుభవం, 5సం॥ గ్యారంటీ, వాసనలేని బేయర్ కెమికల్స్‌తో చెదలు, బొద్దింకలు నివారించు సంస్థ. ✆94924 82494, 93932 30136.

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతి స్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

INDUSTRY

MACHINERY FOR SALE

ఖమ్మంలో మంచి రన్నింగ్‌లో ఉన్న UPVC విండోస్ & డోర్స్ కంపెనీ అమ్మకం/ లీజుకు ఇవ్వబడును. సెల్: 94401 08943.

విత్తనశుద్ధి యంత్రాలు మరియు జనపనార సంచులు అమ్మకానికి అందుబాటులో ఉన్నాయి సంప్ర॥ ✆ 72880 65253.

PERSONAL CLASSIFIEDS

MISSING

కనబడుటలేదు



పేరు: పాలడుగు సాయి కీర్తి
వయస్సు: 33, ఎత్తు: 5.6
రంగు: ఛామనచాయ
గుంటూరు జిల్లా చేబ్రోలు గ్రామం నుండి తేది:13/12/2025 ఉదయం 11 గంటల నుండి కనిపించుటలేదు. ఇంటి నుండి వెళ్ళేటప్పుడు నీలి ఆకాశం రంగు, పంజాబి డ్రస్సు వేసుకున్నారు. పిల్లలు దిగులుగా ఉన్నారు. ఆచూకి తెలిసిన వారు ఈ నెంబర్లుకు కాల్ చేయగలరు.
Ph: 9246789504, 9542713236.
Chebrolu Police Station
Ph: 8688831384.

PEOPLE CARE

OLD AGE HOME

రమణ మహర్షి ఓల్డ్ ఏజ్‌హోమ్: వృద్ధులను, బెడ్‌పేషంట్‌లను చేర్చుకొనబడును. ఇంటి వాతావరణంతో కూడిన వృద్ధాశ్రమం. ✆ 97012 54793/ 63027 93978

REAL ESTATE

గొల్లపూడి, రాయనపాడు, విజయవాడ పరిసర ప్రాంతాలలో మీ ప్లాట్స్, స్థలాలు, అపార్ట్‌మెంట్స్ కమర్షియల్ అమ్మదలచినవారు, కొనదలచినవారు సంప్రదించండి. ✆ 92469 61688.

గుంటూరుసిటీ, గోరంట్ల, రెడ్డిపాలెం, లాం, అగతవరప్పాడు, వెనిగండ్ల, నంబూరు, పెదకాకాని, కొప్పురావూరు, కంతేరు, కాజాలలో ప్లాట్లు అమ్మాలన్నా/ కొనాలన్నా సంప్ర॥ 73823 96677.

గుంటూరుసిటీలో, గోరంట్లలాం, JKCరోడ్డు, ఇన్నర్‌రింగ్, వెనిగండ్ల, పెదకాకాని, నంబూరు, కాజా, మంగళగిరి, తాడికొండలోని ప్లాట్లు అమ్మదలచినవారు సంప్ర: 93999 55545.

హరివిల్లు వారి CRDA అప్రూవ్ ప్లాట్స్, ఇండిపెండెంట్ ఇళ్ళు పెనమలూరు, గండిగుంటలలో ప్రారంభ ధర: గజం 9999/-. ✆ 85008 30038.

అమరావతి రాజధానిలో గల ల్యాండ్ పూలింగ్ ప్లాట్లు, పొలాలు విజయవాడ-గుంటూరు మధ్య అన్ని వెంచర్లలో ప్లాట్లు అమ్మదలచిన, కొనదలచిన. Ph: 77949 12324.

FLAT FOR SALE

2450 Sft. 3 BHK Each Floor single flat, P&T Colony, Phase 3, Patamata High School backside, VJA. ✆ 76888 86666, 94948 31631

FLATS FOR SALE
Ready to Occupy
2 BHK Flat
47 Lakhs Onwards
3 BHK Flat
67 Lakhs Onwards
Including Wood Work & Amenities.
Bank Loan Facility.
Prasadampadu, VJA.
✆ 90303 89292

East Face 3BHK New Independent 2nd Floor Sale 2325 S.Ft at R.R Gardens. Near Gurunanak Colony, Patamata, VJA.✆ 92472 55826

VJA, కరెన్సీనగర్‌లో 2.8 ఎకరాల ప్రీమియం గేటెడ్ కమ్యూనిటీ అపార్ట్‌మెంట్లో 2& 3& 4BHK లగ్జరీ ఫ్లాట్స్ అమ్మబడును. సంప్ర॥ ✆ 86884 66789.

3BHK Flats for Sale బందరురోడ్డుకి కేవలం వంద అడుగుల దూరం గోసాల సెంటర్‌కి దగ్గరగా 1700S.Ft.తో అమ్మకం. 94852 90846

సింగ్‌నగర్ తోటవారి వీధి 9వ లైన్ శ్రీ లక్ష్మీ నరసింహా రెసిడెన్సీ నందు న్యూ 2BHK ఫ్లాట్స్ తక్కువ ధరకే అమ్మబడును. సంప్ర: 98662 01239.

గన్నవరం ప్రీమియం లగ్జరీ 2BHK ఇండిపెండెంట్ ఫ్లోర్స్ ఫ్లాట్స్ అమ్మకం. బుకింగ్ ఆఫర్స్, ఫుల్లీఫర్నిష్డ్. మెటీరియల్ కాంట్రాక్ట్‌తో కట్టించి ఇస్తాం 98666 69123

Poranki 4 BHK Luxury East Face, North East site floorwise individual 2700 S.Ft. High Quality Top Brands Class Location 2 car parking, APCRDA approved. ✆ 83416 78727, 76740 82458.

నిడమానూరులో గృహప్రవేశానికి సిద్ధంగా, తూర్పు ఫేస్ 2BHK (1250 SFt), 3BHK (1450 SFt) ఫ్లాట్స్, లిఫ్ట్, జనరేటర్, కార్‌పార్కింగ్ సౌకర్యములతో అమ్మకమునకు కలవు. ✆ 80087 67979, 80744 99872.

3&4 BHK Deluxe Floorwise FLATS for SALE
Near Kennedy School, Kanuru.
G+2 Independent House for Sale in 154 Sq.yds
(Lift & 2 Car Parking) @ Tadigadapa.
✆7075017255

నున్న SBI ప్రక్కన, వికాస్ కాలేజి రోడ్, మయూర ప్రైడ్‌లో, 2nd ఫ్లోర్‌లో, 204 2B/R, 1100 Sft, 27 LAK, లిఫ్ట్, కారు పార్కింగ్‌తో అమ్మకం. ✆ 99086 84592.

అశోక్‌నగర్ టైం హాస్పిటల్ ఎదురుగా బందరురోడ్‌కి అతి సమీపమున నిర్మించిన 3BHK ఫ్లాట్స్ గృహప్రవేశమునకు సిద్ధముగా వున్నవి. ✆ 93939 59907.

FLATS for SALE
4 BHK Premium FLATS - 2850 Sft.
(2 Cars Parking)
beside Bhashyam School, KANURU
✆ 9989855219
8977162616

మచిలీపట్నం గుండుపాలెం (రుద్రవరం పంటకాలువ డొంకరోడ్డు కృష్ణ యూనివర్శిటీ దగ్గర) 12.5 ఎకరాల పొలం అమ్మకం ✆ +9199499 88829 (Whatsap)

2B/R ఫ్లాట్స్ అమ్మకం. గన్నవరం సెయింట్ జాన్స్ స్కూలు దగ్గర మరియు మొఘల్‌రాజపురంలో కారు పార్కింగ్ వసతితో అమ్మకం. ✆ 93980 22862

FLAT FOR SALE
2620 Sq.ft 3 BHK
Ready to move
Fully Furnished (2 Floor),
Floor Wise Flat
SRI SESHADRINILAYAM
Near Sentini Hospital,VJA.
PH.9848120049

విజయవాడ, స్పెన్సర్స్ ఎదురు, శ్రీనగర్ కాలనీ, అపరంజి అపార్ట్‌మెంట్, S2, 2BHK, సుమారు 900 Sft, కార్ పార్కింగ్ ఫ్లాట్ అమ్మకం. 98857 71082.

మురళీనగర్ బల్లెం వారి వీధిలో రోడ్‌ఫేస్ భువనేశ్వరి హైట్స్‌లో FF-103 ఫుల్లీ ఫర్నిష్డ్ ఫ్లాట్ లిఫ్ట్, కార్ పార్కింగ్‌తో అమ్మకం. నోబ్రోకర్స్ ✆ 79957 54525

మధురానగర్ దగ్గర GVRనగర్‌లో 180 చ॥గ॥ల్లో ఫ్లోర్‌కి ఒక 3 BHK న్యూ డీలక్స్ ఫ్లాట్ చొప్పున నిర్మించిన ఫ్లాట్స్ అన్నిసౌకర్యములతో అమ్మకం. ✆ 96662 11349.

పటమట న్యూ RTC కాలనీ ప్రైమ్ లొకేషన్ 40 అ॥ రోడ్డు తూర్పు ఫేస్
ఫ్లోర్‌కి ఒక్క 3 BHK డీలక్స్ ఫ్లాట్
అమ్మకమునకు కలవు.
✆ 90000 40792

పటమట NSM స్కూల్‌కి దగ్గరలో 2BHKలగ్జరీ ఫ్లాట్స్ ఈస్ట్ నార్త్ ఫేసింగ్‌లతో అమ్మకానికి కలవు ✆ 93810 79649, 76808 56103.

3BHK సూపర్‌డీలక్స్ ఫ్లాట్ E/F 3 బెడ్‌రూమ్స్ 3 బాత్‌రూమ్స్ 3 బాల్కనీస్ 60.5 గజాలు UDA షేర్, 2030 SFT, 75 SFT పార్కింగ్ 4A/Cs 9 ఫ్యాన్స్ 20 సీలింగ్ లైట్స్, 25 Lt గీజర్, చిమ్నీ అన్నిరూమ్స్‌లో కాబినెట్స్ బాల్కనీలో స్లైడింగ్ గ్లాస్ డోర్స్ ఆటోనగర్ బస్టాప్‌కు 100 మీ॥లో వశిష్ట ఎన్‌క్లేవ్ నందు అమ్మకం ✆ 98663 09134

విజయవాడ స్టెల్లా కాలేజి వద్ద, హైవేకి దగ్గరలో అధిర అపార్ట్‌మెంట్ C3లో ఈస్ట్‌ఫేసింగ్ 2BHK ఫ్లాట్ 500 SFT అమ్మకంనకు కలదు. ✆ 76758 74661

సత్యనారాయణపురంలో 1 BHK/ 2BHK/ 3BHK/ 4BHK Flats పాతవి/ కొత్తవి అమ్మబడును ✆ 94901 98654

KANURU

3 BHK తూర్పు ఫేస్ డీలక్స్ ఫ్లాట్స్ అన్ని సౌకర్యములతో అమ్మకానికి కలవు. ★ బల్లెంవారివీధి, గౌరీశంకర్‌నగర్, కానూరు. ✆ 97017 98726, 89196 79256.

కానూరు బల్లెంవారి వీధిలో Occupancyకి సిద్ధముగా 1700 S.ft న్యూ 3 BHK లగ్జరీ ఫ్లాట్స్ E/W కబోర్డ్స్ 100% లోన్‌తో ✆ 76719 22845.

EENADU eClassifieds

కానూరు, మురళీనగర్, బల్లెంవారి వీధిలో అక్షయమెడోస్ నందు న్యూ 3BHK (1400 S.Ft) ఫ్లాట్స్ అన్ని సౌ॥తో 53 లక్షలు. ✆ 8919570872/ 9642847736

TADIGADAPA

బందరురోడ్డు సిద్ధార్థ Eng.కాలేజి ఎదురు, తాడిగడప, పద్మజానగర్ కాలనీలో న్యూ 3BHK ఫ్లాట్ (1800S.Ft) అమ్మకానికి కలదు. (ఫ్లోర్‌కి 1ఫ్లాట్) ✆ 94400 31268

CURRENCY NAGAR

Spacious 3 BHK apt for sale, close to Novotel, Bharathinagar, 1999 constructed, Bhavana apt. 57 Lacs, slightly nego. ✆ 9482746639

SATYANARAYANAPURAM

VJA సత్యనారాయణపురం BRTS రోడ్ దగ్గర న్యూ 2BHK ఫ్లాట్స్ 1,200 S.Ft Upto 90% బ్యాంక్‌లోన్ సదుపాయంతో అమ్మబడును. ✆ 95818 15555

HOUSE FOR SALE

VJA- Bharathi Nagar Road No.10, Duplex Model House, East Facing, Servant Pent House for Sale. ✆ 98661 92045, 83418 35845.

గన్నవరం హైవే, IOCబంక్ ప్రక్కరోడ్‌లో 193.6చ.గ.ల స్థలం అందులో 3అంతస్తుల ఇల్లు SBI వేలంద్వారా అమ్మకం. రిజర్వు ధర: 64ల. 96030 61724.

విజయవాడ ముత్యాలంపాడులో 75 చ.గ.లలో గ్రౌండ్, 1st ఫ్లోర్ కల్గిన బిల్డింగ్ అమ్మబడును. ధర: 45 లక్షలు. నోబ్రోకర్స్. ✆ 96668 52977.

రమేష్ హాస్పిటల్ వెనుక LIC కాలనీలో 1100 SFT ఈస్ట్ ఫేస్, ఫుల్ కబోర్డ్స్ వర్క్‌తో ఫ్లాట్ అమ్మకం. East, West రోడ్‌తో ✆ 78423 88856.

VJA బీసెంట్ రోడ్డుకు దగ్గర్లో కమర్షియల్ బిల్డింగ్, కృష్ణలంకలో 3 BHK & 2 BHK కొత్తవి మరియు 400 చ॥గ॥ల స్థలం అమ్మకం✆ 9963722999

విజయవాడ, మాచవరం, ప్రతిభ నికేతన్ రోడ్డులో మెయిన్ రోడ్డుకి అతిదగ్గరలో 80 చ॥గ॥లో ఇంటి నిర్మాణంలో ఇల్లు అమ్మకం కలదు.సంప్ర ✆ 94900 98438

VJA విద్యాధరపురం Decent Areaలో ఉత్తరం/ తూర్పుఫేసింగ్ 215గజాల G+1 పాత ఇల్లు స్థలం దరకే అమ్మబడును. నోబ్రోకర్స్‌ప్లీజ్. ✆ 94930 37151

LAND FOR SALE

ఏలూరు- రాజమండ్రి హైవేఫేసింగ్ (ముప్పవరం, గుండుగొలను సెంటర్) 1.25 ఎకరాల భూమి అమ్మకం. క్లియర్ టైటిల్, కమర్షియల్‌గా ఉపయోగం ✆ 63022 12237

450 ఎకరాల్లో మెగా అవకాడో ఫామ్‌ల్యాండ్‌లో 11 సెంట్లు 6 లక్షలకే 5 సంవత్సరం నుండి సంవత్సరంకి 2 లక్షల ఆదాయం పొందండి. 9133574455

Land for Sale - 6 cents/ 290.4 sq. yds in the outskirts of Chinapalakaluru, Mallavaram village, Guntur. Ph:- 99592 22511, 94907 50064

Agriculture Commercial Land for Sale. 3 Acres (65 Cents) Badepuram Village, Thadikonda (M), Guntur. ✆ 9849072372.

గుడివాడ మండలం కొమరవోలు శివారు తటివర్రు గ్రామము నందు 20 ఎకరముల మాగాణి పొలము అమ్మకం. సంప్ర: ✆ 93462 81147, 83676 38755.

NH 16 సర్వీసు రోడ్డు పక్కన, హనుమాన్‌జంక్షన్ పెరికీడు వంతెన దగ్గర 2 ఎకరాలు పొలము అమ్మబడును. ✆ 90000 18859.

కృష్ణాజిల్లా, పమిడిముక్కల (మం), కృష్ణాపురం (గ్రా)లో తారు రోడ్డు ఫేసింగ్‌తో 2.34 ఎకరాల మాగాణి పొలం అమ్మబడును. ✆ 80080 50435.

కృష్ణాజిల్లా ఉయ్యూరు ప్రక్కన, తాడంకి గ్రామం కపిలేశ్వరపురం రోడ్డుకి 2వ బిట్టు 95 సెంట్లు వ్యవసాయ భూమి అమ్మకం. ✆ 9392107970, 8328653001

గన్నవరం Airportకి 17 KM వీరవల్లి గ్రామంనందు PMG ఇండస్ట్రీని అనుకుని 50 సెంట్లు తారురోడ్డు ఫేస్ భూమి అమ్మకం. ✆ 94901 79329.

గన్నవరం to ఆగిరిపల్లి రోడ్డులో గెస్ట్‌హౌస్‌లకు అనువైన 1 ఎ॥ 2ఎ॥ 10ఎ॥ వరకు మామిడి తోటలు అమ్మకమునకు కలవు ✆ 98496 01589.

కృష్ణాజిల్లా, యాకమూరులో గరికపర్రు డొంకవైపు పడమర ఫేస్‌తో ఎకరం పొలము అమ్మకమునకు కలదు. వివరాలకు సంప్రదించండి. ✆ 94401 73535.

మైలవరం, సజ్జాపాడు రోడ్డులోని అయ్యప్పనగర్‌లో 40 అ॥ల తారు రోడ్డు ఫేస్‌తో 12 షాపులకు సరిపడే 28 సెంట్ల స్థలం అమ్మకము. ✆ 94401 73535.

PLOT FOR SALE

133.33 Sq.Yds. కేవలం 1,00,000/- మాత్రమే. వినుకొండ, పల్నాడు డిస్ట్రిక్ట్‌లో లిమిటెడ్ ఆఫర్. ఫోన్: 9133633855.

బందరురోడ్డు 6 లైన్ హైవేకి దగ్గరలో 100FT రోడ్డుని ఆనుకొని CRDA ప్లాట్ అమ్మకం 80% బ్యాంక్‌లోన్. గజం కేవలం 18K మాత్రమే. ✆ 94905 14626

బందరు రోడ్, గంగూరు, దనేకుల ఇంజినీరింగ్ కాలేజి ఎదురు 500 గ. స్థలం (70 X 65) అమ్మకం. ✆ 81437 83783, 86880 63040

కానూరు ఉమాశంకర్ 3వ రోడ్‌లో సండులో ప్లాట్ నెం. 401 సిరి స్టేటస్ అపార్ట్‌మెంట్‌లో ప్లాటు అమ్మకమునకు కలదు. ✆ 89192 29587.

శ్రీసిటీ ప్లాటినా గేటెడ్ కమ్యూనిటీ CRDA లేఅవుట్ ఓపెన్ ప్లాట్ ఈస్ట్‌ఫేస్ 45.5x54 272.56 చ॥గ॥ అమ్మకం. నో బ్రోకర్స్. వాట్సాప్ ఓన్లీ 70222 75137.

నిడమానూరు సాయిసుధ వెంచర్‌లో ప్లాటు నెం: 563 నందు E/F 225గ॥లు ఈడుపుగల్లు జనచైతన్య తోకప్రింట్ లో W/F 344 గ॥ అమ్మకం. ✆ 98484 32502.

పునాదిపాడు చైతన్య కాలేజ్ రోడ్డులో మద్దాలి తిరుమలరావు గారి వెంచరులో ప్లాటు నెం: 6,400 చ॥గ॥ W/F స్థలము అమ్మకము Contact: 76610 34433.

కానూరు - ఆటోనగర్ రోడ్డులో Scotspine International School దగ్గర 1084 చ॥గ॥ వెస్ట్‌ఫేస్ స్థలము అమ్మకము. ✆ 76610 34433.

గన్నవరంకి 6 1/2 KM నేషనల్ హైవేకి 1/2 KM తారు రోడ్డు ప్రక్కన 10 సెంట్లు, 20 సెంట్లు, 30 సెంట్లు బిట్లు కలవు. ✆ 93903 15739.

హరివిల్లువారి ప్రీమియం గేటెడ్ కమ్యూనిటీలో హైరిటర్న్స్ ప్లాట్స్ @ పరిటాల, గన్నవరం, కంకిపాడు, పెనమలూరు, ఆకునూరు & మచిలీపట్నంలో ప్లాట్స్ డైరెక్ట్ కుపేత్. ✆ 7893766996

పాతపాడు గ్రామంలో, పోలవరం కాలువ దగ్గర, బైపాస్ రోడ్ ప్రక్కన, గణేష్‌రియల్ ఎస్టేట్ వెంచర్‌లో, డైరీఫార్మ్ ఎదురుగా ఇంటి నిర్మాణానికి అనువైనా 145గ॥ ప్లాటు అమ్మబడును. ✆ 9398618191

Sale 750 Sq.Yds, West Facing Residential Plot, Road # 7, Beside Lords Apartment, Bharathinagar. ✆ 70325 30657, 95507 17832

Gudivada House Site For Sale West/ 525 Sq. Yards Rs 35,000 Behind Sarath Talks Con: 9393007291.

మచిలీపట్నం:
కాలేఖాన్‌పేటలోని వడ్డమూడి వారి వీధి నందు చ.గ. 170ల స్థలము అమ్మబడును. ✆ 85004 29659.

మంగళగిరి నేషనల్ హైవే సర్వీస్ రోడ్డుని అనుకొని, నార్త్ ఫేస్ 445 చ.గ. కమర్షియల్‌కు ఉపయోగపడు ఖాళీ స్థలం అమ్మబడును. ✆ 98484 16864.

పోరంకి పెనమలూరు గోసాలలో 194, 200, 270, 300గ॥, గుణదలలో 480గ॥, చిల్లకల్లు టోల్‌ప్లాజా వద్ద హైవేఫేస్ 7 ఎకరాలు అమ్మకం. ✆ 94407 89749

విజయవాడ, బందరు రోడ్డు, పెనమలూరు CRDA LP No: 104/25, ప్లాట్లు హౌసెస్, విల్లాలు ★ బ్యాంక్‌లోన్ ★ స్పాట్ రిజి. ✆95531 29369, 97054 33765

కానూరులో 80 అ॥ రోడ్డు దగ్గర N/E కార్నర్ మరియు ఉత్తర ఈశాన్యం వీధిపోటు ఉన్న 1225 గజముల స్థలం అమ్మకం. గజం: 35K. ✆ 94915 86009/ 88856 12999.

VJA రామవరప్పాడు LP No.62/2024, గేటెడ్ కమ్యూనిటీలో ప్లాట్లు, హౌసెస్, విల్లాలు ★ బ్యాంక్ లోన్ ★ స్పాట్ రిజి. ✆ 95531 29369, 97054 33765.

కాలేజి, హాస్పిటల్, షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణాలకు అనువైన 10 సెంట్లు స్థలం కోడూరు మెయిన్ రోడ్ ప్రక్కన అమ్మకానికి కలదు. ✆98662 99687, 94904 43879

విజయవాడ పటమట JDనగర్‌లో 427 గ॥ అయ్యప్పనగర్‌లో 409 గ॥ పెనమలూరులో 275 గ॥ తులసీనగర్‌లో 287 చ॥గ॥ల ప్లాట్లు అమ్మకం. ✆ 93962 03890.

బందరు రోడ్డుకు దగ్గరలో 100 అ॥ రోడ్డుని అనుకుని CRDA ప్లాట్లు (80% బ్యాంకు లోన్‌తో) గజం: 18,000/-లకే అమ్మకం. స్పాట్ Reg. ✆ 83418 15371

సంక్రాంతి బంపర్ ఆఫర్
బందరురోడ్డు, గూడూరులో 100 చ॥గ॥ కొనుగోలుపై 50 చ॥గ॥ **ఉచితం.**
బందరు పోర్టు 2026 లో ప్రారంభం
✆ 90000 88199

ప్రకాశం,పుల్లల చెరువు మం. చౌటపాచర్ల గ్రా.లో (మెడపి నుండి 8 km), 2 బోర్లు, వాగునీరు, ఇళ్ళ ప్రక్కనే 3 ఎకరాలు ఒకవైపు రోడ్‌తో ధర: 36ల. ✆ 98848 84210

హరివిల్లు వారి అన్ని CRDA లేఅవుట్‌లో పెనమలూరు, కంకిపాడు, గండిగుంటలో, 240, 300, 400, చ॥గల మంచి ప్లాట్లు కుపేనీ డైరెక్ట్ సేల్కై ✆92464 73929

పోరంకి CRDA గేటెడ్ కమ్యూనిటీలో వెంటనే ఇల్లు కట్టుకునే 220, 275, 330, 550 చ॥గల ప్లాట్లుకై సంప్ర. బ్యాంక్‌లోన్ సదుపాయం కలదు ✆ 98498 65959

గురునానక్‌నగర్ మెయిన్ రోడ్ 450 గ॥ బిల్డింగ్, వినాయక థియేటర్ రోడ్‌లో మంచి బిల్డింగ్, నున్న D మార్ట్ దగ్గర 3000 గ॥ అయ్యప్పనగర్‌లో, తులసీనగర్‌లో 270 గ॥ బిల్డింగ్ గుంటుపల్లి వర్క్‌షాప్ రోడ్‌లో 3, 7 య॥ ✆ 9849348066

బందరురోడ్ నేషనల్ హైవే ఫేసింగ్ నార్త్ సైడ్ కంకిపాడు దగ్గరలో 450 చ॥గ॥ ఫ్లాట్ అమ్మకమునకు కలదు. సంప్రదించండి ✆ 98483 43355

VJA అశోక్‌నగర్ W/F 213 గ॥ తాడిగడప 60 ఫీట్స్ డొంక రోడ్ WS/G కమర్షియల్ 215 గ॥ 1.20 మురళీనగర్ (కానూరు) W/F 233 గ॥ ✆ 95427 56666.

గుడివాడ వలివర్తిపాడులో రోడ్డు ప్రక్కన ఉన్న 4 సెంట్ల స్థలం Govt వాల్యూ 11 Lakhs, 2BHK హౌస్ 1st Floorతో అమ్మబడును ✆ 98484 61609

కంచికచర్ల మండలం, చెవిటికల్లు రోడ్‌లో NH 9 కి దగ్గరలో 33 అ॥ రోడ్‌లో ప్లాటు నెం. 36లో 235గ॥ స్థలం అమ్మబడును. ✆ 96031 26878

3999/- 6999/- చ.గ. గన్నవరం మల్లవల్లి 4వేల ఎకరాల ఇండస్ట్రియల్ హబ్ దగ్గర. K తాడేపల్లి, G. కొండూరు ఆగిరిపల్లిలలో EMI కలదు. ✆ 8374936634.

సెంటు 7,20,000 అంబాపురం ఊరు ఇళ్ల మధ్యలో 4 సెంట్లు తూర్పు ఫేసింగ్ ప్లాట్ సేల్ & ఆగిరిపల్లిలో చ॥గ॥ 9,999/- క్లియర్‌టైటిల్. 9550763551 నో బ్రోకర్స్.

CURRENCY NAGAR

విజయవాడ, భారతీనగర్‌లో నార్త్ & తూర్పు ఫేసింగ్‌తో 451 చ॥గ॥ల స్థలం అమ్మకం లేదా 150 చ॥గ॥లలో 3 విల్లాలు కట్టించి అమ్మబడును ✆93946 26067

TADEPALLI

1000 sq. yds road facing approved layout near to mayuri tech park chinakakani for sale. Contact ✆ 90144 58976

COMMERCIAL SPACE FOR SALE

కమర్షియల్ 532 గ॥లు NH-16 ఆనుకొని N/E కార్నర్ ఫంక్షన్ హాల్స్, హాస్పిటల్స్‌కి అనుకూలం @ గూగుల్ డేటా సెంటర్, వైజాగ్. ✆ 63038 38351.

LEASE/ RENT

VJA లబ్బీపేటలో కాలేజీలకు, బ్యాంకులకు, గోడౌన్‌లు, గోల్డ్‌షాపులు, డిజిటల్ మార్కెటింగ్ ఆఫీసులకు అద్దెకు/ లీజుకు. ✆ 77939 29255, 77027 99355.

హోటల్ లీజుకు
గుంటూరు అరండల్‌పేటలో హోటల్ (లాడ్జ్, రెస్టారెంట్, కేఫ్) లీజుకి ఇవ్వబడును (నోట్: కేవలం లాడ్జి లేదా రెస్టారెంట్ అయినా ఇవ్వబడును, రెస్టారెంట్ అమ్మబడును).
Ph: 9900961963

అవనిగడ్డలో మెయిన్‌రోడ్ ఫేసింగ్‌తో షోరూమ్స్, పెట్రోల్ బంక్స్, ఇతర వ్యాపారాలకు అనుకూలమైన 40 సెంట్లు స్థలం లీజుకు ఇవ్వబడును. ✆ 99485 86894.

SHOP FOR SALE

విజయవాడ ఫైపుల రోడ్డు 80' రోడ్డులో 72 చ.గ.లలో (S /F) కమర్షియల్ షాపు G +2, అమ్మబడును. @ 1.1 Crore. Ph: 98485 48905

PROPERTY FOR SALE

విజయవాడ - కానూరు 5BHK (5900 చ॥అ॥) 1.45 Cr ★ గొల్లపూడిలో 4 BHK (3145 చ॥అ॥) 1.23 Cr ఆంధ్ర & తెలంగాణలో బ్యాంకు వారి ద్వారా కొనుటకు సంప్ర. ✆ 90301 61117.

LEASE/ SALE

నున్న దోబి ఖానా రోడ్‌లో 80HP ఇండస్ట్రియల్ కరెంట్‌తో 628 చ॥గ॥లలో GF & FF, RCC,2వ ఫ్లోర్ క్వార్టర్స్‌గల బిల్డింగ్ లీజు /అమ్మకము. ✆ 98482 34444

భవానిపురం భవానీ హాస్పిటల్ ఎదురు సందు Sri nilayam apartment 1st floor లో 1600 SFT 3BHK ఫ్లాట్ అద్దెకు కలదు. సంప్రదించవలసిన ఫోన్ నెంబరు: 9866071732

VJW భవానిపురం రామాలయం దగ్గర, ఐరన్ యార్డ్‌లో 1st ఫ్లోర్ 28X70 (200 S.F.T) Plot No: 12. ఆఫీస్/ గోడౌన్‌లకు లీజు/ రెంట్‌కు ఇవ్వబడును. సంప్ర: ✆ 92463 44405.

AGRICULTURE LANDS

7 acres, 50 meters of frontage to NH16, by the bridge on Eluru Canal in Kesarapalli. Contact: 6304149506.

తోట్లవల్లూరు మండలం, సౌత్ వల్లూరు గ్రామం 30 సెంట్లు, 54 సెంట్లు వ్యవసాయ భూమి అమ్మబడును. No brokers. ఫోన్: 86392 38081

TO LET

3BHK E/F, 3rd ఫ్లోర్ ఫ్లాట్ నెం: 17, కార్ పార్కింగ్‌తో అద్దెకు. సాయికృష్ణ రెసిడెన్సీ, బృందావన కాలనీ, విజయవాడ. ఫోన్: 98494 54534

VJA భారతీనగర్ Novotel రోడ్డు రోడ్ నెం. 10B ప్లాటు నెం. 3నందు 2BHK, 1 BHK డ్యూప్లెక్స్ హౌస్ మొత్తముగా లేదా విడివిడిగా అద్దెకు ✆92461 61717

Film Colony Plot No:3 Ind House (3BHK) With Car Parking Besides VMC Park LIC Colony Vijayawada. 94919 29136, 98664 42593.

Independent 2B/R House with 1 A/c for rent at Ahyodhyanagar, Lotus Landmark, Sec-1. Govt Employees only ✆ 94901 90739.

2BHK Independent House 2nd Floor For Rent. Near Nalanda School, Beside Trendset Mall, Benz Circle, VJA. ✆ 99497 76210

బందరు రోడ్డు సమీపాన పోరంకి సాయినగర్ ముని రెసిడెన్సీలో 2nd ఫ్లోర్ 1300 Sft. 3BHK కార్ పార్కింగ్‌తో అద్దెకు కలదు ✆ 81065 70099

COMMERCIAL

VJA, ఏలూరురోడ్డు, రామవరప్పాడు రింగు, కె హోటల్ ప్రక్కన UBI బ్యాంక్ అనుకొని 980 చ.అ.ల. గ్రౌండ్‌ఫ్లోర్ బిల్డింగ్ ఆఫీసులకు, షోరూమ్‌లకు అద్దెకు. 95154 61626

VJA బందర్ రోడ్ NTR సర్కిల్ 360 sft గ్రౌండ్ ఫ్లోర్ షాప్ రెంట్‌కు ఉన్నది. Ph.99088 19301, 96404 16219

కంకిపాడు కరూర్ వైశ్యా బ్యాంక్ పైన 1st ఫ్లోర్ షాపు 24 పొడవు, 12 వెడల్పు మరియు 2 BHK ఫ్లాట్ అద్దెకు కలదు. ✆ 90009 28927.

విజయవాడ 1టౌన్ చిప్పాడ వారి వీధి, దుర్గా కోఆపరేటివ్ బ్యాంక్ ప్రక్కన 1,032 Sft ఈస్ట్‌ఫేస్ గ్రౌండ్ ఫ్లోర్ గోడౌను అద్దెకు కలదు ✆ 98499 10688.

విజయవాడ కానూరులో షాపు అద్దెకు. నారాయణ, చైతన్య స్కూల్స్, కాలేజీలు దగ్గరలో Toilet, పార్కింగ్‌తో అద్దెకు. ✆ 98851 56973.

Ware House / Godown for Rent 3300 Sqft Site in Prajasakthi Nagar, Payakapuram, Vijayawada Cont: ✆ 90301 99299, 92900 03169

TO-LET
Commercial Space
G+2 Floors Each Floor
3000 Sqft Suitable for
Shops, Showrooms,
Offices, Banks.
@ M.G ROAD
Opp. Manorama Hotel
Ph: 9848374905

2,600SFt Ground and 1st Floor Hospital / Office Space for Rent. Near Suryaraopet, Vijayawada. ✆ 91606 83161, 63052 76554

GF consisting of 1800 sq.feet at Ratnamba street, Mogalrajapuram. Ideally suitable to banks, clinics, offices. Available from 15th March- 2026. Contact: 97032 52203

నిడమానూరులో గోడౌన్ అద్దెకు
నిడమానూరులో, హైవే ఫేస్, నారాయణ కాలేజి, వైష్ణవి భవన్ ప్రక్కన, మిశ్రా దాబా అనుకొని 8680 చ॥అ॥ గోడౌన్ అద్దెకు
✆ 96764 00122
98481 50838

పటమట బందరురోడ్డు ఫేస్ గోల్డెన్ టవర్స్ గ్రౌండ్ ఫ్లోరునందు 11x26 కొ.గల షాపు ఆఫీసులకు/షాపులకు అద్దెకు. ✆ 98669 75877, 93962 03890

విజయవాడ సత్యనారాయణపురం BRTS రోడ్‌కు దగ్గర 2,000 Sft. కమర్షియల్‌స్పేస్ లిఫ్ట్, పార్కింగ్ సౌకర్యంతో 1వ ఫ్లోర్ అద్దెకు కలదు ✆ 97043 33988

విజయవాడ PVP రోడ్డు, మొగల్‌రాజపురంలో 3 BHK ఫ్లాట్ రెసిడెన్స్/ ఆఫీస్/గోడౌన్స్‌కు అద్దెకు
88858 89922
92993 58470

VJA గవర్నరుపేట బకింగ్‌హామ్ పోస్టాఫీస్ ఎదురు గ్రౌండ్ ఫ్లోర్ 1 షాపు, 1వ ఫ్లోర్‌లో 2 షాపులు ATM/ గోల్డ్ సిల్వర్‌కు అనువుగా అద్దెకు కలవు. ✆ 94403 68181

VJA, కామయ్యతోపు, చలసానినగర్ గోపాళం శివన్నారాయణ హాస్పిటల్ ప్రక్క రోడ్డులో 3 స్లేర్స్ బిల్డింగ్ ఒక్కో ఫ్లోర్ 2000 S.Ft. అద్దెకు. 63034 98345, 94410 83767

TO LET - COMMERCIAL
14000 Sft COMMERCIAL SPACE WTH CENTRALIZED AC FOR RENT
(2800 in each floor)
at Kovelamudi Vari Street, Suryaraopet, Vijayawada.
Ready for EDUCATIONAL INSTITUTIONS with infra.
Also Suitable for
CORPORATES, HOSPITALS etc.
✆ 9848114696
9705366696

కొండపల్లి IDAలో ఈస్ట్‌ఫేస్ ప్లాటు నెం. 56Eలో 1,500 గ॥ స్థలంలో 6,000 S.ft షెడ్‌తో అద్దెకు కలదు. ✆ 70138 34996, 94409 45557

VJA అయోధ్యనగర్‌లో తూర్పుఫేస్ బిల్డింగ్ నందు 750SFt గ్రౌండ్‌ఫ్లోర్ గోడౌన్ పార్కింగ్ సౌకర్యంతో అద్దెకు కలదు. ✆ 94908 77753.

WANTED

ప్రముఖ విద్యాసంస్థకు విజయవాడ బందరు రోడ్, ఏలూరు రోడ్ ఏరియాలలో 20,000 చ॥అ॥ భవనం అద్దెకు కావలెను. ✆ 99499 30394.

SECOND SALE

For Sale in Vizag used filter Bags 20mt Interested please contact Mr. Kumar Mobile ✆ 93970 27485.

వంట సామాగ్రి అమ్మకం
హోటల్ - కేటరింగ్ కు సంబంధించిన వంట సామాగ్రి మరియు జనరేటర్ అమ్మకమునకు కలదు. SS COMERCIAL KITCHEN EQUIPMENTS - 2, AI KUTLERY ITEMS, WATER COOLER, STAINLESS STEEL FREEZER 2, CENTRIFUGAL BLOWER 2, COMMERCIAL LPG SYSTEM, ACRYLIC LED BOARD, THERMAL POS PRINTERS EPSON 4, TOUCH POS SYSTEMS 4, 36 KVA DIESEL GENERATOR, ACs 3 Nos.
98496 36969

లగ్జరీ బ్యూటీపార్లర్ (ఫర్నిచర్, కాస్మోటిక్స్, ఫుల్ ఎక్విప్‌మెంట్‌తో) అమ్మకానికి కలదు. రామవరప్పాడు వంతెన సెంటర్, VJA ✆ 96404 87587.

JOBS

CAD Designer- Civil & MEP Drawings Hyd. Dip/B.E. Civil, 3-5 Yrs. Exp. AutoCAD & ZWCAD Required. jobs@olympialighting.in

Urgent Requirement Sales Representatives for shop to shop Marketing. Attractive Salary. ✆ 96181 99598.

Vja లోని ప్రముఖ రియల్ ఎస్టేట్ సంస్థ NTR హౌసింగ్ నందు అనుభవం గల అకౌంటెంట్స్ కావలెను. జీతం: 20K-25K. ✆ 90300 75742

శ్రీ సాయి అంజనా చిట్‌ఫండ్స్, గాంధీనగర్ నందు పనిచేయుటకు రికవరీ స్టాఫ్ (M) కావలెను. ✆ 76600 08326, 63034 19997.

Walk-in-Interview
మార్కెటింగ్ డిగ్రీతో 1 లేదా 2 సం॥ల అనుభవం ఉన్న స్త్రీ/ పురుషులు ఉద్యోగము కొరకు ఇంటర్వ్యూకు వ్యక్తిగతంగా హాజరు కాగలరు. లోకేష్ ఇండస్ట్రీస్, మంతెన గ్రామము, ఉప్పులూరు రైల్వేస్టేషన్ రోడ్డు. ✆ 94935 79226.

గుంటూరులోని యాడెజెన్సీనందు చేయుటకు ఫోటోషాప్, కోరల్‌డ్రా, వీడియో ఎడిటింగ్ డిజైనర్స్ కావలెను. జీతం అనుభవాన్నిబట్టి 25-35వేలు రూఫ్లీ. ✆ 9988399499.

ప్రముఖ కన్‌స్ట్రక్షన్స్ సంస్థ సైట్‌లో వర్క్ చేయుటకు అనుభవం గల సివిల్ ఇంజినీర్స్ కావలెను. నిడమానూరు, విజయవాడ. ✆ 98490 41054.

హైదరాబాద్‌కు చెందిన Spices కంపెనీకు మీ ఏరియాలో ఉంటూ ప్యాకింగ్ పనిచేయుటకు స్త్రీలు కావలెను. అర్హత: 10th - ఇంటర్. ✆ 98482 73215.

VJA, ప్రముఖ రియల్ ఎస్టేట్ సంస్థ నందు పని చేయుటకు టెలీకాలర్స్ (F), మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ (M/F) కావలెను. జీతం+ ఇన్సెంటివ్. ✆ 99497 96940.

Job Vacancies at Plastic Industry. ITI- 5 Posts, Diploma -5 Posts, Mechanical Engineers-2 Posts, Degree B.com/ BBA -2 Posts Email : infoampp2016@gmail.com ✆ 62810 45178. Address: Amaravathi Poly pack; #25-38, 4th Cross Road, Kabela Industrial; Vijayawada-520 012.

Wanted Plant Operator for Ammonia Cold Storage @ Chennai. Call: 9840218555, 8825404509.

Wanted Female Telecallers, Counsellors & Receptionist for a reputed college in Labbipet. Pay upto 15k+incentives. Qual: Any Degree. Age: 25-40 yrs. Min 2 yrs exp. Ph: 63030 85727.

సన్‌సిరి ప్రాజెక్ట్స్
వారి CRDA లేఅవుట్ ప్లాటు మార్కెటింగ్ కొరకు
మార్కెటింగ్ సిబ్బంది
M/F కావలెను. పటమట, VJA.
✆ 62811 01979
73862 04849

Lady Teachers for 6-10th subjects and languages / upper primary Teachers and study hour Teachers, VJA. ✆ 8074528582.

Wanted ACAD Draftsman.ITI, Diploma/ Degree in Civil Eng. Fresh / Experienced Whats App Resume to: 81215 20624

Required a Male Staff above 2 Years Experience for Packing and Rolling Purpose in Plywood & Laminate shop Bhavanipuram, Vijayawada ✆ 96186 97873.

Urgent Requirement
RUSSIA For MOSCOW
➤ Factory Helper
Sal: Rs. 95,000 to 1 Lakh
➤ Mall Jobs for All Types
Sal:1 Lakh to 1.20 Lakh
1 Time Meals & Free Accommodation
BZA MANPOWER SERVICES Pvt. Ltd
Vijayawada
Contact No: 95605 08757
Office No: 0866-2433685

Hardware and Network Engineers - Should Have Knowledge in Printer Installations and Network Sharing, Preferred Bank AMC Engineers. Con: 90320 41574, 92464 75192, Mail: klcps2@gmail.com

హైదరాబాద్‌లో ఇంట్లోఉండి ఇంటి పనులు చేయుటకు మహిళ కావలెను. పెన్షన్ లేని వాళ్ళకి మొదటి ప్రాధాన్యత. ✆ 96031 36789.

వాసవి గ్రూప్ (AP No:1) HYD VJA న్యూఢిల్లీకు టెలికాలర్స్, కస్టమర్‌కేర్, అన్నిరకాల ఆఫీస్ స్టాఫ్ కావలెను. భో+వ+మంచి జీతం. ✆ 96764 91122.

EXP నర్సులు/ ఆయాలు/ వార్డ్‌బాయ్స్ కావలెను. జీతం Rs. 20,000/- నుండి Rs. 25,000/- వరకు ఇవ్వబడును. Hyd లో. ✆ 99665 68882, 99634 89661.

కానూరు ప్రముఖ ట్రాన్స్‌పోర్ట్ ఆఫీస్ నందు లేడీ కంప్యూటర్ ఆపరేటర్, మేనేజర్-1, ఆఫీస్ సూపర్‌వైజర్స్-2, గ్యారేజీ సూపర్ వైజర్- 1, మెకానిక్స్- 2, బొలెరో డ్రైవర్ కావలెను. హిందీ వచ్చిన వారికి ప్రాధాన్యత ✆ 86889 08675, 91542 97951

కొత్తగా ప్రారంభిస్తున్న SVS సెక్యూరిటీ సర్వీసెస్ & హౌస్‌కీపింగ్ VJAకొరకు అన్నిరకాల స్టాఫ్ కావలెను. భో+వ+ మంచిజీతం. ✆ 96764 91122, 96769 01122

గన్నవరం కార్యాలయంలో పనిచేయుటకు అనుభవం కలిగి ఉన్న అకౌంటెంట్ కావలెను, ట్యాలీ & GST ఫైలింగ్‌లో పని అనుభవం ఉండాలి. ✆ 94401 75207.

ప్రముఖ రియల్ ఎస్టేట్ సంస్థ వారికి విజయవాడ, గుంటూరు జిల్లాలలో మార్కెటింగ్ చేయుటకు (M/F) అభ్యర్థులు కావలెను. అర్హత: 10th to ఏదేని డిగ్రీ. జీతం: అర్హత, అనుభవమునుబట్టి 16-35 వేల వరకు. 93946 67788.

'మహానాడు మీడియా'లో వీడియో ఎడిటర్లుగా పనిచేయుటకు ఉత్సాహవంతులైన యువతీ, యువకులు కావలెను. కాల్: 73372 22004.

కంకిపాడు దగ్గర గల రిలయన్స్ వేర్ హౌస్‌లో పనిచేయుటకు డేటా ఎంట్రీ ఆపరేటర్స్ కావలెను. Q: ఇంటర్ ఆపైన, Ph: 99511 40777.

WANTED
Bala Vikasa Social Service Society Hiring
➠ Project Coordinator - 1 No's
➠ Gardeners - 2 No's
➠ Field Coordinators - 1 No's
Water Conservation Project
➠ Location: Vijayawada & Guntur
➠ Qualification: Graduate (MSW Prefered) & 10th Pass
➠ Experience: 4-5 Years in Watershed Management
➠ Key Roles: Project Execution, Monitoring, Technical Skills, Evaluating and Reporting Willingness to Travel
Apply: Send your CV to
hr@balavikasa.org
H.No. 1-1-867, Siddharthanagar, Hanmakonda, Warangal - 506004

40 వేల జీతం & 1Bhk ఇల్లు, Hydలో రైస్ & కిరాణా షాప్‌లో Cashier Cum Sales చేయుటకు భార్యాభర్తలు లేదా అన్నదమ్ములు కావలెను. విద్యార్హత: Inter. ✆ 7013321010

ఎలక్ట్రీషియన్స్ మరియు హెల్పర్స్ కావలెను. వయస్సు: 18-30 సం॥లోపు. హౌస్ వైరింగ్‌లో అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత. సంప్ర॥ ✆ 93921 33234.

విజయవాడలో ఆటో మొబైల్ ఫైనాన్స్ కంపెనీలో ఫైనాన్స్ కలెక్షన్ చేయుటకు టూ వీలర్ డ్రైవింగ్ లైసెన్సు గల మేల్ కలెక్షన్ ఎగ్జిక్యూటివ్ కావలెను. ✆ 92478 64544.

ఆఫీస్ ఇన్‌ఛార్జ్ (M/F) కావలెను. విజయవాడ లబ్బీపేటలో ప్రముఖ ఎడ్యుకేషన్ ఆఫీస్‌నందు పనిచేయుటకు (పార్ట్/ ఫుల్‌టైమ్) కావలెను. ✆ 79953 51919.

VJA బెంజ్‌సర్కిల్ జ్యోతి కన్వెన్షన్ వెనుక హోటల్ భవానీవిలాస్‌లో కిచెన్ హెల్పర్స్ ఆడవారు చదవగలిగిన వారు కావలెను. టైం: 8 AM - 8 PM. సంప్ర ✆ 90004 95555.

ప్రముఖ బ్యాంక్ సంస్థలో పనిచేయుటకు లేడీ టెలీకాలర్స్ కావలెను. జీతం: 14K - 20K + ఇన్సెంటివ్స్. Exp. 1 Yr min. ✆ 99482 00553.

ప్రముఖ రియల్ ఎస్టేట్స్‌లో పనిచేయుటకు మార్కెటింగ్ మేనేజర్స్, మార్కెటింగ్ ఏజెంట్స్ కావలెను. జీతం+ కమీషన్ ఇవ్వబడును. సంప్ర ✆ 93906 65999.

అజిత్‌సింగ్ నగర్, పాయకాపురం మా కంపెనీలో అనుభవమున్న టెలి కాలర్స్ కావలెను. హిందీ, ఇంగ్లీష్, తమిళ్, కన్నడ వచ్చి ఉండాలి. శాలరీ 10- 15K. టైమింగ్స్: 9.30-6.30. ఆఫీస్‌బాయ్స్ కావలెను. ✆ 77996 48666.

విజయవాడలోని ప్రముఖ ఫైనాన్స్ కంపెనీకి Excellలో అనుభవం గల అకౌంటెంట్ (M/F) Qul: డిగ్రీ+ కంప్యూటర్ నాలెడ్జి మరియు కలెక్షన్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. ✆ 63098 80999, 96969 99499.

కార్ డ్రైవర్ కావలెను. విజయవాడలో ప్రీమియం కారు డ్రైవ్ చేయుటకు అనుభవం గల వారు కావలెను. వెంటనే సంప్రదించండి ✆ 94412 72777

కంప్యూటర్ ఆపరేటర్ M/F కావలెను. (సొంత ల్యాప్‌టాప్ గల) విజయవాడ ఆటోనగర్‌లోని NB ట్రేడర్స్‌నందు పనిచేయుటకు సంప్ర ✆ 92464 97089.

టెక్నీషియన్స్, కలెక్షన్ గర్ల్స్ కావలెను. విజయవాడ గుణదలలో సిటీకేబుల్ నెట్‌వర్క్ నందు పనిచేయుటకు కావలెను. సంప్ర ✆ 92464 75466.

Work From home రిటైర్డ్ ఎంప్లాయీస్ కావలెను. జీతం: 10,000/-, 20,000/-, 30,000/- ✆ 92484 69479.

జాతీయ బ్యాంకులలో మేనేజర్, SR మేనేజర్, చీఫ్ మేనేజర్, AGM, DGMగా రిటైర్ అయినవారు ప్రముఖ సంస్థకు కావలెను. సంప్ర॥ 9866002288.

పౌల్ట్రీఫార్మ్స్‌లో పనిచేయుటకు, షెడ్‌సూపర్ వైజర్లు కావలెను ★ అర్హత : 10th పాస్ చిరునామా: లీలానగర్ గ్రామం, నూజివీడు- విస్సన్నపేట రోడ్. ✆ 94910 37194

1గ్రా. జ్యూయలరీ షాపులో పూసలదండలు చేయుటకు లేడీస్ కావలెను. జీ: 10K వ: 18-30, 10 AM to 7 PM ఆసక్తి కలవారు 30th మంగళవారం సంప్ర: సాయిశ్రీనివాస పెరల్స్ స్వర్ణలోక్ కాంప్లెక్స్ VJA 8309103953

విజయవాడనందు గల ప్రముఖ డయాగ్నొస్టిక్ సెంటర్‌నందు పనిచేయుటకు ఫీమేల్ కంప్యూటర్ ఆపరేటర్లు కావలెను. ✆ 94907 55383.

MORE CLASSIFIEDS ON PAGES 10

తిరువూరు

• తిరువూరు • మైలవరం

పతకాలకు ప్రతిభే గీటురాయి


పోటీల విజేతలతో సురేష్, రమేష్

మైలవరం, న్యూస్‌టుడే : పోటీల్లో పతకాలు సాధించడానికి ప్రతిభ చాటడమే గీటురాయి అని స్థానిక గౌతమ్ పాఠశాల ప్రిన్సిపల్ గొల్లపూడి సురేష్, కరస్పాండెంటు రమేష్ పేర్కొన్నారు. 'ఈనాడు- ఈటీవీ' ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రతిభా పాటవ పోటీల్లో భాగంగా శనివారం ఆ పాఠశాలలోని విద్యార్థులకు క్విజ్ పోటీలు జరిగాయి. ఇందులో 8వ తరగతి విద్యార్థిని జె.సాత్విక, 9వ తరగతి విద్యార్థి సీహెచ్.కార్తికేయ, 7వ తరగతి విద్యార్థిని కె.హర్షిని వరుసగా మొదటి మూడు స్థానాల్లో నిలిచారు. వీరికి పాఠశాల ప్రిన్సిపల్, కరస్పాండెంటు బహుమతులు అందజేశారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

తిరువూరు: 98853 28820 మైలవరం: 80085 74705

స్పందనకు వందనం.. ✦ తిరువూరు 17వ వార్డులోని డ్రెయిన్లలో మురుగు పేరుకుందని స్థానికుడు ఆనందరావు సమస్యను 'ఈనాడు' మేమున్నాం.. మీకు తోడుగా ద్వారా మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన శానిటరీ అధికారి సంతోష్ పారిశుద్ధ్య కార్మికులను పంపించి పూడిక తీయించారు. – న్యూస్‌టుడే, తిరువూరు టౌన్

? ముచ్చనపల్లి ఊర చెరువు దగ్గర కట్టపై చెత్త వేయడంతో ఇబ్బందిగా ఉంది. - వెంకట్, స్థానికుడు ✔ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం. - కె.రాజేష్, ముచ్చనపల్లి ఇన్‌ఛార్జి కార్యదర్శి – రెడ్డిగూడెం

బాధితులకు చేయూత

విస్సన్నపేట, న్యూస్‌టుడే : మండలంలోని తాతకుంట్ల గిరిజన తండాలో అనారోగ్యంతో ఇబ్బంది పడుతున్న బాణావత్ దాసుకు రూ.15,000, బాణావత్ పార్వతికి రూ.5,000 ఎన్ఆర్ఐ వల్లభనేని గిరిబాబు వితరణతో తెదేపా మండల అధ్యక్షుడు రాయల సుబ్బారావు ఆధ్వర్యంలో శనివారం అందించారు. పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంలోనే రహదారుల అభివృద్ధి


ఆంజనేయపురంలో సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాసరావు

తిరువూరు, గంపలగూడెం, న్యూస్‌టుడే : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సీఎం చంద్రబాబు పాలనలో గ్రామీణ రహదారుల అభివృద్ధి వేగంగా జరుగుతోందని తిరువూరు ఎమ్మెల్యే కె.శ్రీనివాసరావు తెలిపారు. శనివారం తిరువూరు మండలం ఆంజనేయపురంలో నిర్మించనున్న సీసీ రోడ్డుకు ఆయన శంకుస్థాపన చేశారు. పలువురు నాయకులు పాల్గొన్నారు.

గంపలగూడెం, తిరువూరు, న్యూస్‌టుడే : తిరువూరులోని శ్రీరస్తు మండపంలో ఎమ్మెల్యే శ్రీనివాసరావు, మాధవి దంపతులు ఆధ్వర్యంలో శ్రీదేవి, భూదేవి సమేత వెంకటేశ్వర స్వామి కల్యాణం నిర్వహించారు. భక్తులకు ప్రసాదం, అల్పాహారం అందించారు.

నిధుల వినియోగంపై ఆంక్షలు విధించొద్దు


ఎంపీపీ నాగలక్ష్మి, జడ్పీటీసీ గనియా, ఎంపీడీవో శ్రీనివాసరావుకు వినతిపత్రం ఇస్తున్న సర్పంచులు

ఎ.కొండూరు, న్యూస్‌టుడే : గ్రామ పంచాయతీలకు విడుదల చేసే 15వ ఆర్థిక సంఘం నిధులు వినియోగంపై ప్రభుత్వం ఆంక్షలు విధించవద్దని కోరుతూ మండల పరిధిలోని సర్పంచులు ఎంపీపీ కె.నాగలక్ష్మి, ఎంపీడీవో బి.శ్రీనివాసరావుకు వినతిపత్రం అందించారు. ఎంపీపీ అధ్యక్షతన శనివారం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఇందులో సర్పంచులు మాట్లాడుతూ.. ప్రభుత్వం ఆర్థిక సంఘం నిధులపై ఆంక్షలు విధిస్తే గ్రామాల్లో అభివృద్ధి పనులు కుంటుపడే అవకాశం ఉందని, ఇప్పటికే తాము గ్రామాల్లో మౌలిక సమస్యలు పరిష్కరించేందుకు ఖర్చు చేసిన సొమ్ము రాదని, పంచాయతీలో పని చేసే సిబ్బందికి జీతాలు కూడా ఇవ్వలేక అవస్థలకు గురవుతామన్నారు. సర్పంచుల వినతిపత్రాన్ని ఉన్నతాధికారులకు పంపిస్తానని ఎంపీడీవో శ్రీనివాసరావు తెలిపారు. ఆర్అండ్‌బీ ఏఈ ఒ.అచ్చారావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సీహెచ్.సాయి వెంకటలక్ష్మి, జడ్పీటీసీ సభ్యుడు బి.గనియా, ఇతర అధికారులు పాల్గొన్నారు.

నిఘా లోపం.. తగ్గుతున్న పర్యావరణ సమతుల్యం

జి.కొండూరు, న్యూస్‌టుడే

జి.కొండూరు మండలంలో సహజ సిద్ధంగా కొండపల్లి రిజర్వ్ ఫారెస్ట్‌లో అటవీ ప్రాంతం ఉంది. ప్రధానంగా కడెంపోతారం, కట్టుబడిపాలెం, చెరువు మాధవరం, మునగపాడు, సున్నంపాడు, గంగినేనిపాలెం, దుగ్గిరాలపాడు గ్రామాల వరకు తొమ్మిది వేల ఎకరాలు, మరో వైపు చెవుటూరు, వెంకటాపురం, గుర్రాజుపాలెం గ్రామాల్లో ఆరు వేల ఎకరాలు మొత్తం 15 వేల ఎకరాల వరకు అటవీ విస్తీర్ణం ఉంటుంది. ఇందులో వెదురు, చింత, మద్ది, పొనికి తదితర రకాల కలప విస్తారంగా దొరుకుతోంది. ఈ నేపథ్యంలో గంగినేనిపాలెం, సున్నంపాడు తదితర గ్రామాల నుంచి జి.కొండూరు మీదుగా నిత్యం పదుల సంఖ్యలో ట్రాక్టర్లలో కలప తరలిపోతోంది. దీనికి ఎటువంటి అనుమతులు లేకుండా, నిఘా లోపం తదితర కారణాలతో అడ్డదారుల్లో తరలిపోతోందని స్థానికులు మండిపడుతున్నారు. ఇంత జరుగుతున్నా సంబంధిత శాఖ అధికారులు చర్యలు చేపట్టడం లేదని,


ట్రాక్టర్లలో తరలిపోతున్న కలప

ఇలా తరిగిపోతున్న కలపను అడ్డుకోకపోతే కొంత కాలానికి కాలుష్యం పెరిగి పర్యావరణ సమతుల్యం దెబ్బతింటోదని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

పెరుగుతున్న డిమాండ్

గంగినేని వైపు నుంచి కొండపల్లి పారిశ్రామికవాడకు, వెల్లటూరు, కుంటముక్కల గ్రామాల్లోని ఇటుక బట్టీలకు కలప తరలి వెళ్తోంది. కొండపల్లి పారిశ్రామికవాడలో ఘన వ్యర్థాలను బాయిలర్లలో మండించి వాయు రూపంలోకి మార్చేందుకు కలపను విరివిగా వాడుతున్నారు. మరో వైపు వెల్లటూరు, కుంటముక్కలలో ఇటుక బట్టీలు విస్తరించి ఉండటంతో ఇటుకలు కాల్చడానికి దీన్ని ఉపయోగిస్తారు. కొంతమంది ఇదే అదునుగా చూసుకుని నిత్యం పదుల సంఖ్యలో ట్రాక్టర్లతో దీన్ని తరలిస్తున్నారని స్థానికులు చెబుతున్నారు. ఈ వ్యవహారాన్ని అడ్డుకోవాల్సిన సిబ్బంది నిర్లక్ష్యమే దీనికి కారణమని, రాబోయే రోజుల్లో అటవి సంపద తగ్గిపోయే ప్రమాదం ఉందని పలువురు ఆందోళన చెందుతున్నారు.

★ కలప అక్రమ రవాణాపై గంగినేని అటవీ సిబ్బంది సుధాకర్‌ను 'న్యూస్‌టుడే' వివరణ కోరగా ఇలా స్పందించారు. నిఘా పెట్టి కలప అక్రమ రవాణా చేపట్టే వారిపై చర్యలు తీసుకుని ప్రభుత్వానికి చలానా కట్టిస్తున్నామని తెలిపారు. పూర్తి స్థాయిలో నిఘా పెంచి కలప తరలిపోకుండా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

ఎరువుల దుకాణాల్లో నిరంతరం తనిఖీలు

తిరువూరు టౌన్, న్యూస్‌టుడే : డివిజన్ పరిధిలో యూరియాను అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవని తిరువూరు ఆర్డీవో కె.మాధురి హెచ్చరించారు. తన కార్యాలయంలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఎరువుల దుకాణాలపై నిరంతరం తనిఖీలు చేపడతామన్నారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కేసులు నమోదు చేసి, లైసెన్స్‌లు రద్దు చేస్తామని తెలిపారు.

విద్యుత్తు సరఫరా నిలిపివేత నేడు

మైలవరం, న్యూస్‌టుడే : మైలవరంలోని విజయవాడ రోడ్డు నుంచి స్టేడియం వరకు విద్యుత్తు స్తంభాల పునరుద్ధరణ నేపథ్యంలో ఆదివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 3 వరకు సరఫరా నిలిపేస్తున్నట్లు ఏఈ జి.రమేష్ బాబు తెలిపారు. ఆయా ప్రాంతాల వినియోగదారులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.


ఉపాధ్యాయులతో సమీక్షిస్తున్న ధర్మకుమార్

నూరు శాతం ఉత్తీర్ణత సాధించడమే లక్ష్యం

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే : మద్దులపర్వ ఆదర్శ పాఠశాలను ఏపీఎం డాక్టర్.ధర్మకుమార్ శనివారం సందర్శించారు. పదో తరగతి విద్యార్థుల కోసం అమలు చేస్తున్న వంద రోజుల ప్రణాళిక అమలు తీరును పరిశీలించారు. నూరు శాతం ఉత్తీర్ణత సాధించడమే లక్ష్యంగా విద్యార్థులకు దిశా నిర్దేశం చేశారు. ఉపాధ్యాయులకు సూచనలు సలహాలు ఇచ్చారు. ప్రిన్సిపల్ ఆర్.శైలజ తదితరులు పాల్గొన్నారు.

మహాసభలు జయప్రదం చేయాలి

మైలవరం, న్యూస్‌టుడే : విశాఖపట్నంలో ఈ నెల 31 నుంచి నిర్వహించనున్న సీఐటీయూ అఖిల భారత మహాసభలను జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు సీహెచ్. సుధాకర్ పేర్కొన్నారు. దీనికి సంబంధించిన గోడపత్రులను స్థానిక సంఘ కార్యాలయంలో ఆయన శనివారం ఆవిష్కరించారు. వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

తిరువూరు, గంపలగూడెం, న్యూస్‌టుడే : తిరువూరులోని సీపీఎం కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎన్.సీహెచ్. సుప్రజ, నాయకులు బి.వెంకటేశ్వరరావు, ఎస్.వీరభద్రం తదితరుల ఆధ్వర్యంలో మహాసభల గోడపత్రికలు ఆవిష్కరించారు.


మైలవరంలో గోడపత్రులు ఆవిష్కరిస్తున్న సీఐటీయూ, వివిధ కార్మిక సంఘాల నాయకులు

దైనందిని ఆవిష్కరణ

ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే : ఆర్టీసీ ఎంప్లాయీస్ థ్రిఫ్ట్, క్రెడిట్ కో-ఆపరేటివ్ సొసైటీ 2026 దైనందినిని ఇబ్రహీంపట్నం ఆర్టీసీ డిపో ఆవరణలో మేనేజర్ ఎ.వేణు శనివారం ఆవిష్కరించారు. ఉద్యోగ, కార్మిక సంఘాలు సంస్థ అభ్యున్నతికి కృషి చేయాలని ఆయన సూచించారు. యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

విలీనానికి పంచాయతీల అంగీకారం

ఇబ్రహీంపట్నం గ్రామీణం, న్యూస్‌టుడే : గ్రేటర్ విజయవాడలో కలపాలని ప్రతిపాదించిన ఇబ్రహీంపట్నం గ్రామీణ మండల పరిధిలోని గ్రామ పంచాయతీలు శనివారం ప్రత్యేక సమావేశాలు నిర్వహించి ప్రభుత్వ ప్రతిపాదనకు అంగీకారం తెలుపుతూ తీర్మానాలు చేశాయి. అనంతరం వాటిని గ్రామ కార్యదర్శులు మండల పరిషత్తు అధికారులకు నివేదించారు.


తిరువూరులో పూజలందుకున్న వేంకటాచలస్వామి


గుంటుపల్లి : గోదా రంగనాథ కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

ఆలయాల్లో ప్రత్యేక పూజలు

గుంటుపల్లి(ఇబ్రహీంపట్నం గ్రామీణం), న్యూస్‌టుడే : ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా గుంటుపల్లి శ్రీవెంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం గోదా రంగనాథ స్వామి వార్ల కల్యాణం నిర్వహించారు. తితిదే పంపించిన లడ్డూ ప్రసాదం, స్వామి వారి శేషవస్త్రాలను భక్తులకు పంపిణీ చేశారు.

తిరువూరు: పాత తిరువూరులోని శ్రీదేవి, భూదేవి సమేత వేంకటాచలస్వామి ఆలయంలో శనివారం అర్చకుడు డి.వేణుగోపాలకృష్ణమాచార్యులు ఆధ్వర్యంలో విశేష పూజలు నిర్వహించారు.

గంపలగూడెం: మండలంలోని పెనుగొలను సమీప మెట్టగుట్టలోని గజలక్ష్మి సమేత శేషాచల శ్రీనివాస స్వామి ఆలయంలో మూలవిరాట్‌ను ప్రధానార్చకుడు శ్యామ్ సుందర శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో శోభాయమానంగా అలంకరించారు.

ఘనంగా పడిపూజ.. జి.కొండూరు: స్థానిక పార్వతీ సమేత అమృత లింగేశ్వర దేవాలయంలో శనివారం పడిపూజ నిర్వహించారు. మండలంలోని అయ్యప్ప భక్తులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

తిరువూరులో హిందూ సమ్మేళనం నేడు..

తిరువూరు, గంపలగూడెం, న్యూస్‌టుడే : తిరువూరులోని ఆర్యవైశ్య కల్యాణ మండపంలో ఆదివారం నిర్వహించే హిందూ సమ్మేళనం విజయవంతం చేయాలని కోరుతూ శనివారం ప్రదర్శన నిర్వహించారు. భరద్వాజ భారతీనంద స్వామి, అరిపిరాల అప్పయ్య శాస్త్రి ఆధ్వర్యంలో పట్టణంలోని రాజుపేట అష్టలక్ష్మి దేవాలయం నుంచి బైపాస్‌లోని కేదారేశ్వరగౌరీనాథుని ఆలయం వరకు ప్రదర్శన జరిగింది.

తొలగిన అడ్డంకులు.. వచ్చిన కొత్త పుస్తకాలు

తిరువూరు, గంపలగూడెం, న్యూస్‌టుడే

తిరువూరు నియోజకవర్గంలో భూములు రీసర్వే పూర్తయిన గ్రామాల్లో రైతులకు మరో వారంలో కొత్త పట్టాదారు పాసు పుస్తకాలను అధికారులు అందజేయనున్నారు. జనవరి 2 నుంచి 9 వరకు రీసర్వే జరిగిన గ్రామాల్లో రెవెన్యూ గ్రామ సభలు నిర్వహించి 'రాజముద్ర' ముద్రించిన వాటిని సాగుదారులకు పంపిణీ చేస్తారు. ఇప్పటికే సాగు భూమి హక్కు సమాచారంతో తయారు చేసినవి జిల్లా కేంద్రం నుంచి మండల రెవెన్యూ కార్యాలయాలకు సరఫరాకు సిద్ధంగా ఉన్నాయి. వైకాపా హయాంలో భూ యజమానులకు పంపిణీ చేసిన పాసు పుస్తకాలపై అప్పటి సీఎం జగన్ బొమ్మ, నవరత్నాల చిహ్నాలు ముద్రించగా దీన్ని రైతులు పూర్తిగా వ్యతిరేకించారు. దీంతో చంద్రబాబు కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే అవన్నీ తొలగించి కొత్త పుస్తకాలు అందిస్తామని హామీ ఇచ్చారు. ఆ మేరకు 2025 నాటికి రీసర్వే పూర్తయిన గ్రామాల్లో ప్రభుత్వ రాజముద్రతో పుస్తకాలు పంపిణీ చేసేందుకు సిద్ధమయ్యారు.


గంపలగూడెం మండలంలో రైతులతో మాట్లాడుతున్న ఆర్డీవో మాధురి

ఏర్పాట్లు పూర్తి..

తిరువూరు నియోజకవర్గంలో ఈ ఏడాది 12 గ్రామాల్లో రీసర్వే పూర్తి చేయగా రైతులకు 9,727 పుస్తకాలు పంపిణీ చేయనున్నారు. విస్సన్నపేట మండలం చంద్రపట్లలో 1046, ఎ.కొండూరు మండలం మారేపల్లిలో 768, గంపలగూడెం మండలం అనుముల్లంక 729, కనుమూరు 1,420, గంపలగూడెం 952, చెన్నవరం 411, రాజవరం 330, వినగడప 1313, తిరువూరు మండలంలో ఆంజనేయపురం 489, చిట్టేల 511, ముష్టికుంట్ల 873, వాముకుంట్ల 885 పుస్తకాలు ఇచ్చేందుకు రెవెన్యూ అధికారులు ఏర్పాట్లు చేశారు. ఈ క్రమంలో రెవెన్యూ అధికారులు సంబంధిత గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం చేయాలి. రైతుల నుంచి ఎటువంటి అభ్యంతరాలు రాకుండా సజావుగా అందించాలి. పాత హక్కు పత్రాలు తిరిగి తీసుకోవాలి. భూముల వివరాలు, యజమానుల పేర్లకు సంబంధించి ఏమైనా తప్పులు ఉంటే రైతులు వెంటనే అధికారులకు తెలియజేయాలి.

శిరస్త్రాణంతో ప్రాణాలు పదిలం


వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న డీసీపీ లక్ష్మీనారాయణ

జి.కొండూరు, న్యూస్‌టుడే : ద్విచక్ర వాహనదారులు శిరస్త్రాణం ధరించి ప్రాణాలు కాపాడుకోవాలని విజయవాడ రూరల్ డీసీపీ బి.లక్ష్మీ నారాయణ కోరారు. శనివారం జి.కొండూరులో జాతీయ రహదారి- 30పై ఆత్కూరు అడ్డరోడ్డు సమీపంలో వాహనదారులకు హెల్మెట్‌పై ఆయన అవగాహన కల్పించారు. తొలుత ఆయన జి.కొండూరు పోలీస్ స్టేషన్ సందర్శించి పలు రికార్డులు పరిశీలించారు. మైలవరం ఏసీపీ వై.ప్రసాదరావు, సీఐ డి.చంద్రశేఖర్, జి.కొండూరు ఎస్సై కె.సతీష్ కుమార్, అదనపు ఎస్సై గిరిజామణి, సిబ్బంది పాల్గొన్నారు.

ఉరుసు మహోత్సవానికి సహకరించండి

కొండపల్లి, న్యూస్‌టుడే : కొండపల్లి షాబుఖారీ దర్గా ఉరుసు మహోత్సవానికి ఎన్టీటీపీఎస్, ప్రభుత్వ యంత్రాంగం సహకరించి అన్ని ఏర్పాట్లు చేయాల్సిన అవసరం ఉందని ఉరుసు కమిటీ ఛైర్మన్ అల్తాఫ్ రజా అన్నారు. ఉరుసు మహోత్సవాలు 29 నుంచి ప్రారంభం కానున్న నేపథ్యంలో ప్రభుత్వం, ఎన్టీటీపీఎస్ ఎటువంటి సహకారం అందివ్వకపోవడం విచారకరమన్నారు.


సభలో మాట్లాడుతున్న కృష్ణ, పక్కన నాయకులు

'ఉద్యమాలు ఆపేందుకు చూడడం తగదు'

విస్సన్నపేట: అనకాపల్లి జిల్లా రైతు సంఘం కార్యదర్శి అప్పలరాజుపై పీడీ యాక్టు కేసు పెట్టి అరెస్టు చేయడం అన్యాయమని సీపీఎం జిల్లా కార్యదర్శి డీవీ.కృష్ణ అన్నారు. శనివారం స్థానిక సుందరయ్య భవనంలో జరిగిన సీపీఎం మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజల తరపున పోరాడుతున్న అప్పలరాజుపై కేసు పెట్టి ఉద్యమాలను ఆపాలని రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నం చేస్తుందని ఆరోపించారు. గద్దల రామకృష్ణ, నాగరాజు, మేకల జ్ఞానరత్నం, ఆడిమిల్లి కిషోర్, పులిబల్ల ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

ఎత్తిపోతలకు మరమ్మతులు చేపట్టాలని వినతి

జి.కొండూరు, న్యూస్‌టుడే : వినగడప శివారు అనుమల్లంక సమీపంలో ఎత్తిపోతల పథకం మరమ్మతులకు నోచుకోక నిరుపయోగంగా ఉందని, దానికి తక్షణమే మరమ్మతులు చేపట్టి వినియోగంలోకి తీసుకురావాలని వినగడప రైతులు ఏపీ ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ అంకెం ఇందిరా ప్రియదర్శినికి శనివారం వినతిపత్రం అందించారు. సమస్యను ఉన్నతాధికారులతో మాట్లాడి పరిష్కరిస్తామని ఆమె హామీ ఇచ్చారు.

తెదేపా నాయకుడిపై కర్రలతో దాడి

విస్సన్నపేట, న్యూస్‌టుడే : మండలంలోని చంద్రుపట్ల తండాకు చెందిన తెదేపా బూత్ కన్వీనర్ మనస్సు గోపిపై వైకాపాకు చెందిన బాణావత్ చంటి ఆధ్వర్యంలో కొంతమంది వ్యక్తులు కర్రలతో దాడి చేసి గాయపరచినట్లు తెదేపా మండల అధ్యక్షుడు రాయల సుబ్బారావు శనివారం తెలిపారు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడి కోమాలోకి వెళ్లిన గోపిని విస్సన్నపేట ప్రభుత్వాసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. అనంతరం అతని కుటుంబ సభ్యులు మెరుగైన వైద్యం కోసం గోపిని విజయవాడ తీసుకెళ్లారు. దాడిలో గోపి, చంటి ఇరువురు గాయపడినట్లు స్థానిక ఎస్సై జి.రామకృష్ణ పేర్కొన్నారు. బాధితులు పరస్పరం ఫిర్యాదు మేరకు విచారిస్తున్నట్లు తెలిపారు.

సమగ్ర సస్యరక్షణతో అధిక దిగుబడులు


మామిడి తోటలో అన్నదాతలకు సలహాలిస్తున్న ఉద్యాన అధికారి

గణపవరం(మైలవరం) : మామిడి పూత దశలో సమగ్ర సస్యరక్షణ చర్యలు తీసుకోవడంతోనే అధిక దిగుబడులు పొందవచ్చని ఉద్యాన అధికారి సొహైల్ అహ్మద్ పేర్కొన్నారు. మండలంలోని గణపవరంలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పూత దశలో ఆశించే పురుగులు, నివారణ చర్యలను రైతులకు వివరించారు. ఉద్యాన సహాయకులు రామకృష్ణ, శేషగిరిరావు పాల్గొన్నారు.


కలగర : అవగాహన ర్యాలీలో అధికారులు, రైతులు

పొలం కొలతల్లో తేడాలు చక్కదిద్దాల్సిందే..

విస్సన్నపేట: పొలం కొలతల్లో తేడాలు రాకుండా రోవర్లు ఉపయోగించి భూములు సర్వే చేస్తున్నామని ఆర్ఐ సుజాత, సర్వేయర్ శంకరరావు తెలిపారు. మండలంలోని కలగర, నరసాపురంలో శనివారం నిర్వహించిన గ్రామ సభల్లో ఆమె మాట్లాడారు. జనవరి 2 నుంచి జరిగే రీసర్వేకు రైతులు హాజరుకావాలని కోరారు. పలువురు అధికారులు పాల్గొన్నారు.

మైలవరం: పొందుగల, చంద్రగూడెంలో గ్రామ సభలు నిర్వహించారు. తహసీల్దార్ అబ్దుల్ దరియా రైతులతో కలిసి ప్రదర్శన చేశారు.

అభినందనలు

కొండపల్లి, న్యూస్‌టుడే : తెదేపా జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమితులైన కొండపల్లి మున్సిపల్ ఛైర్మన్ చిట్టిబాబును 1984-85 పదో తరగతి పూర్వ విద్యార్థులైన స్నేహితులు శనివారం కలిసి పుష్పగుచ్ఛం అందించి అభినందించారు. అరవింద్, కొండలరావు, కుమార్, మహాలక్ష్మి, వెంకటరమణ, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. కొండపల్లి ముస్లింలు కూడా ఆయన్ను కలిసి సత్కరించారు.

ద్విచక్ర వాహనాలు ఢీ.. ఒకరికి తీవ్రగాయాలు

తిరువూరు టౌన్, న్యూస్‌టుడే : రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ఘటనలో ఒకరికి తీవ్రగాయాలయ్యాయి. కోకిలంపాడుకు చెందిన కొటమర్తి.వెంకటకృష్ణ వీఆర్ఏగా పని చేస్తున్నారు. ఈ క్రమంలో అతని కుమారుడుతో కలిసి శనివారం తిరువూరు వచ్చి తిరుగు వెళ్లేటప్పుడు జాతీయ రహదారిలో రిలయన్స్ పెట్రోలు బంకు వద్ద ఎదురుగా వస్తున్న గానుగపాడు కొత్తూరుకు చెందిన వ్యక్తి వీరి వాహనాన్ని బలంగా ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో వెంకటకృష్ణకు తీవ్రగాయాలయ్యాయి. అటుగా వస్తున్న తిరువూరు ఎంపీడీవో రవిబాబు గమనించి వెంటనే 108కు ఫోన్ చేసి క్షతగాత్రుడిని స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ ప్రాథమిక వైద్యం చేసి మెరుగైన చికిత్స నిమిత్తం వెంకటకృష్ణను విజయవాడ తీసుకెళ్లారు. ఈ ప్రమాదంలో వెంకటకృష్ణ కుమారుడికి, గానుగపాడు కొత్తూరుకు చెందిన వ్యక్తికి కూడా స్వల్పగాయాలయ్యాయి.

చరణ్ అర్ధ సెంచరీ..
సెమీస్‌కు ఎన్ఆర్ఐ జట్టు

న్యూస్‌టుడే-విజయవాడ క్రీడలు

కానూరులోని కేసీపీ సిద్ధార్థ ఆదర్శ్ రెసిడెన్షియల్ స్కూల్ మైదానంలో జరుగుతున్న ధనిక్ భారత్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ ప్రజెంట్స్ 'ఈనాడు' స్పోర్ట్స్ లీగ్ (ఈఎస్ఎల్)-2025 ఉత్సాహంగా సాగుతోంది. శనివారం జరిగిన మ్యాచ్‌ల్లో సీనియర్స్ విభాగంలో కేబీఎన్ కళాశాల, వీఆర్ సిద్ధార్థ, ఎంవీఆర్ ఇంజినీరింగ్ కళాశాల జట్లు క్వార్టర్ ఫైనల్స్‌లో ప్రవేశించాయి. జూనియర్స్ విభాగంలో ఎన్ఆర్ఐ జట్టు సెమీఫైనల్ బెర్త్ ఖరారు చేసుకుంది.



కేబీఎన్‌దే విజయం

మొదటి మ్యాచ్‌లో కేబీఎన్ కళాశాల జట్టు ఏడు పరుగుల తేడాతో సిద్ధార్థ అకాడమీ కళాశాల జట్టుపై విజయం సాధించింది. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన కేబీఎన్ జట్టు నిర్ణీత పది ఓవర్లలో ఏడు వికెట్ల నష్టానికి 66 పరుగులు చేసింది. సాయి రాఘవేంద్ర 13 బంతుల్లో 20, అబ్బాస్ 14 బంతుల్లో 14 పరుగులతో రాణించగా.. ప్రత్యర్థి బౌలర్లు ఉజ్వల్ ఏడు పరుగులు ఇచ్చి మూడు, పి.దీపేష్ ఎనిమిది పరుగులు ఇచ్చి ఒక వికెట్ పడగొట్టాడు. బదులుగా బ్యాటింగ్‌కు దిగిన సిద్ధార్థ జట్టు ఏడు వికెట్ల నష్టానికి 59 పరుగులు మాత్రమే చేసింది. జట్టులో వి.హర్ష 16, ఎం.సోహన్ 11 పరుగులతో రాణించగా.. ప్రత్యర్థి బౌలర్ మహేంద్ర 13 పరుగులు ఇచ్చి రెండు వికెట్లు తీశాడు. ఈ మ్యాచ్‌లో మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా సాయి రాఘవేంద్ర ఎంపికయ్యాడు.

వీఆర్ సిద్ధార్థదే గెలుపు

రెండో మ్యాచ్‌లో వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కళాశాల జట్టు 51 పరుగుల తేడాతో ఎస్ఆర్‌కే ఇంజినీరింగ్ కళాశాల జట్టుపై విజయం సాధించింది. టాస్ గెలిచిన ఎస్ఆర్‌కే జట్టు ఫీల్డింగ్ ఎంచుకోగా.. బ్యాటింగ్‌కు దిగిన వీఆర్ సిద్ధార్థ పది ఓవర్లలో ఆరు వికెట్ల నష్టానికి 96 పరుగులు చేసింది. ఎం.కుమారస్వామి 29, అభినయ్ 20 పరుగులతో క్రీజ్‌లో నిలిచారు. ప్రత్యర్థి బౌలర్ ఎల్.రాకేష్ 13 పరుగులు ఇచ్చి రెండు వికెట్లు పడగొట్టాడు. బదులుగా బ్యాటింగ్‌కు దిగిన ఎస్ఆర్‌కే జట్టు 5 వికెట్ల నష్టానికి 45 పరుగులు మాత్రమే చేసింది. ఎల్.రాకేష్ 21 పరుగులతో రాణించగా.. ప్రత్యర్థి బౌలర్ ఎం.లోకేష్ మూడు పరుగులు ఇచ్చి రెండు వికెట్లు కూల్చాడు. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా ఎం.కుమారస్వామి ఎంపికయ్యాడు.





ఎంవీఆర్ జయకేతనం

మూడో మ్యాచ్‌లో ఎంవీఆర్ ఇంజినీరింగ్ కళాశాల జట్టు 23 పరుగుల తేడాతో ప్రభుత్వ దంత కళాశాల జట్టుపై గెలిచింది. టాస్ గెలిచిన దంత కళాశాల ఫీల్డింగ్ ఎంచుకోగా.. బ్యాటింగ్‌కు దిగిన ఎంవీఆర్ జట్టు పది ఓవర్లలో ఎనిమిది వికెట్ల నష్టానికి 69 పరుగులు చేసింది. వి.బాలకృష్ణ 20 బంతుల్లో 25 పరుగులతో రాణించగా.. ప్రత్యర్థి బౌలర్ కె.కార్తీక్ తొమ్మిది పరుగులు ఇచ్చి మూడు వికెట్లు తీశాడు. కె.భార్గవ్, ఆర్.రంజిత్ చెరో రెండు వికెట్లు పడగొట్టారు. బదులుగా బ్యాటింగ్‌కు దిగిన దంత కళాశాల జట్టు తొమ్మిది వికెట్ల నష్టానికి 46 పరుగులే చేసింది. జట్టులో ఎన్.సూర్య ఆకాష్ 20 పరుగులతో రాణించగా.. ప్రత్యర్థి బౌలర్ వి.బాలకృష్ణ ఎనిమిది పరుగులు ఇచ్చి రెండు వికెట్లు కూల్చాడు. ఈ మ్యాచ్‌లో మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా వి.బాలకృష్ణ ఎంపికయ్యాడు.

నేటి మ్యాచ్‌ల వివరాలు

★ పీబీ సిద్ధార్థ ఆర్ట్స్ అండ్ సైన్స్ డిగ్రీ కళాశాల × ఆంధ్రా లయోలా ఇంజినీరింగ్ కళాశాల (మొదటి మ్యాచ్)

★ నలంద డిగ్రీ కళాశాల × అమృతసాయి ఇంజినీరింగ్ కళాశాల (రెండో మ్యాచ్)

★ వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కళాశాల × ఎంవీఆర్ ఇంజినీరింగ్ కళాశాల (మూడో మ్యాచ్)

ధనిక్ భారత్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ స్టార్ క్రికెటర్ ఆఫ్ ది మ్యాచ్ వీరే..



సాయి రాఘవేంద్ర | ఎం.కుమార స్వామి | వి.బాలకృష్ణ | జె.సాయిరామ్ చరణ్

ప్రతిభ చూపిన బౌలర్లు.. బ్యాటర్లు

నాలుగో మ్యాచ్‌లో జూనియర్స్ విభాగంలో ఎన్ఆర్ఐ జూనియర్ కళాశాల జట్టు 99 పరుగుల తేడాతో కేబీఎన్ జూనియర్ కళాశాల జట్టుపై గెలిచి సెమీఫైనల్స్‌లో ప్రవేశించింది. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన ఎన్ఆర్ఐ జట్టు పది ఓవర్లలో నాలుగు వికెట్ల నష్టానికి 144 పరుగులు చేసింది. జె.సాయిరామ్ చరణ్ (59) రాణించగా.. పి.రేనేష్ 37 పరుగులు జోడించాడు. ప్రత్యర్థి బౌలర్ బి.మోహన్ ఒక వికెట్ పడగొట్టాడు. బదులుగా బ్యాటింగ్‌కు దిగిన కేబీఎన్ జట్టు 9.4 ఓవర్లలో 45 పరుగులకే కుప్పకూలింది. ప్రత్యర్థి బౌలర్లు బి.హరీష్ నాలుగు పరుగులు ఇచ్చి నాలుగు, సీహెచ్ వైభవ్‌రాజ్ మూడు పరుగులు ఇచ్చి మూడు వికెట్లు కూల్చారు. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా జె.సాయిరామ్ చరణ్ ఎంపికయ్యాడు.





క్రీడాకారుల జోరు.. ఉత్కంఠ పోరు

ఈనాడు, అమరావతి: విజయవాడలో జాతీయ సీనియర్ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్ పోటీలు ఉత్సాహంగా సాగుతున్నాయి. క్రీడాకారులు రాకెట్లతో హోరాహోరీగా తలపడుతున్నారు. శనివారం జరిగిన పోటీలకు సుప్రీం కోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ లావు నాగేశ్వరరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన్ని ఏపీ బ్యాడ్మింటన్ అసోసియేషన్ కార్యదర్శి అంకమ్మచౌదరి తదితరులు జ్ఞాపికతో సత్కరించారు.

సమాజ సేవకు మారుపేరు ఆర్యవైశ్యులు

పటమట, న్యూస్‌టుడే: సమాజ సేవకు మారుపేరు ఆర్యవైశ్యులు అని జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య అన్నారు. సేవా రంగంలో రాణిస్తున్న మహిళా మణులకు వైశ్య లైమ్‌లైట్ అవార్డ్స్ అందజేయడం ప్రశంసనీయమని పేర్కొన్నారు.



అవార్డు అందిస్తున్న జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య

శనివారం పటమట డొంక రోడ్డులోని ఓ కల్యాణ మండపంలో వైశ్యలైమ్‌లైట్ అవార్డ్స్ ప్రోగ్రాం ఛైర్మన్ ఇమ్మడి శివ ఆధ్వర్యంలో వైశ్య లైమ్‌లైట్ అవార్డుల ప్రదానోత్సవం నిర్వహించారు. కార్యక్రమానికి శ్రీరాం తాతయ్య ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ.. వైశ్యులు సమాజ సేవకు మరింత తోడ్పాటు అందించాలని పిలుపునిచ్చారు. ఇమ్మడి శివ మాట్లాడుతూ.. వివిధ రంగాల్లో సేవలందిస్తున్న 15 మంది మహిళలకు అవార్డులు అందజేశామని తెలిపారు. ఆర్యవైశ్య కార్పొరేషన్ ఛైర్మన్ డూండీ రాకేష్ మాట్లాడుతూ.. త్వరలో ఆర్యవైశ్య కార్పొరేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం తరపున ఆర్యవైశ్య మహిళలకు అవార్డులు అందజేస్తామని ప్రకటించారు. ప్రోగ్రామ్ కమిటీ ప్రతినిధులు శ్రీకర్ ఆలపాటి, రాజేష్, సంపత్, భాజపా నాయకులు విత్తా వంశీకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర మంత్రికి ఘన స్వాగతం



ఏపీ పర్యటనలో భాగంగా కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మల సీతారామన్ శనివారం రాత్రి విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయం చేరుకున్నారు. దిల్లీ నుంచి విమానాశ్రయం చేరుకున్న ఆమెకు రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, మంత్రి కొల్లు రవీంద్ర, ఎమ్మెల్యేలు వెనిగండ్ల రాము, యార్లగడ్డ వెంకట్రావు, పలువురు అధికారులు ఘన స్వాగతం పలికారు. అనంతరం నిర్మలా సీతారామన్ రోడ్డు మార్గంలో విజయవాడ బయలుదేరి వెళ్లారు.

- న్యూస్‌టుడే, గన్నవరం గ్రామీణం



ధర వరలు

వంకాయలు-20/24, టమాటా-47, బెండ-34, పచ్చిమిర్చి-40, కాకర-50, బీర-34/40, క్యాలీ ఫ్లవర్-30/25, క్యాబేజి-22, క్యారెట్-34, దొండ-36, బంగాళ దుంప-24/26, ఉల్లిపాయలు-30, గోరుచిక్కుళ్లు-40, దోస-40, సొర-18/20, పొట్ల-35, అరటికాయ-7/8, చామ దుంప-24, అల్లం-76, మునగ-14/15, బీట్ రూట్-30, కీరదోస-36, బీన్స్-76, క్యాప్సికమ్-58, ముల్లంగి-8, పచ్చిమామిడి-20/22 (నిన్నటివి). నగరంలోని రైతు బజార్లలో ఈ ధరలు (రూ.ల్లో) వర్తిస్తాయి.

- ఎన్టీఆర్ కలెక్టరేట్

బ్రాయిలర్ ధరలు
(కిలో 1కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -135 రిటైల్ ధర 162 చికెన్ విత్ స్కిన్ - 235, చికెన్ స్కిన్‌లెస్ - 267.
అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 152, 161, 172 చికెన్ విత్ స్కిన్ - 294 చికెన్ స్కిన్‌లెస్ - 304.

అపూర్వ స్వర్ణకాంతులు

ఈనాడు, అమరావతి: విజయవాడ సిద్ధార్థ అకాడమీ ఆఫ్ జనరల్ టెక్నికల్ ఎడ్యుకేషన్ సంస్థల స్వర్ణోత్సవం శనివారం వేడుకగా నిర్వహించారు. దేశ సమైక్యతను చాటి చెప్పే విధంగా అన్ని రాష్ట్రాల శాస్త్రీయ నృత్యాలను ఒకే వేదికపై విద్యార్థులు ఆవిష్కరించిన తీరు నిరుపమానం. దశాబ్దాల కిందట చదువుకున్న చదువుల గుడిలో మళ్లీ కలిసిన పూర్వ విద్యార్థులు ఆ పాత మధురాలను నెమరు వేసుకున్నారు. తమకు పాఠాలు చెప్పిన గురువులతో అప్పటి అనుభూతులు పంచుకున్నారు. తమ తమ రంగాల్లో అద్వితీయ ప్రతిభ చూపిన 36 మంది పూర్వ విద్యార్థులను స్వర్ణోత్సవ వేళ యాజమాన్యం చేసిన సత్కారానికి కొందరు భావోద్వేగానికి లోనయ్యారు. సిద్ధార్థ కళాశాలల 50 ఏళ్ల ప్రస్థానంపై రూపొందించిన వీడియో.. సంస్థ ప్రగతి చిత్రాన్ని ఆవిష్కరించింది. ముఖ్యఅతిథి సుప్రీం కోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ లావు నాగేశ్వరరావు, సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు రాజయ్య, లక్ష్మణరావు కలిసి జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యవర్గం, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.



సత్కారం అందుకుంటున్న భారత ప్రభుత్వ అదనపు సొలిసిటర్ జనరల్ కనకమేడల రవీంద్రకుమార్, దర్శకుడు వీఎన్ ఆదిత్య, డీఆర్‌డీవో శాస్త్రవేత్త పద్మజ



ఆకట్టుకున్న నృత్య రూపకం

'డిసెంబరు 27వ తేదీని అయేషా మీరా సంస్మరణ దినంగా ప్రకటించాలి'

ఈనాడు, అమరావతి : తమ బిడ్డ హత్యకు గురైన డిసెంబరు 27వ తేదీని అయేషా మీరా సంస్మరణ దినంగా ప్రకటించాలని ఆమె తల్లిదండ్రులు శంషాద్ బేగం, బాషాలు ప్రభుత్వానికి విన్నవించారు. ఈ కేసులో 18 ఏళ్లుగా పోరాటం చేస్తున్నా.. ఇప్పటికీ న్యాయం జరగలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఏడేళ్ల క్రితం పునర్విచారణ పేరుతో అస్తికల్ని తీసుకున్నారని, వాటిని ఇప్పటికీ తమకు తిరిగి అప్పగించలేదని తెలిపారు. అస్తికల్ని అప్పగించేలా చూడాలని రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ రాయపాటి శైలజను మంగళగిరిలోని కార్యాలయంలో శనివారం వారు కలిసి విన్నవించారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడారు. తన కుమార్తె తరహా బాధితులకు చేయూత ఇచ్చేందుకు ఆమె పేరుతో ఛారిటబుల్ ట్రస్ట్ ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం సహకారం అందించాలని కోరారు. వారి విజ్ఞప్తులపై స్పందించిన రాయపాటి శైలజ...ఈ విషయాలన్నింటినీ ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళతానని భరోసానిచ్చారు.

బస్సు నుంచి మంటలు

తప్పిన ముప్పు

విజయవాడ బస్‌స్టేషన్, న్యూస్‌టుడే: విజయవాడ బస్ స్టేషన్‌లో త్రుటిలో ప్రమాదం తప్పింది. ఆర్టీసీ సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం.. శనివారం సాయంత్రం గుంటూరు నుంచి ప్రయాణికులతో విజయవాడ పండిట్ నెహ్రూ బస్‌స్టేషన్ ఎరైవల్ బ్లాక్‌కు వచ్చిన ఆటోనగర్ డిపోనకు చెందిన ఏసీ బస్సు ప్రయాణికులను ప్లాట్‌ఫాం వద్ద దింపి బస్సు రివర్స్ చేస్తుండగా.. బస్సు వెనుక ఉన్న ప్రయాణికులు ఇంజిన్ నుంచి దట్టంగా పొగలు రావడంతో డ్రైవరుకు తెలిపారు. అప్రమత్తమైన డ్రైవర్ ఇంజిన్‌ను ఆపేశారు. దీంతో వెంటనే ఆర్టీసీ విజిలెన్స్ కానిస్టేబుల్ రెడ్డి అగ్నిమాపక యంత్రాల సాయంతో మంటలు అదుపులోకి తీసుకొచ్చారు. అనంతరం అక్కడికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలు పూర్తిగా అదుపులోకి తెచ్చారు. ప్రాణ నష్టం జరగకపోవడంతో ఆర్టీసీ అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. అనంతరం బస్సును అక్కడి నుంచి తరలించారు.



ఇంజిన్ నుంచి వస్తున్న పొగలు

అదుపు తప్పి.. బోల్తాపడి..

జి.కొండూరు, న్యూస్‌టుడే : లారీ అదుపు తప్పి బోల్తా పడి త్రుటిలో పెనుప్రమాదం తప్పిన సంఘటన ఎన్టీఆర్ జిల్లా జి.కొండూరు పోలీస్ స్టేషన్ పరిధిలో జాతీయ రహదారి-30పై చోటు చేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు.. తమిళనాడుకు చెందిన లారీతో డ్రైవర్ మారన్ రాయపూర్ వైపు నుంచి ఇనుప బార్‌ల లోడుతో తిరిగి తమిళనాడు వెళ్తున్నాడు. ఈ క్రమంలో జి.కొండూరు శివారు ఆత్కూరు అడ్డరోడ్డు చేరే సరికి శనివారం తెల్లవారు జామున 4 గంటల సమయంలో లారీ అదుపు తప్పి బోల్తా పడింది. ఈ సంఘటనలో డ్రైవర్‌కు స్వల్ప గాయాలు కాగా స్థానిక పోలీసులు సమాచారం అందుకుని ప్రథమ చికిత్స అందించారు. అతి వేగంతోనే వాహనం అదుపు తప్పి ప్రమాదం జరిగి ఉంటుందని పోలీసులు భావిస్తున్నారు. దీనిపై జి.కొండూరు ఎస్సై కె.సతీష్ కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సమయానికి రహదారిపై ఎవరూ ఉండక పోవడంతో పెను ప్రమాదం తప్పిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



ఇనుప బార్‌లతో తిరగబడిన లారీ

ఈనాడు ప్రతిభ
◆ https://pratibha.eenadu.net ◆ https://eenadupratibha.net
విద్య, ఉద్యోగ పరీక్షల ప్రత్యేకం!

ప్రాక్టీస్ బిట్స్ — ఇండియన్ ఎకానమీ

1. విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు (ఎఫ్‌డీఐ) రకాల్లో కింది వాటిలో సరికానిది?
1) క్షితిజ సమాంతర ఎఫ్‌డీఐ
2) నిలువు ఎఫ్‌డీఐ 3) నిర్వహణ ఒప్పందం
4) సమ్మేళన ఎఫ్‌డీఐ

2. ప్రస్తుతం ఆటోమేటిక్ మార్గం కింద బీమా రంగంలో ఎఫ్‌డీఐని ఎంతవరకు అనుమతిస్తున్నారు?
1) 49% 2) 54% 3) 100% 4) 74%

3. కిందివాటిలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులపై విధానాలు రూపొందించడానికి నోడల్ ఏజెన్సీగా పనిచేసేది?
1) ఆర్‌బీఐ 2) నాబార్డ్
3) పరిశ్రమలు, అంతర్గత వాణిజ్య ప్రమోషన్ శాఖ
4) సెబీ

4. విదేశాల్లో ఇప్పటికే స్థాపించిన వ్యాపారాన్ని కొనసాగించడాన్ని ఏ ఎఫ్‌డీఐగా పిలుస్తారు?
1) గ్రీన్‌ఫీల్డ్ పెట్టుబడి 2) బ్రౌన్‌ఫీల్డ్ పెట్టుబడి
3) వైట్‌ఫీల్డ్ పెట్టుబడి 4) ప్రైవేట్ కాదు

5. ప్రస్తుతం రైల్వే మౌలిక సదుపాయాల కోసం విదేశీ ప్రత్యక్ష పెట్టుబడి పరిమితి ఎంత?
1) 100% 2) 74% 3) 50% 4) 10%

సమాధానాలు: 1-3, 2-3, 3-3, 4-2, 5-1.

భూమిపై మానవుడితో పాటు ఇతర జీవరాశుల మనుగడకు సవాలు విసురుతున్న ప్రధాన సమస్యలు నేల, శబ్ద కాలుష్యాలు. ఇవి సృష్టించే అనర్థాలు, తెచ్చే ఆరోగ్య సమస్యలు తీవ్రంగా ఉంటాయి. పరిశ్రమలు, పంట పొలాలు, గృహ సంబంధిత వ్యర్థ పదార్థాలతో భూమి కలుషితమై పర్యావరణ సమతౌల్యతకు పెద్ద ముప్పుగా పరిణమిస్తోంది. అధిక స్థాయి ధ్వనులు సృష్టించే శబ్ద కాలుష్యం జీవనం, ఆరోగ్యంపై హానికర ప్రభావాన్ని చూపుతోంది. వాటి మూలాలు, ప్రతికూల ఫలితాలు, కొలమానాలు, నివారణ చర్యల గురించి పోటీ పరీక్షార్థులకు అవగాహన ఉండాలి. నియంత్రణ కోసం ఉన్న నియమాలు, ప్రభుత్వ చర్యలు, పౌరుల బాధ్యతలనూ తెలుసుకోవాలి.



మట్టిలో విషం.. చెవిలో హోరు!

జనరల్ స్టడీస్ — పర్యావరణ అంశాలు


నేల కాలుష్యం

నేలకి ఉన్న సహజ భౌతిక, రసాయనిక జీవలక్షణాలకు భంగం వాటిల్లడమే నేల కాలుష్యం. దీనితో భూమి ఉపరితల పొరల్లోని భౌతిక, రసాయనిక, జీవ లక్షణాల్లో అవాంఛనీయ మార్పులు వస్తాయి. వ్యవసాయ రంగంలో వాడుతున్న రసాయన ఎరువులు, క్రిమిసంహారకాలు నేలసారాన్ని తగ్గించి, సహజ నిర్మాణాన్ని దెబ్బతీస్తున్నాయి. ఒక అంగుళం మృత్తిక ఏర్పడటానికి కొన్ని వందల ఏళ్లు పడుతుంది. ఈ నేల కాలుష్యం రెండు రకాలుగా ఏర్పడుతుంది.

1) ధనాత్మక కాలుష్యం: మృత్తికలోకి ఇతర పదార్థాలు చేరినప్పుడు జరిగేది ధనాత్మక కాలుష్యం. వ్యవసాయ, పారిశ్రామిక వ్యర్థాలు, మురుగు, భారలోహాలు, ఘనవ్యర్థాలు ఈ రకమైన కాలుష్యానికి కారణమవుతాయి.

2) రుణాత్మక కాలుష్యం: మృత్తిక సహజ నిర్మాణం దెబ్బతినడం ద్వారా సంభవించేది రుణాత్మక కాలుష్యం. నేల క్రమక్షయం ద్వారా ఇది జరుగుతుంది. ముఖ్యంగా అడవుల నరికివేత, పశువులు అతిగా మేయడం, మైనింగ్, బ్లాస్టింగ్ లాంటి చర్యలు ఈ కాలుష్యానికి కారణమవుతాయి.

భూ కాలుష్యానికి కారణాలు



ఇళ్ల నుంచి విడుదలయ్యే వ్యర్థ పదార్థాలు.(ఉదా: గాజు, కాగితాలు, ఇనుప ముక్కలు), వివిధ రసాయనిక పదార్థాలు. నేలను అతిగా వాడటం, గాలి ద్వారా నేల క్రమక్షయం చెందుతుంది. పశువులు అతిగా మేయడం, నదీతీర ప్రాంతాలు ముఖ్యంగా ఎగువ ప్రాంతాల్లో చెట్లు నరకడం ద్వారా నేల క్రమక్షయం జరుగుతుంది. పరమాణు బాంబుల విస్ఫోటం, అణుపరీక్షలు, పరిశోధన, వైద్య రంగం, అణు విద్యుత్తు కేంద్రాల నుంచి విడుదలైన రేడియోధార్మిక వ్యర్థ పదార్థాలు భూ కాలుష్యానికి ముఖ్య కారణాలు. బురద, చెత్త, చెదారం, ప్లాస్టిక్, పాలిథిన్, ఖాళీ సీసాలు, డబ్బాలు మొదలైనవి చేరడం ద్వారా కూడా భూమి కలుషితమవుతుంది. నేలలోని వివిధ వ్యాధికారక సూక్ష్మ జీవులు, పురుగులు, వాటి సిద్ధబీజాలు కూడా భూమిని కలుషితం చేస్తాయి. గనుల తవ్వకం కూడా నేల కాలుష్యానికి కారణమవుతుంది.

నేల కాలుష్య నివారణ పద్ధతులు

రసాయన క్రిమిసంహారకాల వాడకాన్ని తగ్గించి జీవక్రియ సంహారకాల వాడకాన్ని ఎక్కువ చేయాలి. కృత్రిమ ఎరువులను తగినంతగా మాత్రమే వాడే విధంగా రైతులను విద్యావంతులను చేయాలి. జీవఎరువుల వాడకాన్ని పెంచాలి. ఆస్పత్రుల వ్యర్థ పదార్థాలను తొలగించడానికి అతి ఉష్ణ భస్మీకరణం పద్ధతి అవలంబించాలి. పెద్ద మొత్తంలో అడవుల పెంపకం చేపట్టాలి. వాడిన పదార్థాలతో తిరిగి వినియోగించగలిగే వస్తువులను రీసైక్లింగ్ ద్వారా తయారుచేయాలి. చెత్త లాంటి వ్యర్థాలను శక్తినిచ్చే చిన్న ముద్దలుగా మార్చి ఎరువులుగా వాడాలి.



శబ్ద కాలుష్యం

శబ్దకాలుష్యంతో మనిషికి అనేక దుష్ప్రభావాలు కలుగుతాయి. శబ్దం దాని పరిమితిని మించినప్పుడు ఆక్షేపించాల్సిన శబ్దం అవుతుంది. శబ్ద కాలుష్యాన్ని డెసిబెల్స్‌లో కొలుస్తారు.

శబ్దకాలుష్య కారకాలు: జనాభా, పరిశ్రమల పెరుగుదల, యంత్ర శక్తి వినియోగం, పట్టణీకరణ, వాహన రవాణా. శబ్దకాలుష్య కారకాలు రెండు రకాలుగా ఉన్నాయి.

1) పారిశ్రామిక శబ్దకాలుష్యం



దీనిని ఆక్యుపేషనల్ శబ్దం అని కూడా అంటారు. ధ్వని ఉత్పత్తికి ప్రధాన కారణం పరిశ్రమల పెరుగుదల. పారిశ్రామిక వాతావరణంలో వివిధ లోహాల క్రషింగ్, డ్రిల్లింగ్, బ్లాస్టింగ్, బ్రోచింగ్, స్టాపింగ్‌ల వల్ల లోహాలకు రంధ్రాలు చేయడం, ఇతర కారణాల వల్ల శబ్దకాలుష్యం సంభవిస్తుంది. పరిశ్రమల్లో పనిచేసే వారు, ఆ పరిసరాల్లో నివసించే ప్రజలు ఈ ధ్వని కాలుష్యానికి గురవుతుంటారు. పరిశ్రమల్లో వినియోగించే యంత్రాలు, సైరన్ కూడా తీవ్ర శబ్దాలు చేస్తాయి.

2) పారిశ్రామికేతర శబ్ద కాలుష్యం



ఆధునిక కాలంలో ఈ రకమైన శబ్దకాలుష్య తీవ్రత బాగా పెరిగింది. భారత్ లాంటి అభివృద్ధి చెందుతున్న దేశాల్లో దానిని నివారించే చర్యలు, నియమాలు ఉన్నప్పటికీ వాటి అమలు సరిగా లేదు.

ఎ) వాహన శబ్ద కాలుష్యం: వాహనాలను నడిపేటప్పుడు ఇంజిన్, నియంత్రణ పరిధిలోని హారన్‌లు చేసే శబ్దాలు 70-80 డెసిబెల్స్ తీవ్రతతో ఉంటాయి. ఫలితంగా వాహనాలతో శబ్ద కాలుష్యం ఏర్పడుతుంది. వాహన సాంద్రత పెరిగిన కొద్దీ అది మరింత ప్రమాదకరంగా మారుతుంది. మెరుగైన ట్రాఫిక్ నిర్వహణ లేకపోతే వాహన శబ్ద కాలుష్య సమస్య ఉద్ధృతమవుతుంది. జీవితకాలం పూర్తయిన వాహనాల వినియోగం కూడా ఈ కాలుష్యానికి కారణమవుతోంది.

బి) గృహశబ్ద కాలుష్యం: వివిధ ఎలక్ట్రానిక్, ఎలక్ట్రికల్ పరికరాలు పెరగడంతో గృహశబ్ద కాలుష్యం పెరిగింది. టీవీలు, హోం థియేటర్‌లు, రిఫ్రిజిరేటర్‌లు, వాషింగ్ మిషిన్లు, మొబైల్స్ లాంటివి స్వల్ప నుంచి తీవ్ర స్థాయి శబ్ద కాలుష్యాన్ని కలిగిస్తున్నాయి.

సి) సంప్రదాయ శబ్దకాలుష్యం: పండగలకు బాణాసంచా కాల్చడం, ప్రార్థనా ప్రదేశాల నుంచి పుట్టే శబ్దం, వ్యక్తిగత కార్యక్రమాలకు వినియోగించే లౌడ్‌స్పీకర్ అధిక కాలుష్యానికి కారణమవుతున్నాయి. వీటికి అదనంగా రాజకీయ సమావేశాలు, కిక్కిరిసిన మార్కెట్‌లు, డౌన్‌టౌన్ ప్రాంతాలు కూడా శబ్ద కాలుష్య కారకాలే.

శబ్ద కాలుష్యంతో నష్టాలు: తలనొప్పి, వాంతులు, వికారం, చెవినొప్పి, అసౌకర్యం చెవిలో గుయ్‌మనే శబ్దం, శరీరంలో గగుర్పాటు, భయం, ఆతృత, చిరాకు, కోపం, రక్త నాళాల సంకోచం, గుండెదడ, రక్త పీడనం అధికమవడం, ఒత్తిడి పెరుగుతుంది. తీవ్ర స్థాయిలో కుషింగ్స్ సిండ్రోమ్ సంభవిస్తుంది. చిన్నారుల్లో మెదడు అభివృద్ధి దెబ్బతినడం వెనుక దీర్ఘకాలిక శబ్ద కాలుష్య ప్రభావం ఉన్నట్లు గుర్తించారు.



రచయిత: ఈదుబిల్లి వేణుగోపాల్

TENTH English — A Letter to God

Reading Comprehension: (1-5) Read the following passage carefully.

All through the night, Lencho thought only of his one hope: the help of God, whose eyes, as he had been instructed, see everything, even what is deep in one's conscience. Lencho was an ox of a man, working like an animal in the fields, but still, he knew how to write. The following Sunday, at daybreak, he began to write a letter which he himself would carry to town and place in the mail. It was nothing less than a letter to God. "God," he wrote, "if you don't help me, my family and I will go hungry this year. I need a hundred pesos in order to sow my field again and to live until the crop comes, because the hailstorm...." **(A Letter to God)**

Now, answer the following questions. 5 x 2 = 10 M

1. **Why did Lencho think of God all through the night?**
A: He believed God could help him in difficult times.
2. **What does the phrase "Lencho was an ox of a man" imply?**
A: Very strong and hardworking
3. **Why did Lencho write a letter to God? ( )**
A) To thank him for the rain
B) To request money to sow his field and survive
C) To complain about the hailstorm
A: B) To request money to sow his field and survive
4. **How much money did Lencho request in his letter? ( )**
A) Fifty pesos
B) One hundred pesos
C) Two hundred pesos
A: B) One hundred pesos
5. **What does the text reveal about Lencho's belief in God? ( )**
A) He believed God could see everything and help him
B) He thought God would punish him for his sins
C) He did not believe in God
A: A) He believed God could see everything and help him.

Final Exams-2026 IMPORTANT Q & A

For more IMP Q & A



Writer: A.Madhu Babu

ఎంబీబీఎస్ రెండో ఏడాది పరీక్ష ఫలితాల వెల్లడి

ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం, న్యూస్‌టుడే: ఈ ఏడాది నవంబరు/డిసెంబరు నెలల్లో జరిగిన ఎంబీబీఎస్ రెండో సంవత్సరం పరీక్ష ఫలితాలు విడుదలయ్యాయి. పత్రాలు వ్యక్తిగత పరిశీలన కోరే అభ్యర్థులు సబ్జెక్టుకు రూ.2000 చొప్పున జనవరి మూడో తేదీలోగా చెల్లించి దరఖాస్తు చేసుకోవాలని విజయవాడ డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ సీహెచ్ శ్రీనివాసరావు తెలిపారు. ఫలితాలు విశ్వవిద్యాలయం వెబ్‌సైట్‌లో పొందుపర్చారు.

ముగిసిన పీజీ మెడికల్ రెండో విడత కౌన్సెలింగ్

ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం, న్యూస్‌టుడే: ప్రస్తుత (2025-26) విద్యా సంవత్సరానికి రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు వైద్య కళాశాలల్లో అందుబాటులో ఉన్న పీజీ మెడికల్ కన్వీనర్ కోటా సీట్లకు నిర్వహించిన రెండో విడత కౌన్సెలింగ్ ముగిసింది. నాన్ సర్వీస్ విభాగంలో మొత్తం 1342 సీట్లు భర్తీ కాగా.. ఇంకా 146 సీట్లు మిగిలి ఉన్నాయి. ఇన్ సర్వీస్ విభాగంలో మొత్తం 164 సీట్లు భర్తీ కాగా, ఇంకా 253 సీట్లు మిగిలి ఉన్నట్లు విశ్వవిద్యాలయం వర్గాలు పేర్కొన్నాయి. సీట్లు పొందిన అభ్యర్థులు ఈనెల 31వ తేదీ మధ్యాహ్నం 3 గంటల్లోగా ఆయా కళాశాలల్లో చేరాలి.

యాజమాన్య కోటాలో 590 సీట్ల భర్తీ

ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం, న్యూస్‌టుడే: ప్రస్తుత (2025-26) విద్యా సంవత్సరానికి రాష్ట్రంలోని ప్రైవేటు వైద్య కళాశాలల్లో అందుబాటులో ఉన్న పీజీ మెడికల్ యాజమాన్య కోటా సీట్లకు నిర్వహించిన రెండో విడత కౌన్సెలింగ్‌లో 590 సీట్లు భర్తీ అయ్యాయి. ఇంకా 373 సీట్లు మిగిలాయి. సీట్ల కేటాయింపులో సందేహాలుంటే ఈ నెల 28వ తేదీ ఉదయం 11.30 గంటల్లోగా ఆన్‌లైన్‌లో విశ్వవిద్యాలయానికి విన్నవించాలని సూచించారు.

● మరో వైపు పీజీ మెడికల్ కన్వీనర్ కోటా రెండో విడత కౌన్సెలింగ్‌లో సీట్ మ్యాట్రిక్స్‌లో పేర్కొన్న సీట్లకు విరుద్ధంగా కేటాయింపులు జరిగాయని అభ్యర్థులు విజ్ఞప్తి చేస్తున్నారు. మెరిటోరియస్ కేటగిరీ (ఎం.ఆర్.సి) కింద పేర్కొన్న విధంగా కాకుండా ఆ కేటగిరీలకు సీట్లు కేటాయించలేదని విశ్వవిద్యాలయం వర్గాలు పేర్కొన్నాయి.

నేడు విద్యుత్తు బిల్లులు చెల్లించొచ్చు

సూర్యారావుపేట, న్యూస్‌టుడే: సెలవు దినమైనప్పటికీ ఆదివారం జిల్లాలోని అన్ని విద్యుత్తు బిల్లుల వసూలు కేంద్రాలు తెరిచి ఉంటాయని ఎస్ఈ యు.హనుమయ్య తెలిపారు. వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అలాగే ఏపీ సీపీడీసీఎల్ కస్టమర్ యాప్‌లో బిల్, ఫోన్ నంబర్‌లు నమోదు చేసుకుని కట్టవచ్చు. గూగుల్ పే, ఫోన్ పే, అమెజాన్ పే, బిల్ డెస్క్ యాప్‌ల ద్వారా బిల్లులు చెల్లించవచ్చని ఎస్.ఈ. పేర్కొన్నారు.

రైతు సంఘాల 'చలో లోక్‌భవన్' అడ్డగింత



నిరసన కార్యక్రమంలో నాయకులు తదితరులు

విజయవాడ(గాంధీనగర్), న్యూస్‌టుడే : మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని రద్దు చేయడం సరికాదని.. కేంద్ర ప్రభుత్వం ఆ చట్టాన్ని యథాతథంగా అమలు చేయాలని మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు డిమాండ్ చేశారు. రైతు సంఘాల ఆధ్వర్యంలో శనివారం ధర్నా చౌక్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. చట్టం స్థానంలో పేదల హక్కులను రద్దు చేసి, 20 కోట్ల మంది గ్రామీణులకు కేంద్రం తీరని అన్యాయం చేసిందని ధ్వజమెత్తారు. ఇప్పటికే ఎన్నో పోరాటాలు చేసి సాధించుకున్న కార్మిక చట్టాలను రద్దు చేసి.. ఆ స్థానంలో నాలుగు కొత్త చట్టాలను తీసుకొచ్చిందని దుయ్యబట్టారు. ఇప్పుడు మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీని రద్దు చేయడం దుర్మార్గమన్నారు. దానిని తిరిగి అమలు చేయాలని, లేనిపక్షంలో ఆందోళనలను ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం 'చలో లోక్‌భవన్' కార్యక్రమంలో భాగంగా రైతు సంఘాల నాయకులు ధర్నా చౌక్ నుంచి లోక్‌భవన్‌కు బయలుదేరడంతో పోలీసులు అడ్డుకున్నారు. ఈ క్రమంలో ఇరు వర్గాల మధ్య తోపులాట జరిగింది. ధర్నా చౌక్ నుంచి లోక్‌భవన్ వెళ్లే మార్గంలో పోలీసులు బారికేడ్లు ఏర్పాటు చేశారు. అనంతరం పోలీసులు రైతు సంఘాల నాయకులతో చర్చించి, కొంత మంది నాయకులను గవర్నర్ వద్దకు పంపడంతో ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘాల నాయకులు వి.వెంకటేశ్వర్లు, ఆవుల శేఖర్, కె.ప్రభాకరరెడ్డి, కె.వి.వి.ప్రసాద్, డి.సుబ్బారావు, కోటేశ్వరరావు, ఎం.హరిబాబు, వై.కేశవరావు, ఎం.సూర్యనారాయణ, వి.శివనాగరాణి, కోట కల్యాణ్, ఇ.అప్పారావు, పిల్లి రామకృష్ణ పాల్గొన్నారు.

'రక్తాభిషేకాలతో రాక్షసుల్లా ప్రవర్తిస్తున్నారు'



శిలాఫలకం ఆవిష్కరిస్తున్న మంత్రి రవీంద్ర, ఎమ్మెల్యే కృష్ణప్రసాద్ తదితరులు

బంటుమిల్లి, న్యూస్‌టుడే: రాష్ట్రాన్ని అన్ని విధాలుగా కూటమి ప్రభుత్వం అభివృద్ధి చేస్తుంటే.. వైకాపా వారు రక్తాభిషేకాలతో రాక్షసుల్లా ప్రవర్తిస్తున్నారని మంత్రి కొల్లు రవీంద్ర విమర్శించారు. శనివారం బంటుమిల్లి మండలం చోరంపూడిలో సుమారు రూ.2 కోట్లతో నిర్మించిన సచివాలయం, రైతు సేవా కేంద్రం భవనాలు, సీసీ రహదారులు, ప్రహరీలు తదితర అభివృద్ధి పనులను పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్‌తో కలిసి ప్రారంభించారు. అనంతరం నిర్వహించిన సభలో మంత్రి మాట్లాడుతూ.. తాము అభివృద్ధి మంత్రం జపిస్తుంటే.. వైకాపా వారు రప్పారప్పా అంటున్నారని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో అమలవుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను చూసి ఓర్వలేక ప్రభుత్వాన్ని ఇరకాటంలో పెట్టాలనుకొని కల్తీ మద్యం కేసులో తానే ఇరుక్కున్నాడని మాజీ మంత్రి జోగి రమేశ్‌ను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. పింఛన్ల రూపంలో సుమారు రూ.50వేల కోట్లు ప్రజలకు అందించామని పేర్కొన్నారు. తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, ఉచిత గ్యాస్, బస్సు ప్రయాణం లాంటి సూపర్ సిక్స్ హామీలను హిట్ చేశామన్నారు. 2026 నాటికి బందరు పోర్టు అందుబాటులోకి వస్తుందని తెలిపారు. 216 జాతీయ రహదారిని ఆరు వరుసలుగా విస్తరించనున్నట్లు చెప్పారు. త్వరలో అర్హులకు ఇళ్ల పట్టాలు ఇస్తామని తెలిపారు. మల్లేశ్వరం ఏఎంసీ ఛైర్మన్ తులసీరావు, బొర్రా కాశీ, నాగలక్ష్మి, సత్యనారాయణ, రంగనాథ్, సురేష్, వీరబాబు, వెంకటరమణ, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

'మద్యం దుకాణాల సమయం కుదించాలి'

రాఘవయ్యపార్క్ కూడలి(కృష్ణలంక), న్యూస్‌టుడే : డిసెంబరు 30, 31, జనవరి 1వ తేదీల్లో మద్యం దుకాణాల సమయాన్ని కుదించాలని ఐద్వా రాష్ట్ర కమిటీ.. ప్రభుత్వాన్ని కోరింది. విజయవాడలోని బాలోత్సవ భవన్‌లో శనివారం నిర్వహించిన సమావేశంలో సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కె.శ్రీదేవి, వి.సావిత్రి మాట్లాడారు. ఆ మూడు రోజుల పాటు అర్ధరాత్రి వరకు ఉంచకుండా సాయంత్రం 7 గంటలకే మూసివేయాలని ఎక్సైజ్ శాఖ మంత్రి, కమిషనర్లకు విజ్ఞప్తి చేశారు. నూతన సంవత్సర వేడుకల సందర్భంగా ఏటా ప్రమాదాల రూపంలో పలువురు మృతి చెందుతున్నారని చెప్పారు. ప్రమాదాల్లో అధికంగా యువత, పిల్లలు బలవుతున్నారని, మహిళలు ఇళ్ల నుంచి బయటకు రాలేని పరిస్థితులు నెలకొంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మద్యం వల్ల కుటుంబాల్లో విషాదం నెలకొంటోందని పేర్కొన్నారు. మద్యం వినియోగాన్ని నియంత్రించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. రాష్ట్ర కమిటీ సభ్యురాలు టి.శ్రీదేవి పాల్గొన్నారు.

10, 11వ తేదీల్లో రాష్ట్ర మహాసభలు



ప్రచార పత్రాలు విడుదల చేస్తున్న ఆంజనేయులు, కృష్ణ, లక్ష్మి, రివేరా, పోలారీ తదితరులు

విజయవాడ (గాంధీనగర్), న్యూస్‌టుడే : జనవరి 10, 11 తేదీల్లో పౌరహక్కుల సంఘం రాష్ట్ర మహా సభలు తిరుపతిలో నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి టి.ఆంజనేయులు, కోశాధికారి పి.రాజారావు తెలిపారు. కార్యక్రమ గోడ పత్రాలను శనివారం వారు విజయవాడ ప్రెస్ క్లబ్‌లో విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రాజ్యాంగానికి వ్యతిరేకంగా సాగుతున్న ప్రభుత్వ నిర్బంధాన్ని ఎదురించి పౌరహక్కుల రక్షణకు ప్రతి ఒక్కరూ నడుం బిగించాలని కోరారు. ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించే ఈ సభలను అమరవీరుల బంధుమిత్రుల సంఘం అధ్యక్షుడు రాఘవశర్మ ప్రారంభిస్తారని తెలిపారు. తొలి రోజు జస్టిస్ చంద్రకుమార్, హేమలతకుమార్, ప్రొఫెసర్ హరగోపాల్ తదితర ప్రముఖులు పాల్గొని ప్రసంగిస్తారని చెప్పారు. 'రాజ్యాంగం, నిర్బంధం' అనే అంశంపై నిర్వహించే సభలో సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు వి.చిట్టిబాబు, చిలకా చంద్రశేఖర్ తదితరులు పాల్గొంటారని వివరించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు అరసవల్లి కృష్ణ, మంజరి లక్ష్మి, కె.కృష్ణ, రివేరా, కె.పొలారీ తదితరులు పాల్గొన్నారు.

నగరంలో పాలిటెక్నిక్ కళాశాలల ఆటల పోటీలు



గోడ పత్రాలు విడుదల చేస్తున్న ప్రిన్సిపల్ విజయసారథి తదితరులు

కరెన్సీనగర్, న్యూస్‌టుడే: ఉమ్మడి కృష్ణా జిల్లా ప్రభుత్వ, ప్రైవేటు పాలిటెక్నిక్ కళాశాలల విద్యార్థులకు ఈ నెల 29, 30 తేదీల్లో ఆటల పోటీలు నిర్వహిస్తున్నట్లు విజయవాడ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ ఎం.విజయసారథి తెలిపారు. శనివారం కళాశాలలో గోడపత్రిక ఆవిష్కరించారు. పోటీలను విజయవాడ పార్లమెంటు సభ్యుడు కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ ప్రారంభిస్తారని ఆయన తెలియజేశారు. గోడపత్రిక ఆవిష్కరణలో అన్ని ట్రేడుల విభాగాధిపతులు ఎ.శివప్రసాద్, బి.శైలజ, బాబూరావు, ఐ.వెంకట్రావు, కుమార్ బాబు, పీడీ పద్మావతి పాల్గొన్నారు.

దోమల కాయిల్ నిప్పుతో ఒళ్లు కాలి బాలుడి మృతి



సమర్పణ పాల్ (పాత చిత్రం)

కృష్ణలంక, న్యూస్‌టుడే: దోమల కాయిల్ కారణంగా ఒంటికి నిప్పు అంటుకుని గాయాలపాలై ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బాలుడు మృతి చెందిన ఘటనపై కృష్ణలంక స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగించే అనిల్ కుమార్, అరుణ కుమారి స్థానిక తారకరామానగర్‌లో నివాసం ఉంటారు. ఇంట్లో దోమలు అధికంగా ఉండడంతో ఈ నెల 21వ తేదీ రాత్రి కాయిల్ వెలిగించారు. కుమారుడు సమర్పణ పాల్(9) పడుకున్న మంచం కింద పెట్టారు. ప్రమాదవశాత్తూ ఆ నిప్పు దుప్పటికి అంటుకోవడంతో మంటలు రేగి కుమారుడి ముఖం, చేతులు, పొట్టకు గాయాలయ్యాయి. వెంటనే ఆటోలో చికిత్స నిమిత్తం బాలుడిని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శనివారం సాయంత్రం మృతి చెందాడు. ఆసుపత్రి నుంచి అందిన సమాచారం మేరకు వివరాలు సేకరించిన కృష్ణలంక పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

'20 మంది ఎంపీలను ఇస్తే విశాఖ ఉక్కును కాపాడతాం'



మాట్లాడుతున్న జగ్గారెడ్డి. పక్కన నరసింహారావు, మస్తాన్‌వలీ

విజయవాడ (గవర్నర్‌పేట), న్యూస్‌టుడే : ఆంధ్రుల హక్కు అయిన విశాఖ ఉక్కుపై ప్రధాని మోదీ కన్ను పడిందని టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు జగ్గారెడ్డి ఆరోపించారు. ఆంధ్రుల ఆస్తిని కార్పొరేట్లకు కట్టబెట్టాలని భాజపా చూస్తోందని విమర్శించారు. కాంగ్రెస్‌కు 20 మంది ఎంపీలను ఇస్తే.. కర్మాగారాన్ని కాపాడతామని.. రాష్ట్ర ప్రజలు పునరాలోచించాలని విజ్ఞప్తి చేశారు. శనివారం ఆయన విజయవాడలోని ఆంధ్రరత్న భవన్‌లో విలేకరులతో మాట్లాడారు. విశాఖ ఉక్కును కాంగ్రెస్ ప్రభుత్వం 1978లో ఏర్పాటు చేసిందని, అప్పట్లో దాని విలువ రూ.14వేల కోట్లని చెప్పారు. ఇప్పుడు దాని విలువ రూ.2.5 లక్షల కోట్లని వెల్లడించారు. కార్మికులకు బలవంతంగా వీఆర్ఎస్ ఇప్పిస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రాన్ని విడగొట్టారన్న కోపంతో ఏపీ ప్రజలు కాంగ్రెస్‌ను దూరం పెట్టారని చెప్పారు. రాష్ట్ర విభజన చేయాలని జగన్, చంద్రబాబులు లేఖలు ఇచ్చారని.. తెలంగాణ గడ్డపై నుంచి తాను మాత్రమే రాష్ట్రాన్ని విభజించవద్దని గట్టిగా మాట్లాడానని గుర్తు చేశారు. మోదీతో చంద్రబాబుకు, జగన్‌కు స్నేహం ఉందని.. ఇద్దరూ విశాఖ ఉక్కు గురించి పట్టించుకోలేదన్నారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్.. ఉక్కు కార్మికులకు బాసటగా నిలిచి, ఇప్పుడు పట్టించుకోవడం లేదన్నారు. తాను ప్రధాని అయిన తర్వాత మొదటి సంతకం విశాఖ ఉక్కు రక్షణపై చేస్తానని రాహుల్ గాంధీ హామీ ఇచ్చారని గుర్తు చేశారు. సమావేశంలో నాయకులు మస్తాన్‌వలీ, నరహరిశెట్టి నరసింహారావు, వి.గురునాథం, కొలనుకొండ శివాజీ తదితరులు పాల్గొన్నారు.

అంతర్ జిల్లాల రగ్బీ పోటీలకు కృష్ణా జట్లు



ఎంపికైన క్రీడాకారులతో హరికృష్ణ, వ్యాయామోపాధ్యాయులు

విజయవాడ క్రీడలు: కర్నూలులో ఈ నెల 29 నుంచి జరిగే రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ బాలబాలికల రగ్బీ ఛాంపియన్‌షిప్‌లో తలపడే ఉమ్మడి కృష్ణా జిల్లా జట్లను శనివారం ప్రసాదంపాడులోని వివేకానంద హైస్కూల్‌లో ఎంపిక చేశామని జిల్లా రగ్బీ సంఘం అధ్యక్షుడు బొప్పన హరికృష్ణ, కార్యదర్శి ఎన్.చంద్రకళ తెలిపారు. మొత్తం 65 మంది క్రీడాకారులు ఎంపిక పోటీలో పాల్గొన్నారు. సంతోష్, భగీరథ, హేమంత్ (జడ్పీహెచ్ స్కూల్, నున్న), జగదీష్, అభిషేక్, మురళీ విజయ్ (వివేకానంద హైస్కూల్), వీరాస్వామి, దుర్గాప్రసాద్ (విజయమేరీ హైస్కూల్), చేతన్ సిన్హా (ఉంగుటూరు), శ్రీకర్ (గన్నవరం), ప్రవాష్ (వీరవల్లి) బాలుర జట్టులో స్థానం సాధించారు. చిట్టెమ్మ, వీణామాధురి, మహాలక్ష్మి, లావణ్య (జడ్పీహెచ్ స్కూల్, నున్న), అజ్మత్, మోక్షశ్రీ (వివేకానంద హైస్కూల్), సుష్మశ్రీ, జ్ఞాన లికిష, మహేశ్వరి (ఉంగుటూరు), హేమశ్రీ (ఎంఎస్ఆర్ స్కూల్), సంజనాదేవి (వీరవల్లి), కావ్యశ్రీ (జడ్పీహెచ్ స్కూల్, నిడమానూరు) బాలికల జట్టులో స్థానం సాధించారు. వ్యాయామోపాధ్యాయులు పాల్గొన్నారు.

మోసగించిన వ్యాపారులపై కేసు

విద్యాధరపురం, న్యూస్‌టుడే: పాతబస్తీ చల్లం రాజు వీధికి చెందిన మెడికల్ దుకాణ నిర్వాహకులు కృష్ణమోహన్, పూర్ణచంద్రరావు తమ వద్ద రూ.1,12,79,335 విలువ చేసే మందులకు డబ్బులు ఇవ్వకుండా మోసం చేశారని సముద్రాల గోవిందరావు అనే వ్యక్తి పోలీసులకు శనివారం ఫిర్యాదు చేశారు. ప్రభుత్వానికి టెండరు ద్వారా సరఫరా చేస్తే మూడు నెలలకు ఒకసారి డబ్బులు వస్తాయని నమ్మించి వారిద్దరూ తన నుంచి ఆరు సంవత్సరాలుగా మందులు తీసుకున్నారు. అడిగిన ప్రతి సారి ప్రభుత్వం నుంచి డబ్బులు రావాలని.. రాగానే ఇస్తామని నమ్మించి మోసం చేసినట్లు పోలీసులకు తెలిపారు. ఈమేరకు భవానీపురం సీఐ ఉమామహేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నకిలీ మద్యం కేసులో జినేష్, శిబుకు రిమాండ్

ఈనాడు, అమరావతి: నకిలీ మద్యం కేసులో అన్నమయ్య జైలులో ఉన్న ఇద్దరు నిందితులను పీటీ వారెంట్‌పై శనివారం సాయంత్రం విజయవాడలోని ఎక్సైజ్ కోర్టులో న్యాయాధికారి ఎదుట హాజరుపర్చారు. ములకలచెరువులో నకిలీ మద్యం కేసులో అరెస్టు అయిన జినేష్ (ఏ24), శిబు (ఏ25)లు భవానీపురం ఎక్సైజ్ స్టేషన్‌లో నమోదైన కేసులో నిందితులుగా ఉన్నారు. ఈ నేపథ్యంలో వీరిని ఇక్కడి కోర్టులో ప్రవేశపెట్టారు. వీరు గోవాలో బాలాజీకి స్పిరిట్‌ను సరఫరా చేశారు. నిందితులకు న్యాయాధికారి ఈనెల 31వ తేదీ వరకు రిమాండ్ విధిస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. వీరిని విజయవాడ కారాగారానికి తరలించారు.

ఛాంపియన్

నేడే భారత మహిళలతో నాలుగో టీ20

లంక ఆపగలదా?

రాత్రి 7 గంటల నుంచి



తిరువనంతపురం

శ్రీలంక మహిళల క్రికెట్ జట్టుతో అయిదు టీ20ల పోరులో వరుసగా మూడు మ్యాచ్‌లు గెలిచి ఇప్పటికే సిరీస్ చేజిక్కించుకుంది భారత్. ఇక మిగిలిన రెండు మ్యాచ్‌లూ నెగ్గి సిరీస్‌ను క్లీన్‌స్వీప్ చేయాలన్న లక్ష్యంతో ఉన్న హర్మన్‌ప్రీత్ బృందం.. ఆదివారం నాలుగో టీ20కి సిద్ధమైంది. అన్ని రంగాల్లోనూ ఆధిపత్యం ప్రదర్శిస్తున్న భారత్‌ను ఆపడం లంక కష్టమే. తొలి మూడు టీ20ల్లో స్పిన్నర్ దీప్తిశర్మ, పేసర్ రేణుక సింగ్ అదరగొట్టారు. ఇప్పటికే చెరో నాలుగు వికెట్లు ఖాతాలో వేసుకున్నారు. యువ స్పిన్నర్ వైష్ణవి శర్మ కూడా చక్కని నియంత్రణతో బౌలింగ్ చేస్తూ ప్రత్యర్థిని కట్టడి చేస్తోంది. ఈ సిరీస్‌లో ఏ లంక బ్యాటర్ అర్ధసెంచరీ చేయలేదంటేనే భారత బౌలర్లు ఎంత కట్టుదిట్టంగా బంతులేశారో అర్థం చేసుకోవచ్చు. టాస్ రూపంలోనూ ప్రతిసారీ భారత్‌కు అదృష్టం కలిసొస్తోంది. తొలి మూడు మ్యాచ్‌ల్లో హర్మన్‌ప్రీత్ టాస్ గెలిచింది. భారత్ లక్ష్యాన్ని ఛేదించి విజయాన్ని అందుకుంది. ఛేదనలో మంచు ప్రభావం ఉండడంతో నాలుగో టీ20 లోనూ టాస్ కీలకం కానుంది. బ్యాటింగ్‌లో షెఫాలివర్మ, జెమీమా రోడ్రిగ్స్ రాణిస్తుండగా.. స్టార్ బ్యాటర్ స్మృతి మంధాన విఫలమవుతోంది. గత మూడు టీ20ల్లో ఆమె 13.33 సగటుతో 25, 14, 1 స్కోర్లే చేయగలిగింది. ఇప్పటికే సిరీస్ ఫలితం తేలిన నేపథ్యంలో నాలుగో టీ20లో కమలిని, హర్లీన్ డియోల్‌ను తుది జట్టులో ఆడించే అవకాశాలున్నాయి. వచ్చే ఏడాది టీ20 ప్రపంచకప్ ఉండడంతో జట్టు కూర్పుపై ఒక అవగాహనకు రావడానికి టీమ్ మేనేజ్‌మెంట్ భావిస్తోంది. ఇందుకోసం భిన్నమైన మేళవింపులను ప్రయత్నిస్తోంది. మరోవైపు వరుసగా మూడు మ్యాచ్‌ల్లో ఓడి ఆత్మవిశ్వాసం సన్నగిల్లిన లంక.. నాలుగో టీ20లో అయినా పుంజుకుంటుందేమో చూడాలి. చమరి ఆటపట్టు సారథ్యంలోని లంకను ఈ సిరీస్‌లో బ్యాటింగ్ వైఫల్యం వెంటాడుతోంది. చమరితో పాటు హాసిని పెరీరా, కవిషా, హర్షిత రాణించాలని ఆ జట్టు కోరుకుంటోంది. బ్యాటింగ్‌తో పోలిస్తే బౌలింగ్‌లో లంక మెరుగ్గా రాణిస్తోంది. పెద్దగా అనుభవం లేకపోయినా లంక బౌలర్లు.. భారత స్టార్లను కట్టడి చేశారు.

భారత కెప్టెన్‌గా ఆయుష్

అండర్-19 ప్రపంచకప్ జట్టు



ఆయుష్ మాత్రే

ముంబయి

అండర్-19 వన్డే ప్రపంచకప్‌లో పాల్గొనే భారత జట్టుకు ఆయుష్ మాత్రే కెప్టెన్‌గా ఎంపికయ్యాడు. జనవరి 15న ఆరంభమయ్యే ఈ మెగా టోర్నీలో పాల్గొనే 15 మంది సభ్యుల భారత జట్టును సెలక్టర్లు శనివారం ప్రకటించారు. యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ కూడా ఈ టీమ్‌లో ఉన్నాడు. జింబాబ్వే, నమీబియా ఆతిథ్యం ఇచ్చే ఈ కప్‌లో 16 జట్లు పోటీపడుతున్నాయి. అయిదుసార్లు ఛాంపియన్ భారత్.. గ్రూప్-ఎలో బంగ్లాదేశ్, న్యూజిలాండ్, అమెరికాతో పోటీపడనుంది. జనవరి 15న అమెరికాతో మ్యాచ్‌తో భారత్ టోర్నీని మొదలుపెట్టనుంది. 17న బంగ్లాదేశ్.. 24న న్యూజిలాండ్‌తో తలపడనుంది. ఈ టోర్నీకి ముందు దక్షిణాఫ్రికాలో జనవరి 3న మొదలయ్యే మూడు వన్డేల సిరీస్‌కు కూడా సెలక్టర్లు జట్టును ఎంపిక చేశారు. ఈ టీమ్‌కు సూర్యవంశీ కెప్టెన్.

అండర్-19 ప్రపంచకప్‌కు భారత జట్టు: ఆయుష్ మాత్రే (కెప్టెన్), విహాన్ మల్హోత్రా (వైస్ కెప్టెన్), వైభవ్ సూర్యవంశీ, ఆరోన్ జార్జ్, వేదాంత్ త్రివేది, అభిజ్ఞాన్ కుందు, హర్‌వంశ్ సింగ్, అంబరీష్, కనిష్క్ చౌహాన్, ఖిలాన్ పటేల్, మహ్మద్ ఇనాన్, హెనిల్ పటేల్, దీపేశ్, కృష్ణన్ కుమార్, ఉద్ధవ్ మోహన్.

దక్షిణాఫ్రికాతో వన్డేలకు: వైభవ్ సూర్యవంశీ (కెప్టెన్), ఆరోన్ జార్జ్ (వైస్ కెప్టెన్), వేదాంత్, అభిజ్ఞాన్, హర్‌వంశ్, అంబరీష్, కనిష్క్, ఖిలాన్ పటేల్, ఇనాన్, హెనిల్ పటేల్, దీపేశ్, కృష్ణన్ కుమార్, ఉద్ధవ్ మోహన్, యువరాజ్ గోహిల్, రాహుల్ కుమార్.

వచ్చాడు మెరుపులా..



సకిబుల్ గని

ఈటీవీ భారత్

విజయ్ హజారే ట్రోఫీలో బిహార్-అరుణాచల్ ప్రదేశ్ మ్యాచ్! అందరూ యువ సంచలనం వైభవ్ సూర్యవంశీపైనే దృష్టి పెట్టారు. అంచనాలు అందుకుంటూ ఈ 14 ఏళ్ల బిహార్ బ్యాటర్ మెరుపు ఇన్నింగ్స్ ఆడాడు. డబుల్ సెంచరీ ముంగిట వెనుదిరిగాడు. అతడు ఔటైన తర్వాత కూడా బిహార్ పరుగుల వరద పారించింది. 574 పరుగులు చేసి లిస్ట్-ఎ క్రికెట్లో ప్రపంచ రికార్డు నెలకొల్పింది. వైభవ్ తుపాన్ వెలిసినా.. సకిబుల్ గని (128) సునామిలా విరుచుకుపడడమే ఇందుకు కారణం. కేవలం 32 బంతుల్లోనే సెంచరీ చేసిన అతడు.. లిస్ట్-ఎ క్రికెట్లో వేగంగా శతకం సాధించిన భారత క్రికెటర్‌గా ఘనత సాధించాడు. బిహార్‌కు చెందిన సకిబుల్ ఈ ఒక్క ఇన్నింగ్స్‌లో భారత క్రికెట్లో ప్రకంపనలు రేపాడు.

బిహార్‌లోని అగర్వాకు చెందిన సకిబుల్ మధ్య తరగతి కుటుంబం నుంచి వచ్చాడు. అతడి తండ్రి మహ్మద్ మనాన్ గని క్రీడా పరికరాల వ్యాపారి. అతడి సోదరుడు ఫైజల్‌ను చూసే సకిబుల్ కూడా క్రికెట్ బాట పట్టాడు. ఫైజల్ ఫస్ట్‌క్లాస్ క్రికెటర్. విజయ్ హజారేలోనూ ఆడాడు. కొన్ని కారణాల వల్ల అతడి ఆట ఆగింది. కానీ సకిబుల్‌కు క్రికెట్‌పై ఆసక్తి ఉండడంతో ఫైజల్ అతడిని ప్రోత్సహించాడు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నా అతడు ముందుకే సాగాడు. ఫైజల్ మాత్రమే కాక తల్లిదండ్రులూ అతడిని ప్రోత్సహించారు. మెరుపు బ్యాటింగ్‌తో పాటు మీడియం పేస్ బౌలింగ్‌తో సకిబుల్ అదరగొట్టేవాడు. బిహార్ వయసు విభాగాల టోర్నీల్లో సత్తా చాటిన అతడు.. 2019 విజయ్‌హజారే ట్రోఫీలో ఆడాడు. 2022లో మిజోరాంపై తొలి రంజీ మ్యాచ్‌లోనే అదిరే ఇన్నింగ్స్ ఆడాడు. తొలి ఇన్నింగ్స్‌లో ట్రిపుల్ సెంచరీ (341) బాదాడు. ఫస్ట్‌క్లాస్ అరంగేట్రంలో అత్యధిక స్కోరు సాధించిన ఘనత సకిబుల్‌దే. ఆ తర్వాత అతడి పరుగుల ప్రవాహం కొనసాగింది. వరుసగా 98, 101 పరుగులు సాధించాడు. తొలి మూడు ఫస్ట్‌క్లాస్ మ్యాచ్‌ల్లోనే 540 పరుగులు చేశాడు. దూకుడుగా ఆడే ఈ కుడి చేతివాటం బ్యాటర్.. దేశవాళీలో దాదాపు 50 సగటుతో ఉన్నాడు. 28 ఫస్ట్‌క్లాస్ మ్యాచ్‌ల్లో 2035 పరుగులు చేశాడు. 15 వికెట్లు పడగొట్టాడు. ఇందులో 5 సెంచరీలు, 8 అర్ధసెంచరీలు ఉన్నాయి. 38 టీ20ల్లో 986 పరుగులు సాధించాడు. 7 వికెట్లు తీశాడు. ప్రస్తుతం బిహార్ జట్టుకు అతడే కెప్టెన్. గత నాలుగేళ్లుగా ఐపీఎల్ వేలంలోకి సకిబుల్ పేరు వచ్చినా.. ఏ ఫ్రాంఛైజీ ఆసక్తి చూపించలేదు. భారత్‌కు ఆడాలన్నది సకిబుల్ కల. ఈ ఆల్‌రౌండర్ ముమ్ముందు ఇదే జోరు కొనసాగిస్తే ఐపీఎల్‌లో, ఆపై భారత జట్టులో చూసే అవకాశాలున్నాయి.

టెస్టులకు కొత్త కోచ్?

పరిమిత ఓవర్ల క్రికెట్లో టీమ్ ఇండియా కోచ్‌గా గౌతమ్ గంభీర్ రికార్డు గొప్పగా ఉంది. అతడి మార్గనిర్దేశకత్వంలో జట్టు ఇప్పటికే ఐసీసీ, ఏసీసీ ట్రోఫీలను గెలుచుకుంది. కానీ గంభీర్ టెస్టు రికార్డు మాత్రం పేలవం. అతడు వచ్చాక సేనా (దక్షిణాఫ్రికా, ఇంగ్లాండ్, న్యూజిలాండ్, ఆస్ట్రేలియా) దేశాల చేతుల్లో టీమ్ఇండియా పది టెస్టుల్లో ఓడిపోయింది. ఈ విషయంలో అతడు ఇప్పటికే చాలా విమర్శలు ఎదుర్కొన్నాడు. ఈ నేపథ్యంలో ఓ ఆసక్తికర విషయం వెలుగు లోకి వచ్చింది. టెస్టు కోచ్‌గా గంభీర్ స్థానంలో మరొకరిని నియమించేందుకు బీసీసీఐ ప్రయత్నాలు చేస్తోందట.



గంభీర్

జైపుర్

గత నెలలో టెస్టు సిరీస్‌లో దక్షిణాఫ్రికాకు టీమ్ఇండియా దాసోహమన్న తర్వాత జట్టుపైనే కాక కోచ్ పైనా తీవ్ర విమర్శలు వచ్చాయి. గత ఏడాది న్యూజిలాండ్ చేతిలో భారత జట్టు సొంతగడ్డపై వైట్‌వాష్ గురి కావడం పెద్ద షాక్. అది అనుకోకుండా జరిగిందనుకుంటే.. ఈ ఏడాది దక్షిణాఫ్రికా చేతిలోనూ అలాంటి పరాభవమే ఎదురు కావడాన్ని అభిమానులు జీర్ణించుకోలేకపోయారు. న్యూజిలాండ్, ఆస్ట్రేలియాల చేతుల్లో సిరీస్ ఓటముల తర్వాత అశ్విన్, రోహిత్, కోహ్లి టెస్టుల నుంచి రిటైరయ్యారు. ఒక రకంగా ఆ ఓటములకు బాధ్యత వహిస్తూనే వాళ్లు తప్పుకోవాల్సి వచ్చిందని భావించవచ్చు. అయితే దక్షిణాఫ్రికా చేతిలో ఓటమి అనంతరం అందరి వేళ్లూ గంభీర్ వైపే చూపించాయి. అతణ్ని కోచ్‌గా తప్పించాలని గట్టిగా డిమాండ్లు వినిపించాయి. బీసీసీఐ సైతం గంభీర్‌ను టెస్టుల్లో కోచ్‌గా కొనసాగించే విషయంలో పునరాలోచనలో పడ్డట్లు తెలుస్తోంది. దక్షిణాఫ్రికా సిరీస్ అనంతరం బీసీసీఐలో ఓ ముఖ్య వ్యక్తి వీవీఎస్ లక్ష్మణ్‌ను సంప్రదించాడని, టెస్టు జట్టు కోచ్‌గా పని చేయాలన్న ఆసక్తి ఉందా అని అడిగాడని తెలుస్తోంది. కానీ లక్ష్మణ్ ఆసక్తి ప్రదర్శించలేదని సమాచారం. బెంగళూరులోని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ అధిపతిగా తాను సంతృప్తిగా ఉన్నానని లక్ష్మణ్ చెప్పాడట.

ఆటగాళ్లలో అభద్రతాభావం?: 2027 వన్డే ప్రపంచకప్ ముగిసే వరకు బీసీసీఐతో గంభీర్‌కు కాంట్రాక్ట్ ఉంది. కానీ బోర్డు దీన్ని సమీక్షించే అవకాశాన్ని కొట్టిపారేయలేం. అంతా సొంతగడ్డపై జరిగే 2026 ప్రపంచకప్‌లో వచ్చే ఫలితంపై ఆధారపడి ఉంటుంది. 2025-27 ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ చక్రంలో భారత్ మరో 9 టెస్టులు ఆడాల్సివుంది. 2026 ఆగస్టులో శ్రీలంకలో రెండు టెస్టులు, అక్టోబరులో న్యూజిలాండ్ పర్యటనలో రెండు టెస్టులు ఆడనున్న టీమ్ఇండియా.. ఆ తర్వాత సొంతగడ్డపై 2027 జనవరి-ఫిబ్రవరిలో ఆస్ట్రేలియాతో అయిదు టెస్టుల సిరీస్ ఆడుతుంది. అయితే భారత్ డబ్ల్యూటీసీ ఫైనల్ అవకాశాలు ఇప్పటికే బాగా దెబ్బతిన్నాయి. ''భారత క్రికెట్లో అధికార వర్గాల నుంచి గంభీర్‌కు గట్టి మద్దతు ఉంది. ఒకవేళ భారత్ టీ20 ప్రపంచకప్‌ను నిలబెట్టుకుంటే, కనీసం ఫైనల్ చేరితే అతడు బాధ్యతల్లో కొనసాగుతాడు. కానీ టెస్టు కోచ్‌గా కొనసాగుతాడా అన్నదే ఆసక్తికరం. రెడ్ బాల్ ఫార్మాట్లో పెద్దగా ప్రత్యామ్నాయాలు లేకపోవడం గంభీర్‌కు లాభించే అంశం. ఎందుకంటే సీనియర్ టెస్టు జట్టుకు కోచింగ్ ఇవ్వాలనే ఆసక్తి లక్ష్మణ్‌కు లేదు'' అని ఓ బీసీసీఐ అధికారి చెప్పాడు. గంభీర్ హయంలో జట్టులో చాలా మంది ఆటగాళ్లు ద్రవిడ్ కోచ్‌గా ఉన్నప్పటిలా భద్రతా భావంతో లేరు. భారత క్రికెట్లో తర్వాతి స్టార్‌గా అంతా భావించిన శుభ్‌మన్ గిల్‌నే టీ20 ప్రపంచకప్ జట్టు నుంచి తప్పించినప్పుడు.. తమలో ఎవరిపైనైనా వేటు పడొచ్చని వాళ్లు భావిస్తున్నారు. విధానపరమైన నిర్ణయాలు తీసుకోవడానికి బీసీసీఐ ఎల్లప్పుడూ సమయం తీసుకుంటుంది. టీ20 ప్రపంచకప్ తర్వాత రెండు నెలల పాటు ఐపీఎల్ ఉంటుంది. భిన్న కోచ్‌లు లేదా అన్ని ఫార్మాట్లకు ఒకే కోచ్ ఉండడంపై నిర్ణయం తీసుకోవడానికి బోర్డుకు తగినంత సమయం ఉంది. అంటే 'గురు గంభీర్'కు వచ్చే రెండు నెలలు చాలా కీలకమన్నమాట.

15 ఏళ్ల తర్వాత..

- ఆస్ట్రేలియా గడ్డపై ఇంగ్లాండ్‌కు టెస్టు విజయం
- రెండు రోజుల్లోనే ముగిసిన యాషెస్ నాలుగో మ్యాచ్

మెల్‌బోర్న్



బెతెల్

ఇంగ్లాండ్‌కు ఊరట. వరుస పరాభవాలతో తల్లడిల్లిన ఆ జట్టు ఎట్టకేలకు విజయాన్నందుకుంది. ఆస్ట్రేలియా గడ్డపై 15 ఏళ్ల, 18 టెస్టుల తర్వాత గెలుపు రుచిచూసింది. తొలి మూడు మ్యాచ్‌ల్లో ఓడి యాషెస్ సిరీస్‌ను కోల్పోయిన ఇంగ్లాండ్.. రెండు రోజుల్లోనే ముగిసిన నాలుగో టెస్టులో 4 వికెట్ల తేడాతో ఆస్ట్రేలియాను ఓడించింది. రెండో రోజు, శనివారం 175 పరుగుల లక్ష్యాన్ని ఇంగ్లాండ్.. 32.2 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి ఛేదించింది. జాకబ్ బెతెల్ (40; 46 బంతుల్లో 5×4), జాక్ క్రాలీ (37; 48 బంతుల్లో 3×4, 1×6), బెన్ డకెట్ (34; 26 బంతుల్లో 4×4, 1×6) రాణించారు. స్టార్క్, జే రిచర్డ్‌సన్, బోలాండ్ తలో రెండు వికెట్లు పడగొట్టారు. ఉదయం 4/0తో రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన ఆస్ట్రేలియా.. 132 పరుగులకే ఆలౌటైంది. కార్స్ (4/34), స్టోక్స్ (3/24), జోష్ టంగ్ (2/44) ఆ జట్టును బెంబేలెత్తించారు. ట్రావిస్ హెడ్ (46; 67 బంతుల్లో 4×4) టాప్ స్కోరర్. ఏడో ఓవర్లో, జట్టు స్కోరు 22 వద్ద బోలాండ్ (6)ను ఔట్ చేయడం ద్వారా ఆసీస్‌ను అట్కిన్సన్ తొలి దెబ్బతీశాడు. ఆ తర్వాత ఆ జట్టు క్రమం తప్పకుండా వికెట్లు కోల్పోయింది. ఒక్క పెద్ద భాగస్వామ్యం కూడా నమోదు కాలేదు. హెడ్ కాకుండా స్టీవ్ స్మిత్ (24), గ్రీన్ (19) మాత్రమే రెండంకెల స్కోరు చేయగలిగారు. సిరీస్‌లో ఆసీస్ 3-1తో ఆధిక్యంలో ఉంది. చివరిదైన అయిదో టెస్టు జనవరి 4న మొదలవుతుంది.



టంగ్

ఛేదన ధాటిగా..: పేసర్లకు దాసోహమంటున్న పిచ్‌పై ఆస్ట్రేలియాను తొలి ఇన్నింగ్స్‌లో 152కే ఆలౌట్ చేసి అద్భుత అవకాశం సృష్టించుకున్నప్పటికీ.. బ్యాటుతో తడబడి 110 పరుగులకే కుప్పకూలడంతో ఇంగ్లాండ్‌కు మరో ఓటమి ఖాయమనుకున్నారంతా! కానీ ఆసీస్‌ను రెండో ఇన్నింగ్స్‌లో 132కే పరిమితం చేసి మరో అవకాశాన్ని సృష్టించుకుంది ఇంగ్లాండ్. లక్ష్యం 175 పరుగులే. అయినా ఇంగ్లాండ్‌పై ఎవరూ పూర్తి నమ్మకంతో లేరు. కానీ ఆ జట్టు అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంది. ధాటిగా బ్యాటింగ్ చేసి విజయాన్నందుకుంది. ఓపెనర్లు క్రాలీ, డకెట్ బ్యాట్లు ఝుళిపించడంతో ఇంగ్లాండ్ 10 ఓవర్లకు 70/2తో నిలిచింది. ఆ తర్వాత బెతెల్ కీలక ఇన్నింగ్స్ ఆడాడు. అతడు క్రాలీతో మూడో వికెట్‌కు 47, రూట్ (15)తో నాలుగో వికెట్‌కు 25 పరుగులు జోడించి, జట్టు స్కోరు 137 వద్ద ఔటయ్యాడు. ఆ తర్వాత హ్యారీ బ్రూక్ (18 నాటౌట్) నిలిచాడు. రూట్‌తో అతడు 23 పరుగులు జోడించడంతో ఇంగ్లాండ్ విజయానికి చేరువైంది. రూట్, స్టోక్స్ (2) ఔటైనా.. బ్రూక్ పని పూర్తి చేశాడు.

సంక్షిప్త స్కోర్లు... ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్: 152; **ఇంగ్లాండ్ తొలి ఇన్నింగ్స్:** 110; **ఆస్ట్రేలియా రెండో ఇన్నింగ్స్:** 132 (హెడ్ 46, స్మిత్ 24, గ్రీన్ 19, లబుషేన్ 8, వెదరాల్డ్ 5, కేరీ 4, ఖవాజా 0; కార్స్ 4/34, స్టోక్స్ 3/24, జోష్ టంగ్ 2/44); **ఇంగ్లాండ్ రెండో ఇన్నింగ్స్:** 178/6 (బెతెల్ 40, క్రాలీ 37, డకెట్ 34, బ్రూక్ 18, రూట్ 15; స్టార్క్ 2/55, జే రిచర్డ్‌సన్ 2/22, బోలాండ్ 2/29)

ఇదేం పిచ్?

యాషెస్ సిరీస్ నాలుగో టెస్టు రెండు రోజుల్లోనే ముగిసిపోవడంపై సర్వత్రా విమర్శలు వస్తున్నాయి. మ్యాచ్‌కు ఆతిథ్యమిచ్చిన మెల్‌బోర్న్ క్రికెట్ స్టేడియంలో పిచ్ స్పందించిన తీరుపై ఇంగ్లాండ్ కెప్టెన్ బెన్ స్టోక్స్ కూడా అసంతృప్తి వ్యక్తం చేశాడు. ఈ మ్యాచ్‌లో ఇంగ్లాండ్ గెలిచినప్పటికీ.. స్టోక్స్ తన అసంతృప్తిని దాచుకోలేదు. ''నిజాయితీగా చెప్పాలంటే మ్యాచ్ ఇలా సాగాలని ఎవ్వరూ కోరుకోరు. ఇది బాక్సింగ్ డే టెస్టు మ్యాచ్. రెండు రోజుల్లోపు ఇది పూర్తవుతుందని ఎవ్వరూ ఊహించరు. ఇది సరైంది కాదు. ఆటగాళ్లుగా మేం ఎలాంటి పిచ్ ఇచ్చినా ఆడాల్సిందే. కానీ ప్రపంచంలో ఇంకెక్కడైనా అయితే వికెట్ గురించి ఎన్ని విమర్శలు వచ్చేవో. టెస్టులంటే నాలుగు, అయిదు రోజులు జరగాలి. ఇంత త్వరగా పని పూర్తయిగా బాగా అనిపించదు'' అని స్టోక్స్ చెప్పాడు. ఇంగ్లాండ్ మాజీ ఆటగాడు కెవిన్ పీటర్సన్ సైతం మెల్‌బోర్న్ పిచ్ స్పందించిన తీరుపై విమర్శలు గుప్పించాడు. భారత్‌లో ఓ టెస్టు మ్యాచ్ ఇలా జరిగితే క్రికెట్ ప్రపంచం గగ్గోలు పెట్టేదన్నాడు. ''భారత్‌లో తొలి రోజే ఎక్కువ వికెట్లు పడిపోతే ఇదేంటని అందరూ విమర్శలు గుప్పిస్తారు. ఆస్ట్రేలియాలో ఇలా జరగడం మీద కూడా అలాంటి చర్చే జరగాలి'' అని ఎక్స్‌లో పీటర్సన్ పేర్కొన్నాడు. రెండు రోజుల్లో 36 వికెట్లు నేల కూలడం అంటే కొంచెం ఎక్కువే అని ఆస్ట్రేలియా కెప్టెన్ స్టీవ్ స్మిత్ అభిప్రాయపడ్డాడు.



స్టోక్స్



చరిష్మ

ఫైనల్లో సూర్య చరిష్మ

ఈనాడు, అమరావతి: జాతీయ సీనియర్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో ఆంధ్రప్రదేశ్ అమ్మాయి తమిరి సూర్యచరిష్మ మహిళల సింగిల్స్‌లో ఫైనల్‌కు దూసుకెళ్లింది. సెమీఫైనల్లో ఆమె 21-18, 18-21, 21-9తో తెలంగాణకు చెందిన రక్షితశ్రీపై విజయం సాధించింది. నువ్వానేనా అన్నట్లు సాగిన తొలి రెండు గేముల్లో చెరొకటి గెలవగా.. నిర్ణయాత్మక మూడో గేమ్‌లో సూర్య చరిష్మ విజృంభించి ఆడి విజయం సాధించింది. మరో సెమీస్‌లో తన్వి పత్రి (ఒడిశా) 18-21, 21-12, 21-15తో శ్రుతి (మహారాష్ట్ర)పై నెగ్గింది. పురుషుల సింగిల్స్ సెమీఫైనల్లో తెలంగాణ కుర్రాడు తరుణ్ 17-21, 21-11, 11-21తో భరత్ రాఘవ (హరియాణా) చేతిలో ఓడాడు. మరో సెమీస్‌లో రిత్విక్ సంజీవి (తమిళనాడు) 21-16, 17-21, 22-20తో కిరణ్ జార్జ్ (ఆర్బీఐ)ను ఓడించాడు. మిక్స్‌డ్ డబుల్స్ సెమీస్‌లో సాత్విక్‌రెడ్డి (తెలంగాణ), రాధిక శర్మ (పంజాబ్) జోడీ 21-13, 21-14తో నితిన్‌కుమార్, కనిక కన్వాల్ (రైల్వేస్) ద్వయంపై నెగ్గి ఫైనల్ చేరింది. మరో సెమీస్‌లో అసిత్ సూర్య, అమృత.పి జోడీ (కర్ణాటక) జంట 8-21, 21-18, 21-18తో దీప్‌రామ్‌బియా, సోనాలి (మహారాష్ట్ర) జోడీని మట్టికరిపించింది.

అగ్రస్థానంలో హంపి



హంపి

దోహా: ఫిడే ప్రపంచ ర్యాపిడ్, బ్లిట్జ్ చెస్ టోర్నమెంట్ ర్యాపిడ్ విభాగంలో డిఫెండింగ్ ఛాంపియన్ కోనేరు హంపి అగ్రస్థానానికి చేరుకుంది. మహిళల విభాగంలో 8 రౌండ్లలో 6.5 పాయింట్లతో ఈ భారత గ్రాండ్ మాస్టర్.. జు జినెర్ (చైనా)తో కలిసి ఉమ్మడిగా మొదటి స్థానంలో ఉంది. అయిదు గేమ్‌లు గెలిచిన హంపి.. మూడు డ్రా చేసుకుంది. జినెర్ కూడా అయిదు గేమ్‌లు నెగ్గి.. మూడింట్లో పాయింట్లు పంచుకుంది. 4 విజయాలు, 4 డ్రాలతో ద్రోణవల్లి హారిక (6), ప్రపంచకప్ విజేత దివ్య దేశ్‌ముఖ్ (5.5) ఉమ్మడిగా రెండు, మూడో స్థానాల్లో కొనసాగుతున్నారు. ఓపెన్ విభాగంలో ప్రపంచ ఛాంపియన్ దొమ్మరాజు గుకేశ్, అర్జున్ ఇరిగేశి (6.5) ఉమ్మడిగా మూడో స్థానంలో ఉన్నారు. ప్రపంచ నంబర్‌వన్ మాగ్నస్ కార్ల్‌సన్ (7, నార్వే) ఉమ్మడిగా రెండో స్థానంలో.. వ్లాదిస్లావ్ (రష్యా), నీమన్ (అమెరికా) 7.5 పాయింట్లతో ఉమ్మడిగా అగ్రస్థానంలో కొనసాగుతున్నారు.

ఆ భారత జట్టు అంత గొప్పదేమీ కాదు: కుక్

మెల్‌బోర్న్: ఇంగ్లాండ్‌లో టెస్టు సిరీస్‌ను 2-2తో డ్రాగా ముగించిన భారత జట్టు అంత గొప్పగా ఏమీ లేదని మాజీ బ్యాటింగ్ స్టార్ అలిస్టెర్ కుక్ అభిప్రాయపడ్డాడు. ''కోచ్‌గా మెక్‌కలమ్ హయాం ఘనంగా ప్రారంభమైంది. అతడు తొలి తొలి ఏడాదిలో, తొలి 10 మ్యాచ్‌ల్లో ఎనిమిది గెలిచినట్లున్నాడు. ఆ తర్వాత పతనం మొదలైంది. ఈ ఏడాది ఇంగ్లాండ్ గెలుపు శాతం 30 పైన మాత్రమే'' అని కుక్ అన్నాడు. ''భారత్‌తో సిరీస్ డ్రా చేసిన విషయాన్ని కొందరు గుర్తు చేస్తున్నారు. కానీ దక్షిణాఫ్రికా చేతిలో భారత్ ఓడిపోయింది. అది అంత గొప్ప భారత జట్టేమీ కాదు'' అని కుక్ అన్నాడు.

వసుంధర

vasundhara@eenadu.in

బెస్ట్‌గా నిలిచా!

నా విజయం

ఇంటి నుంచి బయటికి వెళ్లే చెత్త తగ్గాలి, రసాయనాలైని కూరగాయలు ఇంట్లోవాళ్లకి అందించాలి. ఇందుకు నాకు కనిపించిన పరిష్కారం 'మిద్దెతోట పెంపకం'. పొడి చెత్తను కంపోస్ట్‌గా, స్వాప్షుగా మారుస్తున్నా. తడి చెత్తతో మొక్కలకు ద్రవరూప పోషకాలు, క్రిమికీటక నాశకాలను తయారుచేస్తా. వీటితో ఇంటికి కావాల్సిన పండ్లు, కాయగూరలు, ఆకుకూరలన్నీ పండిస్తున్నా. ఈ సంగతి తెలిసి మున్సిపాలిటీ అధికారులు మా ఇంటికి వచ్చి నేను అనుసరిస్తున్న విధానాల్ని పరిశీలించి మెచ్చుకున్నారు. పలు సంస్థల నుంచి 'బెస్ట్ సిటిజన్ ఆఫ్ రాజమండ్రి', 'లో బడ్జెట్ టెర్రస్ గార్డెన్', 'ఉత్తమ మిద్దెతోట' వంటి అవార్డులనీ అందుకున్నా. హోటళ్లు, గుళ్ల నుంచీ చెత్తని సేకరించి సేంద్రియ ఎరువుగా మారుస్తున్నా. ఇరుగుపొరుగు వారికీ సేంద్రియ పంటల పెంపకం నేర్పిస్తున్నా. అయితే పిల్లలే కదా భావి పౌరులు. వాళ్లకి వీటిపై అవగాహన ముఖ్యం అనిపించింది. అందుకే పాఠశాలల్లో 'తడి-పొడి చెత్తని ఎలా సద్వినియోగం చేసుకోవాలో చెబుతూ మొక్కలు పెంచేలా ప్రోత్సహిస్తున్నా. ఈ క్రమంలో ఈ ఏడాది మా జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీల చేతులమీదుగా 'బెస్ట్ హోమ్ కంపోస్ట్ మేకర్' అవార్డునీ అందుకున్నా. పిల్లలు జంక్‌ఫుడ్‌కి దూరంగా... రసాయన రహిత ఆహారం తీసుకునేలా చేయాలి. ఇది నా కొత్త ఏడాది లక్ష్యం.



– యర్రా శేషకుమారి, రాజమహేంద్రవరం

కింద కూర్చుంటే ఆందోళన తగ్గుతుంది...!

ఒకప్పుడు నేలపైనే కూర్చుని భోజనం చేసేవాళ్లం. వీధి అరుగులే సోఫాలు... గిన్నెలు తోమాలన్నా, దుస్తులు ఉతకాలన్నా కింద కూర్చునే... కానీ, ఇప్పుడు ఆ అవకాశమేది?

నేలపై కూర్చోవడం వల్ల వెన్నెముక సహజ స్థితిలో ఉంటుంది. కుర్చీలో కూర్చున్నప్పుడు వచ్చే వంపు తప్పుతుంది. ముఖ్యంగా దేన్నీ ఆనుకోకుండా కూర్చోవడం వల్ల పొట్ట, వీపు కండరాలు బలోపేతమవుతాయి. వెన్ను నొప్పి తగ్గుతుంది.

- తుంటి, మోకాళ్లు, చీలమండలు సాగుతాయి. వీటివల్ల పెద్ద వయసులోనూ నేల మీద నుంచి సులువుగా లేవగలుగుతారు. ఇది దీర్ఘాయువుకు సంకేతమట. కాళ్లు ముడుచుకుని కూర్చోవడం వల్ల రక్తప్రసరణా మెరుగవుతుంది.
- నేలపై కూర్చుని... ముందుకు వంగి తినడం, తిరిగి వెనక్కు వచ్చే కదలిక జీర్ణ క్రియను మెరుగుపరుస్తుంది. మలబద్ధకాన్ని తగ్గిస్తుంది.
- మహిళలు నేలపై సరైన భంగిమలో కూర్చోవడం వల్ల పెల్విక్ కండరాలు బలపడతాయి. ఇది, ఒత్తిడి, ఆందోళనల్ని తగ్గిస్తుంది. మనస్సుని ప్రశాంతంగా ఉంచుతుంది.



కొన్నిసార్లు మాటలు చెప్పలేని వాస్తవాలు గణాంకాలు చెబుతాయి. నిఫ్టీ 500 కంపెనీల సగటు లాభాల వృద్ధి 9.9 శాతం కాగా, మహిళలు నాయకత్వం వహిస్తోన్న కొన్ని సంస్థల్లో ఇది 50-450 శాతంగా ఉంది. నాయకత్వ బాధ్యతల్లో మహిళలు క్రియాశీలకంగా ఉండటమే దీనికి కారణం. అందుకే కార్పొరేట్ సంస్థలు మహిళామణుల్ని అధినేత్రులుగా ఎంచుకుంటున్నాయి.

నాయిక 2025

'ఇంతి'ంతై... అంతా తానై!

లోకల్ నుంచి గ్లోబల్ వరకూ...



హిందుస్థాన్ యునీ లీవర్ ('హెచ్‌యూఎల్') చరిత్రలో మొదటి మహిళా సీఈఓ, ఎండీ **ప్రియా నాయర్**. ఆగస్టులో ఈ బాధ్యతలు తీసుకోవడానికి ముందు యునీలీవర్ గ్లోబల్‌లో బ్యూటీ, వెల్‌బీయింగ్ విభాగానికి ప్రెసిడెంట్‌గా చేశారు. 'హెచ్‌యూఎల్‌కు డిజిటల్ ఫస్ట్, ప్రాంతీయ బ్రాండ్లతో పోటీ పెరిగింది. ఈ నేపథ్యంలో ప్రియ సమర్థ నాయకత్వంపైన సంస్థ నమ్మకం ఉంచింది. పుణెలోని సింబయాసిస్ ఇన్‌స్టిట్యూట్ నుంచి ఎంబీఏ చేశాక, 30 ఏళ్ల కిందట హెచ్‌యూఎల్‌తోనే కెరియర్ ప్రారంభించారు ప్రియ. 'పశ్చిమ భారత సేల్స్ రీజనల్ మేనేజర్‌గా పనిచేసి వ్యవస్థని క్షేత్రస్థాయిలో చూడగలిగాను. యునీలీవర్ బ్యూటీ, వెల్‌బీయింగ్ ఉత్పత్తుల గ్లోబల్ చీఫ్ మార్కెటింగ్ ఆఫీసర్‌గా విదేశీ మార్కెట్లను దగ్గరగా చూశాను. ఈ రెండూ నా కెరియర్‌కు ఊతమిచ్చాయి' అని చెబుతారు ప్రియ.

'మెటా'కు ఆమె మాటే వేదం!



మెటాకు చెందిన ఫేస్‌బుక్, వాట్సాప్, ఇన్‌స్టాల్లో భారత్ నుంచి వినియోగదారులు 50 కోట్ల మందికిపైనే. ఈ కీలకమైన మార్కెట్‌ను నడిపిస్తున్నారు **సంధ్యా దేవనాథన్**. 2022 నుంచి భారత విభాగానికి వైస్‌ప్రెసిడెంట్ హోదాలో నాయకత్వం వహిస్తుండగా, ఈ ఏడాది అదనంగా ఆగ్నేయాసియా బాధ్యతల్నీ తీసుకున్నారు. సంధ్య చదువుకున్నది విశాఖపట్నంలో. ఇక్కడే బీటెక్ పూర్తిచేశారు. దిల్లీ యూనివర్సిటీ నుంచి ఎంబీఏ చేశారు. బ్యాంకింగ్, పేమెంట్స్, టెక్నాలజీ రంగాల్లో 25 ఏళ్ల అనుభవం. 2016లో మెటాలో చేరి సింగపూర్, వియత్నాంలలో సంస్థ ఎదుగుదలలో కీలకపాత్ర పోషించారు. 2020లో సంస్థ ఆసియా-పసిఫిక్ ప్రాంత గేమింగ్ విభాగానికి నాయకత్వం వహించారు. మెటా ఏఐకి ఎక్కువగా వినియోగదారులున్నది మనదగ్గరే. అత్యధికంగా ఇన్‌స్టాగ్రామ్ క్రియేటర్లున్న దేశమూ మనదే. ఏఐ దిశగా వడివడిగా అడుగులు వేస్తున్న మెటా... అనేక ఉత్పత్తుల తయారీతోపాటు వాటిని ఇక్కడే మొదట పరీక్షిస్తోంది.

ఆర్థికవృద్ధికి పావులు కదుపుతూ...



ప్రతిభ ఉంటే పదవులు వాటికవే వెతుక్కుంటూ వస్తాయనడానికి నిదర్శనం ఆర్బీఐ డెప్యూటీ గవర్నర్ **డా. పూనమ్ గుప్తా**. దిల్లీలోని హిందూ కాలేజీ నుంచి బీఏ ఎకనామిక్స్, ఆపైన యూనివర్సిటీ ఆఫ్ మేరీల్యాండ్ నుంచి మాస్టర్స్, పీహెచ్‌డీ చేశారు. దిల్లీ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్, యూనివర్సిటీ ఆఫ్ మేరీల్యాండ్‌లతో పాఠాలు చెప్పారు. ఇంకా అనేక సంస్థల్లో గెస్ట్ ఫ్యాకల్టీగానూ ఉన్నారు. మాక్రో ఎకనామిక్ స్టెబిలిటీ, ఇంటర్నేషనల్ ఫైనాన్స్ విభాగాల్లో దిట్ట. అంతర్జాతీయ ద్రవ్యనిధి, ప్రపంచబ్యాంకులో రెండు దశాబ్దాలు పనిచేశారు. ఆర్బీఐలో చేరకముందు 'నేషనల్ కౌన్సిల్ ఆఫ్ అప్లైడ్ ఎకనమిక్ రిసర్చ్'కు డైరెక్టర్ జనరల్‌గా ఉన్నారు. ప్రధానమంత్రి ఆర్థిక సలహా మండలిలో నాలుగేళ్లుగా సభ్యురాలు. ఈ ఏప్రిల్‌లో ఆర్బీఐ డెప్యూటీ గవర్నర్‌గా బాధ్యతలు తీసుకున్నారు. ఈ హోదాలో మానిటరీ పాలసీ, పాలసీ రీసర్చ్, ఫైనాన్షియల్ స్టెబిలిటీ... ఇలా అరడజనుకుపైగా విభాగాల్ని పర్యవేక్షిస్తున్నారు. 'సంస్కరణల వేగం పుంజుకుంది. త్వరలోనే 7-7.5శాతం వృద్ధి సాధిస్తాం' అని భరోసా ఇస్తారు పూనమ్.

డబ్బెక్కడ పెట్టాలో చెబుతారు!



లక్ష్మీ అయ్యర్... ఈ ఆగస్టులో బజాజ్ ఫిన్‌సర్వ్ గ్రూప్ ప్రెసిడెంట్, ఇన్వెస్ట్‌మెంట్స్‌గా ఎంపికయ్యారు. కొటాక్ మహీంద్రా బ్యాంక్‌లో ఫండ్ మేనేజర్‌గా సుదీర్ఘ అనుభవం సంపాదించారు లక్ష్మి. చివరిగా ఆ సంస్థ ఇన్వెస్ట్‌మెంట్స్, స్ట్రాటజీ విభాగానికి సీఈఓగా చేశారు. ఈమెది ఆర్థిక సేవల రంగంలో 27 ఏళ్ల అనుభవం. ఫిక్స్‌డ్ ఇన్‌కమ్, రియల్ ఎస్టేట్... విభాగాల్లో వెల్త్ అడ్వైజరీ, స్ట్రాటజీ, ప్రొడక్ట్ సొల్యూషన్స్ అంశాల్లో సేవలు అందించారు. ముంబయిలోని నార్సీ మాంజీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ నుంచి ఎంబీఏ చేశారు. రెండేళ్ల ఉద్యోగ అనుభవం తర్వాత మార్కెట్ నైపుణ్యాలకు అదనంగా కోడింగ్ నైపుణ్యాలను నేర్చుకున్నారు. దాంతో 1999లో కొటాక్‌లో మ్యూచువల్ ఫండ్స్‌కు సాఫ్ట్‌వేర్ వేదికను రూపొందించే అవకాశం వచ్చింది. అలా ఆ కంపెనీతో పాతికేళ్లు ప్రయాణించారు. ఆసియా ఇన్వెస్టర్ మ్యాగజీన్ ఈమెను 'టాప్ 25 మోస్ట్ ఇన్‌ఫ్లుయెన్షియల్ విమెన్'లో ఒకరిగా గుర్తించింది.

ఇంకొందరు

- నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(ఎన్‌పీసీఐ)-'భీమ్'కు ఎండీ, సీఈఓగా ఉన్నారు లలితా నటరాజ్.
- అర్వింద్ ఫ్యాషన్స్‌కు నేతృత్వం వహిస్తున్నారు అమీషా జైన్.
- భువనేశ్వరి ఎ. ఎండీ, సీఈఓ, ఎబీఐక్యాప్ సెక్యూరిటీస్
- జయంతీ గంగూలీ, సీఈఓ, హోమ్ సెంటర్ ఇండియా



నీలి సముద్రం... కనుచూపు మేరంతా నీళ్లు... ఊహించుకోవడానికి ఆ చిత్రం ఎంత బాగుంటుందో! దాన్నే మరో కోణంలో చూద్దాం. భీకరంగా వీచే గాలులు... ఎగసిపడే రాకాసి అలలు. జోరున పడే వాన... తుపానులు ఇప్పుడేమనిపిస్తోంది? భయం ఆవరిస్తుంది కదూ! అలాంటి వాతావరణంలో సత్తా చాటుతున్నారు భారత సైనికురాళ్లు!

సముద్ర జలాల్లో... సాహస నారులు!



'పాయింట్ నీమో'... పసిఫిక్ సముద్రంలో ఒక నిర్జన ప్రదేశం. ఉపగ్రహాలు, అంతరిక్ష నౌకల్ని ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ఇక్కడే కూల్చేస్తుంటారు. దీనికి 'అంతరిక్ష నౌకల మరుభూమి'గానూ పేరు. ఈ ప్రమాదకరమైన చోటు నుంచి నీళ్లను సేకరించారు మన లెఫ్టినెంట్ కమాండర్లు **దిల్నా, రూప**. ఆ ఘనత సాధించిన తొలి భారత మహిళలుగా చరిత్రనీ సృష్టించారు. అత్యంత శీతల ప్రదేశంగా 'కేప్ హార్న్'కు పేరు. ఇది అంటార్కిటికాకు 800కి.మీ. దూరంలో ఉంటుంది. అత్యంత వేగంతో వీచే గాలులు, 5మీ. మేర ఎగసిపడే అలలు. 'అత్యంత ప్రమాదకరమైన ప్రదేశ'మని చెప్పే దాన్నీ దాటారు ఈ ఇద్దరు నేవీ ఆఫీసర్లు. 'కేప్ హార్నర్స్'గా పేరూ సంపాదించుకున్నారు. ఎనిమిది నెలల సముద్రయానంలో తుపానులు, భీకర గాలులు వంటి ఎన్నో వాతావరణ పరీక్షలు దాటి 25,400 నాటికల్ల లక్ష్యం పూర్తిచేశారు. స్త్రీశక్తికి ప్రతీకగా నిలిచారు.

వీళ్లిద్దరి సముద్ర ప్రయాణం గత అక్టోబరులో 'ఐఎన్ఎస్‌వీ తరిణి'లో మొదలైంది. గోవాలో శ్రీకారం చుట్టిన ఈ సాహసయాత్ర దక్షిణాఫ్రికాలోని కేప్‌టౌన్‌కు చేరుకుని... 8నెలల తరవాత ఈ ఏడాది ఆగస్టులో తిరిగి గోవాలో ముగిసింది. మధ్యలో సరకులు, మెయింటనెన్స్ కోసమే వీళ్లు కొన్ని పోర్ట్‌ల్లో ఆగారు. మిగతా అంతా ప్రయాణమే. దేశం నుంచి ఇద్దరు మాత్రమే నిర్వహించిన యాత్రగానూ వీరిద్దరూ చరిత్ర సృష్టించారు. సముద్రంలో ఆపదలో చిక్కుకున్న వారికి సాయం చేయడం, అక్రమ రవాణా, చొరబాట్లను అడ్డుకోవడం వంటివెన్నో నేవీ బాధ్యతలు. అలాంటప్పుడు నేవిగేషన్, సమాచారం ఇవ్వడం, టెక్నికల్ అంశాలు, ప్లానింగ్‌లపై అవగాహనతోపాటు నిర్భయంగా రిస్క్ తీసుకోవడానికి ఎప్పుడూ సిద్ధంగా ఉండేవారి అవసరమే ఎక్కువ. వాటిని అలవాటు చేయడానికి మన నేవీ 'ఓషన్ సెయిలింగ్ ఎక్స్‌పెడిషన్స్'ని నిర్వహిస్తుంది. సముద్ర నౌకాయాన సాహసాల్లో భారత ఉనికి ముఖ్యంగా మహిళా శక్తిని తెలియజేయాలన్న ఉద్దేశమూ దీనిలో భాగమే. ఫలితంగానే లెఫ్టినెంట్ కమాండర్లు దిల్నా, రూపలతో 'నావికా సాగర్ పరిక్రమ-2' ప్రారంభమైంది. దీనికోసం వీళ్లు మూడేళ్లు కఠినమైన శిక్షణనీ తీసుకున్నారు.

ఈసారి బృందంగా...!

'సాగర ప్రదక్షిణ' ఇదీ మన సైన్యంలో నారీశక్తిని నిరూపించడానికి ప్రారంభించిన సాహస యాత్రే! అయితే ఈసారి బృందంగా ప్రయాణమయ్యారు. ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్‌కి చెందిన పదిమంది మహిళా ఆఫీసర్లు దీనిలో భాగమయ్యారు. ఈ ఏడాది సెప్టెంబరులో వీరి యాత్ర ముంబయిలో ప్రారంభమైంది. దేశీయంగా నిర్మించిన 50 అడుగుల 'ఐఏఎస్‌వీ త్రివేణి' నౌకలో 9 నెలలపాటు వీరి ప్రయాణం సాగనుంది. సుమారు 26వేల నాటికల్ మైళ్లు ప్రయాణించి చరిత్ర సృష్టించనుందీ బృందం. ఇందులో భాగంగా అత్యంత ప్రమాదకరమైనవిగా పేరున్న మూడు గేట్‌కేప్‌లు... కేప్ లీవిన్, కేప్ హార్న్, కేప్ ఆఫ్ గుడ్ హోప్‌లు, దక్షిణ మహాసముద్రం, డ్రేక్ పాసేజ్‌ల్లో వీరి ప్రయాణం సాగనుంది. దీనికి లెఫ్టినెంట్ కల్నల్ అనూజ వారుద్కర్ నాయకత్వం వహిస్తున్నారు.

చిన్నారుల నిద్రకు ఆటంకం కలగకుండా..!



నిద్రపోయేటప్పుడు బెడ్‌రూమ్ చీకటిగా ఉండాలి. నీలి కిరణాలు అస్సలే పడకూడదు. లేదంటే నిద్రకు ఆటంకం కలుగుతుంది. అలా అని వెలుతురు లేకుండా వదిలేయనూ లేం. అనుకోకుండా మెలకువ వస్తే భయపడతారు పిల్లలు. వాష్‌రూమ్‌కు వెళ్లాలన్నా, నీళ్లు తాగాలన్నా ఇబ్బందే. ఈ సమస్యలేవీ లేకుండా ఓ మంచి నైట్ ల్యాంప్‌ను ఏర్పాటు చేస్తే సరి. అదీ కార్టూన్లు, పాండా, కుందేళ్లు, కుక్కపిల్లలు ఉన్న ల్యాంప్స్ అయితే భలే ముచ్చట పడతారు చిన్నారులు. అందుకే వీళ్ల ఇష్టాయిష్టాలను దృష్టిలో పెట్టుకుని మార్కెట్లోకి చాలానే 'కార్టూన్ నైట్ ల్యాంప్స్' వచ్చాయి. వీటిలో బ్యాటరీతో నడిచేవే ఎక్కువ. అన్నట్లు ఇవి టచ్ పద్ధతిలో పనిచేస్తాయి. నిద్రపోవడానికే కాదు, చదువుకోవడానికీ ఉపయోగపడతాయి ఇవి. డిస్కో లైట్లు, పసుపు, తెలుపు రంగుల్లోనూ దొరుకుతున్నాయి. అవసరాన్ని బట్టి నచ్చినది ఎంపిక చేసుకోవడమే. బాగున్నాయి కదూ... నచ్చితే ప్రయత్నించేయండి మరి!



కిడ్స్ కార్నర్

ఈ పనితో లాభం ఉండదన్నారు..!



అలలకు భయపడితే ఎప్పటికీ నదిని దాటలేం... ప్రయత్నించే వాళ్లు ఎప్పుడూ విఫలం కాలేదు... ఈ సామెతను జాస్మర్, పరమ్‌జీత్ దంపతులు నిజమని నిరూపించారు. ఉపాధి కోసం శ్మశానంలో శవాలను దహనం చేసిన ఈ జంట వర్మీ కంపోస్ట్ తయారుచేస్తూ ఏడాదికి రూ.50లక్షల టర్నోవర్ సాధిస్తున్నారు.



పరమ్‌జీత్

ఒక మహిళ తీసుకున్న చిన్న నిర్ణయం కూడా కొన్నిసార్లు పెద్ద మార్పునకు దారితీస్తుంది కదా! అదే పరమ్‌జీత్ విషయంలో జరిగింది. తన కుటుంబం కోసం తీసుకున్న నిర్ణయం వారి జీవితాలతోపాటు తన గ్రామంలోని మహిళల జీవితాల్లోనూ మార్పు తీసుకొచ్చింది. పరమ్‌జీత్, జాస్మర్‌లది హరియాణాలోని కురుక్షేత్ర జిల్లాలో ఖాన్పూర్ రోరాన్ గ్రామం. రెక్కాడితే కానీ డొక్కాడని కుటుంబం. కడుపు నిండాలంటే కూలీకి వెళ్లాల్సిందే. పని దొరికితే ఆ పూటకి కడుపు నిండుతుంది లేదంటే పస్తులుండాల్సిందే. అందుకే పరమ్‌జీత్ భర్త జాస్మర్ తోటపని దగ్గర నుంచి చెప్పులు కుట్టడం వరకూ అన్నీ చేశారు. చివరికి ఏ పనీ లేకపోవడంతో ఏడాదిపాటు శ్మశానంలో కాటికాపరిగా చేశాడు. భర్త కష్టాన్ని పంచుకోవాలనుకున్నారు పరమ్‌జీత్. 'వ్యాపారం మొదలుపెట్టాలనుకున్నా. అప్పుడే వర్మీకంపోస్ట్ తయారుచేయాలనుకున్నా. ఎందుకంటే మాకు పశువులున్నాయి. వాటి ఎరువుల్ని మా ఊళ్లో భూస్వాములు ఉచితంగా తీసుకెళ్లేవారు. నేను దాన్నే నా ఆదాయంగా మార్చుకోవాలనుకున్నా. ఇందుకు మహారాష్ట్రలోని నేషనల్ డెయిరీ రీసర్చ్ ఇన్‌స్టిట్యూట్‌లో శిక్షణ తీసుకున్నాను. తర్వాత కురుక్షేత్రలో మావారు, నేను కలిసి వర్మీ కంపోస్ట్ తయారీ మొదలుపెట్టాం. 'దీనివల్ల లాభం ఉండదు...' అంటూ చుట్టుపక్కల వాళ్లు అనేవారు. గ్రామం మొత్తం మమ్మల్ని చూసి నవ్వింది. అయినా మేము వెనక్కి తగ్గలేదు. దాదాపు ఆరుసంవత్సరాలు ఎలాంటి ఆదాయం రాలేదు. ఓర్పుతో ఎదురు చూశాం. ఒకరోజు మా కష్టానికి ఫలితం దక్కింది. మొదటి ఆర్డర్ వచ్చింది. పదకొండేళ్ల క్రితం మొదలుపెట్టిన ఈ వ్యాపారం దాదాపు పది రాష్ట్రాల్లో విస్తరించింది. తయారీ పనులు నేను చూసుకుంటా. మార్కెటింగ్ వ్యవహారాలు మావారు చూసుకుంటారు. ఇప్పుడు పదిమంది మహిళలకు ఉపాధి కల్పించగలుగుతున్నాం. కొంతమంది మా దగ్గర శిక్షణ తీసుకోవడానికి వస్తున్నారు' అంటారీమె.

తెల్లటి చర్మం... నల్లటి ముఖం... ఎందుకిలా?

పిగ్మెంటేషనా మెలస్మానా నాకు తెలియదు. కానీ, నా శరీర రంగుకి భిన్నంగా నా ముఖం నల్లగా మారింది. నేను నియాసినమైడ్, గ్లైకాలిక్‌యాసిడ్... వంటి క్రీములూ, ఇంటి చిట్కాలన్నీ ప్రయత్నించి చూశా. చక్కెర, గ్లూటెన్ పదార్థాలను తీసుకోవడం మానేశా. పీరియడ్స్ క్రమంగానే వస్తున్నాయి. దీనికి పరిష్కారం ఏంటి? – ఓ సోదరి


డియర్ వసుంధర



- సూరపనేని పద్మావతి, డెర్మటాలజిస్ట్

మీ ముఖం రంగు... శరీర వర్ణం కంటే భిన్నంగా ఉందని రాశారు. మెలస్మా అయితే, సాధారణంగా నుదురు, బుగ్గలు, ముక్కు... ఇలా మార్క్ చేసినట్లుగా కొన్ని ప్రాంతాల్లోనే కనిపిస్తుంది. మిగిలిన చర్మం అంతా మామూలుగానే ఉంటుంది. మీ సమస్య ఫేషియల్ మెలనోసిస్ కావొచ్చు. ఇందుకు రకరకాల కారణాలు ఉండొచ్చు. ముఖ్యంగా ఎండకు రంగు మారే చర్మతత్వం అయితే, దీర్ఘకాలంలో ఇలా మారే అవకాశం ఉంది. లేదంటే మీరు వేసుకునే హెయిర్ డై, రాసుకునే ఆయిల్స్ వంటివి పడనప్పుడు ఇలా జరుగుతుంది. ఇది మాత్రమే కాదు... వాడే ఫేస్ క్రీమ్స్, ఫేషియల్స్‌లోని ఏదైనా కెమికల్ పడకపోయినా పిగ్మెంటేషన్ రావొచ్చు. అందుకే, ముందు వీటిల్లో ఏదైనా పనిని మీరు కొత్తగా మొదలుపెట్టారేమో గమనించండి. దానివల్లే ఇలా జరిగిందేమో పరిశీలించి సరిచేసుకోండి. సున్నిత చర్మతత్వం ఉన్న మీలాంటివాళ్లు ఫిజికల్ బ్లాకర్స్ ఉన్న సన్‌స్క్రీన్ లోషన్‌ని ఎంచుకోవాలి. ఇందులో హానికారక కెమికల్స్ ఉండవు. జింక్ ఆక్సైడ్, టైటానియం డయాక్సైడ్‌లు స్కిన్ మీద లేయర్స్‌ని ఫామ్ చేసి సూర్యకిరణాల నుంచి రక్షణనిస్తాయి. చర్మ మృదుత్వం కోసం స్కిన్ లైటెనింగ్ ఏజెంట్స్ ఉన్న రిసోర్సినాల్, గ్లైకాలిక్ యాసిడ్ వంటివి వాడొచ్చు. పిగ్మెంటేషన్ తగ్గేందుకు ఆర్బుటిన్, కోజిక్, ఎజిలిక్, హైడ్రోక్వినాన్ యాసిడ్స్ ఉన్న రకాల్ని వాడాలి. ఎండలోకి వెళ్తే చర్మం రంగు మారే లక్షణం ఉంటే పగటి పూట సన్‌స్క్రీన్‌తోపాటు యాంటీ ఆక్సిడెంట్స్ క్రీములు అంటే నియాసినమైడ్, విటమిన్ సి రకాల్ని ఎంచుకుంటే సరి. తీసుకునే ఆహారంలోనూ యాంటీఆక్సిడెంట్స్ అధికంగా ఉండే బొప్పాయి, మామిడి, క్యారెట్, బీట్‌రూట్, దానిమ్మ వంటివి తీసుకోవాలి. ఈ జాగ్రత్తలన్నీ అనుసరిస్తే క్రమంగా మీ సమస్య దూరమవుతుంది.

రంగవల్లిక




ఉప్పులూరి ప్రణవి, కాకినాడ

20 చుక్కలు 20 వరుసలు

15 చుక్కలు 1 వచ్చేవరకూ



ప్రభావతి, రాయవోటి




రాణీ రావ్, హైదరాబాద్

18 చుక్కలు 7 వచ్చేవరకు మధ్యచుక్క

మీ ముగ్గులు **9154091911** నంబరుకు వాట్సాప్ చేయొచ్చు.

మా చిరునామా:
వసుంధర, ఈనాడు
ప్రధాన కార్యాలయం,
రామోజీ ఫిల్మ్‌సిటీ,
అనాజ్‌పూర్,
అబ్దుల్లాపూర్‌మెట్ మండలం,
రంగారెడ్డి జిల్లా,
తెలంగాణ - 501 512.
Email:vasundhara@eenadu.in

బంగారం - వెండి



27న ముగింపు

	బంగారం (24క్యా)	ఆర్నమెంట్ (22క్యా)	వెండి (కిలో)
హైదరాబాద్	1,43,290	1,29,850	2,44,535
విజయవాడ	1,38,905	1,33,330	2,53,000
ప్రొద్దుటూరు	1,44,000	1,32,480	2,53,000
రాజమహేంద్రవరం	1,41,220	1,29,450	2,74,000
విశాఖపట్నం	1,41,220	1,29,450	2,55,000
తమిళనాడు	-----	1,31,000	2,85,000

aha@eenadu.in

ఆహా! ..ఏమి రుచి

ఘుమఘుమలాడే రవ్వ సాంబార్

పాఠక వంట



గోధుమరవ్వతో ఉప్మా, కిచిడీ కాకుండా రవ్వ సాంబార్ చేసి చూడండి. ఇందుకోసం... కందిపప్పు- అర కప్పు, ఉల్లిపాయ, మునక్కాడ, చిలకడదుంప- ఒక్కొకటి, బెల్లం, కారం- స్పూన్, బెండకాయలు- 4, వంకాయలు- 2, ఉప్పు- తగినంత, సాంబార్ పౌడర్ - ముప్పావు స్పూన్, చింత పండు- నిమ్మకాయంత, నెయ్యి- 3 స్పూన్లు, కొత్తిమీర తరుగు- గుప్పెడు, గోధుమరవ్వ- ముప్పావు కప్పు, ఆవాలు, మినప్పప్పు, జీలకర్ర- అర స్పూన్, మెంతులు- పావుస్పూన్, కరివేపాకు- 2 రెబ్బలు, ఇంగువ- చిటికెడు తీసుకోవాలి. సగం నెయ్యితో గోధుమరవ్వను వేయించాలి. చింతపండును కడిగి నానబెట్టి గుజ్జు తీయాలి. కందిపప్పును వేయించి, ఉడికించి, మెత్తగా మెదపాలి. ఈలోగా కూరగాయలు తరిగి నాలుగు గ్లాసుల నీళ్లు, పసుపు చేర్చి ఉడికించాలి. అందులో రవ్వ, పప్పు, సాంబార్ పౌడర్, కారం, బెల్లం, ఉప్పు జతచేసి మరిగించాలి. కూరగాయ ముక్కలు మెత్తబడ్డాక.. పల్చగా ఉండగానే దించేయాలి. లేకుంటే చల్లారాక మరింత చిక్కబడుతుంది. మిగిలిన నెయ్యి వేడిచేసి ఆవాలు, మెంతులు, మినప్పప్పు, జీలకర్ర, కరివేపాకు, ఇంగువలతో తాలింపు వేసి.. కొత్తిమీర చల్లితే ఘుమఘుమలాడే 'రవ్వ సాంబార్' తయారైపోతుంది. ఇందులోకి వడియాలు, అప్పడాలు సూపర్ కాంబినేషన్. ఒకసారి రుచి చూశారంటే మళ్లీమళ్లీ కావాలనిపిస్తుంది.




– ఐ.సుచరిత, బెంగళూరు

కబుర్లతో కమ్మటి విందు

కొత్త సంవత్సరం వచ్చేస్తోంది. ఉత్సాహాలను మోసుకొస్తోంది. మది దోచిన సంగతులు, మనసు లోలోపలి ముచ్చట్లు పంచుకోవాలంటే ఆత్మీయులతో విందు ఆరగించాల్సిందే. వాళ్ల కోసం ఈ ప్రత్యేక రెసిపీలు చేసేయండి. కబుర్లతో పాటు కమ్మటి రుచులూ ఆస్వాదించండి!

స్టఫ్డ్ మష్రూమ్



కావలసినవి: మష్రూమ్స్ - 12, ఉల్లిపాయ - ఒకటి, పచ్చిమిర్చి - 2, వెల్లుల్లి తరుగు - స్పూన్, క్యాప్సికం ముక్కలు - 2 టేబుల్ స్పూన్లు, చీజ్ - 4 టేబుల్ స్పూన్లు, ఉప్పు - రుచికి తగినంత, మిరియాల పొడి - అర స్పూన్, గరం మసాలా - పావు స్పూన్, నూనె, బ్రెడ్ పొడి - 2 టేబుల్ స్పూన్ల చొప్పున, వెన్న - రెండు స్పూన్లు, కొత్తిమీర తరుగు - గుప్పెడు

తయారీ: ఉల్లి, మిర్చిలను సన్నగా తరగాలి. చీజ్‌ను తురమాలి. పుట్ట గొడుగుల కాడలు తీసేసి, సన్నగా తరిగి పక్కనుంచాలి. ప్యాన్‌లో నూనె వేడి చేసి, ఉల్లి, పచ్చిమిర్చి, వెల్లుల్లి వేసి కొద్దిగా వేయించాలి. అందులో తరిగిన మష్రూమ్ కాడలు, క్యాప్సికం జోడించాలి. రెండు నిమిషాల తర్వాత.. ఉప్పు, మిరియాల పొడి, గరం మసాలా జతచేసి కలియబెడుతుండాలి. ముక్కలు మెత్తగా అయ్యాక.. సెగ తీసేసి బ్రెడ్ పొడి, చీజ్, కొత్తిమీర వేయాలి. ఇలా తయారుచేసిన స్టఫింగ్ మిశ్రమాన్ని.. కాడలు తీసేసిన మష్రూమ్ కప్పుల్లో నింపి.. వెన్నలో వేయించాలి. అవెన్‌లో అయితే.. 180 డిగ్రీల సెల్సియస్ వద్ద 12 నుంచి 15 నిమిషాలు బేక్ చేయాలి. ఇవి టొమాటో సాస్ లేదా పుదీనా చట్నీతో సర్వ్ చేస్తే ఎంతో టేస్టీగా ఉంటాయి.

కార్న్ పాలక్



కావలసినవి: పాలకూర - 250 గ్రాములు, మినప్పప్పు - 2 టేబుల్ స్పూన్లు, నూనె - రెండున్నర టేబుల్ స్పూన్లు, వెన్న, జీలకర్ర, అల్లం వెల్లుల్లి పేస్ట్ - స్పూన్ చొప్పున, ఉల్లితరుగు - ముప్పావు కప్పు, పచ్చిమిర్చి - 2, మొక్కజొన్న గింజలు - ముప్పావు కప్పు, టొమాటో ముక్కలు - అర కప్పు, ధనియాల పొడి - ఒకటిన్నర స్పూన్లు, మిరియాలు, జీలకర్ర పొడులు, గరం మసాలా - అర స్పూన్ చొప్పున, జీడిపప్పుల పొడి - 3 స్పూన్లు, ఉప్పు - రుచికి తగినంత, కొత్తిమీర తరుగు - గుప్పెడు, ఫ్రెష్ క్రీమ్ - టేబుల్ స్పూన్

తయారీ: పాలకూరను కడిగి, మెత్తగా గ్రైండ్ చేసి ఉంచాలి. మొక్కజొన్న గింజలను ఉడికించాలి. ప్యాన్‌లో నూనె వేడయ్యాక జీలకర్ర వేయాలి. అవి వేగాక.. ఉల్లి తరుగును లేత గోధుమ రంగులోకి మారే వరకూ వేయించాలి. అందులో అల్లం వెల్లుల్లి పేస్ట్, పచ్చిమిర్చి, టొమాటో ముక్కలు జోడించాలి. జీడిపప్పుల, ధనియాల, మిరియాల, జీలకర్ర పొడులు, ఉప్పు, పాలకూర పేస్ట్, మొక్కజొన్న గింజలు జతచేసి.. ఆరేడు నిమిషాలు ఉడికించాలి. చివర్లో గరం మసాలా, క్రీమ్, కొత్తిమీర జోడించి.. ఓ నిమిషం ఉంచి దించేస్తే.. స్పైసీగా, టేస్టీ 'కార్న్ పాలక్' సిద్ధమైపోతుంది.

చాక్లెట్ సందేశ్



కావలసినవి: పాలు - లీటర్, నిమ్మరసం - ఒకటిన్నర స్పూన్లు, పంచదార - నాలుగు టేబుల్ స్పూన్లు, కోకో పౌడర్, డార్క్ చాక్లెట్ - రెండు టేబుల్ స్పూన్ల చొప్పున, వెన్న - స్పూన్, యాలకుల పొడి - చిటికెడు, డ్రై ఫ్రూట్స్ - మూడు స్పూన్లు, బాదం, పిస్తా పలుకులు - అలంకరించేందుకు

తయారీ: పాలను వేడిచేయాలి. పొంగు వచ్చాక.. సెగ తగ్గించి నిమ్మరసం వేయాలి. విరిగిన పాలను పల్చని వస్త్రంలో వడకట్టి పనీర్‌ను తయారుచేసుకోవాలి. దీన్ని వెడల్పాటి పాత్రలో వేసి.. ఆరేడు నిమిషాల పాటు బాగా కలిపి, మెత్తగా అయ్యేట్లు చేయాలి. ఈ పనీర్ ముద్దకు పంచదార, కోకో పౌడర్ చేర్చి సన్న సెగ మీద వేడిచేయాలి. దానికి డార్క్ చాక్లెట్, వెన్న జతచేసి కలియతిప్పుతుండాలి. మిశ్రమం ప్యాన్‌కు అంటకుండా విడిపోతున్నప్పుడు.. యాలకుల పొడి జోడించి సెగ తీసేయాలి. గోరువెచ్చగా అయ్యాక.. చిన్న భాగాలుగా విడగొట్టి, గుండ్రంగా లేదా బాదుషాల్లా చేసి, పైన డ్రై ఫ్రూట్స్ పలుకులతో గార్నిష్ చేసి.. ఒక అరగంట ఫ్రిజ్‌లో ఉంచాలి. పిల్లలు, పెద్దలు అందరికీ నచ్చే స్వీట్ ఇది. ఎక్కువ ఉడికిస్తే సందేశ్ గట్టిపడుతుందని గుర్తుంచుకోవాలి.

షజవాన్ రైస్



కావలసినవి: బాస్మతి బియ్యం - కప్పు, ఉప్పు - రుచికి తగినంత, నూనె - మూడు స్పూన్లు, క్యారెట్, క్యాప్సికం - రెండు చొప్పున, బీన్స్ - 10, స్వీట్ కార్న్ - పావు కప్పు, పచ్చిమిర్చి - 2, ఉల్లికాడ తరుగు - అర కప్పు, వెల్లుల్లి - నాలుగు రెబ్బలు, వెజిటబుల్ సాస్ - 2 టేబుల్ స్పూన్లు, టొమాటో కెచప్, సోయా, చిల్లీసాస్‌లు - స్పూన్ చొప్పున, చిల్లీ ఫ్లేక్స్ - అర స్పూన్, ఉప్పు - రుచికి తగినంత, నెయ్యి - రెండు టేబుల్ స్పూన్లు

తయారీ: క్యారెట్ మొదలైన వాటిని తరిగి ఉంచాలి. కడిగిన బియ్యంలో తగినన్ని నీళ్లు, కాస్త ఉప్పు, స్పూన్ నూనె వేసి ఉడికించాలి. సగం ఉడికాక దించేసి పక్కనుంచాలి. వెడల్పాటి ప్యాన్‌లో మిగిలిన నూనె వేడి చేసి.. వెల్లుల్లి, పచ్చిమిర్చి, స్వీట్ కార్న్, క్యాబేజీ, క్యారెట్, క్యాప్సికం, బీన్స్ ముక్కలను మూడు నాలుగు నిమిషాలు వేయించాలి. సెగ తగ్గించి.. టొమాటో కెచప్, సోయా, చిల్లీ, వెజిటబుల్ సాస్‌లు, చిల్లీ ఫ్లేక్స్, ఉప్పు, సగం ఉడికించిన అన్నం జోడించాలి. రెండు నిమిషాలు హై ఫ్లేమ్‌లో, ఇంకో రెండు నిమిషాలు సిమ్‌లో ఉంచి దించేసి.. కొత్తిమీర చల్లితే సరిపోతుంది. వేడివేడిగా వడ్డించారంటే.. వహ్వారే షజవాన్ రైస్ అనేస్తారు.

జామకాయలతో క్యాండీ



జామకాయలు పండితే అంతగా నచ్చవు కదూ! కానీ వాటితో క్యాండీ చేస్తే అందరికీ నచ్చేస్తుంది.

అందుకోసం... పండిన జామకాయలు - 4, పంచదార - కప్పు, పంచదార పొడి, నిమ్మరసం - స్పూన్ చొప్పున, యాలకుల పొడి - పావు స్పూన్, నెయ్యి - 2 స్పూన్లు, ఫుడ్ కలర్ - కొద్దిగా తీసుకోవాలి. జామకాయలను కడిగి, గింజల భాగం తీసేసి ముక్కలుగా కోసి ఉడికించాలి. చల్లారాక.. మెత్తగా గ్రైండ్ చేయాలి. ఈ గుజ్జును ప్యాన్‌లో వేసి.. పంచదార, యాలకుల పొడి, ఫుడ్ కలర్ చేర్చి మధ్యస్థమైన సెగ మీద ఉంచాలి. అడుగంటకుండా కలియబెడుతుండాలి. చిక్కబడిన తర్వాత.. నిమ్మరసం, ఒకటిన్నర స్పూన్ల నెయ్యి చేర్చాలి. ముద్దలా మారి.. ప్యాన్‌కు అంటకుండా విడిపోతున్నప్పుడు సెగ తీసేయాలి. మిగిలిన నెయ్యిని పళ్లెంలో రాసి.. మిశ్రమాన్ని సమంగా సర్దాలి. చల్లారిన తర్వాత చతురస్రం లేదా నచ్చిన ఆకృతిలో కట్ చేసి.. పంచదార పొడి చల్లాలి. ఒక రోజంతా ఎండబెడితే. ఎక్కువ రోజులు నిల్వ ఉంటాయి. తీపి ఎక్కువ ఇష్టపడని వాళ్లు పంచదారను కొంచెం తగ్గించవచ్చు.

బొప్పాయి పానీయం చేసేద్దాం!

బొప్పాయి పండ్లతో కాన్సన్ట్రేట్ చేసి ఉంచితే.. శీతల పానీయాలకు బదులు ఎంచక్కా సేవించవచ్చు.

కావలసినవి: బొప్పాయిపండు - కిలో, పంచదార- 750 గ్రా, నిమ్మరసం- 2 స్పూన్లు, సోడియం బెంజోయేట్- కాస్త



తయారీ: బొప్పాయి పండు తొక్క, గింజలు తొలగించి ముక్కలుగా కోసి, ఉడికించి పక్కనుంచాలి. పంచదారలో తగినన్ని నీళ్లు పోసి తీగ పాకం వచ్చే వరకూ మరిగించాలి. అందులో బొప్పాయి గుజ్జును జోడించాలి. అడుగంటకుండా మధ్యమధ్యలో కలియబెడుతుండాలి. పావుగంట తర్వాత సెగ తీసేసి.. నిమ్మరసం కలపాలి. పూర్తిగా చల్లారిన తర్వాత సోడియం బెంజోయేట్ జతచేసి కలియతిప్పాలి. దీన్ని తడి లేని, గాలి చొరబడని సీసాలో పోసి రిఫ్రిజిరేటర్‌లో భద్రం చేసుకోవాలి. తాగదలచినప్పుడు గ్లాస్ నీళ్లలో రెండు టేబుల్ స్పూన్ల చిక్కటి పానీయం కలిపితే సరిపోతుంది. బాగా పండిన బొప్పాయి వాడితే రంగూ రుచీ కూడా బాగుంటాయి. హైఫ్లేమ్‌లో ఉడికిస్తే రంగు మారుతుంది కాబట్టి సెగ పెంచకూడదు. సోడియం బెంజోయేట్ వేయడం వల్ల ఎక్కువకాలం నిల్వ ఉంటుంది. సులువే కాబట్టి ఒకసారి చేసి చూడండి!

ఏడిపించిన కోడి.. నవ్వించిన అమ్మ!

బ్యాచిలర్స్ కిచెన్



అమ్మ ఫోన్ చేసి 'ఏరా పెద్దోడా.. ఏం వండావ్?' అనడిగితే 'ఏదో వండుకున్నాలేమ్మా' అన్నాను నిరాశగా. 'కూర మాడిందా?' అని నవ్వితే ఉక్రోషం వచ్చి 'నువ్వు వంట నేర్పి ఉంటే నాకీ తంటా ఉండేదా?' అన్నాను. 'అసలే రోజన్నా వంటగదిలోకి వచ్చావా? సర్లే.. ఇప్పుడేం కష్టమొచ్చిందో చెప్పు' అంది లాలనగా. 'చికెన్ ఫ్రై..' అని నా మాట పూర్తవ్వకుండానే 'ఎంత ఎదిగిపోయావురా!' అంది సంబరంగా. 'పోమ్మా.. అది ఫ్రై కాదు, క్రై అయ్యింది. అంతా పద్ధతిగానే చేశా. చికెన్ షాప్‌కి వెళ్లా, ముక్కలు కొట్టించి తెచ్చా! మసాలాలతో మ్యారినేట్ చేసి ఉడికించా.. కొత్తిమీరతో సహా అన్నీ వేశా. కానీ ఘోరంగా ఉంది' అన్నాను. 'ఇంతకీ ఏమైంది? సరిగ్గా ఉడకలేదా? ఏదన్నా ఎక్కువో తక్కువో అయ్యిందా?' అనడిగింది. దుఃఖం తన్నుకొచ్చి 'ఉప్పు ఎక్కువైపోయింది.. ఇప్పుడు మొత్తం పడేయాల్సిందేగా!' అన్నాను. 'అక్కర్లేదు, ఎంచక్కా రిపేర్ చేసేయొచ్చు. రెండు బంగాళదుంపలు తీసుకో!' అంది అమ్మ. 'ఇప్పుడు ఆలూఫ్రై చేసే ఓపికలేదమ్మా' అన్నాను చిరాగ్గా. 'చెప్పేది పూర్తిగా వినవా? రెండు బంగాళదుంపలు చెక్కు తీసి, నాలుగు ముక్కలుగా కోసి కూరలో వెయ్యి. కొన్ని నీళ్లు పోసి, రెండు నిమిషాలు సన్న సెగ మీదుంచి దించెయ్యి. చికెన్‌లో ఉప్పు తగ్గిపోతుంది' అంది. 'అంతేనా.. నువ్వు సూపర్ అమ్మా!' అని ఫోన్ పెట్టేశా. అమ్మ సలహా అద్భుతంగా పనిచేసింది. ఉప్పు తగ్గడమే కాదు, కర్రీకి మరింత రుచి వచ్చింది. ఈ చిట్కా పెళ్లయ్యాక మా ఆవిడకి కూడా చెప్పా! అదన్నమాట ఫ్రెండ్స్. నా బ్రహ్మచారి జీవితంలో మా అమ్మ ఇచ్చిన టిప్స్‌తో ఓ పుస్తకమే రాయొచ్చంటే నమ్మండి!

– ఎస్.సుమంత్, పలాస, కాశీబుగ్గ

కేరళ స్టైల్ ఫిష్ మోలీ

షెఫ్ స్పెషల్

తక్కువ కారంతో గుజ్జుగా చేసే కేరళ ప్రాంతపు వంటకం ఫిష్ మోలీ. ఇది అన్నం, రొట్టెలు ఎందులోకైనా బాగుంటుంది.

కావలసినవి: వంజరం చేప ముక్కలు - అర కిలో, కొబ్బరి పాలు - రెండు కప్పులు, ఉల్లిపాయలు - 2, పచ్చిమిర్చి - 3, అల్లం తరుగు ఒకటిన్నర స్పూన్లు, వెల్లుల్లి - 4 రెబ్బలు, కరివేపాకు - 2 రెబ్బలు, పసుపు - స్పూన్, మిరియాల పొడి - అర స్పూన్, ఉప్పు - తగినంత, నూనె - 2 టేబుల్ స్పూన్లు, నిమ్మరసం - ఒకటిన్నర స్పూన్



తయారీ: చేప ముక్కలకు కాస్త ఉప్పు, పసుపు పట్టించి పావుగంట పక్కనుంచాలి. ఉల్లిపాయలను పొడుగ్గా ముక్కలు కోసుకోవాలి. కడాయిలో నూనె వేడి చేసి కరివేపాకు, వెల్లుల్లి రెబ్బలు వేయాలి. అవి వేగాక.. ఉల్లి తరుగును దోరగా వేయించాలి. అందులో అల్లం, పచ్చిమిర్చి, మిరియాల పొడి జోడించాలి. మంచి వాసన వస్తుండగా.. పసుపు, మ్యారినేట్ చేసిన చేప ముక్కలు జతచేసి మూత పెట్టి ఉడికించాలి. చివర్లో కొబ్బరి పాలు పోసి.. ముక్కలు విరగకుండా మెల్లగా కలియతిప్పుతుండాలి. నిమిషం తర్వాత సెగ తీసేసి.. నిమ్మరసం చేర్చాలి. ఈ కూరలో కారం వేయరు. పచ్చిమిర్చి, మిరియాల పొడి మాత్రమే వేస్తారు. కొబ్బరి పాలను ఎక్కువసేపు సెగ మీదుంచితే విరిగినట్లవుతాయి కాబట్టి చివర్లోనే పోయాలి.

నకిలీ మద్యం కేసులో మరో ఛార్జిషీట్!

- నాలుగైదు రోజుల్లో సమర్పించే అవకాశం
- ఇందులో జోగి సోదరుల పాత్రపై ఆధారాలు

ఈనాడు, అమరావతి: ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నంలో బయటపడిన నకిలీ మద్యం వ్యవహారంలో మిగిలిన నిందితులపై అభియోగపత్రం దాఖలు చేసేందుకు సిట్ అధికారులు కసరత్తు చేస్తున్నారు. భవానీపురం ఎక్సైజ్ స్టేషన్‌లో నమోదైన ఈ కేసులో ఇప్పటివరకు మొత్తం 25 మందిని నిందితులుగా సిట్, ఎక్సైజ్ అధికారులు తేల్చారు. వీరిలో 11 మందిపై రెండు అభియోగ పత్రాలను విజయవాడ ఎక్సైజ్ కోర్టులో ఫైల్ చేశారు. అద్దేపల్లి జనార్దనరావు, జగన్మోహన్‌రావు, రవి, బాదల్ దాస్, ప్రదీప్ దాస్, శ్రీనివాస్‌రెడ్డి, కల్యాణ్, తిరుమలశెట్టి శ్రీనివాసరావు, రమేష్‌బాబు, సతీష్, అల్లా బక్ష్‌పై ఛార్జిషీట్ వేశారు. మరో 14 మంది మిగిలారు. వీరిలో ఇద్దరు (మనోజ్‌కుమార్, సెంథిల్) పరారీలో ఉన్నారు. మనోజ్‌కు జనవరి 6 వరకు అరెస్టు చేయకుండా రక్షణ ఉంది.

■ మిగిలిన నిందితుల్లో కీలకమైన వైకాపా నేత జోగి రమేష్, ఆయన సోదరుడు రాము నవంబరు 2న అరెస్టయ్యారు. వీరిపై ఛార్జిషీట్ దాఖలు చేయడానికి గడువు (60 రోజులు) ఐదు రోజుల్లో ముగుస్తుంది. ఈ నేపథ్యంలో వీరితో పాటు ఒకేసారి మిగిలినవారిపై కూడా ఛార్జిషీట్ వేసేందుకు సిట్ అధికారులు సన్నద్ధమవుతున్నారు. ఇంకా అరెస్టు కావాల్సిన ఇద్దరి పేర్లను కూడా చేర్చనున్నట్లు తెలిసింది. దీనిపై ఇప్పటికే వారు న్యాయ సలహా కోసం లేఖ రాసినట్లు తెలిసింది.

■ త్వరలో దాఖలు చేయబోయే అనుబంధ ఛార్జిషీట్‌లో ముఖ్యంగా జోగి సోదరుల పాత్ర గురించి ప్రస్తావించనున్నారు. ప్రధాన నిందితులైన అద్దేపల్లి సోదరులతో వీరి ఆర్థిక, స్నేహ బంధం గురించి పేర్కొననున్నారు.

ఐదేళ్లలో అన్నీ విద్యుత్, సీఎన్‌జీ బస్సులే

- డీజిల్ బస్సుల స్థానంలో వీటినే తీసుకోనున్న ఆర్టీసీ
- అత్యధికంగా 6,494 విద్యుత్ బస్సులు
- 2,075 డీజిల్ బస్సులు.. సీఎన్‌జీ, విద్యుత్ బస్సులుగా మార్పు

ఈనాడు, అమరావతి: ఏపీఎస్‌ఆర్టీసీలో ఇప్పుడున్న డీజిల్ బస్సుల స్థానంలో.. భవిష్యత్తులో అన్నీ విద్యుత్, సీఎన్‌జీతో నడిచే బస్సులే ఉండాలంటూ సీఎం చంద్రబాబు ఇచ్చిన ఆదేశాలతో.. అధికారులు దీనిపై ప్రణాళిక సిద్ధం చేశారు. 2026-27 ఆర్థిక సంవత్సరం నుంచి 2030-31 వరకు ఐదేళ్లలో మొత్తం 8,819 విద్యుత్, సీఎన్‌జీ బస్సులు ప్రవేశపెట్టేందుకు కసరత్తు ఆరంభించారు. వీటివల్ల పర్యావరణ పరిరక్షణతో పాటు, ప్రయాణికులకు అధునాతన బస్సులు అందుబాటులోకి వచ్చినట్లు అవుతుంది.

- ఆర్టీసీలో 11,499 బస్సులు ఉన్నాయి. వీటిలో సంస్థ సొంత బస్సులు 8,679 కాగా, మిగిలిన 2,770 అద్దె బస్సులు.
- వీటిలో 2,630 బస్సులకు 2031-32 నుంచి 15 ఏళ్లు నిండుతాయి. ఇందులో సంస్థ సొంత బస్సులు 1,941, అద్దె బస్సులు 689 ఉన్నాయి.
- మిగిలిన 8,819 బస్సులకు 2031 కంటే ముందే కాలం చెల్లుతుంది. వీటిస్థానంలో విద్యుత్, సీఎన్‌జీ బస్సులు తీసుకోనున్నారు.
- ఇందులో 6,494 విద్యుత్ బస్సులను అద్దె ప్రాతిపదికన కొత్తగా తీసుకుంటారు.
- అలాగే 1,075 డీజిల్ బస్సుల్లో 5-6 లక్షల కి.మీ. తిరిగినవాటిని.. విద్యుత్ బస్సులుగా రెట్రో ఫిట్‌మెంట్ చేయనున్నారు.
- మరో 1,000 డీజిల్ బస్సులను సీఎన్‌జీతో నడిచేలా రెట్రోఫిట్‌మెంట్ చేయనున్నారు.
- రాయలసీమ జిల్లాల్లో థింక్ గ్యాస్, విజయవాడలో భాగ్యనగర్ గ్యాస్, మేఘా, విశాఖలో ఐఓసీ సీఎన్‌జీ సరఫరా చేస్తున్నాయి. వీటిలో తక్కువ రేట్లకు సీఎన్‌జీ సరఫరా చేసేవాటికి అవకాశం కల్పిస్తారు.
- 2026-27లో 1,450 విద్యుత్ బస్సులను తీసుకోవాలని ఇటీవల సీఎం చంద్రబాబు.. ఆర్టీసీ అధికారులకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు.

ఏ ఏడాది ఎన్ని విద్యుత్, సీఎన్‌జీ బస్సులు

ఆర్థిక సంవత్సరం	బస్సులు
2026–27	1,450
2027–28	1,750
2028–29	1,720
2029–30	1,615
2030–31	2,284
మొత్తం	8,819

1,050 బస్సులకు కి.మీ.కి రూ.22-24 రాయితీ

ప్రధానమంత్రి ఈ-బస్ సేవ పథకం కింద రాష్ట్రంలోని 11 నగరాలకు ఇప్పటికే 750 విద్యుత్ బస్సులను కేంద్రం మంజూరుచేసింది. వీటిని పినాకిల్ ఇండియా అనే సంస్థ నడపనుంది. ఆర్టీసీ-పినాకిల్ మధ్య ఒప్పందం జరిగింది. ఆ నగరాల్లోని ఆర్టీసీ డిపోల్లో ఛార్జింగ్ పాయింట్లు, సబ్‌స్టేషన్ల నిర్మాణం, హెచ్‌టీ విద్యుత్ లైన్లు వేయించడం.. తదితరాలకు రూ.237.40 కోట్లు ఖర్చవుతుందని అంచనా వేశారు. ఇందులో హెచ్‌టీ లైన్ విద్యుత్ సదుపాయం కోసం రూ.106.11 కోట్లను పూర్తిగా కేంద్రం వెచ్చిస్తుంది. డిపోలో ఆయా నిర్మాణాలకు రూ.131.29 కోట్లవుతుందని అంచనా వేయగా.. ఇందులో 73.71 కోట్లను కేంద్రం ఇస్తుంది. ఆర్టీసీ రూ.57.58 కోట్లు వెచ్చించాలి. కేంద్రం ఆమోదం లభించాక ఈ ఆర్థిక సంవత్సరంలోనే విద్యుత్ బస్సులు రానున్నాయి.

- ఈ బస్సుల్లో 12 మీటర్ల పొడవు ఉండేవాటికి కి.మీ.కు రూ.72.55 చొప్పున, 9 మీటర్ల పొడవుండే బస్సుకు కి.మీ.కు రూ.62.17 చొప్పున గుత్తేదారుకు చెల్లించాలి.
- ఇందులో 12 మీటర్ల బస్సుకు కి.మీ.కు రూ.24 చొప్పున, 9 మీటర్ల బస్సుకు కి.మీ.కు రూ.22 చొప్పున కేంద్రం రాయితీగా గుత్తేదారు సంస్థకు చెల్లిస్తుంది.
- మిగిలిన మొత్తాన్ని ఆర్టీసీ చెల్లించాలి. ఈ ఒప్పందం 11 ఏళ్లపాటు కొనసాగనుంది.
- వీటితోపాటు మరో 300 విద్యుత్ బస్సులను తిరుమల-తిరుపతి ఘాట్‌లో నడిపేందుకు పీఎం ఈ-బస్ సేవ కింద కేంద్రం సమ్మతి తెలిపింది.

రూ.90 లక్షల గంజాయి స్వాధీనం

థర్మోకోల్ పెట్టెల్లో తరలిస్తుండగా పట్టివేత

గన్నవరం గ్రామీణం, న్యూస్‌టుడే: ఎవరికీ అనుమానం రాకుండా థర్మోకోల్ పెట్టెల్లో గంజాయి తరలిస్తున్న ముఠాను కృష్ణా జిల్లా ఈగల్ బృందం, ఉంగుటూరు మండలం ఆత్కూరు పోలీసులు సంయుక్తంగా పట్టుకున్నారు. కర్ణాటకలోని చామరాజనగర్ జిల్లాకు చెందిన సన్నప్ప మారెప్పకు విశాఖపట్నానికి చెందిన బంటు తాతారావు, బొమ్మినాయని మోహన్‌రావు, గండేపల్లి అభిరామ్ సంపత్, పాయకరావుపేటకు చెందిన గరికన రాజేశ్‌లతో పరిచయం ఏర్పడింది. ఒడిశాలోని జనతా గ్రామంలో రెండు కిలోల చొప్పున ఉన్న 90 పొట్లాల గంజాయిని కొనుగోలు చేసిన మారెప్ప.. మిగతా నలుగురి సాయంతో బెంగళూరుకు తరలించేందుకు సిద్ధమయ్యాడు. గంజాయి పొట్లాలను ఎవరికీ అనుమానం రాకుండా థర్మోకోల్ పెట్టెల్లో ఉంచి, వాటిని మినీ ట్రక్‌లోకి ఎక్కించారు. దాని ముందు ఓ కారులో వెళ్తూ.. చెన్నై-కోల్‌కతా జాతీయ రహదారిపై పెద్దఅవుటపల్లి వద్ద వాహనాలను నిలిపారు. స్థానికులకు అనుమానం రావడంతో ఈగల్ బృందానికి సమాచారమిచ్చారు. వారు ఆత్కూరు పోలీసులతో కలిసి వాహనాలను తనిఖీ చేయగా.. సుమారు రూ.90 లక్షలు విలువజేసే 108 కిలోల గంజాయి ఉన్నట్లు గుర్తించి, స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అరెస్టు చేసినట్లు పోలీసులు శనివారం తెలిపారు.

ప్రజలు హర్షించేలా విద్యుత్తు సంస్కరణలు

మంత్రి గొట్టిపాటి రవికుమార్



అర్హులకు కారుణ్య నియామక పత్రాలు అందిస్తున్న మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు. చిత్రంలో విష్ణుకుమార్‌రాజు

విశాఖపట్నం (మధురవాడ, సాగర్‌నగర్), న్యూస్‌టుడే: విద్యుత్తు విభాగంలో నూతన సంస్కరణలు అమలుచేస్తూ రాష్ట్ర ప్రజలు హర్షించేలా ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాలతో వేగవంతంగా అడుగులు వేస్తున్నామని మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. విశాఖ బీచ్‌రోడ్డు సాగర్‌నగర్ సమీపంలోని ఏపీఈపీడీసీఎల్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ ఫర్ ఎనర్జీ ట్రాన్సిషన్ (సీఓఈఈటీ) భవనంలో శనివారం 34 మందికి కారుణ్య నియామకపత్రాలను ఆయన అందించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. సరఫరాలో అంతరాయం లేకుండా నాణ్యమైన విద్యుత్తు సరఫరా చేయడంతో పాటు ప్రజలపై విద్యుత్తు భారం తగ్గించామన్నారు. ఎస్సీ, ఎస్టీ, గిరిజన తండాల్లో రూ.130 కోట్లతో దాదాపు 40వేల విద్యుత్తు కనెక్షన్లు ఇచ్చామని, టైగర్ రిజర్వ్ ప్రాంతాల్లో నివాసిత గిరిజనులకు సౌరవిద్యుత్తు అందిస్తున్నామన్నారు. గడచిన 18 నెలల్లో రాష్ట్రవ్యాప్తంగా 287 మందికి కారుణ్య నియామకాలు అందించి వారి కుటుంబాల్లో వెలుగులు నింపామన్నారు. ఈపీడీసీఎల్ అధికారులు, సిబ్బంది పనితీరును ప్రశంసించారు. తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, ఉత్తర ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు మాట్లాడుతూ... కారుణ్య నియామకాలు పొందినవారు విధి నిర్వహణలో బాధ్యతాయుతంగా వ్యవహరించి సంస్థకు, ప్రభుత్వానికి పేరు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో భాగంగా ఏపీఈపీడీసీఎల్ సీఎండీ ఇమ్మడి పృథ్వీతేజ్ సంస్థ పురోగతిని, అమలు చేస్తున్న పథకాలను వివరించారు.

అభ్యంతరకర పదాలు దొర్లాయి.. మర్యాదగా వ్యవహరిస్తా

- తెలంగాణ మహిళా కమిషన్ ముందు నటుడు శివాజీ వెల్లడి

హైదరాబాద్, న్యూస్‌టుడే: సినిమా ప్రమోషన్ కార్యక్రమంలో మహిళల దుస్తులపై తాను చేసిన వ్యాఖ్యల్లో అభ్యంతరకరమైన పదాలు దొర్లాయని... తన మాటల్ని వెనక్కు తీసుకుంటున్నట్లు సినీ నటుడు శివాజీ వెల్లడించారు. భవిష్యత్తులోనూ కమిషన్ నుంచి పిలుపొస్తే హాజరవుతానని తెలిపారు. ఎవరిపైనా వ్యతిరేక ఉద్దేశాలు లేవని, ఎలాంటి దుస్తులు ధరించాలన్నది వారి వ్యక్తిగతమని... ఒక తండ్రిలా నా దగ్గర ఉన్న హీరోయిన్లకు నా పిల్లలకు చెప్పినట్లు చెప్పానని వివరించారు. ఇక ముందు మర్యాదగా వ్యవహరిస్తానన్నారు. ఈ నెల 22న జరిగిన దండోరా సినిమా ప్రమోషన్‌లో శివాజీ చేసిన వ్యాఖ్యలపై తెలంగాణ మహిళా కమిషన్ సుమోటోగా నోటీసులు జారీ చేసింది. శనివారమిక్కడ ఛైర్‌పర్సన్ నేరెళ్ల శారద ఆధ్వర్యంలోని కమిషన్ ముందు హాజరై శివాజీ వివరణ ఇచ్చారు. 'దాదాపు రెండు గంటలు జరిగిన విచారణలో శివాజీ తన తప్పును అంగీకరించారు. మహిళలపై దాడులకు దుస్తులే కారణమైతే చిన్నారులు, వృద్ధులపై దాడులకు కారణమేమిటని ఛైర్‌పర్సన్ ప్రశ్నించారు. సినీ పరిశ్రమలో ఎంతో మంది మహిళలు వేధింపులకు గురవుతున్నప్పుడు కాస్టింగ్ కౌచ్‌పై స్పందించాల్సిన బాధ్యత లేదా అని అడిగారు. ఆయన సమాధానమివ్వలేకపోయారు. ఇకపై తప్పుడు వ్యాఖ్యలు చేయకూడదని హెచ్చరించారు'' అంటూ మహిళా కమిషన్ కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది. అనంతరం నటుడు శివాజీ మీడియాతో మాట్లాడుతూ ''నాతో కెరీర్ మొదలుపెట్టినవారే, నాతో ఉంటూనే వ్యతిరేక కుట్రలు చేస్తున్నారు. నేను సినిమా కాకపోతే వ్యవసాయం చేసుకొని బతుకుతా. ఆత్మాభిమానమే ముఖ్యం. మంచి మాటలు చెప్పడం మానుకోవాలని అర్థమైంది'' అని అన్నారు.



మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ శారదకు వివరణ పత్రం అందిస్తున్న శివాజీ

దుర్గగుడిలో విద్యుత్తు సరఫరా నిలిపివేత

- 3 గంటలకు పైగా ఇబ్బందులు పడ్డ భక్తులు

ఈనాడు, అమరావతి - న్యూస్‌టుడే, ఇంద్రకీలాద్రి: రాష్ట్రంలోని ప్రముఖ పుణ్యక్షేత్రాల్లో ఒకటైన విజయవాడ దుర్గ గుడికి శనివారం విద్యుత్తు అధికారులు కనెక్షన్ కట్ చేశారు. బకాయిలు చెల్లించలేదని సరఫరా నిలిపివేశారు. దీంతో ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.40 వరకు 3 గంటలకు పైగా విద్యుత్తు సరఫరా నిలిచిపోయింది. దుర్గ గుడి నుంచి తమకు రూ.3.08 కోట్ల బకాయిలు ఉన్నాయని, అవి చెల్లించలేదని విద్యుత్తు అధికారులు సరఫరాను నిలిపివేశారు. వేల మంది భక్తులు ఉన్న సమయంలో ఇలా చేయడంపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

నిలిచిపోయిన లిఫ్టులు

ఇంద్రకీలాద్రిపై ఉన్న తాగునీటి రిజర్వాయర్లు నింపేందుకు సైతం ఆలయ అధికారులు తంటాలు పడ్డారు. 11 సర్వీసులను ఒకేసారి కట్ చేయడంతో లిఫ్టులు నిలిచిపోయాయి. దీంతో నిత్యాన్నదానానికి సైతం ఇబ్బందులు తలెత్తాయి. నివేదన సమయం కావడంతో ఉదయం 11.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 వరకు వేల మంది భక్తులు క్యూలైన్లలో వేచి ఉన్నారు. ఆలయ అధికారులు జనరేటర్లు ఆన్‌చేసి సమస్య తీవ్రతను తగ్గించేందుకు ప్రయత్నించారు. సోలార్ ప్లాంట్ నుంచి ఉత్పత్తి చేసి గ్రిడ్‌కు అనుసంధానిస్తున్న విద్యుత్తు యూనిట్ల లెక్కలు తేల్చాలని ఆలయ అధికారులు కోరుతున్నారు. విద్యుత్తు అధికారులు ఇచ్చిన నోటీసుల్లో రూ.30 లక్షల వరకు జరిమానాలు ఉన్నట్లు తెలిసింది. సోలార్ కరెంటు బిల్లును మినహాయించుకొని ఇంకా ఏమైనా చెల్లించాల్సి వస్తే.. ఆ మొత్తాన్ని కట్టేందుకు సిద్ధంగా ఉన్నామని ఆలయ అధికారులు వెల్లడించారు. వాణిజ్య సంస్థ మాదిరిగా సీపీడీసీఎల్ వ్యవహరించడం ఏమిటని ప్రశ్నించారు. విద్యుత్తు శాఖ అధికారుల వాదన మరోలా ఉంది. ఈఆర్‌సీ నిబంధనల ప్రకారం ఒక కనెక్షన్‌కు 500 కిలోవాట్ల ప్లాంట్‌కే అనుమతి ఉందని, కానీ ఒక మెగావాట్ సామర్థ్యం ఉన్న సోలార్ ప్లాంట్‌ను ఏర్పాటు చేశారని చెప్పారు. దీని వల్ల సాంకేతిక సమస్యలు ఏర్పడ్డాయని, వినియోగించుకున్న విద్యుత్తు తాలూకా బిల్లులు చెల్లించాలని స్పష్టంచేశారు. సోలార్ ప్లాంట్ నుంచి ఉత్పత్తి అయ్యే విద్యుత్తును గ్రిడ్‌కు అనుసంధానం చేస్తున్నట్లు ఆలయ అధికారులు అంటున్నారు. మొత్తంగా ఈ వ్యవహారం రెండు శాఖల మధ్య వివాదాన్ని రాజేసింది.

తీవ్రంగా పరిగణించిన మంత్రులు ఆనం, గొట్టిపాటి

దుర్గ గుడికి విద్యుత్తు సరఫరా నిలిపివేయడాన్ని దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, విద్యుత్తు శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌లు తీవ్రంగా పరిగణించారు. రెండు శాఖల అధికారుల వ్యవహారం ప్రభుత్వానికి చెడ్డ పేరు తెచ్చే విధంగా ఉందని వారు ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. మంత్రుల జోక్యంతో మధ్యాహ్నం 1.40 గంటలకు విద్యుత్తు అధికారులు సరఫరాను పునరుద్ధరించారు.

జనవరి 1 నుంచి రైల్వే కొత్త టైం టేబుల్

ఈనాడు, హైదరాబాద్: కొత్త ఏడాదిలో రైళ్ల రాకపోకల్లో మార్పులుచేర్పులు జరగనున్నాయి. కొత్త టైంటేబుల్ జనవరి 1వ తేదీ నుంచి అమల్లోకి వస్తుందని ద.మ.రైల్వే శనివారం తెలిపింది. వందేభారత్ ఎక్స్‌ప్రెస్ సహా మొత్తం 25 రైళ్లు బయల్దేరే వేళలు మారనున్నాయి.

- సికింద్రాబాద్-విశాఖపట్నం (20707) వందేభారత్ ఎక్స్‌ప్రెస్ ప్రస్తుతం సికింద్రాబాద్ నుంచి 5.05 గంటలకు బయల్దేరుతుండగా జనవరి 1 నుంచి 5 గంటలకు ప్రయాణం మొదలవుతుంది. సికింద్రాబాద్-సిర్పూర్ కాగజ్‌నగర్ ఎక్స్‌ప్రెస్ (12757) సికింద్రాబాద్ నుంచి ఉదయం 8.20కి బదులుగా 8.10కి.. సికింద్రాబాద్-భద్రాచలం (17659) కాకతీయ ఎక్స్‌ప్రెస్ 5.25కి బదులుగా 5 గంటలకు సికింద్రాబాద్‌లో బయల్దేరుతుంది. ఈ మార్పుల వివరాలను ఐఆర్‌సీటీసీ వెబ్‌సైట్‌లో చూడొచ్చని ద.మ.రైల్వే సీపీఆర్వో ఎ.శ్రీధర్ తెలిపారు.

కుల, మత విభేదాలు లేని యువతతోనే ప్రగతి సాధ్యం

- విజ్ఞానంతో కూడిన విద్యకు ప్రాధాన్యం ఇవ్వండి
- సిద్ధార్థ విద్యాసంస్థల స్వర్ణోత్సవంలో సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ లావు నాగేశ్వరరావు

ఈనాడు, అమరావతి: 'స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత అంబేడ్కర్ చేసిన ప్రసంగంలో మనకు రాజకీయ స్వాతంత్ర్యమే వచ్చింది, సామాజిక స్వేచ్ఛ రాలేదన్నారు. 75 ఏళ్ల తర్వాత కూడా మనకు సామాజిక స్వాతంత్ర్యం రాలేదు. విద్యార్థుల్లో కుల, మత విభేదాలు తొలగితేనే దేశం ప్రగతి వైపు పరుగు పెడుతుంది. ఇప్పటికైనా దేశం గురించి ఆలోచించి పక్క విద్యార్థిని కులం అడగకుండా విద్యార్థులు మమేకమై పనిచేస్తే వచ్చే 30 ఏళ్లలో ప్రపంచంలో దేశం అగ్రపథాన ఉంటుంది' అని సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ లావు నాగేశ్వరరావు హితవు పలికారు. సిద్ధార్థ అకాడమీ ఆఫ్ జనరల్, టెక్నికల్ ఎడ్యుకేషన్ సంస్థ విజయవాడలో శనివారం నిర్వహించిన స్వర్ణోత్సవాలకు ఆయన ముఖ్య అతిథిగా వచ్చారు. గత 50 ఏళ్లలో సంస్థ పరిధిలోని వివిధ కళాశాలల్లో చదివిన


జస్టిస్ లావు నాగేశ్వరరావును సత్కరిస్తున్న సిద్ధార్థ అకాడమీ కార్యదర్శి పాలడుగు లక్ష్మణరావు, అధ్యక్షుడు ఎం.రాజయ్య

వారిలో వివిధ రంగాల్లో ప్రతిభ కనబరుస్తున్న రామోజీ ఫిల్మ్‌సిటీ ఎండీ విజయేశ్వరి, డీఆర్‌డీవో శాస్త్రవేత్త పద్మజ, సినీ దర్శకులు వీఎన్ ఆదిత్య, రాజ్యసభ మాజీ సభ్యుడు కనకమేడల రవీంద్రకుమార్ లాంటి పలువురు పూర్వ విద్యార్థులను సత్కరించారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

ఎన్నికల్లేకుండా పాలకవర్గం ఎంపిక విశేషం

జస్టిస్ లావు నాగేశ్వరరావు మాట్లాడుతూ.. 'స్థానిక వ్యక్తిగా సిద్ధార్థ కళాశాలల ప్రగతిని కళ్లారా చూశాను. 28వేల మంది విద్యార్థులకు బోధన చేయడం అసాధారణం. 50 ఏళ్లుగా ఎన్నికలు లేకుండా పాలకవర్గాన్ని ఎంపిక చేస్తున్నారంటే వారి నిబద్ధత స్పష్టమవుతోంది. ఇక్కడ చదివిన విద్యార్థులు అన్ని రంగాల్లో అద్భుతాలు చేస్తున్నారు. ఏపీ హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ రఘునందనరావు, జస్టిస్ జయసూర్య ఇక్కడ చదివినవారే. విద్యార్థుల సంఖ్య వేల నుంచి లక్షలకు పెరుగుతుంది. చాలామంది విద్యార్థులు ఫోన్లు చూస్తూ విలువైన సమయాన్ని కోల్పోతున్నారు. విజ్ఞానంతో కూడిన విద్యతోనే విద్యార్థికి గుర్తింపు వస్తుంది. కేవలం డబ్బుల కోసమే పని చేయకండి. దేశంలో చాలామంది తిండి లేని వారు, చదువుకునే స్తోమత లేనివారు ఉన్నారు. మీరు వారిని చదివిస్తే దేశం బాగుపడుతుంది' అని తెలిపారు. సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు రాజయ్య, లక్ష్మణరావు మాట్లాడుతూ.. 'సంస్థ స్వర్ణోత్సవం చేసుకోవడమంటే.. వేల మంది విద్యార్థులు, వారి తల్లిదండ్రుల అండ వల్లే. ఈ వేడుకలు జనవరి నుంచి జరుగుతున్నాయి. ఇప్పటికే అనేక క్రీడా, సాంస్కృతిక పోటీలు, అకాడమీ సెమినార్లు నిర్వహించాం. ఈ వేడుకల్లో పూర్వ విద్యార్థులను సత్కరించడం చాలా ఆనందాన్నిచ్చింది' అని తెలిపారు.

విచ్చలవిడిగా యాంటీబయాటిక్స్ వాడకంతో క్యాటరాక్ట్ బాధితుల్లో సూపర్ బగ్!

- ఎల్వీ ప్రసాద్ కంటి ఆసుపత్రి అధ్యయనంలో వెల్లడి

ఈనాడు, హైదరాబాద్: వైద్యుల సూచనలు లేకుండా విచ్చలవిడిగా యాంటీబయాటిక్స్ వాడేస్తున్నారా.. తస్మాత్ జాగ్రత్త. ఇలాంటి వారిలో మల్టీ డ్రగ్ రెసిస్టెన్స్(ఎండీఆర్) పెరిగి.. యాంటిబయోటిక్స్ పనిచేయని పరిస్థితి సంభవిస్తోందని ఎల్వీ ప్రసాద్ కంటి ఆసుపత్రి వైద్య నిపుణులు నిర్వహించిన తాజా అధ్యయనంలో తేలింది. ప్రధానంగా క్యాటరాక్ట్ సర్జరీ చేయించుకున్న కొందరు రోగుల కళ్లలో ఇన్‌ఫెక్షన్(క్యాటరాక్ట్ ఎండోఫ్తాల్మిటిస్) పెరిగినట్లు వైద్యులు గుర్తించారు. శస్త్ర చికిత్స చేసినప్పుడు ఇచ్చే యాంటీబయాటిక్స్ మందులు పనిచేయకపోవడమే దానికి కారణమని తేల్చారు. హైదరాబాద్‌లోని ఎల్వీప్రసాద్ కంటి ఆసుపత్రితో పాటు దేశంలోని ఇతర ఆసుపత్రులతో కలిపి మొత్తం 410 మందిపై అధ్యయనం చేయగా, 32 మంది(7.8 శాతం)లో ఎండీఆర్ ఉన్నట్లు నిర్ధారించారు. ఈ వివరాలు రెటీనా తాజా సంచికలో ప్రచురితమయ్యాయి. 'క్యాటరాక్ట్ సర్జరీ తర్వాత చాలామంది రోగుల్లో యాంటీబయాటిక్స్ పనిచేయడం లేదు. ఇన్‌ఫెక్షన్ నుంచి బయటపడటం ఆలస్యమవుతోంది. సూడోమోనాస్ వంటి గ్రామ్-నెగిటివ్ రకం బ్యాక్టీరియా పెరగడమే దానికి కారణమని గుర్తించాం. ఇలాంటివి చాలానే ఉన్నాయి. వీటినే సూపర్ బగ్స్‌గా వ్యవహరిస్తారు. ఈ బ్యాక్టీరియా కణత్వచం(సెల్ వాల్) బయట మరో మెంబ్రేన్(పొర) ఉండటంతో చాలాసార్లు యాంటీబయాటిక్స్ సులభంగా లోపలకు చేరవు. 93 శాతం మంది రోగులు ఒకటి కంటే ఎక్కువ యాంటీబయాటిక్స్‌కు రెసిస్టెంట్‌గా ఉన్నట్లు తేలింది. ఇలాంటి వారిలో క్యాటరాక్ట్ ఆపరేషన్ తర్వాత కంటిలో ఇన్‌ఫెక్షన్ తగ్గడానికి ఎక్కువ రోజులు పడుతోంది' అని ఎల్వీ ప్రసాద్ వైద్యులు తెలిపారు.

భువనేశ్వర్-భోగాపురం మధ్య జాతీయ రహదారి

కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు

శ్రీకాకుళం అర్బన్, న్యూస్‌టుడే: భువనేశ్వర్ నుంచి భోగాపురం విమానాశ్రయం వరకు కొత్త రహదారిని నిర్మించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించినట్లు పౌర విమానయానశాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడు తెలిపారు. శనివారం శ్రీకాకుళంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. విశాఖ క్లస్టర్‌లో పారిశ్రామిక అభివృద్ధి ద్వారా శ్రీకాకుళం జిల్లాకు మంచి రోజులు వస్తున్నాయని, రానున్న రోజుల్లో కొత్త సిక్కోలును చూస్తామని పేర్కొన్నారు.

ఫోన్ చోరీ.. పట్టించే పోర్టల్‌తో హ్యాపీ



- పోలీస్ స్టేషన్లచుట్టూ తిరగకుండా ఒక్కసారి ఇంట్లో నుంచి ఫిర్యాదు చేస్తే సరి
- విజయవంతంగా పనిచేస్తున్న సీఈఐఆర్ పోర్టల్

ఆధునిక జీవితంలో సెల్‌ఫోన్ లేకుంటే ఒక్క క్షణం గడవదు. మన జీవితాల్లో అత్యంత ముఖ్యమైన సాధనంగా అది మారిపోయింది. మనం ఇతరులతో మాట్లాడటానికే కాకుండా.. అందులో కాంటాక్ట్ నంబర్లను నిక్షిప్తం చేసుకుంటాం. అది ఒక ఎత్తైతే ఇప్పుడు సెల్‌ఫోన్ అనేది వ్యక్తిగత కంప్యూటర్‌లా మారింది. అందులోనే మన బ్యాంకు ఖాతాలు, ఆర్థిక లావాదేవీలు, ఫొటోలు, ముఖ్యమైన పత్రాలను దాచుకుంటున్నాం. అలాంటి అత్యంత ముఖ్యమైన ఫోన్ పోయినా.. చోరీకి గురైనా మనకు కాలూ చేయి ఆడదు. ఫోన్ పోవడంవల్ల ఆర్థికంగా నష్టపోవడమే కాకుండా మన డేటా చోరీ అవుతుందని భయపడతాం. దీంతో పాటు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసి దాని చుట్టూ తిరగాల్సి ఉంటుంది. అయినా అది దొరుకుతుందో లేదోనని ఆందోళన చెందుతాం. చివరకు విసిగివేసారి వదిలేస్తాం. కానీ ఫోన్ పోతే దానిని కనిపెట్టి అప్పగించేందుకు మనకో పోర్టల్ ఉందని మీకు తెలుసా.. కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని టెలికమ్యూనికేషన్లశాఖ (డీవోటీ) దీనిని రూపొందించింది. సీఈఐఆర్ పేరుతో రూపొందించిన ఆ పోర్టల్ ఇప్పటికే విజయవంతంగా పని చేస్తోంది. దేశంలోని వివిధ రాష్ట్రాల్లో పోలీసు శాఖలతో కలిసి అనేక వేల ఫోన్లను రికవరీ చేసి బాధితులకు అందజేసింది. మన ఫోన్ పోతే పదే పదే పోలీస్ స్టేషన్ల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా ఆన్‌లైన్ ద్వారానే ఈ పోర్టల్‌లో ఫిర్యాదు చేయవచ్చు. అయితే దీనికి మనం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లుగా రసీదు నంబరును ఎంటర్ చేయాల్సి ఉంటుంది. దేశంలోని కొన్ని రాష్ట్రాలు ఆన్‌లైన్‌లోనూ పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదు చేసే అవకాశాన్ని కల్పించాయి. అలా వచ్చే రసీదు నంబరును ఎంటర్ చేసి సీఈఐఆర్ పోర్టల్‌లో ఫిర్యాదు చేయవచ్చు.

ఏమిటీ సీఈఐఆర్..

టెలికమ్యూనికేషన్లశాఖ (డీవోటీ) అభివృద్ధి చేసిన సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్టరు (సీఈఐఆర్) పోర్టల్ ఒక కేంద్రీకృత వ్యవస్థ. దాని ప్రధాన పని పోగొట్టుకున్న, దొంగిలించబడిన ఫోన్లను బ్లాక్ చేయడంతోపాటు లొకేషన్‌ను గుర్తించడం.

- దేశంలోని అన్ని టెలికం కంపెనీల డేటాబేస్‌తో ఈ పోర్టల్ అనుసంధానమై ఉంటుంది.
- ఒక్కసారి మీ పోయిన ఫోన్ ఐఎంఈఐ నంబరును పోర్టల్‌లో ఎంటర్ చేయగానే దేశంలోని అన్ని నెట్‌వర్క్‌లలో ఫోన్ పని చేయడం ఆగిపోతోంది.



ఫిర్యాదు ఎలా చేయాలి..

మీ ఫోన్ పోయినా, చోరీకి గురైనా వెంటనే టెలికం ఆపరేటర్‌కు ఫోన్ చేసి సిమ్ కార్డును బ్లాక్ చేయించాలి. ఇది మీ నంబరు దుర్వినియోగాన్ని అడ్డుకుంటుంది.

- ఆ తర్వాత పోలీసు విభాగం వెబ్‌సైట్‌లోగానీ, యాప్‌లోగానీ పోలీస్ స్టేషన్‌లో 'ఇ-ఎఫ్ఐఆర్' ఫైలు చేయాలి. ఆన్‌లైన్‌లో అవకాశం లేనివారు ఒక్కసారి స్టేషన్‌కు వెళ్లాల్సి ఉంటుంది. ఆ తర్వాత ఫిర్యాదు డిజిటల్ ప్రతిని భద్రపరచుకోవాలి.
- ఎఫ్ఐఆర్ అయ్యాక ceir.sancharsaathi.gov.in పోర్టల్‌లోకి వెళ్లాలి. 'బ్లాక్ స్టోలెన్/లాస్ మొబైల్' ఆప్షన్‌ను ఎంచుకోవాలి. పోర్టల్‌లో మొబైల్ ఫోన్ మోడల్ నంబరు, ఐఎంఈఐ నంబరు, కొనుగోలు చేసిన బిల్లు ఉంటే దానిని, పోలీసు ఫిర్యాదు రసీదును అప్‌లోడ్ చేయాలి.
- ఈ వివరాలన్నీ నమోదు చేయగానే మీ ఫోన్ పని చేయకుండా బ్లాక్ అవుతుంది. వేరే సిమ్‌తో ఎవరైనా ప్రయత్నించినా పని చేయదు. అలా చేసిన వెంటనే పోలీసులకు, పోర్టల్‌కు అలర్ట్ వస్తుంది. దీంతో పోలీసులు ఆ ఫోన్‌ను రికవరీ చేయడానికి అవకాశం కలుగుతుంది.

– ఈటీవీ భారత్

ప్రయోజనాలివే..

- ఫిర్యాదు చేయగానే ఫోన్ బ్లాక్ అయి అందులోని డేటా చోరీ కాకుండా కాపాడుతుంది.
- బ్యాంకుల యాప్‌లు, వ్యక్తిగత సమాచారానికి భద్రత లభిస్తుంది.
- దేశంలోని అనేక రాష్ట్రాలు వేల ఫోన్లను ఈ పోర్టల్ సాయంతో గుర్తించి బాధితులను అందజేశాయి.
- పాత ఫోన్లు కొనేవారు ఈ పోర్టల్ ద్వారా అది చోరీ చేసిందా లేదా అనేది తెలుసుకోవచ్చు.

మోదీ పాలనలో విశ్వవిజేతగా భారత్

జాతీయ విజ్ఞాన సమ్మేళనంలో మంత్రి సత్యకుమార్ యాదవ్

తిరుపతి (విద్య), న్యూస్‌టుడే: ప్రధాని నరేంద్రమోదీ పాలనలో భారతదేశం అన్ని రంగాల్లో విశ్వవిజేతగా ఎదుగుతోందని.. విద్యార్థులు, యువత అభివృద్ధే ధ్యేయంగా దేశంలో సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందిస్తున్నామని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ పేర్కొన్నారు.


భారతీయ విజ్ఞాన సమ్మేళనంలో ప్రదర్శనశాలను తిలకించి వివరాలు తెలుసుకుంటున్న మంత్రి సత్యకుమార్ యాదవ్

తిరుపతి వేదికగా జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయంలో జరుగుతున్న ఏడో భారతీయ విజ్ఞాన సమ్మేళనం రెండోరోజు శనివారం జరిగిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా ప్రసంగించారు. ఒకనాడు భారత్ అంటే చిన్నచూపు ఉండేదని, విదేశీయుల పాలనలో అణచివేతకు గురైన భారతావని.. మోదీ ప్రధాని అయ్యాక విశ్వగురువుగా అంతర్జాతీయ స్థాయిలో అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తోందని పేర్కొన్నారు. అంతరిక్ష రంగంలో విజయాలు సాధించడమే కాక.. ఆపరేషన్ సిందూర్ ద్వారా పాకిస్థాన్‌ను దెబ్బతీసి.. భారతీయ రాడార్ వ్యవస్థ ఘనతను ప్రపంచానికి చాటి చెప్పామని వివరించారు. విద్యార్థులు డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని, సాంకేతికతను ఉపయోగించుకొని మేధస్సును పెంచుకోవాలే తప్ప దురలవాట్లకు లోనుకారాదని సూచించారు. రాష్ట్రంలో ఆర్థిక వనరులు ఎలా ఉన్నా.. అభివృద్ధి అంశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తీవ్రంగా శ్రమిస్తున్నారని వివరించారు. ఈ సందర్భంగా కౌశల్ 2025 పోటీల్లో రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాల నుంచి విజేతలుగా నిలిచినవారికి మంత్రి బహుమతులు, ప్రశంసాపత్రాలు, పారితోషికాలు అందజేశారు.

90 శాతం రాయితీతో గిరిజన రైతులకు పరికరాలు

గిరిజన సంక్షేమశాఖ మంత్రి సంధ్యారాణి

ఈనాడు, అమరావతి: గిరిజన ప్రాంతాల సమగ్రాభివృద్ధికి ముఖ్యమంత్రి చంద్రబాబు కృషి చేస్తున్నారని, ఐటీడీఏల ద్వారా 90 శాతం రాయితీతో రైతులకు పరికరాలను అందించేందుకు చర్యలు చేపట్టారని గిరిజన సంక్షేమశాఖ మంత్రి సంధ్యారాణి పేర్కొన్నారు. ఇందు కోసం ట్రైకార్ ద్వారా రూ.13.70 కోట్లు ప్రభుత్వం విడుదల చేసిందని శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 'జగన్ హయాంలో ట్రైకార్ రుణాలు నిలిపేసి గిరిజనులకు అన్యాయం చేశారు. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని పునరుద్ధరించాం. గిరిజన యువత ఉపాధి కల్పనకు చర్యలు చేపట్టాం. రైతుల శ్రమ తగ్గించి, పంట ఉత్పాదకత పెంచేందుకు ట్రాకర్లు, మినీ ట్రాక్టర్లు, ట్రక్కులు, ఆయిల్ ఇంజిన్లు కూడా మంజూరు చేస్తాం' అని వివరించారు.

చలితో వణికిపోతున్న అల్లూరి జిల్లా

చింతపల్లి, న్యూస్‌టుడే: అల్లూరి సీతారామరాజు జిల్లాలో కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. శనివారం జి.మాడుగులలో 5.1 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదైనట్లు చింతపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం వాతావరణ విభాగం నోడల్ అధికారి డాక్టర్ ఆళ్ల అప్పలస్వామి తెలిపారు. ముంచంగిపుట్టులో 6.8, చింతపల్లి-8.2, పెదబయలు-9, పాడేరు-9.9, అరకులోయలో 10 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయని పేర్కొన్నారు.



పిల్లలు పుట్టాక ఈ తప్పు చేయకండి

పిల్లలు పుట్టిన తర్వాత చాలా మంది తల్లిదండ్రులు చేసే తప్పేంటంటే వారి బాగోగులపైనే దృష్టి పెట్టి తమ వ్యక్తిగత జీవితాన్ని నిర్లక్ష్యం చేస్తారు. తమ ఆసక్తులను, అభిరుచులను వదిలేస్తారు. శారీరక ఆరోగ్యంపై అశ్రద్ధతో ఫిట్‌నెస్ కోల్పోతారు. ఇది సరికాదు. పిల్లలు తమ తల్లిదండ్రులను అనుకరించడం ద్వారానే ఎక్కువ నేర్చుకుంటారు. కాబట్టి వారు తమ జీవితాన్ని ఉన్నతంగా తీర్చిదిద్దుకోవాలంటే, ముందు మీరు చక్కటి జీవన విధానాన్ని అవలంబించాలి.

– కెవిన్ డాహల్‌స్ట్రామ్, హెల్త్ కోచ్

జనగణన పూర్తవ్వగానే
గ్రేటర్ విజయవాడ, గ్రేటర్ తిరుపతి ప్రక్రియ

- సర్వే పూర్తయ్యేవరకు డీలిమిటేషన్ చేపట్టకూడదని కేంద్రం ఆదేశాలు
- లింకు డాక్యుమెంట్లతో పనిలేకుండా రైతులకు రుణాలివ్వాలని బ్యాంకర్లకు ఆదేశం
- పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ మంత్రి నారాయణ

ఈనాడు, అమరావతి: జనగణన పూర్తయ్యేవరకూ డీలిమిటేషన్ చేపట్టకూడదని కేంద్రం ఆదేశించిందని, సర్వే పూర్తవ్వగానే గ్రేటర్ విజయవాడ, గ్రేటర్ తిరుపతి ప్రక్రియ చేపడతామని పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి నారాయణ పేర్కొన్నారు. ఇప్పటికే కేంద్రం జనాభా సర్వే ప్రారంభించినందున ఈ ప్రక్రియ వెంటనే చేపట్టేందుకు అడ్డంకిగా మారిందని తెలిపారు. లింకు డాక్యుమెంట్లతో సంబంధం లేకుండా రాజధాని రైతులకు రుణాల మంజూరుచేయాలని బ్యాంకు అధికారుల్ని సీఎం చంద్రబాబు ఆదేశించారని వెల్లడించారు. శనివారం ఉండవల్లి నివాసంలో సీఆర్డీఏపై సీఎం సమీక్ష అనంతరం వివరాల్ని ఆయన మీడియాకు వివరించారు. 'భూసమీకరణ భూముల్లో ప్లాట్లు కేటాయించిన వారందరినీ ఫోన్ ద్వారా సంప్రదించాం. 250 మందికిగాను 42 మంది వేరేచోటకు మార్చాలని కోరారు. వీరిలో ఇప్పటికే 16 మందికి మార్చాం. మరో 8 మంది మార్చుకునేందుకు ముందుకొచ్చారు. మిగతా వారు వేచి చూస్తామని చెప్పారు. ఇంకా ఎవరైనా ప్లాట్లను మార్చుకోవాలనుకుంటే సీఆర్డీఏ అధికారుల్ని సంప్రదించొచ్చు' అని సూచించారు.

45 రోజుల్లోగా జరీబు, జరీబేతర భూముల గుర్తింపు: 'కొంతమంది రైతులు వారి భూముల్ని జరీబుగా గుర్తించాలని విజ్ఞప్తి చేశారు. దీనికి రాష్ట్ర స్థాయిలో వివిధ శాఖల అధికారులతో కమిటీని నియమించాం. 45 రోజుల్లోగా ఈ ప్రక్రియను పూర్తిచేయాలని నిర్దేశించాం. జరీబు భూముల గుర్తింపునకు 2014 డిసెంబరు 8వ తేదీ నాటి ఉపగ్రహ చిత్రాలను ప్రాతిపదికగా తీసుకోవాలని ఆదేశించాం. కమిటీ నివేదిక రాగానే సమస్యను పరిష్కరిస్తాం. గ్రామాల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధి పనుల డిజైన్లు పూర్తయ్యాయి. వాటిని శాసనసభ్యులకు అందిస్తాం. గ్రామ పెద్దలతో వారు చర్చించి సలహాలు, సూచనలు స్వీకరిస్తారు. ఆ మేరకు డిజైన్లలో అవసరమైన మార్పులు చేస్తాం' అని వివరించారు.

రాజధాని జరీబు భూముల అంశంపై రాష్ట్ర స్థాయి కమిటీ

ఈనాడు, అమరావతి: రాజధాని అమరావతిలో జరీబు, జరీబేతర భూముల అంశాన్ని నిగ్గుతేల్చేందుకు వివిధ విభాగాలకు చెందిన ఐదుగురు అధికారులతో ప్రభుత్వం రాష్ట్రస్థాయి కమిటీని నియమించింది. గుంటూరు జిల్లా సంయుక్త కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, భూగర్భ జలవనరుల విభాగం జాయింట్ డైరెక్టర్ ఎన్.శ్రీనివాస్, ఏపీఎంఏపీ ప్రాజెక్టు అధికారి ఎం.వెంకటేశ్వర్లు, సీసీఎల్ఏలో సర్వే విభాగం జాయింట్ డైరెక్టర్ కెజియా, వ్యవసాయశాఖ అదనపు డైరెక్టర్ శ్రీధర్ కమిటీలో సభ్యులుగా ఉంటారు. వివాదం నెలకొన్న 202.205 ఎకరాలను ఈ కమిటీ పరిశీలించి, అవి జరీబు భూములా, కాదా అనే విషయాన్ని నిర్ధారిస్తుంది. 45 రోజుల్లోగా గుంటూరు జిల్లా కలెక్టర్‌కి ఈ కమిటీ నివేదిక అందజేయనుంది.

బంగ్లాదేశ్‌లో హిందువులకు మద్దతుగా గళమెత్తాలి: మాధవ్

ఈనాడు, అమరావతి: బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దారుణాలను వ్యతిరేకిస్తూ ప్రతిఒక్కరూ స్పందించాలని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ కోరారు. ప్రతి రాజకీయ పార్టీ.. ఆ దేశంలోని పరిణామాలను నిశితంగా గమనించి, అక్కడి హిందువుల రక్షణ కోసం గళం విప్పాలని శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ విషయంలో భారత విదేశాంగ శాఖ బంగ్లాదేశ్‌పై ఘాటుగానే స్పందించిందని తెలిపారు.


నగారా మోగించి సభలను ప్రారంభిస్తున్న ప్రకాశ్‌రాజ్

ఆరెస్సెస్‌లో మహిళలకు స్థానం ఎక్కడ?

సీఐటీయూ అఖిలభారత మహాసభల్లో సినీనటుడు ప్రకాశ్‌రాజ్

విశాఖపట్నం (ఏయూ ప్రాంగణం, జగదాంబకూడలి), న్యూస్‌టుడే: ఆరెస్సెస్‌లో మహిళలకు స్థానం ఎక్కడుందని సినీనటుడు ప్రకాశ్‌రాజ్ ప్రశ్నించారు. విశాఖపట్నం బీచ్‌రోడ్డులోని ఆంధ్ర విశ్వవిద్యాలయం ఎగ్జిబిషన్ మైదానంలో శనివారం సాయంత్రం సీఐటీయూ 18వ అఖిలభారత మహాసభలు ప్రారంభమయ్యాయి. కర్నూలు మాజీ ఎమ్మెల్యే ఎం.ఎ.గఫూర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమాన్ని సినీనటులు ప్రకాశ్‌రాజ్ నగారా మోగించి ప్రారంభించారు. అక్కడ, అంతకుముందు విలేకర్లతోను ఆయన మాట్లాడారు. "దేశంలో కార్మికులకు తీవ్ర అన్యాయం జరుగుతోంది. ప్రభుత్వాలు ప్రభుత్వరంగ సంస్థల్ని నిర్వీర్యం చేస్తున్నాయి. ప్రశ్నించే గొంతుకలను నొక్కేస్తున్నాయి. ఆరెస్సెస్‌లో ఒక్క స్వాతంత్ర్య సమరయోధుడైనా ఉన్నారా? మావోయిస్టుల భావజాలం వేరైనంత మాత్రాన ఎన్‌కౌంటర్లు చేసి చంపేస్తారా? వేదికలపై మాట్లాడేవాళ్లు జాగ్రత్తగా మాట్లాడాలి. నటుడు శివాజీ వ్యాఖ్యలు తప్పే. ఆడవాళ్లకు మగవాళ్ల వల్లే అన్యాయం జరుగుతోంది. అనసూయకు మద్దతు ప్రకటిస్తున్నా. ఐ బొమ్మ రవి చేసింది దొంగతనమే అవుతుంది. అయినా టికెట్ ధరలు పెరిగితే ప్రేక్షకులే సినిమాలు చూడడం మానేయాలి. విమానాశ్రయాలు మారుతున్నాయంటున్నారు కానీ చేయి మారుతున్నాయనే విషయం గమనించాలి. ఒకప్పుడు రాజకీయ నాయకులు పదవులు దక్కించుకోవడానికి రౌడీలను పెంచిపోషించేవారు. ఇప్పుడు కార్పొరేట్లు చెప్పినట్లు వింటున్నారు" అని చెప్పారు. మాజీ ఎమ్మెల్యే ఎం.ఎ.గఫూర్ మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రంలో జరగని సీఐటీయూ అఖిలభారత మహాసభలు విశాఖ వేదికగా జరుగుతున్నాయన్నారు. ఉపాధిహామీ పథకాన్ని ఎత్తివేసే కుట్ర జరుగుతోందన్నారు. అంతకుముందు పుస్తక ప్రదర్శనను ఆచార్య వెలమల సిమ్మన్న, ఫొటో ఎగ్జిబిషన్‌ను స్టార్‌మేకర్ సత్యానంద్ ప్రారంభించారు. సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నరసింగరావు, బేబీరాణి, రైటర్స్ అకాడమీ వ్యవస్థాపకుడు వి.వి.రమణమూర్తి, పాత్రికేయుడు తెలకపల్లి రవి తదితరులు పాల్గొన్నారు.

అప్పలరాజును విడుదల చేయాలి

ముఖ్యమంత్రికి సీపీఎం నేత బీవీ రాఘవులు లేఖ

ఈనాడు, అమరావతి: అనకాపల్లి జిల్లా సీపీఎం కార్యదర్శివర్గ సభ్యుడు అప్పలరాజుపై పోలీసులు పెట్టిన పీడీ చట్టాన్ని ఉపసంహరించుకొని, ఆయన్ను విడుదల చేయాలని కోరుతూ సీఎం చంద్రబాబుకు ఆ పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు లేఖ రాశారు. "సామాన్య ప్రజల జీవితాల మెరుగు కోసం పనిచేస్తున్న మా పార్టీ నాయకుడిని నేరస్థుడిగా చిత్రీకరించి, అరెస్టు చేశారు. ఎవరి ప్రయోజనం కోసం ప్రభుత్వం ఈ చర్య తీసుకుందో ప్రజలు గమనిస్తున్నారు. రైతుల హక్కుల కోసం పని చేయడాన్ని ప్రభుత్వం నేరంగా పరిగణిస్తుందా..? ఈ విషయంలో మీరు జోక్యం చేసుకోవాలి. అప్పలరాజుపై పోలీసులు మోపిన అభియోగాలను ఉపసంహరించుకొని, ఆయన్ను విడుదల చేయాలి" అని కోరారు.

రాజకీయ పార్టీలు, న్యాయవాద సంఘాల్లో..
పోష్ చట్టం అమలుకు సవరణ

- ఆయా సంఘాలతో చర్చించి, ముసాయిదా తయారీ
- రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ రాయపాటి శైలజ

ఈనాడు, అమరావతి: అన్ని రాజకీయ పార్టీలు, న్యాయవాద సంఘాలు, వృత్తిపరమైన సంస్థల్లో మహిళలపై లైంగిక వేధింపుల నిరోధక చట్టం (పోష్ యాక్ట్) అమలు చేయాల్సిన అవసరముందని రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ రాయపాటి శైలజ పేర్కొన్నారు. పార్టీలు, న్యాయవాద సంఘాల్లో మహిళల ప్రాతినిధ్యం గణనీయంగా పెరిగిన నేపథ్యంలో పని ప్రదేశాల్లో వారికి రక్షణ, భద్రతతో కూడిన వాతావరణం కల్పించాల్సిన బాధ్యత ఉందన్నారు. రాజకీయ పార్టీలు, న్యాయవాద సంఘాలకు పోష్ చట్టం వర్తింపజేసేందుకు సవరణలపై మంగళగిరిలోని కార్యాలయంలో మహిళా కమిషన్, బెజవాడ బార్ అసోసియేషన్ సంయుక్తంగా తొలి సమావేశం నిర్వహించాయి. ఈ చట్టం అమలుకు గతంలో వివిధ న్యాయస్థానాలు ఇచ్చిన తీర్పులు, చేపట్టాల్సిన చర్యలపై చర్చించి సవరణలు ప్రతిపాదించారు.



అనంతరం రాయపాటి శైలజ మీడియాతో మాట్లాడుతూ 'కొన్నిచోట్ల బార్ అసోసియేషన్లలో మహిళలపై వేధింపుల ఉదంతాలు మా దృష్టికి వచ్చాయి. కానీ, పోష్ చట్టం న్యాయవాద సంఘాలకు వర్తించదని కొన్ని తీర్పులున్నాయి. ఇలాంటి సందర్భాల్లో బాధితులు న్యాయం కోసం ఎవరిని ఆశ్రయించాలన్న ప్రశ్న వస్తోంది. దీన్ని అధిగమించేందుకు ప్రస్తుత చట్టంలో మార్పులు తెచ్చేందుకు ఈ సమావేశం నిర్వహించాం. కేంద్ర చట్టంలో మార్పుల ఆమోదానికి సమయం పట్టనున్నందున, రాష్ట్ర ప్రభుత్వ పరిధిలో అమలు చేసేలా సవరణలు ప్రతిపాదించాం. వీటిపై రాష్ట్రంలోని అన్ని బార్ అసోసియేషన్లతో చర్చించి, వారి అభిప్రాయాల మేరకు మార్పులు చేసి ప్రభుత్వానికి నివేదిస్తాం. సవరణలతో కూడిన పోష్ చట్టాన్ని అమలు చేసిన తొలి రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ నిలుస్తుంద'ని అని పేర్కొన్నారు.

ముసాయిదా చట్టాన్ని తయారుచేశాం

సీనియర్ న్యాయవాది సుంకర రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ '1997లో విశాఖ వర్సెస్ రాజస్థాన్ కేసులో మహిళలపై పని ప్రదేశంలో లైంగిక వేధింపులు నివారించేందుకు సుప్రీంకోర్టు మార్గదర్శకాలు ఇచ్చింది. 2013లో అది చట్టంగా మారింది. తర్వాత కేరళ హైకోర్టు రాజకీయ పార్టీలు, న్యాయవాద సంఘాలకు ఈ చట్టం వర్తిస్తుందని తీర్పునిచ్చింది. కొంత మంది దీనిపై సుప్రీంకోర్టుకు వెళ్లడంతో పార్టీలు, న్యాయవాద సంఘాలకు చట్టం వర్తించాలంటే కొన్ని మార్పులు చేయాలని అత్యున్నత న్యాయస్థానం సూచించింది. ఈ తీర్పును ప్రాతిపదికగా తీసుకొని, పోష్ చట్టం అమలుకు సవరణలు ప్రతిపాదించాం. 'పని ప్రదేశం', 'రాజకీయ పార్టీ', 'బార్ అసోసియేషన్' పదాలను నిర్వచిస్తూ ముసాయిదా రూపొందించాం. దీనిపై అన్ని న్యాయవాద సంఘాల నుంచి సలహాలు, సూచనలు స్వీకరించాక వాటిని క్రోడీకరించి ప్రభుత్వానికి నివేదిస్తామ'ని వివరించారు.

అవయవానికి... 6 గంటలు!

కర్మాగారాల్లో ప్రమాదాలు.. రోడ్డు యాక్సిడెంట్‌లు.. ఇంట్లో మిక్సీ పడుతున్నప్పుడో.. యంత్రాలతో సేద్యం చేస్తున్నప్పుడో రెప్పపాటులో జరిగే ప్రమాదాలకు అవయవాలను కోల్పోయి






శాశ్వత అంగవైకల్యం అనుభవిస్తున్న వారెందరో. ఈ పరిస్థితి రాకుండా తెగిన అవయవాలను అతికించేందుకు 6 గంటల అప్రమత్తత అవసరమంటున్నారు నిపుణులు.

తెగిన వెంటనే అప్రమత్తం కావాలి...

- శరీరం నుంచి తెగిన అవయవాన్ని మంచినీళ్లతో శుభ్రంచేసి, సున్నితమైన తడి వస్త్రంలో చుట్టాలి.
- దాన్ని పొడిగా ఉన్న ఒక ప్లాస్టిక్ సంచిలో పెట్టి సీల్ చేయాలి.
- ఆ సంచిని ఐస్‌లో భద్రపరచాలి. అవయవాన్ని నేరుగా ఐస్‌లో ఉంచకూడదు.
- గాయమైన ప్రాంతంలో పొడి వస్త్రంతో గట్టిగా ఒత్తి రక్తస్రావం నియంత్రించాలి.
- సెప్టిక్ కాకుండా టీటీ ఇంజక్షన్, యాంటీ బయాటిక్స్ వంటివి తీసుకోవాలి.
- గాయంపై ఆయింట్‌మెంట్, పౌడర్ వంటివి పూయకూడదు.
- అవయవాన్ని గట్టిగా కట్టకుండా త్వరగా ఆసుపత్రికి తీసుకెళ్లాలి.

సరైన సమయానికి చేరితే...




- ప్రమాదం జరిగిన వెంటనే స్థానిక వైద్యుడి సూచన మేరకు ఆరు గంటల్లో అందుబాటులోని ప్లాస్టిక్ సర్జన్ వద్దకు చేరుకుంటే రీప్లాంటేషన్‌కు అవకాశం ఉంటుంది.
- గాయం తీవ్రత, రోగి ఆరోగ్య పరిస్థితి పరీక్షించి ఎంత వరకు అవకాశం ఉందో చెప్తారు.
- చాలా అరుదైన పరిస్థితుల్లో మాత్రం 24 గంటల్లోపు వచ్చినా సర్జరీ విజయవంతమైన సందర్భాలున్నాయన్నది వైద్యుల మాట.

గోల్డెన్ అవర్స్ దాటితే వ్యర్థమే..

- తెగిన అవయవం నుజ్జునుజ్జయినప్పుడు, దుమ్ముధూళి, గ్రీజు వంటి పదార్థాలు దట్టంగా పట్టినప్పుడు, ఎక్కువ ప్రాంతాల్లో తెగినా రీప్లాంటేషన్ సాధ్యపడదు.


(ఉదా: చేతి వేలు ఒకే దగ్గర కాకుండా మూడు నాలుగు ప్రాంతాల్లో తెగినప్పుడు..)

- గోల్డెన్ అవర్స్ 6 నుంచి 12 గంటలు దాటినా అతికించే అవకాశం ఉండదు.
- బాధితుడు ఆరేడు గంటల సర్జరీకి సిద్ధపడి ఉండాలి.
- దీర్ఘకాలిక ఆరోగ్య సమస్య ఉండి, శస్త్రచికిత్సకు సహకరించకపోయినా, ప్రాణాపాయ గాయాలున్నా ఇది సాధ్యంకాదు. ఇలాంటప్పుడు ప్రాణాలు రక్షించేందుకు ప్రాధాన్యమిస్తారు.



- ఈనాడు, రాజమహేంద్రవరం

ఎలా చేస్తారంటే...



- రీప్లాంటేషన్ నైపుణ్యంతో కూడిన ఓ దీర్ఘకాలిక సర్జరీ.
- ముందు తెగిన భాగంలో రక్తనాళాలు, నరాలు, కండరాల (టెండాన్) పరిస్థితి పరీక్షిస్తారు.
- తర్వాత శరీరంతో ఉన్న భాగాన్ని పరిశీలించి అందులోని ఎముక, రక్తనాళాలు, కండరాలు, చర్మం అతికిస్తారు.

సక్సెస్ రేటు..

- అతికించిన భాగాన్ని వారం నుంచి 10 రోజులు నిశితంగా పరిశీలిస్తారు.
- ఈ క్రమంలో కొన్ని సందర్భాల్లో 15 నుంచి 20 శాతం రిస్క్ ఉంటుంది.
- మరికొన్ని సందర్భాల్లో ఎముకలు వెంటనే అతుక్కోక బిగుతుగా అవుతాయి. దీన్ని ఫిజియోథెరపీతో సరి చేసుకోవచ్చు.
- నరాలను కుట్టడం వల్ల ఆ భాగం గతంలో మాదిరిగా పని చేసే అవకాశాలు తక్కువ.

వేగమే ప్రధానం..

సాధారణంగా కర్మాగారాలు, టైల్స్, వెదురు, గ్లాస్ కటింగ్ చేసే కార్మికులు, రోడ్డు ప్రమాదాల్లో ఈ తరహా ఘటనలు ఎక్కువ జరుగుతాయి. పని ప్రదేశాల్లో తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. ప్రమాదవశాత్తు అవయవం తెగితే ప్రాథమిక వైద్యం అనంతరం వీలైనంత తొందరగా ప్లాస్టిక్‌సర్జన్‌ను సంప్రదిస్తే మెరుగైన వైద్యం అందుతుంది.

– డాక్టర్ మూల రోహిత్‌బాబు, ప్లాస్టిక్ సర్జన్, ఎయిమ్స్, బీబీ నగర్, హైదరాబాద్

'గాల్లో' పరిగెత్తే చైనా రైలు

2 సెకన్లలోనే 700 కి.మీ గరిష్ఠ వేగం

సాంకేతికతను అందిపుచ్చుకోవడంలో ముందుండే చైనా సరికొత్త ఆవిష్కరణలు చేస్తూ ప్రపంచాన్ని ఆశ్చర్యపరుస్తోంది. కొన్నేళ్లుగా హైస్పీడ్ రైలు నెట్‌వర్క్‌పై దృష్టిసారించిన బీజింగ్.. తాజాగా ప్రపంచంలోనే అత్యంత వేగవంతమైన మ్యాగ్లెవ్ రైలును పరీక్షించింది. ఈ పరీక్షలో టన్ను బరువున్న రైలు.. కేవలం 2 సెకన్లలోనే 0 నుంచి 700 కిలోమీటర్ల గరిష్ఠ వేగాన్ని అందుకుంది. 400 మీటర్ల మ్యాగ్లెవ్ ట్రాక్‌పై ఈ పరీక్ష జరిగింది. రైలు సురక్షితంగా ఆగింది. మ్యాగ్నెటిక్ లెవిటేషన్ టెక్నాలజీతో దీన్ని రూపొందించినట్లు చైనా నేషనల్ యూనివర్సిటీ ఆఫ్ డిఫెన్స్ టెక్నాలజీ వెల్లడించింది. ఈ టెక్నాలజీలో రైలు.. సూపర్ కండక్టింగ్ మ్యాగ్నెట్ల సాయంతో పట్టాలకు కొన్ని సెంటీమీటర్ల ఎత్తులో ప్రయాణిస్తుంది. సాధారణ రైలులా ఇది చక్రాలపై ఆధారపడి పనిచేయదు. అయస్కాంత బలాలను (ఆకర్షణ, వికర్షణ) ఉపయోగించి దూసుకెళుతుంది. ఇలా రైలు ట్రాక్‌ను తాకకుండా ఉండటం వల్ల ఘర్షణ ఉండదు. కాబట్టి అత్యంత వేగంగా ప్రయాణిస్తుంది. –బీజింగ్





4,608 మంది నాట్యమాడగా.. గిన్నిస్ రికార్డు తాళం వేయగా..

హైదరాబాద్ గచ్చిబౌలి స్టేడియంలో 4,608 మంది కళాకారులు 40 నిమిషాలపాటు కూచిపూడి నృత్యం చేసి గిన్నిస్ రికార్డు నెలకొల్పారు.

శనివారం భారత్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో 'కూచిపూడి కళా వైభవం-2' పేరిట నిర్వహించిన ఈ ప్రదర్శనలో తెలుగు రాష్ట్రాలతో పాటు విదేశాల నుంచి వచ్చిన కళాకారులు ఉత్సాహంగా నాట్యం చేశారు. 2023లో ఇదే అకాడమీ ఆధ్వర్యంలో 4218 మందితో నిర్వహించిన ప్రదర్శన గిన్నిస్ రికార్డులోకి ఎక్కగా.. తాజాగా దాన్ని అధిగమించారు. ఈ మేరకు గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ ప్రతినిధి స్వప్నిల్ ధ్రువీకరణ పత్రం అందజేశారు. –న్యూస్‌టుడే, హైదరాబాద్

పేరుకే ఘోస్ట్.. తింటే యమ టేస్ట్!



ఈ పసుపు రంగు పీత విశాఖ సాగర తీరంలో శనివారం మత్స్యకారుల వలకు చిక్కింది. విశాఖ ఫిషరీస్ డెవలప్‌మెంట్ అధికారిణి ఆశాజ్యోతి వెల్లడించిన వివరాల ప్రకారం.. ఈ పీతలు తీరంలోని ఇసుక తిన్నెల్లో రంధ్రాలు చేసుకొని ఉంటాయి. అందుకే వీటిని కొన్ని చోట్ల ఇసుక పీతలంటారు. ఆహార అన్వేషణకు రాత్రివేళల్లోనే సాగరంలోకి వెళ్లే అలవాటు ఉండటం వల్ల మరికొన్ని ప్రాంతాల్లో 'ఘోస్ట్ క్రాబ్స్'గానూ పిలుస్తారు. ఇన్ని పేర్లున్న వీటి శాస్త్రీయ నామం 'ఓషియోపోడ్ రోటన్‌డేటా'. రాత్రిళ్లు సముద్రంలో, పగలు బొరియల్లో ఉండే ఇవి అరుదుగా వలలకు చిక్కుతాయి. వీటి రుచి ఎంతో బాగుంటుందని మత్స్యకారులు తెలిపారు. – న్యూస్‌టుడే, విశాఖపట్నం

చిక్కుళ్ల రారాజు!



పశ్చిమ గోదావరి జిల్లా తణుకు మండలం వేల్పూరుకు చెందిన రైల్వే విశ్రాంత ఉద్యోగి ముత్యాల సత్తిరాజు తన ఇంటి వద్ద 13 రకాల చిక్కుళ్లు పండిస్తున్నారు. అంగుళం పరిమాణం ఉన్న బీన్స్(లవంగం చిక్కుడు) మొదలు.. 6 అంగుళాల పొడవున్న రకాలు సాగు చేస్తున్నారు. 'తెలుగు రాష్ట్రాల్లో మిద్దె తోట సాగుదారుల వాట్సప్ గ్రూప్‌లో ఉండటం వల్ల విత్తనాలు మార్పిడి చేసుకుంటాం. నా వద్ద లవంగం, కనుప, దసరా, నాటు, చెట్టు, శ్వేత పర్పుల్, ఎర్ర చిక్కుడు, తెల్ల, తెల్ల తపుటి, తెల్ల వెడల్పు, గుత్తి, నేపాల్, వెడల్పు చిక్కుడు అనే రకాలు ఉన్నాయి' అని సత్తిరాజు వివరించారు. 'చిక్కుళ్లలో ప్రాంతాలను బట్టి రకాలు ఉంటాయి. సత్తిరాజులాంటి ఔత్సాహికుల వల్ల స్థానిక రకాల విత్తనాల అభివృద్ధికి అవకాశం ఉంది' అని తణుకు ప్రాంతీయ ఉద్యాన అధికారిణి ప్రియదర్శిని తెలిపారు. –ఈనాడు, వేల్పూరు(తణుకు)

చదివితే పండితులు.. మోస్తే బాడీబిల్డర్లు



పుస్తకం హస్తభూషణం అంటారు. కానీ, ఇక్కడ ఎవరూ బొమ్మపై ఆధారంగా ఉన్న పుస్తకాన్ని అంత సులువుగా చేతులతో పట్టుకుని తిరగలేరు. ఎందుకంటే దీని బరువు సుమారు 30 కిలోలు. ధర కూడా రూ.24 వేలు. హైదరాబాద్ ఎన్టీఆర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన పుస్తక ప్రదర్శనలోని ఓ స్టాల్‌లో అలిపిస్తున్న దేవనాగరి లిపి దివ్యవేదవాణి పుస్తకం ఇది. ఇంత పెద్ద పుస్తకాన్ని తీసుకెళ్లడం కష్టమనుకునే వారి కోసం ఆరు భాగాలుగా విభజించి కూడా అందుబాటులో ఉంచారు. తెలుగులోనూ ఒకే పుస్తకంగా, నాలుగు భాగాలుగా విక్రయిస్తున్నారు. –ఈనాడు, హైదరాబాద్

ఎట్టకేలకు ఆగిన కాల్పులు

థాయ్‌లాండ్, కంబోడియా మధ్య కుదిరిన ఒప్పందం

బ్యాంకాక్: గత కొన్ని వారాలుగా కొనసాగుతున్న సరిహద్దు ఘర్షణలకు థాయ్‌లాండ్, కంబోడియా ముగింపు పలికాయి. ఈ మేరకు ఇరు దేశాల రక్షణ మంత్రులు శనివారం కాల్పుల విరమణ ఒప్పందంపై సంతకాలు చేశారు. ఒప్పందంలో భాగంగా దాడులు, ప్రతిదాడుల కారణంగా సరిహద్దులకు దూరంగా వెళ్లిన వేల మంది పౌరులు స్వస్థలాలకు చేరుకోవడానికి అనుమతించాలని రెండు దేశాలు నిర్ణయించాయి. జులైలో తాము నిర్బంధించిన 18 మంది కంబోడియా సైనికులను అప్పగించేందుకు థాయ్‌లాండ్ అంగీకరించింది. అమెరికా, చైనా చొరవతో ఈ చర్చలు జరిగాయి. అక్టోబరులో కూడా అమెరికా అధ్యక్షుడు ట్రంప్ జోక్యంతో రెండు దేశాల మధ్య కాల్పుల విరమణ ఒప్పందం జరిగింది. కానీ అది విఫలమైంది. ఈ నెల 7 నుంచి ఇరు దేశాల మధ్య మళ్లీ ఘర్షణ రాజుకొంది. ఈ పోరులో పదుల సంఖ్యలో పౌరులు, సైనికులు మృతి చెందారు.

పాలన, సంస్కరణలపై విస్తృత చర్చలు

- సీఎస్‌ల జాతీయ సదస్సులో ప్రధాని మోదీ వెల్లడి



దిల్లీ: వికసిత భారత్ లక్ష్య సాధనలో రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు అనుసరించాల్సిన వ్యూహాలు, విద్య, మానవ వనరులు, నైపుణ్యాభివృద్ధి, పాలన, సంస్కరణలు తదితరాలపై విస్తృత చర్చలు శనివారం దిల్లీలో ప్రారంభమయ్యాయి. ప్రధాని మోదీ అధ్యక్షతన జరుగుతున్న ప్రధాన కార్యదర్శుల(సీఎస్) జాతీయ సదస్సు దీనికి వేదికగా మారింది. జాతీయాభివృద్ధి ప్రాథమ్యాలకి సంబంధించి కొనసాగే నిర్మాణాత్మకమైన, సుస్థిరమైన సంప్రదింపుల ప్రక్రియ కేంద్రం-రాష్ట్రాల భాగస్వామ్యాన్ని బలోపేతం చేస్తోందని, ప్రస్తుత సదస్సు ఇందుకు దోహదపడుతుందని అధికారులు ఆశాభావం వ్యక్తం చేశారు. తొలి రోజు సదస్సు విశేషాలను ప్రధాని మోదీ సామాజిక మాధ్యమం 'ఎక్స్' ద్వారా వెల్లడించారు. పాలన, సంస్కరణలు తదితర అంశాలపై లోతైన చర్చలు జరిగినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ప్రధాని ముఖ్య కార్యదర్శులు పి.కె.మిశ్ర, శక్తికాంత దాస్, కేంద్ర క్యాబినెట్ కార్యదర్శి టి.వి.సోమనాథన్, నీతి ఆయోగ్ సభ్యులు, అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల ప్రధాన కార్యదర్శులు (సీఎస్) పాల్గొన్నారు. సదస్సు షెడ్యూలు ప్రకారం.. ఆరు ప్రత్యేక సెషన్లు జరగనున్నాయి. పూర్వ ప్రాథమిక విద్య, నైపుణ్యాలు, ఉన్నత విద్య, క్రీడలు, విద్యేతర కార్యక్రమాలు, పాలనా వ్యవహారాల్లో సాంకేతికత, మార్కెట్ల అనుసంధానత, ఆత్మనిర్భర్ భారత్ తదితరాలపై ప్రత్యేక దృష్టిని సారించనున్నారు. సీఎస్‌ల జాతీయ సదస్సును గత నాలుగేళ్లుగా ప్రతి ఏడాదీ నిర్వహిస్తున్నారు.



శబరిమలలో ఘనంగా మండల పూజ

- వేల సంఖ్యలో తరలివచ్చిన భక్తులు
- తిరిగి 30న తెరుచుకోనున్న ఆలయం


శబరిమల: అయ్యప్పస్వామి కొలువైన శబరిమలలో శనివారం మండలపూజ ఘనంగా జరిగింది. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని వేల సంఖ్యలో భక్తులు తరలివచ్చి మణికంఠుడి దర్శనం చేసుకున్నారు. ఆలయ తంత్రి కందరారు మహేశ్ మోహనారు ఆధ్వర్యంలో శనివారం శాస్త్రోక్తంగా పూజాదికాలు నిర్వహించారు. రాత్రి పదిగంటల సమయంలో స్వామికి పవళింపు కీర్తన హరివరాసనం ఆలపించిన అనంతరం ఆలయ ద్వారాలను లాంఛనంగా మూసివేశారు. దీంతో వార్షిక యాత్ర సీజన్‌లో 41 రోజుల పాటు సాగిన తొలిదశ ముగిసినట్లైంది. మకరవిలక్కు పూజల కోసం ఈ నెల 30న సాయంత్రం 5 గంటలకు ఆయ్యప్ప ఆలయ ద్వారాలను తెరుస్తారు. ఆ రోజు నుంచి వార్షిక యాత్ర సీజన్‌లో రెండో దశ మొదలవుతుంది.


మహాకాళేశ్వర ఆలయ వార్షికాదాయం రూ.100 కోట్లు

ఉజ్జయిని: ద్వాదశ జ్యోతిర్లింగాల్లో ఒకటైన బాబా మహాకాళేశ్వర దేవస్థానానికి ఈ సంవత్సరం భక్తుల నుంచి రూ.100 కోట్లకు పైగా విరాళాలు లభించాయి. మధ్యప్రదేశ్‌లోని ఉజ్జయినిలో మహాకాళేశ్వర ఆలయం ఉంది. ప్రస్తుత సంవత్సరం జనవరి ఒకటి నుంచి డిసెంబరు 15 వరకూ దేవస్థానాన్ని సందర్శించిన 5.5 కోట్ల మంది భక్తుల నుంచి ఈ విరాళం అందిందని ఆలయ కమిటీ వెల్లడించింది.

ఆరెస్సెస్‌కు దిగ్విజయ్ సింగ్ ప్రశంసలు

- సంస్థాగత బలంపై సానుకూల వ్యాఖ్యలు





దిగ్విజయ్ పోస్టు చేసిన ఫొటో

దిల్లీ: కాంగ్రెస్‌కు మరో తలనొప్పి వచ్చి పడింది. ఒకవైపు ఆ పార్టీ ఎంపీ శశిథరూర్ కేంద్రంపై, ప్రధాని మోదీపై ప్రశంసలు కురిపిస్తూ సొంత పార్టీ నుంచి విమర్శలు ఎదుర్కొంటున్న సంగతి తెలిసిందే. తాజాగా ఆ పార్టీకే చెందిన సీనియర్ నేత దిగ్విజయ్ సింగ్.. భాజపా, ఆరెస్సెస్‌లకు ఉన్న సంస్థాగత బలాన్ని కొనియాడారు. సామాజిక మాధ్యమంలోని ఆ వ్యాఖ్యలకు ప్రధాని మోదీకి చెందిన పాత ఫొటోను జత చేశారు. గుజరాత్‌లో గతంలో జరిగిన ఓ కార్యక్రమానికి సంబంధించిన ఆ చిత్రంలో భాజపా అగ్ర నేత ఆడ్వాణీ కుర్చీలో ఆసీనులై ఉండగా.. ఆయన ముందు నేలపై మోదీ కూర్చున్నట్లు ఉంది. 'ఆరెస్సెస్‌లో సామాన్య కార్యకర్తలా.. నాయకుల పాదాల వద్ద నేలపై కూర్చున్న వ్యక్తి రాష్ట్ర సీఎంగా, దేశ ప్రధానిగా ఎలా ఎదిగారో చూడండి. ఇది భాజపా, ఆరెస్సెస్‌లకు ఉన్న సంస్థాగతమైన శక్తి' అని రాసుకొచ్చారు. ఈ పోస్టు చర్చనీయాంశంగా మారింది. ఉపాధి హామీ పథకం పేరు మార్చడాన్ని వ్యతిరేకిస్తూ ఉద్యమ కార్యాచరణను రూపొందించుకోవడం కోసం శనివారం కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) సమావేశం కావడానికి ముందు ఈ పరిణామం చోటుచేసుకుంది. సీడబ్ల్యూసీ భేటీ అనంతరం సామాజిక మాధ్యమంలో పెట్టిన మరో పోస్టులో...'భాజపా, ఆరెస్సెస్‌లకు నేను బద్ధ వ్యతిరేకిని. కాంగ్రెస్ పార్టీని క్షేత్రస్థాయి నుంచి బలోపేతం చేసుకోవాల్సిన అవసరం ఉందన్నది నా అభిప్రాయం. కొందరు అపార్థం చేసుకున్నారు' అని దిగ్విజయ్ పేర్కొన్నారు.

గురమెక్కకుండా స్వారీ నేర్చుకోగలరా?



మీరు గుర్రమెక్కకుండా గుర్రపు స్వారీ నేర్చుకోలేరు. ఈత కొలనులోకి దిగకుండా స్విమ్మింగ్‌ను సాధన చేయలేరు. అదే విధంగా మీరు జీవితంలో విజేతగా ఎదగాలనుకుంటే, అందుకు అనువైన వాతావరణం మీ చుట్టూ ఉండాలి. అందుకే మిమ్మల్ని నిరుత్సాహపరిచేవారికి దూరంగా ఉంటూ స్ఫూర్తిదాయక వ్యక్తులతో ఎక్కువగా గడపండి. కంఫర్ట్‌జోన్‌ను వదిలి సవాళ్లతో కూడిన పరిస్థితులను స్వీకరించండి.

– అలెక్స్ హార్మోజీ, బిజినెస్ గ్రోత్ మెంటార్

ట్రంప్-జెలెన్‌స్కీ భేటీ వేళ.. క్షిపణులతో విరుచుకుపడ్డ రష్యా

కీవ్: ఉక్రెయిన్ యుద్ధం ముగించేందుకు ఓవైపు ప్రయత్నాలు జోరుగా సాగుతున్నా, రష్యా మాత్రం తన దాడులను ఆపడం లేదు. శనివారం ఉదయం ఉక్రెయిన్ రాజధాని కీవ్‌పై డ్రోన్లు, బాలిస్టిక్ క్షిపణులతో విరుచుకుపడింది. ఈ దాడుల్లో ఓ పౌరుడు ప్రాణాలు కోల్పోయారని, 32 మందికి గాయాలయ్యాయని ఉక్రెయిన్ తెలిపింది. అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌ను ఆదివారం ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ కలవనున్న నేపథ్యంలోనే ఈ భారీ దాడి జరగడం గమనార్హం. చర్చల్లో ప్రధానంగా భద్రతా హామీలపైనే పట్టుబడతామని జెలెన్‌స్కీ పేర్కొన్నారు. రష్యా దాడిని ఆయన తీవ్రంగా ఖండించారు. శాంతి చర్చలకు ముందు జరిగిన ఈ దాడి పుతిన్ మనస్తత్వాన్ని తెలియజేస్తుందని అన్నారు. దాడిలో మొత్తం 500 డ్రోన్లు, 40 క్షిపణులను రష్యా ప్రయోగించిందని తెలిపారు. తాము ఉక్రెయిన్ ఇంధన, మిలిటరీ సదుపాయాలే లక్ష్యంగా దాడులు చేపట్టామని రష్యా రక్షణ మంత్రిత్వ శాఖ వెల్లడించింది. కీవ్ తమ దేశంలోని జనావాసాలపై చేసిన దాడులకిది ప్రతీకారమని తెలిపింది.



కీవ్‌లోని ఓ అపార్ట్‌మెంట్‌లో ఎగసిన మంటలు

బంగ్లాలో గాయకుడు జేమ్స్ కచేరీపై మూకదాడి

ఢాకా: ప్రముఖ రాక్ గాయకుడు జేమ్స్ నిర్వహిస్తున్న కచేరీపై మూకదాడి జరిగింది. కార్యక్రమం ప్రారంభానికి ముందే కొంతమంది ఆందోళనకారులు వేదిక వద్దకు దూసుకురావడంతో ఉద్రిక్తత నెలకొంది. దీంతో నిర్వాహకులు కార్యక్రమాన్ని రద్దు చేశారు. మూకదాడిలో 20 మంది విద్యార్థులు గాయపడినట్లు అధికారులు తెలిపారు. బంగ్లాదేశ్‌లోని ఫరీదాపూర్‌లో ఓ పాఠశాల 185వ వార్షికోత్సవాల ముగింపు సందర్భంగా శుక్రవారం రాత్రి జేమ్స్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. పూర్వ విద్యార్థులతో సహా వేలమంది ఇందులో పాల్గొనేందుకు వచ్చారు. కార్యక్రమ ప్రారంభానికి ముందు.. ఉన్నట్టుండి ఆందోళనకారులు రాళ్లు, ఇటుకలతో దాడి చేశారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో పోలీసులు అక్కడికి చేరుకొని నిరసనకారులను చెదరగొట్టే ప్రయత్నం చేశారు. భద్రతా కారణాల రీత్యా కార్యక్రమాన్ని రద్దు చేశారు.

1,840 ఏళ్లనాటి టవర్‌కు హైటెక్ మెరుగు



నేషనల్ డెస్క్: ఇటలీలోని రోమ్‌లో ఉన్న 1,840 ఏళ్లనాటి మార్బుల్ టవర్‌కు లేజర్ టెక్నాలజీతో హైటెక్ మెరుగులు దిద్దుతున్నారు. ఇందుకోసం 23లక్షల డాలర్లను వ్యయం చేస్తున్నారు. 2వ శతాబ్దంలో నిర్మించిన మార్కస్ ఔరేలియా అనే 100 అడుగుల ఈ టవర్‌పై యుద్ధ భూమిలో శిరచ్ఛేదం, మహిళా ఖైదీలను జుట్టుపట్టుకుని లాగుతున్న దృశ్యాలున్నాయి. 18 మంది నిపుణులు దీనికి మెరుగులద్దే పనిలో ఉన్నారు. అత్యంత ఆధునిక లేజర్ టెక్నాలజీని ఇందులో వాడుతున్నారు.

తండ్రిని కాపాడేందుకు మొసలితో పోరాటం..

- దక్కిన జాతీయ పురస్కారం



ఉత్తర్‌ప్రదేశ్‌లోని ఆగ్రా సమీప ఝర్నాపూర్ గ్రామ బాలుడు అజయ్‌రాజ్ శుక్రవారం రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము చేతుల మీదుగా 'ప్రధానమంత్రి రాష్ట్రీయ బాల పురస్కారం' అందుకొన్నాడు. మేకలకాపరి కుమారుడికి దక్కిన ఈ జాతీయ పురస్కారం వెనుక సాహసోపేతమైన గాథ ఉంది. ఈ ఏడాది జులై 25న.. వీర్‌భాన్ (35) చంబల్‌నది తీరాన తన కుమార్తె కిరణ్ (13), కుమారుడు అజయ్‌రాజ్ (10)లతో కలిసి మేకలు మేపుతుండగా పిల్లలిద్దరూ దాహమేస్తోందని చెప్పారు. నది వద్దకు వెళ్లి బాటిలుతో నీటిని ముంచుకొంటూ ఉండగా.. నీళ్లలోంచి ఒక్క ఉదుటున లేచిన మొసలి వీర్‌భాన్ కాలును ఒడిసిపట్టి లోపలికి లాగడం మొదలుపెట్టింది. తండ్రి కేకలు విని పరుగున వచ్చిన అజయ్ అమాంతం నదిలోకి దూకి చేతిలో ఉన్న కర్రతో మొసలి తలపై పదే పదే కొట్టాడు. కాసేపటి తర్వాత వీర్‌భాన్ కాలును వదిలేసిన మొసలి అప్పటికే చుట్టుపక్కల రైతులు, గొర్రెల కాపరులు అక్కడికి చేరుకొని కేకలు వేయడంతో నీళ్లలోకి జారుకొంది. గాయపడిన వీర్‌భాన్‌ను ఆగ్రా ఆసుపత్రికి తరలించారు.

జైపుర్ ప్యాలెస్‌లో ప్రదర్శించిన 340 ఏళ్ల సిక్కు గురువు ఖడ్గం

రాజస్థాన్ రాజధాని నగరమైన జైపుర్‌లోని రాజభవనంలో పదో సిక్కు గురువు గురు గోవింద్‌సింగ్ జయంతి నాడు వందల ఏళ్ల చరిత్ర గల పవిత్ర ఖడ్గాన్ని పూజించటం ఆనవాయితీగా వస్తోంది. సిర్‌మౌర్ రాజ కుటుంబానికి గురు గోవింద్‌సింగ్ కృపకు చిహ్నంగా దాదాపు 340 ఏళ్ల కిందట బహూకరించిన ఖడ్గమిది. హిమాచల్ ప్రదేశ్‌లోని సిర్‌మౌర్ జిల్లాలో గల నాహన్ రాజ కుటుంబాన్ని సందర్శించిన గురు గోవింద్‌సింగ్ వారి ఆతిథ్యాన్ని మెచ్చి ఈ దివ్య ఖడ్గాన్ని బహూకరించినట్లు చరిత్రకారుడు జితేంద్రసింగ్ షెకావత్ తెలిపారు. నాడు ఆయన సూచించిన యమునానది తీరంలోనే నేడు సిక్కు సమాజం ఎంతో పవిత్రంగా భావిస్తున్న పావ్‌టా సాహిబ్ గురుద్వారా నిర్మించినట్లుగా వివరించారు. సిర్‌మౌర్ నుంచి జైపుర్‌కు కోడలిగా వచ్చిన రాణీ పద్మినీదేవి ఈ ఖడ్గాన్ని తన వెంట తెచ్చినట్లుగా వెల్లడించారు. గురు గోవింద్‌సింగ్ జయంతి సందర్భంగా ఎప్పటిలా శనివారం ఈ ఖడ్గాన్ని ప్రజల సందర్శనార్థం ప్రదర్శించారు. జైపుర్ రాజ కుటుంబానికి చెందిన ఉప ముఖ్యమంత్రి దియాకుమారి పూజలు చేశారు.



ఈటీవీ భారత్

EENADU Vol: 52, Issue: 138 Printed and Published by M Nageswara Rao on behalf of Ushodaya Publications, a division of Ushodaya Enterprises Pvt Ltd. Printed and Published at Ushodaya Publications, Eenadu Press, Survey No. 239/3, 240/3B & 240/4, Gudavalli Village, Vijayawada Rural Mandal, NTR District - 521 104, Andhra Pradesh. Editor: M Nageswara Rao. Phones: 0866-2494900, 2862111. Regd. No. VJ/013/2024-26. RNI No.32238/1978. Air Surcharge Extra. Mumbai, Kolkata, Goa. Re. 1.00, Portblair Rs. 10.00. Founder Ramoji Rao

సౌర.. అవకాశాలు భళా

- ఆకర్షణీయంగా పెరగనున్న సౌర విద్యుదుత్పత్తి సామర్థ్యం
- మాడ్యూళ్లు, ఉపకరణాల తయారీ పరిశ్రమకు ఇం'ధనం'

సౌర విద్యుత్తు ఉత్పత్తి సామర్థ్యం మన దేశంలో ఎంతో ఆకర్షణీయంగా పెరగనుంది. దీనివల్ల సౌర విద్యుత్తు మాడ్యూళ్లు, ఉపకరణాల తయారీ సంస్థలు అధిక ఆదాయాలు ఆర్జించే సానుకూలత ఏర్పడుతోంది. దీంతో పాటు సౌర విద్యుత్తు ప్రాజెక్టులను నిర్మించే టర్న్‌కీ సంస్థల ఆర్డర్ బుక్‌లు భారీగా పెరగనున్నాయి. వచ్చే అయిదేళ్ల పాటు వృద్ధి అవకాశాలు అధికంగా ఉంటాయని తాజా నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. దీంతో ఈ విభాగంలోని కంపెనీల పని తీరుపై నిపుణులు దృష్టి కేంద్రీకరిస్తున్నారు.



2030కి రెట్టింపునకు పైగా..

మనదేశంలో మొత్తం విద్యుదుత్పత్తి సామర్థ్యం 2019లో 356 గిగావాట్లు కాగా, 2025 నాటికి అది దాదాపు 475 గిగావాట్లకు విస్తరించింది. పునరుత్పాదక ఇంధన వనరుల విభాగంలో కొత్త యూనిట్లు అధికంగా ఏర్పాటు కావడం దీనికి ప్రధాన కారణం. ఈ విభాగంలో విద్యుదుత్పత్తి సామర్థ్యం 2019లో 81 గిగావాట్లు మాత్రమే. కానీ 2030 నాటికి అయిదురెట్లకు పైగా వృద్ధి చెంది 430 గిగావాట్లకు పెరుగుతుందని అంచనా వేస్తున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సౌర, పవన విద్యుత్తు ప్రాజెక్టులకు పలు రాయితీలు, ప్రోత్సాహకాలు ఇస్తున్నందున ఈ విభాగాల్లో కొత్త యూనిట్లు అధికంగా ఏర్పాటయ్యే అవకాశం కలుగుతోంది. సౌర విద్యుత్తు సామర్థ్యం ఇప్పుడు 106 గిగావాట్లే. కానీ 2030 నాటికి రెట్టింపునకు పైగా పెరిగి 290 గిగావాట్లకు చేరుతుందని తెలుస్తోంది. ఇదే దేశీయ సౌర విద్యుత్తు ఉపకరణాల తయారీ పరిశ్రమకు ఇం'ధనం'గా మారనుంది.

ఈ కంపెనీలు రంగంలోకి..

2030 నాటికి సౌర మాడ్యూళ్ల ఉత్పత్తి సామర్థ్యం 180 గిగావాట్లకు పెరుగుతుందని అంచనా. దీన్ని సొమ్ము చేసుకోవడానికి సౌర విద్యుత్తు రంగంలోని కంపెనీలు సన్నాహాలు చేస్తున్నాయి. మాడ్యూళ్ల ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచుకోవడానికి ప్రీమియర్ ఎనర్జీస్ అనే సంస్థ రూ.120 కోట్లు పెట్టుబడి పెడుతోంది. దీంతో ఈ సంస్థకు ఉన్న మాడ్యూళ్ల తయారీ సామర్థ్యం 11 గిగావాట్లకు, సెల్స్ ఉత్పత్తి సామర్థ్యం 10.2 గిగావాట్లకు పెరుగుతుంది. దీంతో పాటు ఇన్‌గాట్-వేఫర్ సదుపాయం, అల్యూమినియమ్ ఫ్రేమ్స్ తయారీ యూనిట్‌ను ఏర్పాటు చేస్తోంది. ఇదే విభాగానికి చెందిన మరొక కంపెనీ, విక్రమ్ సోలార్ రూ.112 కోట్లతో ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచుకుంటోంది. వారీ ఎనర్జీస్ అనే మరొక సంస్థ, ఇంకా అధికంగా రూ.250 కోట్ల పెట్టుబడి పెడుతోంది. దీనివల్ల ఈ సంస్థకు ఉన్న మాడ్యూళ్ల సామర్థ్యం 26.8 గిగావాట్లకు, సెల్స్ సామర్థ్యం 15.4 గిగావాట్లకు, ఇన్‌గాట్-వేఫర్స్ ఉత్పత్తి సామర్థ్యం 10 గిగావాట్లకు పెరుగుతుంది.



కేంద్రం సహకారమూ

ఉత్పత్తి పెరగడం సరే, సౌర విద్యుత్తు వినియోగదార్లు ఎవరనేది ఆసక్తికరమైన అంశం. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పీఎం సూర్యఘర్, ముఫ్త్ బిజిలీ యోజన, పీఎం-కుసుమ్ పథకాలు ఇందుకు వీలుకల్పిస్తున్నాయి. ఇదే కాకుండా సొంత సౌర విద్యుత్తు కేంద్రాలను వ్యాపార సంస్థలు ఏర్పాటు చేసుకుంటున్నాయి. మరోపక్క, నేషనల్ గ్రీన్ హైడ్రోజన్ మిషన్ కార్యక్రమం వల్ల సోలార్ పీవీ మాడ్యూళ్లకు డిమాండ్ పెరుగుతుందని అంచనా వేస్తున్నారు. ఈ మార్పులు సౌర విద్యుత్తు పరిశ్రమకు కళాకాంతులు తీసుకురాబోతున్నాయి.

- ఈనాడు, హైదరాబాద్

ఈనాడు బిజినెస్ వారాంతం

రేబిస్ టీకా అభయరబ్‌పై ఆస్ట్రేలియా అడ్వైజరీ


సరికాదన్న ఐఐఎల్

ఈనాడు, హైదరాబాద్: కుక్క కాటుకు చికిత్సలో వినియోగించే రేబిస్ టీకా, 'అభయరబ్'పై ఆస్ట్రేలియా ప్రభుత్వం జారీ చేసిన 'హెల్త్ అడ్వైజరీ'పై హైదరాబాద్‌కు చెందిన టీకాల తయారీ సంస్థ అయిన ఇండియన్ ఇమ్యునలాజికల్స్ లిమిటెడ్ (ఐఐఎల్) అభ్యంతరం వ్యక్తం చేసింది. ఒక ఏడాది క్రితమే నకిలీ టీకా బ్యాచ్‌ను గుర్తించి, దాన్ని పంపిణీ వ్యవస్థ నుంచి తొలగించినట్లు వివరించింది. ఈ నకిలీ టీకా బ్యాచ్ ఆధారంగా 'హెల్త్ అడ్వైజరీ' జారీ చేసినట్లు తెలుస్తోందని, కాబట్టి దీన్ని సమీక్షించాలని ఐఐఎల్ కోరింది. నకిలీ టీకా బ్యాచ్‌లను ఈ సంస్థ ఈ ఏడాది జనవరిలోనే గుర్తించింది. ఇదే విషయాన్ని ఔషధ నియంత్రణ వర్గాల దృష్టికి కూడా తీసుకువెళ్లింది. ఆ తర్వాత పంపిణీ వ్యవస్థ నుంచి నకిలీ టీకా బ్యాచ్‌లను తొలగించినట్లు ఐఐఎల్ వివరించింది. ఈ ఒక్క ఉదంతం తప్పిస్తే టీకా విషయంలో ఎటువంటి అభ్యంతరాలు లేవని పేర్కొంది. ఈ టీకాను నిరంభ్యంతరంగా వినియోగించవచ్చని స్పష్టం చేసింది.

కల్లం టెక్స్‌టైల్స్‌పై దివాలా పిటిషన్ దాఖలు చేయనున్న యూబీఐ

ఈనాడు, హైదరాబాద్: కల్లం టెక్స్‌టైల్స్‌పై ఎన్‌సీఎల్‌టీ-అమరావతి బెంచ్‌లో ఐబీసీ కోడ్‌లోని సెక్షన్-7 కింద యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(యూబీఐ) దివాలా పిటిషన్ దాఖలు చేయనుంది. ఇదే విషయాన్ని కల్లం టెక్స్‌టైల్స్ బీఎస్ఈ (బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్)కి వెల్లడించింది. ఈ కంపెనీకి యూబీఐ వివిధ సందర్భాల్లో రుణాలు ఇచ్చింది. తీసుకున్న అసలు, దానిపై వడ్డీ కలిసి మొత్తం రూ.210.49 కోట్ల బకాయి పడింది. అందువల్ల ఈ సొమ్ము వసూలు చేసుకోవడానికి కల్లం టెక్స్‌టైల్స్‌పై దివాలా పిటిషన్ దాఖలు చేయడానికి యూబీఐ సిద్ధమైనట్లు తెలుస్తోంది.

ఏఐ ఎక్స్‌ప్రెస్‌కు బోయింగ్ 737-8 మ్యాక్స్ తొలి విమాన డెలివరీ 29న



దిల్లీ: ఎయిరిండియా (ఏఐ) ఎక్స్‌ప్రెస్ కోసం ప్రత్యేకంగా తయారు చేసిన బోయింగ్ 737-8 మ్యాక్స్ తొలి విమాన డెలివరీ డిసెంబరు 29న కానుంది. ఆ రోజు దిల్లీలో ఈ విమానం ల్యాండ్ అవుతుందని ఓ అధికారి తెలిపారు. ఇందులో కేవలం ఎకానమీ క్లాస్ సీట్లు మాత్రమే ఉంటాయి. కాగా.. ఎయిరిండియా, ఏఐ ఎక్స్‌ప్రెస్‌ను టాటా గ్రూపు కొనుగోలు చేసిన తర్వాత ఎయిరిండియా గ్రూపు కోసమే తయారైన తొలి విమానం కూడా ఇదే కావడం గమనార్హం. ఒక విమానయాన సంస్థ కోసం ప్రత్యేకంగా విమానాన్ని తయారు చేస్తే దానిని లైన్ ఫిట్‌గా వ్యవహరిస్తారు. ఒక విమానయాన సంస్థ కోసం తయారు చేసి మరో విమానయాన సంస్థకు డెలివరీ చేస్తే దానిని వైట్ టెయిల్ అంటారు. టాటాలు కొనుగోలు చేశాక ఇప్పటివరకు వైట్ టెయిల్ కిందే ఎయిరిండియా గ్రూపునకు విమానాలు డెలివరీ అయ్యాయి. అంతర్జాతీయంగా సరఫరాపరమైన అవరోధాల రీత్యా విమానాల డెలివరీలో ఆలస్యం అవుతుండటమే ఇందుకు కారణం.

కోడి గుడ్లు

28న ఫారం వద్ద రైతు అమ్మకం ధరలు (నెక్)

(100కు రూపాయలలో)

హైదరాబాద్	650
వరంగల్	652
విజయవాడ	680
తూ/ప గోదావరి	665
విశాఖపట్నం	660
చిత్తూరు	703

రూ.11,000 కోట్ల పబ్లిక్ ఇష్యూకు జెప్టో!

సెబీకి దరఖాస్తు

దిల్లీ: క్విక్ కామర్స్ సంస్థ జెప్టో పబ్లిక్ ఇష్యూ సన్నాహాల్లో ఉన్నట్లు తెలుస్తోంది. సంబంధిత ముసాయిదా పత్రాలను రహస్య పద్ధతిలో సెబీకి సమర్పించిందని ఈ పరిణామాలను దగ్గర నుంచి గమనిస్తున్న వర్గాలు తెలిపాయి. రహస్య పద్ధతిలో ముసాయిదా పత్రాలను సమర్పించినప్పుడు.. ఇష్యూ పరిమాణం లాంటి వివరాలు బయటకు తెలిసే వీలుండదు. అయితే ప్రతిపాదిత ఐపీఓ ద్వారా రూ.11,000 కోట్లను సమీకరించాలని జెప్టో భావిస్తోందని ఆ వర్గాలు చెబుతున్నాయి. వచ్చే ఏడాది జులై-సెప్టెంబరు మధ్య పబ్లిక్ ఇష్యూకు రావాలని కంపెనీ భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఇదే జరిగితే స్టాక్ ఎక్స్ఛేంజీల్లో నమోదైన నవతరం అంకుర సంస్థల జాబితాలో జెప్టో కూడా చేరుతుంది. మరోవైపు క్విక్ కామర్స్ వ్యాపారంలో జెప్టోకు పోటీ సంస్థలుగా ఉన్న జొమాటో (ఎటర్నల్), స్విగ్గీ ఇప్పటికే స్టాక్ ఎక్స్ఛేంజీల్లో నమోదయ్యాయి. బ్లింకిట్ పేరుతో ఎటర్నల్, ఇన్‌స్టామార్ట్ పేరుతో స్విగ్గీ.. క్విక్ కామర్స్ కార్యకలాపాలను నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే.



రూ.63,000 కోట్ల విలువ..

10 నిమిషాల్లో నిత్యావసర వస్తువులను డెలివరీ చేసే జెప్టోను 2021 జులైలో అదిత్ పలిచా, కైవల్య వోహ్రా స్థాపించారు. నాలుగేళ్లలోనే ఈ వ్యాపారాన్ని దేశంలోని ప్రధాన నగరాలకు వేగంగా విస్తరించారు. 2025 సెప్టెంబరుకు ఈ సంస్థకు 900కు పైగా డార్క్ స్టోర్లు ఉన్నాయి. 2023లో ఇది యూనికార్న్ హోదాను సాధించింది. ప్రస్తుతం ఈ సంస్థ విలువను 7 బిలియన్ డాలర్లు (రూ.63,000 కోట్లు)గా చెబుతున్నారు.

యువ మదుపర్లూ.. తొలుత సిప్ చేయండి

- అనుభవం వచ్చాక ఈక్విటీలకు మళ్లండి
- ఆర్థిక వృద్ధి-కుటుంబ పొదుపుతో సంపద సృష్టి
- రానున్న పదేళ్ల కాలంలో ఇదే కీలకం

ఈనాడు ఇంటర్వ్యూ

ఏంజెల్ వన్ సీఎండీ దినేష్ థక్కర్



ఈనాడు, హైదరాబాద్: 'దేశ ఆర్థిక వ్యవస్థ వేగంగా వృద్ధి చెందుతోంది. ఈ ప్రయాణంలో సాధారణ పెట్టుబడిదారుల భాగస్వామ్యం అసాధారణంగా పెరుగుతోంది' అని ఏంజెల్ వన్ వ్యవస్థాపకుడు, సీఎండీ దినేష్ థక్కర్ తెలిపారు. దేశ ఆర్థిక స్థితిగతులు, స్టాక్ మార్కెట్ ధోరణులు, పెట్టుబడుల్లో సాంకేతికత పోషిస్తున్న పాత్ర తదితరాలపై ఆయన 'ఈనాడు'కు ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. ఆ విశేషాలు..

? రెండో త్రైమాసికంలో దేశ వృద్ధి రేటు 8.2 శాతంగా ఉంది. పూర్తి ఆర్థిక సంవత్సరంపై మీ అంచనా ఏమిటి

ఈ ఆర్థిక సంవత్సరం ముగిసేనాటికి 7.4% వృద్ధి రేటు నమోదవ్వొచ్చు. పెరుగుతున్న కుటుంబ ఆదాయం.. పెట్టుబడులకు కేటాయించగలిగిన మిగులు ఆదాయంగా మారుతోంది. యూపీఐ, ఆధార్ ఆధారిత కేవైసీ నిబంధనలతో డిజిటల్ మౌలిక సదుపాయాలు ఆర్థిక మార్కెట్లను సామాన్యులకు అందుబాటులోకి తెచ్చాయి. కుటుంబ పొదుపు క్రమంగా క్రమశిక్షణతో కూడిన సంపద సృష్టి వైపు మళ్లుతోంది. ఆర్థిక వ్యవస్థ క్రమబద్ధీకరణ, పొదుపు పెరగడం, ఈక్విటీ భాగస్వామ్యం ఇలా పలు మార్పులు భారత్‌ను 5 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ దిశగా నడిపించొచ్చు.

? ప్రస్తుతం మార్కెట్లో నమోదైన మదుపరులు దాదాపు 24 కోట్లకు పైగానే ఉన్నారు. రెండు, మూడో శ్రేణి నగరాల నుంచి వీరు అధికంగా వస్తున్నారు. దీనికి కారణాలు ఏమిటి

సంపద సృష్టి అనేది ఇప్పుడు మెట్రో నగరాలను దాటింది. సామాన్యుల రోజువారీ ఆర్థిక వ్యవహారాల్లో ఇది భాగంగా మారింది. ఒక సర్వే ప్రకారం 85.5% భారతీయుల ఇళ్లలో స్మార్ట్‌ఫోన్లు ఉన్నాయి. 99.5% యువత యూపీఐని వాడుతున్నారు. ఆధార్ ఆధారిత ఈ-కేవైసీ వల్ల పెట్టుబడి ప్రక్రియ గంటల నుంచి నిమిషాలకు తగ్గింది. దేశ జనాభాలో దాదాపు 65 శాతంగా ఉన్న యువ భారతీయులు ఈక్విటీ మార్కెట్లను దీర్ఘకాలిక సంపద సృష్టి సాధనంగా చూస్తున్నారు. మా గణాంకాల ప్రకారం, కొత్త వినియోగదారుల్లో సుమారు 90% మంది మెట్రోయేతర నగరాల నుంచే వస్తున్నారు. మార్కెట్ హెచ్చుతగ్గులతో సంబంధం లేకుండా నెలకు సిప్ పెట్టుబడులు దాదాపు రూ.30,000 కోట్ల స్థాయికి చేరుకున్నాయి.

? 35 ఏళ్ల లోపు యువత 45% మంది నేరుగా ఈక్విటీల్లో మదుపు చేసేందుకు ఇష్టపడుతున్నారు. ఈ ధోరణి ప్రమాదకరం కాదా

స్టాక్ మార్కెట్లో యువత భాగస్వామ్యం పెరగడం సానుకూల అంశమే. కేవలం అందుబాటులో ఉన్న సమాచారంతో మదుపు చేస్తే సరిపోదు. మార్కెట్‌లో ఉండే నష్ట భయాలనూ సరిగా అర్థం చేసుకోవాలి. స్వల్పకాలిక మార్పులకు స్పందించకుండా, బలమైన కంపెనీల్లో, దీర్ఘకాలం పెట్టుబడులు కొనసాగించడం ద్వారానే సంపద సృష్టి సాధ్యమవుతుంది. ఆవేశపూరితంగా కాకుండా, దీర్ఘకాలిక ఆలోచనతో నిర్ణయాలు తీసుకోవాలి. కొత్త మదుపరులు మార్కెట్‌లోకి ఎప్పుడు వస్తున్నామన్నదానితో సంబంధం లేకుండా క్రమానుగత పెట్టుబడి విధానం (సిప్) ఎంచుకోవడం మంచి మార్గం. అనుభవం వచ్చాక నేరుగా ఈక్విటీల వైపు మళ్లడం ఉత్తమం.

? డిజిటల్ పెట్టుబడుల వ్యవస్థలో పెరుగుతున్న పోటీని ఏంజెల్ వన్ ఎలా తట్టుకుంటోంది? మీ వ్యూహాలేమిటి

భారతీయ మదుపరుల ఆలోచనల్లో ఇప్పుడు చాలా స్పష్టమైన మార్పులు వచ్చాయి. వినియోగదారులు తమ అవసరాల కోసం ఒకే సమీకృత వేదికను ఇష్టపడుతున్నారు. రెండో త్రైమాసికంలో 17 లక్షల మంది మా వద్ద నమోదయ్యారు. కృత్రిమ మేధ(ఏఐ)తో వారి నిర్ణయాలు సరైన విధంగా సాగేలా చూస్తున్నాం.

? కొత్తగా మార్కెట్లోకి వచ్చే యువ మదుపరులకు మీరు ఏం సూచిస్తారు

నా సలహా ఒక్కటే.. త్వరగా పెట్టుబడి ప్రారంభించండి. క్రమబద్ధంగా కొనసాగించండి. కాలానికి మీ కోసం పనిచేసే అవకాశం ఇవ్వండి. మీ నష్టభయ సామర్థ్యాన్ని అర్థం చేసుకోండి. స్వల్పకాలిక వార్తలకు స్పందించొద్దు. హెచ్చుతగ్గుల సమయంలో సహనంతో ఉండండి. ట్రెండ్ వెంట పడొద్దు. ప్రాథమిక సూత్రాలనే నమ్మండి.

విదేశాలకైతే థాయ్.. ఇక్కడైతే గోవా..

కొత్త సంవత్సర వేడుకలకు అధిక బుకింగ్‌లు: మేక్‌మైట్రిప్



దిల్లీ: కొత్త సంవత్సర వేడుకలు చేసుకునేందుకు విదేశీ గమ్యస్థానాల్లో థాయ్‌లాండ్ వైపు ఎక్కువ మంది భారతీయులు ఆసక్తి కనబర్చినట్లు మేక్‌మైట్రిప్ తెలిపింది. అలాగే దేశీయంగా గోవాకు ఎక్కువ బుకింగ్‌లు నమోదయ్యాయని పేర్కొంది. 2025 డిసెంబరు 20 నుంచి 2026 జనవరి 5 మధ్య ప్రయాణాల కోసం మేక్‌మైట్రిప్ ప్లాట్‌ఫామ్‌పై నమోదైన బుకింగ్‌ల ఆధారంగా ఈ విషయాలను వెల్లడించింది. దీని ప్రకారం..

● కొత్త సంవత్సర వేడుకల కోసం భారతీయులకు అత్యంత ప్రాధాన్య విదేశీ గమ్యస్థానంగా థాయ్‌లాండ్ నిలిచింది. ఈ విషయంలో యూఏఈని వెనక్కి నెట్టింది. ● 2024లో ఇదే సమయంలో ఏడో ర్యాంకులో ఉన్న వియత్నాం.. ఈ ఏడాది అత్యధిక బుకింగ్‌లు నమోదైన తొలి 4 విదేశీ గమ్యస్థానాల్లో ఒకటిగా చోటు దక్కించుకుంది. ● వీసా నిబంధనలు సులభతరం కావడం వల్లే విదేశీ పర్యటనల వైపు ఆసక్తి కనబరుస్తున్న భారతీయుల సంఖ్య పెరిగేందుకు దోహదం చేస్తోందని మేక్‌మైట్రిప్ తెలిపింది. ● దేశీయంగా కొత్త సంవత్సర వేడుకల కోసం ఎక్కువ మంది భారతీయులకు గోవా, జైపుర్, ఉదయ్‌పూర్ తొలి 3 ప్రాధాన్య గమ్యస్థానాలుగా ఉన్నాయి.

డ్రోన్ తయారీకి ప్రత్యేక పథకం!

దేశంలో మానవ రహిత వైమానిక వాహనాల తయారీని వేగవంతం చేయడం కోసం బడ్జెట్ 2026లో డ్రోన్‌శక్తి కింద ఒక తయారీ ఆధారిత ప్రోత్సాహక పథకం ప్రకటించే అవకాశం ఉంది. ఆ మేరకు ప్రభుత్వ వర్గాలను ఉటంకిస్తూ ఒక ఆంగ్ల వార్తా సంస్థ తన కథనంలో పేర్కొంది. పౌర డ్రోన్లకు ఒక అంతర్జాతీయ తయారీ కేంద్రంగా భారత్‌ను నిలబెట్టేందుకు ఈ పథకం ఉపయోగపడుతుందని ఆ వర్గాలు పేర్కొన్నాయి. ప్రతిపాదిత పథకం అయిదేళ్ల పాటు అమలు అవ్వొచ్చు. రూ.10,000 కోట్ల వరకు నిధుల మద్దతు లభించొచ్చు. ఇప్పటికే ఈ ప్రతిపాదనను ఆర్థిక శాఖ సూత్రప్రాయంగా అంగీకరించిందని, పూర్తి అమలు కాలానికి ఒకేసారి వ్యయాలనూ ఆమోదించొచ్చని తెలుస్తోంది.

అమలు రెండు దశల్లో: ఉత్పత్తి అనుసంధానిత ప్రోత్సాహక(పీఎల్ఐ) పథకంలో ఉత్పత్తి, విలువ జోడింపు తర్వాతే ప్రోత్సాహకాలు లభిస్తాయి. అయితే డ్రోన్ శక్తి కింద అలా ఉండదు. పెట్టుబడి అనుసంధానిత ప్రోత్సాహకాలు, తయారీ మద్దతు లభిస్తుంది. తొలి దశలో తయారీ యూనిట్ల ఏర్పాటుకు అవసరమయ్యే మూలధన వ్యయాలపై 10-15% సబ్సిడీ ఇస్తారు. అయితే కనీస టర్నోవరు పరిమితి, పెట్టుబడుల పూర్తికి గడువు వంటి షరతులుంటాయి. రెండో దశలో తయారీ అవుట్‌పుట్ అనుసంధానంగా 10-15% సబ్సిడీ అమలవుతుంది. దేశీయ తయారీ డ్రోన్లను దిగుమతి డ్రోన్ల కంటే తక్కువ ధరకు తీసుకురావడమే ఈ పథకం ఉద్దేశం.

దిగ్గజ ఏడు నగరాల్లో 1,400 కో-వర్కింగ్ సెంటర్లు

- స్థల విస్తీర్ణంలో 67% వరకు 10 సంస్థల చేతిలోనే
- జీసీసీలకు వేదికగా 475 కేంద్రాలు
- వెస్టియన్ నివేదిక

దిల్లీ: భారత్‌లోని ఏడు దిగ్గజ నగరాల్లో సుమారు 1,400 కోవర్కింగ్ సెంటర్‌లు (ఫ్లెక్సిబుల్ వర్క్‌స్పేసెస్) ఉన్నాయని స్థిరాస్తి కన్సల్టెంట్ సంస్థ వెస్టియన్ తాజా నివేదిక తెలిపింది. వీటి మొత్తం స్థల విస్తీర్ణం 82.3 మిలియన్ చదరపు అడుగులు కాగా.. ఇందులో మూడింట రెండొంతుల (67%) వరకు 10 సంస్థల నిర్వహణలో ఉన్నాయని పేర్కొంది. అయితే ఆ 10 సంస్థల పేర్లను నివేదిక వెల్లడించలేదు. అలాగే ఈ 1400 కో-వర్కింగ్ సెంటర్లలో 475కు పైగా గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ల (జీసీసీలు)కు బేసెస్‌గా ఉన్నాయని నివేదిక తెలిపింది.



స్థల విస్తీర్ణం 100 మి.చదరపు అడుగులను మించొచ్చని అంచనా వేస్తున్నారు.

కో-వర్కింగ్ కార్యాలయాల స్థలంలో ప్రధాన ఏడు నగరాల వాటా

బెంగళూరు	33.2%
దిల్లీ-ఎన్‌సీఆర్	20.4%
పుణె	14.7%
హైదరాబాద్	12.4%
ముంబయి	9.2%
చెన్నై	8.5%
కోల్‌కతా	1.6%

కార్యకలాపాలు నిర్వహిస్తున్న ప్రముఖ కంపెనీల్లో ద ఎగ్జిక్యూటివ్ సెంటర్, ఇంకస్‌పేజ్, సింప్లివర్క్ ఆఫీసెస్, టేబుల్ స్పేస్, అర్బన్ వాల్ట్, 91స్ప్రింగ్ బోర్డ్, స్ప్రింగ్ హౌస్ వర్క్‌స్పేసెస్, బివ్ వర్క్‌స్పేస్, 315వర్క్ అవెన్యూ, ద ఆఫీస్ పాస్, హాంటో వర్క్‌స్పేసెస్ లాంటివి ఉన్నాయి.

100 మి.చదరపు అడుగులకు

జీసీసీలకు పెరుగుతున్న గిరాకీకి తగ్గట్లుగా కార్యకలాపాల విస్తరణ, నవీకరణపై కో-వర్కింగ్ సెంటర్ల నిర్వహణ సంస్థలు ప్రాధాన్యం ఇస్తున్నాయని వెస్టియన్ సీఈఓ శ్రీనివాస్ రావు తెలిపారు. వచ్చే ఏడాదిలో మెట్రో నగరాల్లో (టైర్-1) ఫ్లెక్సిబుల్ వర్క్‌స్పేసెస్‌ల మొత్తం

ఎక్స్ఛేంజీల్లో నమోదైనవి 4

దేశంలో ప్రస్తుతమున్న కో-వర్కింగ్ సెంటర్‌ల నిర్వహణ సంస్థల్లో 4 సంస్థలు స్టాక్ ఎక్స్ఛేంజీల్లో నమోదయ్యాయి. అవి.. వీవర్క్ ఇండియా, స్మార్ట్‌వర్క్స్, ఆఫిస్, ఇండిక్యూబ్ స్పేసెస్. ఇవేకాకుండా ఈ తరహా

40% గిరాకీ జీసీసీల నుంచే

భారత్‌లో ప్రస్తుతం 1,750కి పైగా జీసీసీ కంపెనీలు ఉన్నాయని నివేదిక తెలిపింది. గత రెండేళ్లలో మొత్తం కార్యాలయాల స్థల గిరాకీలో 40 శాతానికి పైగా వాటా జీసీసీల నుంచే ఉందని పేర్కొంది.

డూప్లికేట్ సెక్యూరిటీల జారీ సులువుగా

- నిబంధనలను సడలించిన సెబీ
- రూ.10 లక్షలకు పరిమితి పెంపు

దిల్లీ: డూప్లికేట్ సెక్యూరిటీల జారీ ప్రక్రియను మార్కెట్ నియంత్రణాధికార సంస్థ సరళతరం చేసింది. మదుపర్లకు నిబంధనలను సడలించే ప్రక్రియలో భాగంగా సెబీ ఈ నిర్ణయం తీసుకుంది. సరళీకృత డాక్యుమెంటేషన్ ప్రక్రియ పరిమితిని సైతం రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచింది. దీంతో రూ.10 లక్షల వరకు విలువైన సెక్యూరిటీలకు మదుపర్లు చాలా తక్కువ పత్రాలను సమర్పించడం ద్వారా డూప్లికేట్ సెక్యూరిటీస్ సర్టిఫికెట్లను పొందొచ్చని ఒక సర్క్యులర్‌లో సెబీ తెలిపింది. ఒక ప్రామాణీకరించిన అఫిడవిట్-కమ్-ఇండెమ్నిటీ బాండ్ ఫార్మాట్‌ను సైతం తీసుకొచ్చింది. రూ.10 లక్షలకు పైబడి విలువ ఉన్న సెక్యూరిటీలకు సైతం హేతుబద్ధీకరించిన డాక్యుమెంటేషన్‌ను ప్రవేశపెట్టింది.



రూ.10,000 వరకు సెక్యూరిటీల విషయంలో అఫిడవిట్ అవసరం లేకుండా చేసింది. పోగొట్టుకున్న, డ్యామేజీ అయిన సెక్యూరిటీలు ఉన్న మదుపర్లు సులభంగా డూప్లికేట్ సెక్యూరిటీలను పొందేలా ఈ చర్యలు తీసుకుంది. అయితే డీమ్యాట్ రూపంలోనే అన్ని డూప్లికేట్ సెక్యూరిటీలను జారీ చేస్తారు.

వినియోగదారులకు వరంగా మారిన 1915

దిల్లీ: 2025లో దేశవ్యాప్తంగా వినియోగదార్లకు మొత్తం మీద రూ.45 కోట్ల రిఫండ్‌లను రికవరీ చేయడంలో జాతీయ వినియోగదార్ల హెల్ప్‌లైన్(ఎన్‌సీహెచ్) సాయం చేసింది. 67,265 వినియోగదారుల ఫిర్యాదులను పరిష్కరించినట్లు ఒక ప్రకటనలో పేర్కొంది. ఇందులో ఇ-కామర్స్ రంగంపై అత్యధికంగా సుమారుగా 40,000 ఫిర్యాదులు రాగా, వాటిని పరిష్కరించి రూ.32 కోట్లను రికవరీ చేసింది. ఇది మొత్తం చెల్లింపుల్లో మూడింట రెండు వంతుల కంటే అధికం కావడం గమనార్హం. తర్వాతి స్థానంలో ప్రయాణ, పర్యాటక రంగం (రూ.3.5 కోట్లు) ఉంది. వినియోగదార్లు తమ ఫిర్యాదులను టోల్-ఫ్రీ-నంబరు (1915), వాట్సప్ (8800001915), ఎస్ఎంఎస్, ఇమెయిల్, వెబ్ పోర్టల్ ద్వారా 17 భాషల్లో నమోదు చేసే సదుపాయం ఉన్న సంగతి తెలిసిందే.

భారత సంతతి సీఈఓల్లో సంపన్నురాలు జయశ్రీ

- ఆమె నికర సంపద రూ.50,170 కోట్లు
- తర్వాత స్థానంలో సత్య నాదెళ్ల
- హురున్ ఇండియా రిచ్ లిస్ట్ 2025

భారత సంతతికి చెందిన అంతర్జాతీయ సంపన్న సీఈఓల్లో దిగ్గజాలైన సత్యనాదెళ్ల, సుందర్ పిచాయ్‌లను తోసిరాజని జయశ్రీ ఉల్లాల్ అగ్రస్థానంలో నిలిచారు. 'హురున్ ఇండియా రిచ్ లిస్ట్ 2025' ప్రకారం, అరిస్టా నెట్‌వర్క్స్ ప్రెసిడెంట్, సీఈఓ జయశ్రీ ఉల్లాల్ రూ.50,170 కోట్ల నికర సంపదతో సంపన్నుల జాబితాలో తొలిస్థానంలో ఉన్నారు. కంప్యూటర్ నెట్‌వర్కింగ్ కంపెనీ అయిన అరిస్టా నెట్‌వర్క్స్‌లో 2008 నుంచి ఆమె సేవలు అందిస్తున్నారు. ఫోర్బ్స్ ప్రకారం.. ఆమె నాయకత్వంలో 2024లో కంపెనీ 7 బిలియన్ డాలర్ల (రూ.63,000 కోట్ల) ఆదాయాన్ని నమోదు చేసింది. 2023తో పోలిస్తే ఇది 20 శాతం అధికం. అరిస్టా నెట్‌వర్క్స్‌లో ఆమెకు సుమారు 3 శాతం వాటా ఉంది.



● జయశ్రీ ఉల్లాల్ 1961 మార్చి 27న లండన్‌లో భారత సంతతికి చెందిన హిందూ కుటుంబంలో జన్మించారు. శాన్‌ఫ్రాన్సిస్కో స్టేట్ యూనివర్సిటీ నుంచి ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్‌లో బ్యాచలర్ ఆఫ్ సైన్స్ పూర్తి చేశారు. 1986లో శాంటా క్లారా యూనివర్సిటీ నుంచి ఇంజినీరింగ్ మేనేజ్‌మెంట్‌లో మాస్టర్ ఆఫ్ సైన్స్ పూర్తి చేశారు. 2025లో ఇంజినీరింగ్‌లో గౌరవ డాక్టరేట్ కూడా పొందారు.

● మైక్రోసాఫ్ట్ సీఈఓ సత్య నాదెళ్ల రూ.9,770 కోట్ల నికర సంపదతో జాబితాలో జయశ్రీ ఉల్లాల్ తర్వాత స్థానంలో నిలిచారు. గూగుల్ సీఈఓ సుందర్ పిచాయ్ రూ.5,810 కోట్ల సంపదతో ఏడో స్థానంలో ఉన్నారు.

2026లోనూ భారత్‌లోకి ఎఫ్‌డీఐ హవా!



బలమైన స్థూల ఆర్థిక ప్రాథమిక అంశాలు, భారీ పెట్టుబడి ప్రకటనలు, వ్యాపారం చేసే సౌలభ్యాన్ని మెరుగుపర్చడానికి జరుగుతున్న నిరంతర ప్రయత్నాలు, కొత్త తరం పెట్టుబడి సంబంధిత వాణిజ్య ఒప్పందాల మద్దతుతో.. 2026లోనూ మనదేశంలోకి విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల (ఎఫ్‌డీఐ) ప్రవాహం గణనీయ వృద్ధిని నమోదు చేస్తుందని అంచనా వేస్తున్నారు. భారతదేశం ఒక ఆకర్షణీయమైన, పెట్టుబడిదార్లకు గమ్యస్థానంగా ఉండేలా చూడటానికి, ప్రభుత్వం ఎఫ్‌డీఐ విధానాన్ని నిరంతరం సమీక్షిస్తోంది. వాటాదార్లతో విస్తృత సంప్రదింపులు జరిపిన తర్వాత ఎప్పటికప్పుడు మార్పుచేర్పులు చేస్తోంది. పరిశ్రమ, అంతర్గత వాణిజ్య ప్రోత్సాహక విభాగం (డీపీఐఐటీ) ఈ ఏడాది ఎఫ్‌డీఐను ప్రోత్సహించే మార్గాలపై వాటాదార్లతో వరుస సమావేశాలు నిర్వహించింది. నవంబరులో వాణిజ్య, పరిశ్రమల మంత్రి పీయూష్ గోయల్ కూడా ప్రక్రియలను వేగవంతంగా, సులభంగా, మరింత సమర్థవంతంగా చేయడం ద్వారా అధిక పెట్టుబడులను ఆకర్షించే మార్గాలపై సంప్రదింపులు జరిపారు.

అంతర్జాతీయ అనిశ్చితులున్నా..

ప్రపంచ వ్యాప్తంగా సవాళ్లు ఉన్నప్పటికీ మన దేశంలో పెట్టుబడిదార్లకు అనుకూలమైన విధానాలు, నియంత్రణ పద్ధతులు, పెట్టుబడులపై ఆకర్షణీయ రాబడి, ప్రతిభావంతులైన శ్రామిక శక్తి, నిబంధనల భారాన్ని తగ్గించడం, చిన్న పరిశ్రమ సంబంధిత నేరాలను నేరరహితం చేయడం, క్రమబద్ధీకరించిన ఆమోదాలు తదితరాలు భారతదేశంలో విదేశీ పెట్టుబడిదార్లు దృష్టి సారించేలా చేస్తున్న అంశాలుగా ఉన్నాయి. అంతర్జాతీయ అనిశ్చితులున్నా 2024-25లో మొత్తం విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు (ఎఫ్‌డీఐ) జీవనకాల గరిష్ఠమైన 80.62 బిలియన్ డాలర్ల(సుమారు రూ.7.65 లక్షల కోట్లు)ను అధిగమించాయి. 2025 జనవరి-అక్టోబరులో స్థూల విదేశీ పెట్టుబడులు 60 బి.డాలర్లను అధిగమించాయి. 2026లో కూడా ఎఫ్‌డీఐ 80.62 బి.డాలర్ల మార్కును అధిగమించే అవకాశం ఉందని డీపీఐఐటీ కార్యదర్శి అమర్‌దీప్ సింగ్ భాటియా అంచనా వేశారు.

ఎక్కువ పని గంటలు కాదు.. చేసే పనిపై శ్రద్ధ ఉండాలి!

ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకులు ఎస్‌డీ శిబులాల్



ముంబయి: ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకుల్లో ఒకరైన ఎన్ఆర్ నారాయణమూర్తి వారానికి 70 గంటలు ఉద్యోగులు పని చేయాలని గతంలో సూచించగా, అదే సంస్థ సహ వ్యవస్థాపకుల్లో మరొకరైన ఎస్‌డీ శిబులాల్ మాత్రం ప్రతి వారం ఎక్కువ గంటలు పనిలో ఉండటం కంటే, చేసే పనిపై శ్రద్ధ పెట్టడం చాలా ముఖ్యమని అభిప్రాయపడ్డారు. ఎక్కువ సమయం పని చేయడం కంటే ఆ పనిలో నాణ్యత చాలా ప్రధానమని అనుకుంటున్నానని తెలిపారు. ఇటీవల జరిగిన ఒక కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ 'ప్రస్తుతం నేను ఇక్కడ కూర్చుని ఉన్నాను. ఇక్కడే ఉండాలి తప్ప పరధ్యానంగా ఉండలేను. నా సెల్‌ఫోన్‌లో నన్ను నేను పరధ్యానంలో ఉంచలేను. నేను మరే ఇతర ఆలోచనలతోనూ పరధ్యానంలో ఉండలేను' అని వెల్లడించారు. గతంలో 2014 వరకు మూడేళ్లపాటు శిబులాల్ ఇన్ఫోసిస్ కంపెనీ సీఈఓగా పని చేశారు. సమయపాలనలో ఎవరి వ్యక్తిగత అభిప్రాయాలు, ప్రాధాన్యాలు వారికి ఉంటాయని పేర్కొన్నారు. వ్యక్తిగత, వృత్తిగత, ప్రజా జీవితం మధ్య సమయాన్ని కేటాయించేందుకు ప్రతి ఒక్కరికీ అవకాశం ఉంటుందని, వారి అవసరాల మేరకు ప్రాధాన్యతలు మారతాయని వెల్లడించారు. అయితే కేటాయించుకున్న సమయంలో మాత్రం అక్కడే 100 శాతం జీవించాలని సూచించారు. గతంలో వారానికి 70 గంటలు పని చేయాలని ఇన్ఫోసిస్ నారాయణమూర్తి, 90 గంటలు పని చేయాలని ఎల్ అండ్ టీ ఛైర్మన్ ఎస్ఎన్ సుబ్రహ్మణ్యన్ సలహా ఇవ్వగా వీరి ఆలోచనలను చాలా మంది వ్యతిరేకించారు.

ఈనాడు సినిమా

గాయమే మీకో పతకం


సల్మాన్ ఖాన్

భారత్ మాతా కీ జై.. అంటూ యుద్ధ భూమిలోకి అడుగుపెట్టారు బాలీవుడ్ అగ్రహీరో సల్మాన్ ఖాన్. ఆయన ప్రధాన పాత్రలో నటిస్తున్న చిత్రం 'బ్యాటిల్ ఆఫ్ గల్వాన్'. అపూర్వ లఖియా దర్శకత్వం వహిస్తున్నారు. చిత్రాంగద సింగ్ కథానాయిక. శనివారం సల్మాన్ పుట్టినరోజు. ఈ సందర్భంగా ఈ సినిమా టీజర్‌ను సామాజిక మాధ్యమాల వేదికగా విడుదల చేసింది చిత్రబృందం. ఇందులో ప్రత్యర్థుల వైపు దూసుకెళ్తున్న భారత ఆర్మీ అధికారిగా కనిపిస్తూ ప్రేక్షకుల్ని ఆకట్టుకుంటున్నారు సల్మాన్. "చావుకి భయపడటం ఎందుకు? అది అనివార్యం", "సైనికులారా గుర్తుంచుకోండి.. మీకు గాయమైతే దాన్ని పతకంలా భావించండి. మృత్యువు ఎదురైతే వందనం చేసి 'ఈరోజు కాదు.. బహుశా మరోసారి' అని చెప్పండి" అంటూ ఆయన చెప్పిన సంభాషణలు సినీప్రియుల దృష్టిని ఆకట్టుకుంటున్నాయి. 2020లో గల్వాన్ లోయలో జరిగిన యుద్ధం నేపథ్యంలో దీన్ని రూపొందిస్తున్నారు. ఈ వార్ డ్రామా వచ్చే ఏడాది ఏప్రిల్ 17న రానుంది.

డ్రీమ్ థియేటర్‌లో సీతాకోకచిలుక


ప్రియాంక మోహన్

'ఓజీ' సినిమాతో పవన్ కల్యాణ్ సరసన నటించి ఇటీవలే తెరపై సందడి చేసింది కథానాయిక ప్రియాంక మోహన్. ఆమె '666: ఆపరేషన్ డ్రీమ్ థియేటర్' చిత్రంలో నటిస్తున్న సంగతి తెలిసిందే. కన్నడ అగ్రహీరో శివరాజ్‌కుమార్ ప్రధాన పాత్రలో నటిస్తున్న చిత్రమిది. 'సప్తసాగరాలు దాటి' ఫేమ్ హేమంత్ ఎం రావు దర్శకత్వం వహిస్తున్నారు. డాలీ ధనంజయ కీలక పాత్రలో కనిపించనున్నారు. తాజాగా ఈ సినిమా నుంచి ప్రియాంక పోస్టర్‌ను సామాజిక మాధ్యమాల వేదికగా విడుదల చేసింది చిత్రబృందం. "గందరగోళ పరిస్థితుల మధ్య ఎగురుతున్న సీతాకోకచిలుకను పరిచయం చేస్తున్నామ"ని వ్యాఖ్యను జోడించింది. ఈ పోస్టర్‌లో రెట్రో లుక్‌లో కనిపిస్తూ సినీప్రియుల్ని ఆకట్టుకుంటోంది ప్రియాంక. 1970 నేపథ్యంలో ఈ సినిమా కథ సాగనున్నట్లు తెలుస్తోంది. వైశాక్ గౌడ నిర్మిస్తున్నారు.

సంక్రాంతి సినిమాలన్నీ బ్లాక్‌బస్టర్ కావాలి!

- 'ది రాజాసాబ్' వేడుకలో ప్రభాస్


రిద్ధికుమార్, మాళవిక మోహనన్, ప్రభాస్, నిధి అగర్వాల్, మారుతి, టి.జి.విశ్వప్రసాద్, కృతిప్రసాద్

"పదిహేనేళ్ల తర్వాత మళ్లీ పూర్తి స్థాయి వినోదంతో 'ది రాజాసాబ్' చేశాం. ఈ సినిమా విషయంలో చాలా ఆత్రుతగా ఉన్నా. అది కూడా సంక్రాంతికి వస్తోంది. సంక్రాంతి సినిమాలన్నీ బ్లాక్‌బస్టర్ అవ్వాలి. మాది కూడా అయిపోతే మరింత సంతోషం" అన్నారు ప్రభాస్. ఆయన కథానాయకుడిగా నటించిన 'ది రాజాసాబ్' విడుదలకు ముందస్తు వేడుక శనివారం రాత్రి హైదరాబాద్‌లో జరిగింది. మారుతి దర్శకత్వంలో రూపొందిన చిత్రమిది. నిధి అగర్వాల్, మాళవిక మోహనన్, రిద్ధికుమార్ కథానాయికలు. సంజయ్‌దత్, జరీనా వహాబ్ ముఖ్యపాత్రలు పోషించారు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై టి.జి.విశ్వప్రసాద్ నిర్మించిన ఈ చిత్రం జనవరి 9న ప్రేక్షకుల ముందుకొస్తోంది. ఈ సందర్భంగా ప్రభాస్ మాట్లాడుతూ "ఈ సినిమాలో సంజయ్‌దత్ కనిపించిన విధానం అద్భుతం. ఇది నానమ్మ మనవడి కథ. నానమ్మని చూస్తూ నా సన్నివేశాల్ని మరిచిపోయేవాణ్ని. అంతగా ఆ పాత్రలో ఒదిగిపోయారు జరీనా. ఇందులో నాతోపాటు మా నానమ్మకూడా ఓ హీరో. ముగ్గురు అందమైన హీరోయిన్లు ఇందులో ఉన్నారు. ఈ సినిమాకి అనుకున్న బడ్జెట్ ఒకటి, అయ్యింది మరొకటి. నిర్మాత టి.జి.విశ్వప్రసాద్ దేనికీ వెనకాడకుండా సినిమాని పూర్తి చేశారు. ఆయన నిజమైన హీరో ఈ సినిమాకు. ఇలాంటి సినిమాకి ఆ స్థాయిలో రీరికార్డింగ్ చేసే సంగీత దర్శకుడు తమన్ ఒక్కరే అనిపించింది. మారుతి మూడేళ్ల కష్టం, బాధ్యత ఈ సినిమా. సంక్రాంతికి చాలా సినిమాలొస్తున్నాయి. ఎప్పటికైనా సీనియర్లు సీనియర్లే. వాళ్ల నుంచే మేం నేర్చుకున్నాం" అన్నారు. దర్శకుడు మారుతి మాట్లాడుతూ "కథానాయకుడు ప్రభాస్, నిర్మాత టి.జి.విశ్వప్రసాద్ కారణంగానే ఈ సినిమాతో ఇంత దూరం ప్రయాణించాం. నిర్మాత జీవితాన్ని పెట్టారు ఈ సినిమాకి. థియేటర్‌కి వచ్చినవాళ్లకు మేం ఎంత కష్టపడ్డామో కనిపిస్తుంది. రాజమౌళికి ప్రతి దర్శకుడు చాలా రుణపడి ఉంటారు. పాన్ ఇండియా స్థాయిలో ఎంతోమందికి గుర్తింపు దక్కిందంటే కారణం ఆయనే. నిజంగా ఇది తెలుగు చిత్ర పరిశ్రమకు స్వర్ణయుగం. నా స్థాయిలో నేను సినిమాలు చేస్తుంటే, నువ్వు ఇంకా పైకి ఎదగాలి అంటూ ఈ అవకాశం ఇచ్చారు ప్రభాస్. ఆయన నటించి వెళ్లడం కాకుండా ఈ సినిమాకోసం జీవితాన్ని పెట్టారు. అన్ని భాషల్లోనూ ఈ సినిమా ప్రేక్షకుల్ని అలరిస్తుంది. ఈ కథలో అంత శక్తి ఉంది. ఈ సినిమాలో ప్రభాస్ నటనను ఒక ప్రేక్షకుడిగా చూస్తూ నాకే కన్నీళ్లొచ్చాయి" అంటూ భావోద్వేగానికి గురయ్యారు. ప్రభాస్ వేదికనెక్కి ఓదార్చిన అనంతరం మళ్లీ మారుతి మాట్లాడుతూ ఈ సినిమా ప్రేక్షకుల్ని ఒక్క శాతం కూడా నిరుత్సాహపరచదని చెప్పారు. ఈ కార్యక్రమంలో నటి జరీనా వహాబ్, టి.జి.విశ్వప్రసాద్, అనిల్ తడానీ, తమన్, నవీన్ ఎర్నేని, కృతిప్రసాద్, మహేశ్ ఆచంట తదితరులు పాల్గొన్నారు.

కొత్త స్టైల్‌తో...

ఈ వేడుకకి ప్రధాన ఆకర్షణ ప్రభాస్ హెయిర్ స్టైలే. ఆయన పిలకతో ఈ వేడుకకు హాజరయ్యారు. 'స్పిరిట్' కోసం ఆ గెటప్‌లో సిద్ధమయ్యారు. వేడుకలో అభిమానుల్ని ఉద్దేశించి ఉత్సాహంగా మాట్లాడారు. ఏదో ఒక రోజు అందరూ షాక్ అయ్యేలా వేదికపై వినోదం పంచుతానని ఆయన చెప్పడంతో అభిమానులంతా కేరింతలు కొట్టారు.

అది తెలియకే పెళ్లి చేసుకోలేదు

వేడుకలో ప్రభాస్ పెళ్లి చేసుకునే అమ్మాయికి ఎలాంటి క్వాలిటీస్ ఉండాలి అంటూ ఓ అభిమాని ప్లకార్డు ప్రదర్శించారు. "అది తెలియకే ఇంకా పెళ్లిచేసుకోలేదు" అంటూ ఫన్నీగా సమాధానమిచ్చారు ప్రభాస్.

బతికినన్ని రోజులూ ఆనందంగా గడిపేద్దాం


అర్జున్ జన్య, ఉపేంద్ర, శివ రాజ్ కుమార్

"బతికినన్ని రోజులు సంతోషంగా బతకాలని చెప్పే చిత్రం '45'. ఈ సినిమా చూస్తే.. కచ్చితంగా ప్రతి ప్రాణిని ప్రేమిస్తారు, గౌరవిస్తారు" అన్నారు కథానాయకుడు శివ రాజ్ కుమార్. ఆయన.. ఉపేంద్ర, రాజ్ బి శెట్టి ప్రధాన పాత్రధారులుగా అర్జున్ జన్య తెరకెక్కించిన చిత్రమే '45'. సూరజ్ ప్రొడక్షన్ సంస్థ నిర్మించింది. ఈ సినిమా మైత్రీ మూవీ డిస్ట్రిబ్యూషన్స్ ద్వారా జనవరి 1న థియేటర్లలోకి రానుంది. ఈ నేపథ్యంలోనే శనివారం హైదరాబాద్‌లో ప్రీరిలీజ్ వేడుకను నిర్వహించారు. ఈ సందర్భంగా నటుడు శివ రాజ్‌కుమార్ మాట్లాడుతూ.. "మనం ఎన్నిరోజులు ఈ భూమ్మీద బతుకుతామో తెలియదు. జీవించినంత కాలం ఆనందంగా గడపాలని ఈ సినిమా చెప్తుంది" అన్నారు. నాకింత వరకు ఎవ్వరూ ఇవ్వని పాత్రను ఈ సినిమాతో నాకిచ్చారు అర్జున్ అన్నారు ఉపేంద్ర.

పరిశ్రమ ఏదైనా పని విషయంలో ఒత్తిడి చేయడం వల్ల ఎవరికీ ప్రయోజనం ఉండదని అంటోంది బాలీవుడ్ నాయిక కియారా అద్వాణీ.


కియారా అద్వాణీ

పరిశ్రమ ఏదైనా పని విషయంలో ఒత్తిడి చేయడం వల్ల ఎవరికీ ప్రయోజనం ఉండదని అంటోంది బాలీవుడ్ నాయిక కియారా అద్వాణీ. ఈ మధ్య కాలంలో యాక్షన్ కథల్లో మెరుస్తూ అలరిస్తున్న కథానాయికీమె. ఈ ఏడాది 'వార్ 2', 'గేమ్‌ఛేంజర్' సినిమాలతో తెరపై సందడి చేసిందీ భామ. ప్రస్తుతం తల్లిగా మాతృత్వపు దశను ఆస్వాదిస్తూనే.. మరోవైపు రాబోయే ప్రాజెక్టుల కోసం రంగం సిద్ధం చేసుకుంటోంది. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న కియారా.. సినీరంగం, తన మాతృత్వపు ప్రయాణం గురించి కొన్ని ఆసక్తికర విషయాల్ని పంచుకుంది.

అమ్మ కేవలం నటిస్తోంది.. సరేనా?

"తల్లి అయ్యాక నా శరీరాన్ని, అందాన్ని చూసే విధానం పూర్తిగా మారిపోయింది. ఇటీవలే విడుదలైన 'వార్ 2'లోని బికినీ షాట్ కోసం చాలా కష్టపడ్డాను. కానీ డెలివరీ అయ్యాక నా శరీరంలో ఏదో తేడా కనిపించింది. మొదట్లో ఉన్నట్లు మళ్లీ ఉండగలనా అనుకున్నా. కానీ ఇక్కడ అందమైన ముఖం, శరీరం ఉండడం ముఖ్యం కాదు. 'నువ్వు ఒక మనిషిని సృష్టించావు' అని నా శరీరాన్ని చూసి గర్వపడ్డాను. ఇప్పుడు నేను చూడ్డానికి ఎలా ఉన్నా.. నన్ను నేను గౌరవించుకుంటాను. నాకు మాతృత్వం నేర్పిన పాఠాలు ఇవి".

వీళ్లకు మాత్రమే ఆ విషయం తెలుసు

"ఇటీవలే 'టాక్సిక్' సినిమా నుంచి విడుదలైన నా ఫస్ట్‌లుక్‌కు మంచి ఆదరణ లభించింది. ఇందులో నదియాగా కనువిందు చేయనున్నా. నా నుంచి మానసికంగా, భావోద్వేగపరంగా ఎక్కువ డిమాండ్ చేసిన పాత్ర ఇది. ఎన్నో నెలల తరబడి ఈ సినిమా కోసం కష్టపడ్డాను. ఈ సినిమా చిత్రీకరణ సమయంలో దర్శకనిర్మాతలకు మాత్రమే నేను గర్భం దాల్చిన విషయం తెలుసు. ఆ సమయంలో కూడా సవాలుతో కూడిన సన్నివేశాల చిత్రీకరణలో పాల్గొన్నా. కడుపులో ఉన్న నా బిడ్డకు భరోసా ఇవ్వడానికి షూటింగ్ గ్యాప్‌లో వానిటీ వాన్‌లోకి వెళ్లి పొట్టపై సున్నితంగా నిమురుతూ 'అమ్మ కేవలం నటిస్తోంది.. సరేనా? ఇదంతా నిజం కాదు' అని చెప్పేదాన్ని".

"ప్రస్తుతం నా వ్యక్తిగత, వృత్తిపరమైన దృక్పథాల్లో చాలా మార్పులు వచ్చాయి. వరుసగా ప్రాజెక్టుల కోసం పరుగులు పెట్టడం, ప్రతి ప్రచార కార్యక్రమంలోనూ పాల్గొనడం కంటే.. ఇప్పుడు నా ఉనికి, స్పష్టతకే ప్రాధాన్యత ఇవ్వాలనుకుంటున్నా. నాకు కొన్ని లక్ష్యాలు, ఆలోచనలు ఉన్నాయి. వాటికి అనుగుణంగా లేని అనవసరమైన ప్రదర్శనలు, సామాజిక బాధ్యతల నుంచి దూరంగా ఉండాలనుకుంటున్నా. వృత్తిలో వేగాన్ని తగ్గించి మరింత అర్థవంతమైన ప్రాజెక్టులపై దృష్టి పెట్టి ఉత్తమమైన చిత్రాల్ని ప్రేక్షకులకు అందించాలని కోరుకుంటున్నా".

వేగాన్ని తగ్గించాలనుకుంటున్నా

నింద మోసిన 'నీలకంఠ'


యష్ణ, మహేంద్రన్

బాలనటుడిగా పలు తెలుగు, తమిళ సినిమాలతో మెరిసిన మాస్టర్ మహేంద్రన్ కథానాయకుడిగా తెరకెక్కిన చిత్రం 'నీలకంఠ'. నేహా పఠాన్, యష్ణ ముతులూరి, స్నేహా ఉల్లాల్ కథానాయికలు. రాకేశ్ మాధవన్ దర్శకుడు. మర్లపల్లి శ్రీనివాసులు, వేణుగోపాల్ దీవి నిర్మాతలు. తెలుగుతోపాటు, హిందీ, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో జనవరి 2న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా శనివారం ట్రైలర్ ఆవిష్కరణ వేడుక జరిగింది. కథానాయకుడు మాట్లాడుతూ "చేయని తప్పుకు ఊరంతా నింద మోపినప్పుడు కథానాయకుడు ఆ పరిస్థితిని ఎలా ఎదుర్కొన్నాడనే కథతో రూపొందిన సినిమానే ఇది" అన్నారు.

శివాజీ వ్యాఖ్యలు.. వాడిన భాష సమర్థనీయం కాదు!

మహిళల వస్త్రధారణ విషయంలో నటుడు శివాజీ చేసిన వ్యాఖ్యల్ని నాగబాబు తప్పుపట్టారు. ఆడవాళ్లు ఇలాంటి దుస్తులే ధరించాలని చెప్పడానికి ఆయనకేం హక్కుందని ప్రశ్నించారు. ప్రతి ఆడపిల్లకు ఆత్మగౌరవం ఉంటుందని.. వాళ్ల మోడ్రన్ దుస్తులు ధరించడం తప్పు కాదని, మహిళలపై జరుగుతోన్న అత్యాచారాలు వాళ్ల డ్రెస్సింగ్ వల్ల కాదని, మగవాళ్ల క్రూరత్వం వల్ల అని తెలిపారు. ఈ అంశంపై తన అభిప్రాయాన్ని తెలుపుతూ శనివారం సామాజిక మాధ్యమాల వేదికగా ఓ వీడియోను విడుదల చేశారు. "నేను రాజకీయ నాయకుడిగానో.. ఇండస్ట్రీ నటుడిగానో దీనిపై స్పందించడం లేదు. ఒక సామాన్య వ్యక్తిగా దీని గురించి మాట్లాడుతున్నా. అలాగని నేను శివాజీని టార్గెట్ చేయడం లేదు. ఆడపిల్లలు ఎలా ఉండాలి.. ఎలాంటి దుస్తులు ధరించాలి.. ఏం మాట్లాడాలి.. ఏం మాట్లాడకూడదనే విషయాలపై ప్రతిఒక్కరూ ఇష్టారీతిన వ్యాఖ్యలు చేస్తున్నారు. అలా మాట్లాడటం రాజ్యాంగ ప్రకారం తప్పు. మగవారితో సమానంగా బతికే హక్కు మహిళలకు కూడా ఉంటుంది. ప్రతి ఆడపిల్లని కుటుంబ సభ్యురాలిలానే చూడండి" అని వీడియోలో పేర్కొన్నారు. అలాగే ఆడపిల్లలు ఆత్మరక్షణ కోసం ప్రత్యేక విద్య నేర్చుకోవాలని సూచించారు.

అలరిస్తోన్న 'రాజు వెడ్స్ రాంబాయి'



ప్రేమకు ప్రేమే శత్రువు.. అంటూ ఇటీవలే థియేటర్లలో యువతను విశేషంగా ఆకట్టుకుంది 'రాజు వెడ్స్ రాంబాయి' చిత్రం. సాయిలు కంపాటి దర్శకత్వంలో అఖిల్‌రాజ్, తేజస్విని జంటగా నటించిన ఈ సినిమా ప్రస్తుతం ప్రముఖ ఓటీటీ వేదిక ఈటీవీ విన్‌లో విడుదలై 100మిలియన్ ప్లస్ స్ట్రీమింగ్ మినట్స్‌ను సొంతం చేసుకొని విజయవంతంగా అలరిస్తోంది. ఈ చిత్రంతో పాటు.. ఇటీవల 'ఏఐఆర్', 'లిటిల్ హార్ట్స్', లాంటి యువతను ఆకర్షించే కథలతో మంచి విజయాలను దక్కించుకున్న ఈటీవీ విన్.. ఇప్పుడు కొత్త ఆఫర్లను సినీప్రేమికులకు అందుబాటులోకి తీసుకొచ్చింది. ఆర్‌డబ్ల్యూఆర్50 కూపన్ కోడ్‌తో రూ.99 నెలవారీ సబ్‌స్క్రిప్షన్‌పై రూ.50, ఆర్‌డబ్ల్యూఆర్100 కూపన్ కోడ్‌తో రూ.699 ఇయర్లీ ప్రీమియమ్ ప్లస్ ప్యాక్‌పై రూ.100 తగ్గించినట్లు ఓ ప్రకటనలో వెల్లడించింది ఈటీవీవిన్.

అవకాశాలు వరుస కడుతున్నాయ్


రోషన్

ప్రస్తుతం 'ఛాంపియన్' చిత్రంతో థియేటర్లలో సందడి చేస్తున్నారు యువ కథానాయకుడు రోషన్. ఇప్పుడతనితో ప్రముఖ నిర్మాత అల్లు అరవింద్ ఓ సినిమా నిర్మించేందుకు సిద్ధమవుతున్నారు. తాజాగా ఈ సినిమాని వీక్షించిన ఆయన.. రోషన్ నటనకు ఎంతో ముగ్ధులయ్యారు. దీంతో వ్యక్తిగతంగా అతనికి అభినందనలు తెలపడంతో పాటు తన బ్యానర్‌లో ఓ చిత్రం చేయనున్నట్లు చెప్పారు. ఇక మరోవైపు రోషన్‌తో ఓ చిత్రం నిర్మించేందుకు ప్రముఖ నిర్మాణ సంస్థ సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ కూడా సిద్ధమవుతోంది. మరి ఈ సినిమాలకు ఎవరు దర్శకత్వం వహిస్తారన్నది త్వరలో తేలనుంది.

'ఈషా' వసూళ్లు చూస్తే సందేహాలు తీరిపోతాయి


వంశీ నందిపాటి, త్రిగుణ్, హెబ్బా పటేల్, దామోదర్‌ప్రసాద్, బన్నీవాస్, శ్రీనివాస్ మన్నె

"'ఈషా' సినిమాపై ఎవర్కైనా సందేహాలుంటే ఈ చిత్ర వసూళ్లు చూస్తే వాళ్ల సందేహాలు తీరిపోతాయి" అన్నారు నిర్మాత బన్నీవాస్. ఈ చిత్రం తొలి రోజే రెండు తెలుగు రాష్ట్రాల్లో రూ.2కోట్ల 20లక్షల గ్రాస్ రాబట్టిందని.. చిన్న చిత్రాల్లో ఇది రికార్డని తెలిపారు. ఆయన.. వంశీ నందిపాటి విడుదల చేసిన ఈ సినిమాలో త్రిగుణ్, అఖిల్ రాజ్, హెబ్బా పటేల్, సిరి హనుమంతు ప్రధాన పాత్రలు పోషించారు. కేఎల్ దామోదర్‌ప్రసాద్ సమర్పణలో హేమ వెంకటేశ్వరరావు నిర్మించారు. శ్రీనివాస్ మన్నె దర్శకత్వం వహించారు. ఈ సినిమా ప్రస్తుతం థియేటర్లలో సందడి చేస్తున్న నేపథ్యంలో ఇటీవల హైదరాబాద్‌లో సక్సెస్‌మీట్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నిర్మాత బన్నీవాస్ మాట్లాడుతూ.. "ఒక సినిమా హిట్ అనడానికి వసూళ్లే ప్రామాణికం. ప్రస్తుతం మా చిత్రానికి దక్కుతున్న వసూళ్లను బట్టి ఇది బాక్సాఫీస్ విన్నర్" అన్నారు. ఈ కార్యక్రమంలో చిత్రబృందం పాల్గొంది.

వానర అయ్యాడు 'వనవీర'


రాజేశ్ దండా

"పురాణాల టచ్‌తో సాగే గ్రామీణ నేపథ్య చిత్రం 'వనవీర'. ఇది కచ్చితంగా ఎవర్నీ నిరుత్సాహపరచదు అనే నమ్మకంతో ఉన్నాం" అన్నారు అవినాశ్ తిరువీధుల. ఆయన హీరోగా నటిస్తూ.. స్వయంగా తెరకెక్కించిన ఈ చిత్రానికి తొలుత 'వానర' అనే పేరు పెట్టినప్పటికీ సెన్సార్ బోర్డు అభ్యంతరాల మేరకు దాన్ని 'వనవీర'గా మార్చారు. అవినాశ్ బుయానీ, ఆలపాటి రాజా, సి అంకిత్ రెడ్డి నిర్మించారు. సిమ్రాన్ చౌదరి కథానాయిక. ఈ సినిమా జనవరి 1న థియేటర్లలోకి రానుంది. ఈ నేపథ్యంలోనే శనివారం హైదరాబాద్‌లో ట్రైలర్‌ని విడుదల చేశారు. నిర్మాత రాజేశ్ దండా ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

పాయసంలా... పతంగ్


ప్రణవ్, ప్రీతి, వంశీ

"ఈ క్రిస్మస్ సినిమాల్లో 'పతంగ్' పాయసంలా తియ్యగా ఉంద" న్నారు హీరో సందీప్ కిషన్. నిజాయతీతో చేసిన ఈ ప్రయత్నాన్ని అందరూ అభినందిస్తున్నారని తెలిపారు. ప్రీతి పగడాల, ప్రణవ్ కౌశిక్, వంశీ పూజిత్ ప్రధాన పాత్రధారులుగా నటించిన ఈ 'పతంగ్' చిత్రాన్ని ప్రణీత్ పత్తిపాటి తెరకెక్కించారు. నాని బండ్రెడ్డి, విజయ్ శేఖర్ అన్నే, సంపత్ మకా, సురేశ్ కొత్తింటి నిర్మించారు. ఈ సినిమా ఇటీవల విడుదలైన నేపథ్యంలో శనివారం హైదరాబాద్‌లో సక్సెస్‌మీట్ ఏర్పాటు చేశారు. హీరో సందీప్ కిషన్, నిర్మాత ఎస్‌కేఎన్ అతిథులుగా పాల్గొన్నారు.

ఆ స్పందనతో కళ్లల్లో నీళ్లు తిరిగాయి!


రాకేశ్

వీరుడు ఖుదీరాం పాత్రలో నటించాక... నాలో భయం పోయి, సత్యం కోసం నిలబడాలనే ధైర్యం మరింతగా పెరిగిందన్నారు రాకేశ్ జాగర్లమూడి. ఆయన కథానాయకుడిగా... విద్యాసాగర్ రాజు దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రమే 'ఖుదీరాం బోస్'. 18 ఏళ్లకే దేశం కోసం ప్రాణత్యాగం చేసిన విప్లవ వీరుడు ఖుదీరాం బోస్ జీవిత కథతో తెరకెక్కిన చిత్రమిది. డిసెంబరులో వేవ్స్ ఓటీటీ వేదికలో విడుదలైంది. ఈ సందర్భంగా రాకేశ్ జాగర్లమూడి మాట్లాడుతూ "మా నాన్న విజయ్ జాగర్లమూడికి దేశం అంటే ప్రాణం. నేటి తరానికి మన వీరుడి కథ తెలియాలనే ఈ సినిమాని నిర్మించారు. ఆయన కారణంగానే నాకు ఖుదీరాం బోస్ పాత్రని పోషించే అవకాశం దొరికింది. అయితే ఆ పాత్రకి న్యాయం చేయడం కోసం ఎంతో శ్రమించాల్సి వచ్చింది. పార్లమెంట్‌లో ఎంపీలు ఈ సినిమాని చూసినప్పుడు, గోవా చిత్రోత్సవాల్లోనూ ఈ సినిమాకి లభించిన స్పందన చూసి కళ్లల్లో నీళ్లు తిరిగాయి. భారత ప్రభుత్వ అధికారిక యాప్ అయిన వేవ్స్‌ని డౌన్‌లోడ్ చేసుకుని ఉచితంగా ఈ సినిమాని చూడొచ్చు" అన్నారు.

మార్పు కోసం కికి అండ్ కొకొ



"చిన్నారుల్ని లక్ష్యంగా చేసుకుని రూపొందే యానిమేషన్ సినిమాలు చాలావరకూ కల్పిత ప్రపంచాన్నే చూపిస్తుంటాయి. అలా కాకుండా జీవితాల్లోని వాస్తవికతను వాళ్ల కళ్లకు కట్టేదే మా 'కికి అండ్ కొకొ' చిత్రం" అన్నారు పి.నారాయణన్. ఆయన దర్శకత్వంలో రూపొందుతున్న భారతీయ యానిమేషన్ సినిమా ఇది. బాలనటి శ్రీనిక.. కొకొ పాత్రలో నటిస్తోంది. ధరణి నిర్మాత. మీనా చాబ్రియా సీఈవో. ఈ సినిమా త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రానుంది. శనివారం హైదరాబాద్‌లో టీజర్ ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. దర్శకుడు మాట్లాడుతూ "కొన్ని సినిమాల కారణంగా చిన్నారులు హింసకు ఎక్కువగా ప్రభావితం అవుతున్నారు. మార్పు అనేది మన నుంచే మొదలవ్వాలనే లక్ష్యంతో... మానవత్వం, వాస్తవికత అంశాలకు పెద్దపీట వేస్తూ 'కికి అండ్ కొకొ' చిత్రాన్ని రూపొందిస్తున్నాం" అన్నారు.

తెలుగు సినిమా ఆత్మగౌరవ రక్షణే మా నినాదం


ప్రోగ్రెసివ్ ప్యానెల్ సభ్యులు

ఇరవయ్యేళ్లుగా ఒక్క సినిమా కూడా తీయని కొద్దిమంది వ్యక్తులు... రాత్రీపగలు కష్టపడి చురుగ్గా సినిమాలు తీసే 99 శాతం మంది నిర్మాతల్ని శాసించాలని చూడటంతోనే గిల్డ్ ఏర్పాటైందని.. చిత్ర పరిశ్రమ ఆస్తుల్ని కాపాడటంతోపాటు, నిర్మాతల ఆరోగ్య బీమా విషయంలో జరుగుతున్న దోపిడీని తాము అరికట్టామన్నారు చలనచిత్ర వాణిజ్య మండలి ఎన్నికల్లో పోటీ చేస్తున్న ప్రోగ్రెసివ్ ప్యానెల్ సభ్యులు. తెలుగు సినిమా ఆత్మగౌరవ రక్షణే తమ నినాదమన్నారు. శనివారం హైదరాబాద్‌లో ఆ ప్యానెల్ విధి విధానాల్ని వివరించేందుకు విలేకర్ల సమావేశాన్ని ఏర్పాటు చేసింది. ఇందులో పలువురు సినీ ప్రముఖులు పాల్గొన్నారు. నిర్మాత కె.ఎల్.దామోదర్ ప్రసాద్ మాట్లాడుతూ "మేం ఇన్నాళ్లూ చిత్ర పరిశ్రమలోని ఒకొక్క సమస్యనీ పరిష్కరించుకుంటూ వచ్చాం. కానీ కొంతమంది ఇంకా సమస్యల్ని సృష్టిస్తున్నారు. ఛాంబర్ అమ్మలాంటి సంస్థ. నిర్మాత తండ్రితో సమానం. నిర్మాత బతికితేనే పరిశ్రమ మనుగడ. చిన్న నిర్మాతల కోసం పోరాడుతోంది, క్యూబ్, యు.ఎఫ్.వో సంస్థలపై న్యాయ పోరాటం చేస్తున్నదీ మేమే. ఛాంబర్ భవనంపై జరుగుతున్న కుట్రని కూడా తాము అడ్డుకుంటున్నాం. పదిమందికి ఉపయోగపడే పనులే చేస్తున్న మా ప్రోగ్రెసివ్ ప్యానెల్‌కు నిర్మాతలంతా ఓటు వేసి గెలిపించాలని కోరుతున్నాం" అన్నారు. ఈ ప్యానెల్‌ని గెలిపించుకుని, నిర్మాతలంతా కలిసికట్టుగా ఉందామని పిలుపునిచ్చారు నిర్మాత వై.రవిశంకర్. సినిమా చేసే ప్రతి ఒక్కరికీ ఈ ప్యానెల్ గెలిస్తే సేవలు అందుతాయన్నారు స్రవంతి రవికిశోర్.

ఈనాడు ప్రతిభ

■ e-mail: support@epratibha.net

19

ఆదివారం డిసెంబరు 28, 2025

రాజ్యాంగ ప్రవేశిక

భారత స్వాతంత్ర్యోద్యమంలో ముఖ్యపాత్ర పోషించిన నాయకులు, దార్శనికులు భావితరాలకు అందించిన భారతీయ ప్రాచీన, ఆధునిక లక్ష్యాల మూలసంపుటి రాజ్యాంగ ప్రవేశిక. భారత రాజ్యాంగం ప్రవేశికతో ప్రారంభమవుతుంది. దీన్ని భారత రాజ్యాంగ విశిష్ట లక్షణంగా వర్ణించవచ్చు.
భారత రాజ్యాంగం మూలతత్వాన్ని ప్రవేశిక ద్వారా తెలుసుకోవచ్చు. నెహ్రూ ప్రవేశపెట్టిన రాజ్యాంగ లక్ష్యాలు - ఆశయాల తీర్మానాన్ని భారత రాజ్యాంగ పరిషత్ సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. ఈ ఏకగ్రీవ తీర్మానమే రాజ్యాంగ ప్రవేశికగా రూపొందింది.

గణతంత్ర రాజ్యం

ప్రజాస్వామ్య వ్యవస్థను రెండు రకాలుగా వర్గీకరించవచ్చు. అవి:

రాచరిక వ్యవస్థ: రాచరిక వ్యవస్థలో సాధారణంగా రాజు/రాణి రాజ్యాధినేతగా ఉంటారు. వీరు వంశపారంపర్యంగా వారసత్వ సూత్రం ప్రకారం అధికారంలోకి వస్తారు.

ఉదా: బ్రిటన్

గణతంత్ర వ్యవస్థ: ఈ వ్యవస్థలో రాజ్యాధినేత ఒక నిర్దిష్ట కాలపరిమితికి ప్రత్యక్షంగా/పరోక్షంగా ఎన్నికవుతారు.

ఉదా: అమెరికా, భారత్

● భారత రాజ్యాంగ ప్రవేశికలో ఉన్న గణతంత్రం ప్రకారం రాష్ట్రపతిగా పేర్కొనే దేశాధ్యక్షుడు ఎన్నిక ద్వారా అధికారంలోకి వస్తారు. అయిదేళ్ల నిర్ణీతకాలం పాటు అధికారంలో ఉంటాడు. రాష్ట్రపతి ఎన్నిక పరోక్ష పద్ధతిలో ఉంటుంది. గణతంత్ర రాజ్యం అంటే ప్రజలతో ఏర్పడిన ప్రభుత్వం అని అర్థం.

న్యాయం

రాజ్యాంగ ప్రవేశికలోని న్యాయం అనే లక్ష్యంలో మూడు అంశాలుంటాయి. అవి:

- సామాజిక న్యాయం
- ఆర్థిక న్యాయం
- రాజకీయ న్యాయం

● రష్యా విప్లవం (1917) నుంచి ఈ అంశాలను గ్రహించారు. వ్యక్తి శ్రేయస్సు కంటే సంఘ శ్రేయస్సుకు ప్రాధాన్యం ఇవ్వడమే దీని లక్ష్యం. సామాజిక న్యాయాన్ని ప్రాథమిక హక్కుల్లో, ఆర్థిక న్యాయాన్ని ఆదేశిక సూత్రాల్లో పొందుపర్చారు. రాజకీయ న్యాయాన్ని 326 ప్రకరణ ఓటుహక్కు ద్వారా కల్పించారు.

స్వేచ్ఛ

బ్రిటిష్ ప్రభుత్వ పాలనా కాలంలో భారత ప్రజలు కోల్పోయిన స్వేచ్ఛా, స్వాతంత్ర్యాలను భావితరాలకు అందించాలనే ఉద్దేశంతో రాజ్యాంగ నిర్మాతలు భారత రాజ్యాంగం సాధించాల్సిన ఆశయంగా స్వేచ్ఛా, స్వాతంత్ర్యాలను రాజ్యాంగ ప్రవేశికలో పొందుపర్చారు.

▲ 1789లో జరిగిన ఫ్రెంచ్ విప్లవం సందర్భంగా ఇచ్చిన స్వేచ్ఛా, సమానత్వం, సౌభ్రాతృత్వాలను రాజ్యాంగ ప్రవేశికలో పొందుపర్చారు. ఆలోచనల్లో, విశ్వాసంలో, నమ్మకంలో, ఆరాధనలోనూ ప్రజలందరికీ స్వేచ్ఛా స్వాతంత్ర్యాన్ని కల్పించడమే రాజ్యాంగ లక్ష్యమని పేర్కొన్నారు.

మౌలిక విలువలకు ప్రతిబింబిం..
భావితరాలకు దిక్సూచి


ఏపీపీఎస్సీ పరీక్షల ప్రత్యేకం

ఇండియన్ పాలిటీ

రాజ్యాంగ నిర్మాతలు భారత రాజ్యాంగానికి దిక్సూచిగా రాజ్యాంగ ప్రవేశికను రూపొందించారు. ప్రవేశిక మౌలిక రాజ్యాంగ విలువలను ప్రతిబింబిస్తూ, దేశ స్వభావాన్ని నిర్దేశిస్తుంది. 1976లో 42వ రాజ్యాంగ సవరణ చట్టం ద్వారా సామ్యవాద, లౌకిక, సమగ్రత అనే పదాలను ప్రవేశికలో చేర్చారు.

✦ రాజ్యాంగ ప్రవేశిక అనే భావనను అమెరికా నుంచి గ్రహించారు.

1946 డిసెంబరు 13న నెహ్రూ రాజ్యాంగ పరిషత్‌లో లక్ష్యాలు – ఆశయాలు తీర్మానాన్ని ప్రవేశపెట్టారు.



✦ రాజ్యాంగ పరిషత్ ఈ తీర్మానాన్ని 1947 జనవరి 22న ఆమోదించింది.

✦ లక్ష్యాలు - ఆశయాలు తీర్మానం ఆధారంగా భారత రాజ్యాంగ ప్రవేశికను రూపొందించారు.

✦ ఇప్పటివరకు రాజ్యాంగ ప్రవేశికను ఒకసారి మాత్రమే సవరించారు.

ప్రవేశికలోని అంశాలు - వివరణ

'భారత ప్రజలమైన మేము (We, the people of India) చిత్తశుద్ధితో ఈ రాజ్యాంగాన్ని అంగీకరించి, చట్టరూపంగా మాకు మేము సమర్పించుకున్నాము' అనే మాటల వల్ల భారత రాజ్యాంగం ప్రజలకు బాధ్యత వహించే ప్రతినిధులతోనే ప్రజల కోసం రూపొంది అమల్లోకి వచ్చింది అని అర్థం. దీని ఆధారంగా ఏర్పాటైన అన్ని ప్రభుత్వ వ్యవస్థల అధికారానికి మూలం ప్రజలే అని నిష్కర్షగా చెప్పవచ్చు. అంటే ప్రజాస్వామ్యంలో అంతిమ సార్వభౌములు ప్రజలే అనే విషయం స్పష్టమవుతోంది.

సార్వభౌమాధికారం

సార్వభౌమ అనే పదంలో కొన్ని అంతరార్థాలున్నాయి. బహిర్గతంగా ఎవరి ఆదేశాలకు లోనుకాకుండా, అంతర్గతంగా తిరుగులేని అధికారాన్ని కలిగి ఉండటమే సార్వభౌమాధికారం. దీని ప్రకారం భారతదేశం ఒక స్వతంత్ర రాజ్యం.

▮ దేశంలోని సమస్త వ్యక్తులు, సంస్థలపై, విదేశీ జోక్యం లేని అధికారం భారతదేశానికి ఉందనే విషయాన్ని ఈ పదం వ్యక్తపరుస్తుంది. భారతదేశం సార్వభౌమాధికార రాజ్యం కాబట్టి ఏదైనా విదేశీ రాజ్యానికి తన భూభాగాన్ని ఇచ్చే హక్కు ఉంటుంది.

▮ కామన్వెల్త్ దేశాల సమాఖ్యలో సభ్యత్వం తీసుకోవడం వల్ల భారతదేశం సార్వభౌమత్వం లేని రాజ్యం కాదు. ఎందుకంటే కామన్వెల్త్‌లో ఏ దేశమైనా తన ఇష్టప్రకారం ప్రవేశించవచ్చు, ఇష్ట లేకుంటే బయటకు వెళ్లే అవకాశం ఉంటుంది.

సామ్యవాదం

సామ్యవాదం అంటే సమానత్వాన్ని సాధించడం, సమసమాజ స్థాపనగా భావిస్తారు. 1955 - ఆవడి (మద్రాస్) కాంగ్రెస్ సమావేశం సామ్యవాద తరహా సమాజ స్థాపనే తన లక్ష్యంగా ప్రకటించింది. సంపద, సహజ వనరులు కొంతమంది వ్యక్తుల చేతుల్లో కేంద్రీకృతం కాకుండా విశాల సమాజ ప్రయోజనాలకు వినియోగించాల్సి ఉంటుంది. కనీస అవసరాలను ప్రాతిపదికగా తీసుకుని సామాన్య ప్రజలకు వాటినందిస్తూ పేదలకు, ధనికులకు మధ్య అసమానతలను తగ్గించటమే భారతదేశ సామ్యవాద ప్రధాన లక్ష్యం.



❖ సామ్యవాదం అనే పదాన్ని 42వ రాజ్యాంగ సవరణ చట్టం ద్వారా 1976లో చేర్చారు. అయితే ఈ సామ్యవాద భావన రాజ్యాంగంలోని ఆదేశిక సూత్రాల్లోనే ఇమిడి ఉంటుంది.

❖ డి.ఎస్. నకారా vs యూనియన్ ఆఫ్ ఇండియా (1982) మధ్య జరిగిన వ్యాజ్యంలో సుప్రీంకోర్టు సామ్యవాదం అనే పదాన్ని రాజ్యాంగం నుంచి తొలగించాల్సిన అవసరం లేదంటూ, కార్ల్‌మార్క్స్, మహాత్మాగాంధీ సిద్ధాంతాల కలయికగా ఏర్పడిన ఈ అంశం దేశంలోని అసమానతలను రూపుమాపేంత వరకు రాజ్యాంగంలో కొనసాగుతుందని తీర్పునిచ్చింది.

లౌకిక

లౌకిక అనే పదాన్ని 1950 నాటి రాజ్యాంగంలో చేర్చలేదు. 1976లో 42వ రాజ్యాంగ సవరణ ద్వారా చేర్చారు. లౌకిక రాజ్యం అంటే మతప్రమేయం లేని రాజ్యం. రాజ్యానికి అధికార మతమంటూ ఏదీ లేదు. ప్రభుత్వం, పరిపాలనలో మత ప్రాధాన్యత ఉండదు. అన్ని మతాల పట్ల సమాన దృక్పథం, పౌరులకు మతపరమైన స్వేచ్ఛ ఉంటాయి.

◆ ఆధునిక రాజ్యాలన్నీ లౌకిక రాజ్యాలే. ప్రపంచ సామాజిక, సాంస్కృతిక జీవన విధానంలో సంభవించిన మార్పులతో మతపరమైన రాజ్యాల భావనకు ప్రాధాన్యత తగ్గింది. లౌకిక రాజ్య భావన విస్తృతంగా ప్రాముఖ్యం పొందిన నేటి పరిస్థితులకు అనుగుణంగా రాజ్యాంగ నిర్మాతలు భారతదేశాన్ని లౌకిక రాజ్యంగా రూపొందించారు. భారత రాజ్యాంగం నిర్దేశించిన లౌకికవాదం సానుకూల దృక్పథంతో ఉంటుంది.

◆ ఎస్.ఆర్.బొమ్మై vs యూనియన్ ఆఫ్ ఇండియా కేసు (1994)లో సుప్రీంకోర్టు తీర్పునిస్తూ లౌకిక స్వభావం రాజ్యాంగ మౌలిక స్వరూపంలో అంతర్భాగమని పేర్కొంది.

◆ అరుణా రాయ్ vs యూనియన్ ఆఫ్ ఇండియా కేసులో సుప్రీంకోర్టు తీర్పునిస్తూ ప్రతి పౌరుడికీ అన్ని మతాలకు సంబంధించిన తాత్విక అంశాలను తెలుసుకునే స్వేచ్ఛ ఉంది. కాబట్టి వివిధ మతప్రవక్తల జీవిత చరిత్రలను పాఠ్యాంశాల్లో చేర్చడం తప్పేమీ కాదని తీర్పునిచ్చింది.

ప్రజాస్వామ్యం

ప్రజాస్వామ్యాన్ని ఆంగ్లంలో డెమోక్రసీ అంటారు. డెమోక్రసీ అనే పదం గ్రీకు భాషలోని డెమోస్, క్రేషియా అనే పదాల నుంచి ఉద్భవించింది. డెమోస్ అంటే ప్రజలని, క్రేషియా అంటే పరిపాలన అని అర్థం.

☛ ప్రజాస్వామ్యాన్ని రెండు రకాలుగా వర్గీకరించవచ్చు. అవి:

ప్రత్యక్ష ప్రజాస్వామ్యం: ఈ ప్రజాస్వామ్యంలో ప్రజలు తమ సార్వభౌమాధికారాన్ని ప్రత్యక్షంగా వినియోగించుకుంటారు.

ఉదా: స్విట్జర్లాండ్

పరోక్ష ప్రజాస్వామ్యం: పరోక్ష ప్రజాస్వామ్యంలో ప్రజలు తమ సార్వభౌమాధికారాన్ని తాము ఎన్నుకున్న ప్రతినిధుల ద్వారా ప్రభుత్వాన్ని ఏర్పర్చుకుని సార్వభౌమాధికారాన్ని వినియోగించుకుంటారు. ఈ తరహా ప్రజాస్వామ్యాన్ని ప్రాతినిధ్య ప్రజాస్వామ్యం అని కూడా అంటారు. ఇవి తిరిగి రెండు రకాలు. అవి:

▼ పార్లమెంటరీ తరహా ప్రభుత్వం

▼ అధ్యక్ష తరహా ప్రజాస్వామ్యం

▼ భారత రాజ్యాంగం ప్రాతినిధ్య పార్లమెంటరీ తరహా ప్రజాస్వామ్యాన్ని ఏర్పరుస్తుంది. దీని ప్రకారం కార్యనిర్వాహకశాఖ తాను తీసుకున్న విధానాలు, చర్యలకు శాసనసభకు బాధ్యత వహిస్తుంది.

▼ సార్వజనీన వయోజన ఓటుహక్కు విధానం, నిర్దిష్ట కాలంలో ఎన్నికలు, సమన్యాయపాలన, న్యాయవ్యవస్థ, స్వాతంత్ర్యం లాంటి ప్రజాస్వామ్య అంశాలు భారత రాజకీయ వ్యవస్థలో ఉన్నాయి. ప్రవేశికలో ఉన్న ప్రజాస్వామ్యం అనే పదం రాజకీయ ప్రజాస్వామ్యానికే కాకుండా సామాజిక, ఆర్థిక ప్రజాస్వామ్యానికి కూడా వర్తిస్తుంది. భారతదేశం అతిపెద్ద ప్రజాస్వామ్య దేశం.



రచయిత
డా. వి.కుమారస్వామి
విషయ నిపుణులు

Word of the Day 874

Precision

Telugu meaning: కచ్చితమైన, స్పష్టత

English meaning: The word precision (ప్రిసిషన్) is a noun that refers to the quality of being exact, accurate, and careful in details.

Synonyms: Accuracy, Exactness

Antonyms: Inaccuracy, Vagueness

Usage: 1. The scientist conducted the experiment with great precision to ensure reliable results.

2. Precision in language is essential while drafting legal and official documents.

Current Affairs



Prime Minister Narendra Modi inaugurated the 'Rashtra Prerna Sthal' in Lucknow, Uttar Pradesh on 25 December 2025, dedicated to the life and ideals of former Prime Minister Atal Bihari Vajpayee, marking his 101st birth anniversary.

▮ The Prime Minister paid floral tributes to the three towering figures of nationalism, namely Atal Bihari Vajpayee, Dr Syama Prasad Mookerjee and Pandit Deendayal Upadhyaya, whose statues have been erected at the 65-acre sprawling memorial situated in Lucknow's Vasant Kunj area. These statues represent the life, ideals and legacy of the three national icons.



Two-time Olympic medallist and former world champion PV Sindhu, was elected Chair of the BWF Athletes' Commission for the 2026-2029 term. She will also serve as a member of the Badminton World Federation (BWF) Council.

▮ PV Sindhu won silver at the Rio 2016 Olympics and bronze at Tokyo 2020, is India's most successful badminton player to date. She is set to lead India at the 2026 Badminton Asia Team Championships in Qingdao, China.

Defence Research and Development Organisation (DRDO) has successfully completed the User Evaluation Trials (UET) of Next Generation Akash missile (Akash-NG) system. During the trials, the missiles successfully intercepted aerial targets at different range & altitude including the near-boundary-low-altitude and Long Range, high altitude scenarios.

Gujarat has achieved a historic milestone in renewable energy by installing over 5 lakh rooftop solar systems with a total capacity of 1,879 megawatts under the PM Surya Ghar: Muft Bijli Yojana. The state has already achieved 50 percent of its target to install 1 million residential rooftop solar systems by March 2027.

For more Current Affairs: Scan QR code

భారత జాతీయ కాంగ్రెస్

స్టడీ జోన్

దేశ స్వాతంత్ర్యోద్యమంలో భారత జాతీయ కాంగ్రెస్ (ఐఎన్‌సీ) పాత్ర మరువలేనిది. బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా ప్రజలను సంఘటితం చేయడంతోపాటు భారతీయుల హక్కుల కోసం పోరాడి, వారిని చైతన్యవంతులుగా చేసేందుకు ఐఎన్‌సీ కృషి చేసింది. ఆంగ్లేయుల విధానాలను చర్చించడానికి, ముఖ్యమైన సమస్యలపై తీర్మానాలు చేయడానికి ఐఎన్‌సీ సమావేశాలు నిర్వహించేది. అందులో స్వాతంత్ర్య పోరాటాలకు సంబంధించిన మార్గదర్శక నిర్ణయాలు తీసుకునేవారు. జాతీయవాదానికి, భారతీయుల రాజకీయ పోరాటాలకు ఒక జాతీయ వేదికగా 1885, డిసెంబరు 28న ఐఎన్‌సీ ఏర్పాటైంది. పోటీపరీక్షల నేపథ్యంలో ఐఎన్‌సీ ఏర్పాటు, ముఖ్యమైన సమావేశాలు - అధ్యక్షుల గురించిన ముఖ్య విషయాల గురించి తెలుసుకుందాం..!



ఐఎన్‌సీ ఏర్పాటు: దేశానికి ఒక సమర్థవంతమైన రాజకీయ ప్రాతినిధ్యాన్ని కల్పించడం, ఆర్థిక - సామాజిక సంస్కరణల ఆవశ్యకత మొదలైన అంశాలతోపాటు బ్రిటిష్ వలస పాలనపై పెరుగుతున్న అసంతృప్తిని జాతీయోద్యమంగా మలచాలని నాయకులు సంకల్పించారు. అంతేకాక వారు తమ ఫిర్యాదులను తెలియజేయడానికి, అర్థవంతమైన మార్పు కోసం వాదించడానికి ఒక జాతీయ వేదికను ఏర్పాటు చేయాలనుకున్నారు.

❖ వీరి ఆలోచనలు కార్యరూపం దాల్చేలా చేసింది మాత్రం ఆంగ్లేయుడైన రిటైర్డ్ సివిల్ సర్వెంట్ అలెన్ ఆక్టావియన్ హ్యూమ్ (ఏఓ హ్యూమ్).


❖ 1885లో 'భారత జాతీయ యూనియన్' అనే సంస్థను ఏర్పాటు చేశారు. దాదాభాయ్ నౌరోజీ సూచన మేరకు అందులో 'యూనియన్' పదాన్ని తొలగించి ఆ స్థానంలో కాంగ్రెస్‌ను చేర్చారు.

ఐఎన్‌సీ తొలి సమావేశం - లక్ష్యాలు, గత పరీక్షల్లో అడిగిన ప్రశ్నలు - జవాబుల కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

జనరల్ స్టడీస్ - భౌతికశాస్త్రం

పని - శక్తి - సామర్థ్యం

మన నిత్య జీవిత కార్యకలాపాల్లో చాలా వాటిని భౌతిక శాస్త్రం పనులుగా గుర్తించదు. ఉదాహరణకు తలపై భారాన్ని మోస్తున్న వ్యక్తి ఎంత దూరం నడిచినా, అతడు చేసిన పని సున్నా. అలాగే వస్తువును వృత్తాకార మార్గంలో తిప్పడం, వంట చేయడం, ఆఫీస్‌లో పని చేయడం మొదలైనవన్నీ ఫిజిక్స్ పరంగా పనులు కావు.



పని

ఒక వస్తువుపై బలాన్ని ప్రయోగించి, దాన్ని బలం దిశలో స్థానభ్రంశం చెందిస్తే, బలం చేసిన పని ఈ రెండింటి (బలం, స్థానభ్రంశాల) లబ్ధానికి సమానం.

గతిజశక్తి

వస్తువుకు చలనం వల్ల కలిగే శక్తిని గతిజ శక్తి అంటారు.

స్థితిజ శక్తి

స్థానం వల్ల లేదా స్థితి వల్ల వస్తువుకు ఉండే శక్తిని స్థితిజ శక్తి అంటారు.

శక్తి నిత్యత్వ నియమం

ఒక వియుక్త వ్యవస్థలోని మొత్తం శక్తి స్థిరం. శక్తిని సృష్టించలేం, నాశనం చేయలేం. కానీ శక్తిని ఒక రూపం నుంచి మరొక రూపంలోకి మార్చవచ్చు.

లిఫ్ట్‌లో దృశ్య భారం

ద్రవ్యరాశితో ఉండే వ్యక్తి, లిఫ్ట్‌లోని వెయింగ్ మెషిన్‌పై నిల్చొని ఉన్నాడు. లిఫ్ట్ విరామ స్థితిలో ఉన్నప్పుడు, దాని ఉపరితలం, భారానికి సమానమైన అభిలంబ బలాన్ని (N) ప్రయోగిస్తుంది. కాబట్టి వెయింగ్ మిషన్ చూపే రీడింగ్ అతడి నిజభారానికి (mg) సమానం.

స్థానభ్రంశం, సామర్థ్యం, నిత్యత్వ బలాలు మొదలైన అంశాలతో సహా పూర్తి సమాచారం ఈ-బుక్ రూపంలో 'ఈనాడు ఈప్రతిభ' వెబ్‌సైట్‌లో 'జనరల్ స్టడీస్ ఈ-బుక్స్' కోర్సులో అందుబాటులో ఉంది. మరిన్ని వివరాలకు క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

నోటిఫికేషన్స్

బీఈసీఐఎల్‌లో ఉద్యోగాలు

నొయిడాలోని బ్రాడ్‌కాస్ట్ ఇంజినీరింగ్ కన్సల్టెంట్స్ ఇండియా లిమిటెడ్ (బీఈసీఐఎల్) ఒప్పంద ప్రాతిపదికన వివిధ విభాగాల్లో పలు ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. మొత్తం పోస్టుల సంఖ్య 76. దరఖాస్తు ఫీజు రూ.295. ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తుకు చివరి తేదీ 2026 జనవరి 5.

బీఓఐలో అప్రెంటిస్ పోస్టులు

ముంబయిలోని బ్యాంక్ ఆఫ్ ఇండియా (బీఓఐ) వివిధ జోన్‌లలో అప్రెంటిస్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. మొత్తం ఖాళీల సంఖ్య 400. దరఖాస్తు రుసుము రూ.800. ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు స్వీకరణకు చివరి తేదీ 2026 జనవరి 10.

ప్రభుత్వ మెడికల్ కాలేజీలో పోస్టులు

రాజమండ్రి ప్రభుత్వ మెడికల్ కాలేజీ ఒప్పంద, ఔట్ సోర్సింగ్ ప్రాతిపదికన పలు విభాగాల్లో ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. మొత్తం పోస్టుల సంఖ్య 60 దరఖాస్తు ఫీజు రూ.300. ఆఫ్‌లైన్‌లో దరఖాస్తుకు చివరి తేదీ 2026 జనవరి 9.

దరఖాస్తు చేశారా..?

కింది ఉద్యోగాలకు నేడే (డిసెంబరు 28) చివరి తేదీ

☛ ఐబీఎఫ్‌లో 10 జూనియర్ ఎగ్జిక్యూటివ్ పోస్టులు. డిప్లొమా, గ్రాడ్యుయేట్, ఎంకాం, ఎంఏ/ ఎంబీఏ/ సీఏ/ సీఎంఏ/ సీఎస్/ సీఎఫ్ఏ ఉత్తీర్ణతతో పాటు ఉద్యోగానుభవం ఉన్నవారు అర్హులు.

☛ ఫోరెన్సిక్ సైన్స్ యూనివర్సిటీలో టీచింగ్ ఉద్యోగాలు. ఎంఈ/ఎంటెక్, ఎంఎస్సీ, పీహెచ్‌డీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉన్నవారు అర్హులు.

పూర్తి వివరాలు, మరిన్ని నోటిఫికేషన్ల కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.


Odd One Out

Directions (Qs. 1 - 43): *Choose the odd one out of the given options.*

1. A) Circle B) Triangle C) Square D) Cube
2. A) Gold B) Silver C) Iron D) Plastic
3. A) 232 : 49 B) 105:36 C) 140:25 D) 371:1331
4. A) Urethra B) Veins C) Capillaries D) Arteries
5. A) BCF : CDG B) UIO : VJQ C) HWB : IXC D) IWN : JXO
6. A) Mandarin B) Chinese C) Arabic D) Pound
7. A) Liberal B) Compliant C) Lavish D) Munificent
8. A) Osteoporosis B) Pagets disease C) Rickets D) Emphysema
9. A) Resistant B) Willing C) Eager D) Ready
10. A) Whistle B) Tadpole C) Boom D) Cluck
11. A) Linguistics B) Communication studies C) Polity D) Literature
12. A) NERVES B) LIVER C) HEART D) BRAIN

Railway Exams
Reasoning

13. A) 121 B) 144 C) 169 D) 125
14. A) Kilo B) Mega C) Centi D) Giga
15. A) 64 B) 125 C) 216 D) 256
16. A) Flute B) Guitar C) Violin D) Piano
17. A) Oxygen B) Hydrogen C) Nitrogen D) Mercury
18. A) Square B) Rectangle C) Rhombus D) Triangle
19. A) S18H8 B) G7R18 C) Y25D4 D) A1U21
20. A) Karnataka B) Tripura C) Assam D) Chandigarh
21. A) Vaishali Rameshbabu B) Viswanathan Anand C) Nihal Sarin D) Sushil kumar
22. A) AZBY B) FUHS C) DWGH D) LOVE
23. A) Copper B) Aluminium C) Iron D) Sulphur



24. A) 11 × 11 B) 12 × 12 C) 13 × 13 D) 14 × 15
25. A) He B) Ne C) Ar D) N_2
26. A) DEAR B) READ C) DARE D) HARD
27. A) 2, 6, 12 B) 3, 9, 27 C) 4, 16, 64 D) 5, 25, 125
28. A) Tongue B) Eye C) Nose D) Hand
29. A) 81 B) 125 C) 216 D) 343
30. A) ACE B) BDF C) GIK D) LNO
31. A) 2-3-5 B) 3-5-7 C) 5-7-9 D) 7-11-13
32. A) Cough B) Fever C) Malaria D) Headache
33. A) sin B) cos C) tan D) log
34. A) Brick B) Cement C) Sand D) Wall
35. A) Mango B) Lotus C) Banana D) Grape
36. A) December B) July C) August D) September
37. A) Lucknow B) Hyderabad C) Pune D) Gandhinagar
38. A) Pound B) Peso C) Taka D) Dhaka
39. A) Asia B) Europe C) Kabul D) Africa
40. A) 567 B) 693 C) 891 D) 132
41. A) CDJM B) AFGH C) STMN D) WZRS
42. A) Kite B) Bird C) Parrot D) Pigeon
43. A) Lion B) Tiger C) Cheetah D) Cat

Scan the QR code for Key

These model questions were prepared by subject experts

నకిలీ ఏజెంట్ల బారిన పడొద్దు

- 'హెచ్1-బీ' వీసాలపై ఎంబసీ అడ్వైజరీ

ఇంటర్నెట్‌డెస్క్: నకిలీ ఏజెంట్ల బారిన పడొద్దని హెచ్-1బీ వీసా దరఖాస్తుదారులకు భారత్‌లోని అమెరికా రాయబార కార్యాలయం సూచించింది. అగ్రరాజ్య ఆంక్షల నేపథ్యంలో హెచ్-1బీ వీసా ప్రాసెసింగ్, రెన్యువల్స్ ఆలస్యమవుతుండటంపై ఈ మేరకు స్పందించింది. ప్రస్తుత పరిస్థితిని అవకాశంగా తీసుకొని కొందరు నకిలీ ఏజెంట్లు ఎలాంటి జాప్యాలకు తావు లేకుండా వీసా లభించేలా చూస్తామంటూ హామీలిస్తున్నారని, వాటిని నమ్మొద్దని పేర్కొంది. దానివల్ల ఆర్థికంగా నష్టం, ప్రయాణ ప్రణాళికల్లో ఇబ్బందులు తలెత్తవచ్చని ఎక్స్ వేదికగా అడ్వైజరీ జారీ చేసింది. వీసా అపాయింట్‌మెంట్లు అధికారిక వెబ్‌సైట్ల ద్వారానే షెడ్యూల్ అవుతాయని, ఇతర మార్గాల్లో ఎవరైనా వీసా ఇప్పిస్తామంటే అది మోసం కిందికే వస్తుందని హెచ్చరించింది. అధికారిక ప్రక్రియలో భాగంగా పేర్కొన్న ఫీజు కంటే ఎక్కువ మొత్తం చెల్లించాల్సిన అవసరం లేదని సూచించింది.

ఆ ఇద్దరూ ఒకటవుతారని మాకనిపిస్తోంది

- ఇప్పటికే పెళ్లి చేసుకున్నారు
- అత్యాచారం కేసును కొట్టేసిన సుప్రీం కోర్టు



దిల్లీ: తమ జోక్యం కారణంగా ఫిర్యాదీ, నిందితుడు వివాహం చేసుకున్న నేపథ్యంలో సుప్రీంకోర్టు ఓ అత్యాచారం కేసును ఇటీవల కొట్టేసింది. కక్షిదారులైన నిందితుడు, బాధితురాలి మధ్య పరస్పర సమ్మతితో నెలకొన్న అనుబంధానికి అపార్థం, అవగాహనా రాహిత్యం కారణంగా అత్యాచారం రంగు పులిమారని జస్టిస్ బి.వి. నాగరత్న, జస్టిస్ సతీశ్ చంద్ర శర్మలతో కూడిన ధర్మాసనం పేర్కొంది. కేసుకు సంబంధించిన వివరాలన్నింటినీ పరిశీలించిన ధర్మాసనం 'ఆ ఇద్దరినీ... ఒకటి చేయవచ్చని మా అంతరంగానికి తోచింది' అని వ్యాఖ్యానించింది. కక్షిదారులిద్దరూ ఈ సంవత్సరం జులైలో వివాహం చేసుకుని అప్పటి నుంచి కలిసి జీవిస్తున్నారని ధర్మాసనం పేర్కొంది. 'అప్పీలుదారుడైన నిందితుడు ఈ న్యాయస్థానం జోక్యంతో నేర నిర్ధారణ, శిక్ష రద్దై ప్రయోజనం పొందాడు' అని న్యాయమూర్తులు తమ తీర్పులో పేర్కొన్నారు. తనకు విధించిన శిక్షను సస్పెండు చేయాల్సిందిగా నిందితుడు సుప్రీంకోర్టులో అప్పీలు చేసుకున్నాడు. గతంలో తన పిటిషన్‌ను మధ్యప్రదేశ్ హైకోర్టు నిరాకరించడంతో సుప్రీంలో అప్పీలు చేశాడు. అంతకు ముందు ట్రయల్‌కోర్టు అత్యాచార నేరాన్ని నిర్ధారించి పదేళ్ల కారాగారవాసంతోపాటు రూ.55వేల జరిమానా విధించింది. ఈ వ్యాజ్యంపై కక్షిదారులతో వారి కుటుంబ సభ్యుల సమక్షంలో న్యాయమూర్తులు మాట్లాడారు. వివాహానికి తామిరువురం సిద్ధమేనని నిందితుడు, బాధితురాలు తెలిపారు. దీంతో న్యాయస్థానం నిందితుడికి మధ్యంతర బెయిలు మంజూరు చేయగా బాధితురాలితో అతడి వివాహం జులై నెలలో జరిగింది. ఇరువురి తల్లిదండ్రులు దీనిపై హర్షం వ్యక్తం చేశారు. 'రాజ్యాంగంలోని 142వ అధికరణం కింద మాకున్న అధికారాలను ఉపయోగించి ఈ విషయంలో సంపూర్ణ న్యాయం చేసే ఉద్దేశంతో ఫిర్యాదును, నేర నిర్ధారణను, శిక్షను రద్దు చేస్తున్నాం' అని న్యాయమూర్తులు ప్రకటించారు.

ఔషధాల ప్రకటనలపై సుప్రీంలో పిటిషన్

దిల్లీ: ప్రస్తుత శాస్త్రీయ పరిణామాలకు అనుగుణంగా కొన్ని సందర్భాల్లో ఔషధాల ప్రకటనలను నియంత్రించే లక్ష్యంతో తీసుకొచ్చిన 1954 చట్ట షెడ్యూల్‌ను సమీక్షించి, నవీకరించాలని కోరుతూ సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలైంది. డ్రగ్స్ అండ్ మ్యాజిక్ రెమెడీస్ (అభ్యంతరకర ప్రకటనలు) చట్టం 1954లోని సెక్షన్ 2(సీసీ) కింద ఆయుష్ వైద్యులను 'రిజిస్టర్డ్ మెడికల్ ప్రాక్టీషనర్స్'గా ప్రకటించేలా ఆదేశాలు ఇవ్వాలని నితిన్ ఉపాధ్యాయ్ అనే వ్యక్తి ఈ పిటిషన్‌లో కోరారు. 'తప్పుడు, తప్పుదారి పట్టించే ప్రకటనల నుంచి ప్రజలను రక్షించడానికి ఈ చట్టం రూపొందింది. అయితే సెక్షన్ 3(డీ) కొన్ని వ్యాధులు, పరిస్థితులకు సంబంధించిన ప్రకటనలపై పూర్తి నిషేధాన్ని విధించింది' అని పిటిషన్‌లో పేర్కొన్నారు. ఆయుష్ వైద్యులు, ఇతర నిజమైన అల్లోపతి కానీ వైద్యులు సెక్షన్ 14 మినహాయింపు కిందకు రారని తెలిపారు. 'ఈ పూర్తి నిషేధం తీవ్రమైన వ్యాధుల సమస్యను పరిష్కరించగల ఔషధాల ప్రకటనలను పూర్తిగా నిలిపివేస్తుంది. దీంతో ప్రజలకు వాటిపై సమాచారం అందదు' అని పిటిషన్ పేర్కొంది.



బిహార్ రాజధాని పట్నాలోని సాహిబ్ గురు గోవింద్ సింగ్ ఆలయంలో శనివారం పూజలు చేస్తున్న ప్రధాని మోదీ

అత్యధికంగా భారతీయులను బహిష్కరించిన సౌదీ అరేబియా

ఇంటర్నెట్ డెస్క్: ఈ ఏడాది అత్యధికంగా భారతీయులను వెనక్కి పంపిన దేశంగా సౌదీ అరేబియా నిలిచింది. 2025లో దాదాపు 24,600 మంది భారతీయులను 81 దేశాలు స్వదేశానికి పంపించాయి. విదేశీ వ్యవహారాలశాఖ రాజ్యసభకు సమర్పించిన నివేదికలో ఈ విషయం వెల్లడైంది. ✦ ఈ ఏడాది సౌదీ అరేబియా 11వేల మందికి పైగా భారతీయులను వెనక్కి పంపింది. ✦ అమెరికా 3,800 మంది భారతీయులను పంపింది. వీరిలో ప్రైవేటు ఉద్యోగులు, విద్యార్థులున్నారు. ✦ మయన్మార్ 1,591 మంది, మలేసియా 1,483 మంది, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ 1,469 మంది భారతీయులను స్వదేశానికి పంపించాయి. సైబర్ ముఠాలకు చిక్కిన కేసులకు సంబంధించి మయన్మార్ అనేక మందిని భారత్‌కు పంపించింది. వీరిలో ఎక్కువ మంది తెలుగువారున్నట్లు సమాచారం. ✦ యూకే 170 మంది, ఆస్ట్రేలియా 114 మంది, రష్యా 82 మంది, అమెరికా 45 మంది భారతీయ విద్యార్థులను స్వదేశానికి పంపించాయి.



ఘూమర్ ఘూమర్ ఘూమే..

ఈటీవీ భారత్: రాజస్థాన్‌లోని చిత్తోడ్‌గఢ్ నగరంలో గల ఇందిరాగాంధీ స్టేడియంలో శుక్రవారం రాత్రి నిర్వహించిన జానపద సాంస్కృతిక వేడుకలో వేలాది మహిళలు ఘూమర్ నృత్యాన్ని ప్రదర్శించి సరికొత్త రికార్డు సృష్టించారు. లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లా ముఖ్య అతిథిగా పాల్గొన్న ఈ కార్యక్రమంలో 15,000 మందికి పైగా మహిళలు 'ఘూమర్ ఘూమర్ ఘూమే..' అంటూ తమ నృత్యాలతో అలరించారు. 'మరు కోకిల' సీమా మిశ్ర సైతం ఇందులో పాల్గొని తన ఆట పాటలతో స్టేడియంను ఉర్రూతలూగించారు.

అయోధ్య రామాలయంలో ద్వితీయ వార్షికోత్సవాలు షురూ

అయోధ్య: ఉత్తర్‌ప్రదేశ్‌లోని అయోధ్యలో నిర్మించిన రామాలయ ద్వితీయ వార్షికోత్సవాలు శనివారం ప్రారంభమయ్యాయి. శ్రీరామజన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్ట్ సభ్యుడు స్వామి విశ్వప్రసన్న తీర్థ పర్యవేక్షణలో బెంగళూరు విద్యాపీఠానికి చెందిన 15 మంది వేద విద్యార్థులు దీనిలో పాల్గొన్నారు. హోమం, కలశ పూజ, పుష్ప ఊరేగింపు, మండప పూజ వంటివి నిర్వహించారు. ఈ నెల 31న 'ప్రతిష్ఠ ద్వాదశి'నాడు జరిగే వార్షికోత్సవానికి రక్షణమంత్రి రాజ్‌నాథ్‌సింగ్ హాజరవుతారు. ఆరోజు రాముడికి ఐదురకాల ఫలరసాలతో అభిషేకించి, 56 రకాల ప్రసాదాలను నైవేద్యంగా సమర్పిస్తారు. అయోధ్యకు గత నెల రోజులుగా భక్తుల తాకిడి పెరుగుతోంది.

చినాబ్‌పై జలవిద్యుత్కేంద్రానికి కేంద్రం ఓకే

దిల్లీ: జమ్మూకశ్మీర్‌లోని కిష్త్వార్ జిల్లాలో చినాబ్ నదిపై 260 మెగావాట్ల దుల్హస్తి రెండవ దశ జలవిద్యుత్ ప్రాజెక్టు నిర్మాణానికి కేంద్ర పర్యావరణ శాఖ నిపుణుల కమిటీ ఈ నెల మొదట్లో ఆమోదముద్ర వేసిందని అధికారులు శనివారం తెలిపారు. రూ.3200 కోట్ల వ్యయమయ్యే ఈ ప్రాజెక్టుకు టెండర్లు పిలవడమే తరువాయి. ఈ ప్రాజెక్టులో మొదటి దశ నిర్మాణం 2007లోనే పూర్తయి విద్యుదుత్పాదన సాగిస్తోంది. ఈ ఏడాది ఏప్రిల్‌లో పహల్గామ్ ఉగ్రదాడి అనంతరం పాకిస్థాన్‌తో సింధు జలాల పంపిణీ ఒప్పందాన్ని భారత్ సస్పెండ్ చేసిన సంగతి తెలిసిందే. ఆ వెంటనే దుల్హస్తి జలవిద్యుత్ ప్రాజెక్టు రెండో దశకూ నాంది పలికింది. 1960 నాటి సింధు జలాల ఒప్పందం ప్రకారం పాకిస్థాన్‌కు సింధు, జీలం, చినాబ్ నదులపైన హక్కులు ఉంటే, భారత్‌కు రావి, బియాస్, సట్లెజ్ నదులపై హక్కులున్నాయి. ఈ ఏడాది ఏప్రిల్ 23న సింధు జలాల ఒప్పందాన్ని భారత్ సస్పెండ్ చేసి చినాబ్ నదిపై కూడా ప్రాజెక్టు నిర్మిస్తోంది. దుల్హస్తి ప్రాజెక్టు రెండో దశతోపాటు సింధు, దాని ఉపనదుల పరీవాహక ప్రాంతాల్లో పలు జలవిద్యుత్కేంద్రాల నిర్మాణ ప్రతిపాదనలను ఆమోదిస్తోంది.

దిల్లీలో 966 మంది ముందస్తు అరెస్టు

దిల్లీ: కొత్త సంవత్సర వేడుకల నేపథ్యంలో ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా దిల్లీ పోలీసులు 966 మందిని అదుపులోకి తీసుకున్నారు. వారివద్ద నుంచి అక్రమ ఆయుధాలు, డ్రగ్స్, మద్యాన్ని, వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఆపరేషన్ ఆఘాత్-3.0 పేరుతో పోలీసులు ఈ చర్యలు చేపట్టారు. కొత్త సంవత్సరం వేళ వీఐపీల కదలికలు భారీగా ఉండే అవకాశమున్న నేపథ్యంలో పోలీసులు ముందు జాగ్రత్తలు చేపట్టారు.

అవినీతిని నిర్మూలించే నిబంధనలు జీ రామ్ జీ చట్టంలో లేవు

- లిబ్‌టెక్ ఇండియా విశ్లేషణ

దిల్లీ: అవినీతిని నిర్మూలించేందుకు కొత్త నిబంధనలేవీ వీబీ జీ రామ్ జీ చట్టంలో లేవని విద్యావేత్తలు, ఉద్యమకర్తల వేదిక 'లిబ్‌టెక్ ఇండియా' పెదవి విరిచింది. ఉపాధి, వేతనాలు, జవాబుదారీతనాలకు సాంకేతికతే ఏకైక మార్గం కారాదని అభిప్రాయపడింది. ఎంజీనరేగా చట్టాన్ని రద్దు చేయడానికి ఆ పథకంలో అవినీతి ఒక కారణమని చెప్పినా కొత్త చట్టంలోనూ అదనపు నిబంధనలేవీ చేర్చలేదని గుర్తుచేసింది. "డిజిటల్ వ్యవస్థలకు అనుబంధంగా బలమైన, స్పష్టమైన నిర్వచనాలున్న ఇతర తనిఖీ సాధనాలూ ఉండాలి. ఎంజీనరేగాలో దీనికోసం సామాజిక తనిఖీలు, బహిరంగ విచారణలు వంటివి వ్యవస్థలో అంతర్భాగంగా ఉండేవి. అవినీతిని నిర్మూలించడానికి అవసరమైన ఇలాంటివేవీ ప్రస్తుత చట్టంలో కొత్తగా లేవు. అవినీతికి అడ్డుకట్ట వేయడానికి, పారదర్శకత పెంచడానికి వేలిముద్రల ద్వారా ధ్రువీకరించే సాంకేతికతపైనే కొత్తచట్టం దృష్టి సారించింది. పని ప్రదేశంలో బయోమెట్రిక్ హాజరును తప్పనిసరి చేయడం వల్ల కొందరికి పని, వేతనం విషయంలో తిరస్కరణ ఎదురయ్యే అవకాశం ఉంది. పనిని అడగడం, హాజరు వేసుకోవడం, చెల్లింపులు పొందడం, సమస్యలు పరిష్కరించుకోవడం వంటి విషయాల్లో డిజిటలేతర యంత్రాంగాలూ కార్మికులకు అందుబాటులో ఉండాలి. మద్దతునిచ్చే సాధనంగా సాంకేతికత ఉండాలే గానీ అన్నింటికీ అదే మార్గంగా ఉండకూడదు. ఎంజీనరేగా రద్దును మేం వ్యతిరేకిస్తున్నాం. దానిబదులు ఆ పథకాన్ని బలోపేతం చేస్తే సరిపోయేది'' అని పేర్కొంది. ప్రజలతో సంప్రదించకుండా, పార్లమెంటులో తగినంత పరిశీలన లేకుండా కొత్త చట్టాన్ని ఆమోదించారని సంస్థ విమర్శించింది. కేంద్రానికి ఏకపక్ష అధికారాలు ఇచ్చేలా జీ రామ్ జీ ఉందని పేర్కొంది.

జీ రామ్ జీ చట్టంపై కాంగ్రెస్‌ది దుష్ప్రచారం: భాజపా

దిల్లీ: ఉపాధి హామీ పథకాన్ని మెరుగుపరిచి కేంద్రం కొత్తగా తీసుకువచ్చిన వీబీ- జీ రామ్ జీ చట్టంపై కాంగ్రెస్ చెబుతున్నది నిరాధారమని, ప్రజల్ని తప్పుదోవ పట్టించేలా దుష్ప్రచారానికి ఆ పార్టీ ప్రయత్నిస్తోందని భాజపా విమర్శించింది. కొత్త పథకం వల్ల పారదర్శకత వస్తుందని, వ్యవస్థలో నిజాయతీ కనిపిస్తుందని కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్, పార్టీ జాతీయ అధికార ప్రతినిధి సుధాంశు త్రివేది పేర్కొన్నారు. కాంగ్రెస్ ఆందోళన అంతా రాజకీయాలతో కూడుకుందని, ఉపాధి కల్పించే విషయంలో ప్రభుత్వం ఎంతమాత్రం వెనక్కి తగ్గలేదని చెప్పారు. మునుపటి కాంగ్రెస్ పాలనలో ఉపాధి హామీ పథకం పూర్తిగా అవినీతిలో కూరుకుపోయిందని, కొత్త పథకంలో పూర్తి పారదర్శకతతో కార్మికులకు లబ్ధి కలుగుతుందని తెలిపారు. మునుపటి చట్టంతో పోలిస్తే కూలీలకు ఎక్కువ ప్రయోజనాన్ని కలిగించేది కొత్త చట్టమేనని త్రివేది అన్నారు. పార్లమెంటు సమావేశాలు జరుగుతున్నప్పుడు హాజరుకాకుండా విదేశాలకు వెళ్లిపోవడం, భారత్‌కు తిరిగి వచ్చాక ప్రభుత్వ విధానంపై విరుచుకుపడటం కాంగ్రెస్ నేత రాహుల్‌కు పరిపాటిగా మారిందని విమర్శించారు.

చెట్ల ఆకులపై ఎంబ్రాయిడరీ డిజైన్లు





అందమైన సీతాకోక చిలుకలు, పూలతీగలు, జంతువులు.. ఇలా వివిధ ఆకృతుల ఎంబ్రాయిడరీ డిజైన్లను ఇప్పటిదాకా వస్త్రాలపై మనం చూశాం. మహారాష్ట్రలోని బీడ్ ప్రాంతానికి చెందిన అనికేత్ పవార్ రబ్బరు, పనస వంటి చెట్ల ఆకులపై ఈ డిజైన్లకు ప్రాణం పోస్తున్నారు. పుణెలో జరుగుతున్న భీమ్‌థడీ జాతరలో ఈ కళాకారుడు ఆకుపై తీర్చిదిద్దిన ఛత్రపతి శివాజీ ఎంబ్రాయిడరీ డిజైను అందరినీ ఆకట్టుకుంటోంది. మహారాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఎంపీఎస్‌సీ) పరీక్షలకు సిద్ధమవుదామని పుణెకు వచ్చిన అనికేత్ కరోనా లాక్‌డౌను సమయంలో సరదాగా చెట్ల ఆకులపై ఎంబ్రాయిడరీ డిజైన్లు వేయడం ప్రారంభించారు. పరీక్ష తప్పిన అనికేత్‌కు ఫ్యాషన్ డిజైనింగ్ కోర్సు చేసిన అతడి సోదరుడు సౌరభ్ దేవడే జత కలిశారు. బీడ్, పుణె, పైఠణ్ తదితర నగరాల్లో ఈ సోదరులిద్దరూ ప్రారంభించిన వ్యాపారం నేడు 30 మందికి పైగా మహిళలకు ఉపాధి చూపుతోంది.

ఈటీవీ భారత్


యాప్ స్టోర్ & గూగుల్ ప్లే ద్వారా డౌన్‌లోడ్ చేసుకోండి

వాతావరణ విపత్తులతో.. రూ.10 లక్షల కోట్ల నష్టం

- ఇందులో కాలిఫోర్నియా కార్చిచ్చుల వాటాయే సగం


దిల్లీ: ఈ ఏడాది వడగాడ్పులు, కార్చిచ్చులు, వరదలు, కరవు, తుపానులు మొదలైన వాతావరణ విపత్తుల వల్ల ప్రపంచవ్యాప్తంగా దాదాపు రూ.10 లక్షల కోట్లకుపైగా ఆర్థిక నష్టం వాటిల్లిందని రష్యాకు చెందిన క్రిస్టియన్ ఎయిడ్ నివేదిక వెల్లడించింది. ఈ విపత్తులు సహజమైనవి కావని, శిలాజ ఇంధనాల వినియోగం, రాజకీయ నిర్లక్ష్యం కారణంగా ఏర్పడ్డాయని నివేదిక పేర్కొంది. అమెరికాలో కాలిఫోర్నియా కార్చిచ్చులు అత్యధికంగా రూ.5 లక్షల కోట్ల (సుమారుగా) నష్టం కలిగించాయని వెల్లడించింది. ఆగ్నేయాసియా దేశాలైన థాయ్‌లాండ్, ఇండోనేసియా, శ్రీలంక, వియత్నాం, మలేసియాల్లో సంభవించిన తుపానుల కారణంగా దాదాపు రూ.2 లక్షల కోట్ల నష్టం వాటిల్లిందని వివరించింది. చైనాలో సంభవించిన వరదలు మరో రూ.98 వేల కోట్ల నష్టాన్ని కలిగించినట్లు తెలిపింది.

121 ఏళ్లు దాటినా చెక్కుచెదరని చర్చి



బినా: మధ్యప్రదేశ్‌లోని సాగర్ జిల్లా బినాలో 121 సంవత్సరాల క్రితం బ్రిటిష్ హయాంలో నిర్మించిన సెయింట్ జాన్స్ చర్చి ఒక్క పగులూ లేకుండా నేటికీ చెక్కుచెదరకుండా కాంతులీనుతోంది. ఈ కట్టడం బ్రిటిష్ కాలం నాటి నిర్మాణ చాతుర్యానికి ప్రతీకగా నిలిచింది. చర్చి నిర్మాణంలో రాయి, ఉక్కు, కలప వినియోగించారు. ఎక్కడా సిమెంటు వాడలేదు. "చర్చి నిర్మాణం 1896లో మొదలై 1904లో ముగిసింది. ఇండో గోతిక్ శైలిలో నిర్మించారు. బుందేల్‌ఖండ్ ప్రాంతంలోని అతి పురాతన కట్టడాల్లో ఇది ఒకటి. ఆ రోజుల్లో బినా ఒక ముఖ్యమైన రైల్వే జంక్షన్‌గా ఉండేది. మధ్య భారతంలో రైల్వే లైను నిర్మాణం బినా నుంచే మొదలైంది'' అని చర్చిపై పీహెచ్‌డీ చేసిన డాక్టర్ షిరీన్ కంఫర్ట్ తెలిపారు. ఈ చర్చి బ్రిటిష్ రైల్వే అధికారుల కోసం నిర్మించి ఉంటారు అని ఆమె తెలిపారు. చర్చి పైకప్పు నిర్మాణం కోసం వినియోగించిన పెంకులు 1865 నాటివైనా ఇప్పటికీ యథాతథంగా ఉన్నాయి. చర్చి నిర్మించిన సమయంలో స్థాపించిన లెక్టెర్న్ (ప్రసంగం చేసేందుకు ఉపయోగించే వేదిక) కూడా ఇప్పటికీ అలాగే ఉంది. ఆ రోజుల్లో దాన్ని రూ 250కి కొన్నారు. చర్చిలో ఏర్పాటు చేసిన గంట ఇక్కడి ప్రత్యేక ఆకర్షణ. దాదాపు వంద కిలోల బరువున్న ఈ గంట 1.10 అడుగుల ఎత్తు, 1 11 అడుగుల వెడల్పు కలిగి ఉంది. ఇందులోని లోలకం 1.9 అడుగుల ఎత్తు కలిగివుంది.

మలేసియాలో సంస్కృత శాసనాలు లభ్యం



కౌలాలంపూర్: మలేసియాలోని బుకిట్ కోరస్‌లో పురాతన సంస్కృత శాసనాలు లభ్యమయ్యాయి. అక్కడ తవ్వకాలు జరపగా బుద్ధుడి విగ్రహంతోపాటు దీర్ఘచతురస్రాకారంలో ఉన్న మూడు రాళ్లు దొరికాయి. వాటిపై సంస్కృత శాసనాలున్నాయి. అవి 8, 9 శతాబ్దాలకు చెందినవిగా భావిస్తున్నారు. బుకిట్ కోరస్ అనేది ఒకప్పటి మహాయాన బౌద్ధ పవిత్ర క్షేత్రం. గతంలో ఇక్కడ జరిపిన తవ్వకాల్లో 8వ శతాబ్దంనాటి పల్లవ కాలంనాటి శాసనాలు లభించాయి.



తైవాన్‌కు ఆయుధాలు అమ్మితే తగిన మూల్యం

- అమెరికాకు చైనా హెచ్చరిక

ఈటీవీ భారత్: తైవాన్‌కు ఆయుధాలను విక్రయిస్తే భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని అమెరికాను చైనా హెచ్చరించింది. అంతేకాకుండా తైవాన్‌కు గత కొన్నేళ్లుగా ఆయుధాలను సరఫరా చేస్తున్న 20 రక్షణ కంపెనీలు, 10 మంది సీనియర్ ఎగ్జిక్యూటివ్‌లపై చైనా విదేశాంగశాఖ ఆంక్షలను విధించింది. ఈ ఆంక్షలు వెంటనే అమల్లోకి వస్తాయని ప్రకటించింది. గత వారం తైవాన్‌కు భారీ ఆయుధాల విక్రయానికి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆమోదం తెలిపారు.

రోహింగ్యాలు, బంగ్లాదేశీయులు ఎంతమందో చెప్పాలి: అభిషేక్ బెనర్జీ

ఇంటర్నెట్ డెస్క్: పశ్చిమ బెంగాల్‌లో ఓటరు జాబితాల నుంచి తొలగించిన వారిలో బంగ్లాదేశీయులు, రోహింగ్యాలు ఎంత మంది ఉన్నారో తెలపాలని తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) నేత అభిషేక్ బెనర్జీ డిమాండ్ చేశారు. ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) కసరత్తులో భాగంగా 58 లక్షల మంది పేర్లను ఆ రాష్ట్రంలో తొలగించిన విషయం తెలిసిందే. అయితే, వీరిలో అక్రమంగా నివసిస్తోన్న బంగ్లాదేశీయులు, రోహింగ్యాలు ఎంతమంది ఉన్నారనే వివరాలను ఎన్నికల సంఘం (ఈసీ) బహిర్గతం చేయాలని అభిషేక్ బెనర్జీ కోరారు. గత ఎన్నికల్లో తమ పార్టీ విజయం సాధించినప్పటి నుంచి కేంద్ర ప్రభుత్వం బెంగాల్‌ను లక్ష్యంగా చేసుకొని వేధింపులకు గురిచేస్తోందని ఆరోపించారు. బెంగాల్ జనాభా 10.05 కోట్ల మంది కాగా.. 'సర్ ప్రక్రియలో దాదాపు ఐదు శాతం మంది ఓటర్లను తొలగించారని తృణమూల్ కాంగ్రెస్ పేర్కొంది. సర్ చేపడుతోన్న ఇతర రాష్ట్రాలతో పోలిస్తే ఈ సంఖ్య పశ్చిమ బెంగాల్‌లో తక్కువేనని తెలిపింది. అయితే, వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో భాజపాకు లబ్ధి చేకూర్చేందుకే లక్షల మంది అర్హులైన ఓటర్లను తొలగించారని ఆరోపించింది. ఈ క్రమంలో తమ ఆందోళనలను వ్యక్తంచేస్తూ రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారికి రాష్ట్ర మంత్రుల బృందం వినతిపత్రం సమర్పించింది.

సోమాలీలాండ్‌కు ఇజ్రాయెల్ గుర్తింపు

- ఖండించిన ఆఫ్రికన్ యూనియన్

నైరోబీ: సోమాలియా నుంచి విడిపోయి ప్రత్యేక దేశంగా ప్రకటించుకున్న సోమాలీలాండ్‌కు ఇజ్రాయెల్ గుర్తింపునివ్వడాన్ని ఆఫ్రికన్ యూనియన్ ఖండించింది. సోమాలీలాండ్ 1991లో సోమాలియా నుంచి వేరుపడి స్వతంత్రం ప్రకటించుకుంది. ఈ ప్రాంతానికి సొంత ప్రభుత్వం, కరెన్సీ ఉన్నప్పటికీ ప్రపంచంలోని ఏ దేశమూ గుర్తింపు ఇవ్వలేదు. కానీ ఇజ్రాయెల్ శుక్రవారం గుర్తింపు ఇస్తున్నట్లు ప్రకటించింది. దీనిపై ఆఫ్రియన్ యూనియన్ అధ్యక్షుడు మహమూద్ అలీ యూసుఫ్ స్పందిస్తూ.. 'సోమాలియా సార్వభౌమాధికారానికి భంగం కలిగించే ప్రయత్నాలు ఆఫ్రికా ఖండంలో శాంతి సుస్థిరతలకు విఘాతం కలిగిస్తాయి' అని వ్యాఖ్యానించారు. సోమాలీలాండ్ ప్రాంతం ఫెడరల్ రిపబ్లిక్ ఆఫ్ సోమాలియాలో భాగమేనని స్పష్టం చేశారు.

జుట్టు కోసం తల్లి వాడే మందుతో శిశువులకు ముప్పు!

దిల్లీ: జుట్టు రాలుతున్న సమస్యకు తల్లులు మినోక్సిడిల్ అనే ఔషధాన్ని ఉపయోగిస్తే వారి శిశువులకు హైపర్‌ట్రైకోసిస్ అనే సమస్య ఉత్పన్నం కావొచ్చని తాజా అధ్యయనం చెబుతోంది. దీనివల్ల ఆ చిన్నారుల్లో శరీరంపై అసాధారణ స్థాయిలో వెంట్రుకలు పెరుగుతాయని పేర్కొంది. సాధారణంగా వెంట్రుకలు మొలవని చోట్ల కూడా అవి పుట్టుకురావొచ్చని వివరించింది. దిల్లీలోని ఎయిమ్స్, కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ పరిశోధకులు ఈ అధ్యయనాన్ని చేశారు. ఇందులో భాగంగా వారు ప్రపంచవ్యాప్తంగా 2,664 మంది శిశువుల్లో హైపర్‌ట్రైకోసిస్ కేసులను పరిశీలించారు. ఇందులో 45 కేసులు 23 నెలలలోపు పిల్లలవేనని వారు పేర్కొన్నారు. ఈ కేసుల్లో 22 శాతం మందికి వారి తల్లి మినియోక్సిడిల్ వాడటం వల్లే ఈ పరిస్థితి ఉత్పన్నమైనట్లు తేలింది. 44.4 శాతం మంది ప్రమాదవశాత్తు ఈ ఔషధం తాకిడికి గురయ్యారు. 33 శాతం మందిలో ఆ పరిస్థితి ఎందుకు ఉత్పన్నమైందన్నది వెల్లడికాలేదు. సాధారణ జనాభాలో 1,669 కేసుల్లో నేత్ర సంబంధ సమస్యలు తలెత్తాయి. అందులో 25 కేసులు భారత్‌లోనే నమోదయ్యాయి. వీరిలో కంటివాపు, చూపు మసకబారడం వంటివి ఉత్పన్నమయ్యాయి. నిజానికి మినాక్సిడిల్‌ను అధిక రక్తపోటుకు చికిత్స కోసం రూపొందించారు. ఆ తర్వాత దాన్ని మహిళలు, పురుషుల్లో జుట్టు రాలే సమస్యకు చికిత్సకు ఉపయోగించడం మొదలుపెట్టారు. అయితే ఈ ఔషధాన్ని ఎలాంటి నియంత్రణ లేకుండా విక్రయించడంపై ఆందోళన వ్యక్తమవుతోంది. గర్భిణులు, పిల్లలకు పాలిచ్చే తల్లులు దీన్ని ఉపయోగించకూడదని చెప్పినా.. కొన్ని సందర్భాల్లో అది ఉల్లంఘనకు గురవుతున్నట్లు డేటా చెబుతోంది.

పాక్‌లో 17 మంది ఉగ్రవాదుల హతం

కరాచీ: కల్లోలిత బలోచిస్థాన్ రాష్ట్రంలో ఒక ఉగ్రవాద ముఠాకు చెందిన 17 మందిని పాకిస్థాన్ భద్రతా దళాలు హతమార్చాయి. నిఘా విభాగాల సమాచారం ఆధారంగా ఈ చర్య తీసుకున్నట్లు పాక్ సైన్యానికి చెందిన మీడియా విభాగం ఇంటర్ సర్వీసెస్ పబ్లిక్ రిలేషన్స్ (ఐఎస్‌పీఆర్) శనివారం వెల్లడించింది. ఈ ఉగ్రవాదుల్ని ఈ నెల 24 నుంచి 26 వరకూ నిర్వహించిన భిన్న ఆపరేషన్లలో తుదముట్టించినట్లు పేర్కొంది. ఇందులో నలుగుర్ని పంజ్‌గుర్ జిల్లాలో అంతమొందించామని తెలిపింది. అలాగే కోహ్లూలో జరిగిన భారీ ఎన్‌కౌంటర్‌లో ఐదుగురు ఉగ్రవాదులు మృతి చెందారని వివరించింది. కలాట్ ప్రాంతంలో జరిగిన కాల్పుల్లో 8 మంది మృతి చెందాదరి తెలిపింది. ఉగ్రవాదుల నుంచి ఆయుధాలు, మందుగుండు సామగ్రి, పేలుడు సామగ్రి స్వాధీనం చేసుకున్నామని వెల్లడించింది.

వాయు కాలుష్యంతో భారత్‌కు అతి పెద్ద ముప్పు

- శ్వాసకోశ వ్యాధులు సునామీలా విరుచుకుపడే అవకాశం
- నిపుణుల హెచ్చరిక

దిల్లీ: కొవిడ్ తరవాత భారతదేశానికి ఎదురవుతున్న అతిపెద్ద ప్రమాదం వాయు కాలుష్యమేననీ, దీన్ని నివారించడానికి సత్వరం కార్యాచరణ చేపట్టకపోతే పరిస్థితి ఏటేటా దిగజారిపోతుందని బ్రిటన్‌లోని భారత సంతతి శ్వాసకోశ వ్యాధి నిపుణులు మనీశ్ గౌతమ్, రజయ్ నారాయణ్‌లతో పాటు బ్రిటిష్ మిడ్‌ల్యాండ్ మెట్రోపాలిటన్ విశ్వవిద్యాలయ ఆస్పత్రి ఆచార్యుడు డెరెక్ కానల్లీ హెచ్చరించారు. వాయు కాలుష్యం వల్ల కంటికి కనిపించకుండా శ్వాసకోశ వ్యాధులు గూడుకడుతున్నాయనీ, ఏదో ఒకనాడు అవి సునామీలా విరుచుకుపడతాయని వీరు వెల్లడించారు. "మోటారు వాహనాలు, విమానాలు వెదజల్లే కర్బన ఉద్గారాలు ఇప్పటికే ప్రపంచ వ్యాప్తంగా హృదయ, రక్తనాళాల వ్యాధులకు దారితీస్తున్నాయి. స్థూలకాయం కన్నా వాయు కాలుష్యమే ఈ వ్యాధులకు మూలకారణం. వాహనాల పొగలకు తోడు పంట వ్యర్థాల దహనం వల్ల ఏర్పడుతున్న వాయు కాలుష్యంతో ఉత్తర భారతంలో కోట్లమంది ప్రభావితమవుతున్నారు'' అని మనీష్ గౌతమ్ పేర్కొన్నారు. "నేడు ప్రపంచంలో అత్యంత తీవ్రంగా వాయు కాలుష్యం బారిన పడిన నగరంగా దిల్లీ రికార్డులకెక్కింది. ఈ డిసెంబరులో దిల్లీ ఆస్పత్రుల్లో చేరిన శ్వాసకోశ రోగుల సంఖ్య 20 నుంచి 30 శాతం పెరిగింది. వీరిలో యువజనులు, మొదటిసారి శ్వాసకోశ వ్యాధుల బారినపడినవారు కూడా ఉన్నారు. వాయు కాలుష్యం వల్ల శ్వాసకోశ రోగాలతోపాటు హృదయ,రక్తనాళ వ్యాధులు, నాడీ సంబంధ వ్యాధులు కూడా వస్తాయి'' అని బ్రిటన్‌లోని హృద్రోగ నిపుణుడు రజయ్ నారాయణ్ హెచ్చరించారు.



ప్రేయసి కోసం సరిహద్దు దాటి.. పాక్‌లో జైలుపాలై కష్టాలు



ఈటీవీ భారత్: ప్రేమ మైకంలో పాకిస్థాన్ సరిహద్దును అక్రమంగా దాటి జైలుపాలైన ఉత్తర్‌ప్రదేశ్‌లోని అలీగఢ్‌కు చెందిన బాదల్ బాబు ఏడాది శిక్ష అనుభవించాక జైలు నుంచి విడుదలై ఇంటికి తిరిగి రానున్నాడు. పాక్ జైలు నుంచి నిర్బంధ కేంద్రానికి చేరుకున్న బాదల్ భారత్‌కు పంపే ముందు అధికారులు పూర్తిచేసే లాంఛనాల కోసం ఎదురుచూస్తున్నాడు. అలీగఢ్ జిల్లాలోని బరలా పోలీస్‌స్టేషను పరిధికి చెందిన బాదల్ పాక్ యువతి సనా రాణితో ఫేస్‌బుక్ స్నేహం చేశాడు. ఛాటింగు ముదిరి ప్రేమగా మారడంతో ఎలాగైనా సరిహద్దు దాటి ప్రేయసిని కలుసుకోవాలని బాదల్ నిశ్చయించుకున్నాడు. ఈ ప్రయత్నంలో 2024 డిసెంబరు 27న పాక్ సైనికులకు పట్టుబడి జైలుపాలయ్యాడు. బాదల్‌ను భారత గూఢచారిగా అనుమానించి సుదీర్ఘ విచారణ జరిపినా ఎటువంటి ఆధారం లభించలేదు. దీంతో కోర్టు ఏడాది జైలుశిక్షతో సరిపెట్టింది. బాదల్ కోసం ఎదురుచూస్తున్న అతడి కుటుంబం పాక్ న్యాయవాది ఫయాజ్ ఫోను చేసి విడుదల సమాచారం అందించడంతో ఊపిరి పీల్చుకుంటోంది. తన కుమారుడు సురక్షితంగా స్వదేశానికి చేరేలా చూడాలని బాదల్ తండ్రి కృపాల్‌సింగ్ భారత ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

భారత వ్యతిరేక ప్రపంచ కూటమిలో కాంగ్రెస్ పార్టీ భాగస్వామి

రాహుల్‌గాంధీ జర్మనీ పర్యటనపై భాజపా ధ్వజం

దిల్లీ: కాంగ్రెస్ పార్టీ నిజ స్వరూపం ఏమిటో రాహుల్ గాంధీ కుటుంబ సలహాదారైన శామ్ పిట్రోడా అన్యాపదంగా చెప్పిన మాటల్లో వెల్లడైందని భాజపా విమర్శలు గుప్పించింది. భారత్‌కు వ్యతిరేకంగా ఆవిర్భవించిన ప్రపంచ కూటమి.. గ్లోబల్ ప్రోగ్రెసివ్ అలయెన్స్ (జీపీఏ)లో కాంగ్రెస్ పార్టీ కూడా భాగస్వామి అని స్పష్టమైందని పేర్కొంది. ఆ కూటమి కార్యక్రమాల్లో పాల్గొనేందుకే రాహుల్ గాంధీ జర్మనీ పర్యటనకు వెళ్లారని భాజపా జాతీయ అధికార ప్రతినిధి సుధాంశు త్రివేది ఆరోపించారు. జీపీఏ అధ్యక్ష మండలిలో రాహుల్ గాంధీ కూడా ఉన్నారనే విషయాన్ని శామ్ పిట్రోడా శనివారం ఇంటర్వ్యూలో బహిర్గతం చేశారని త్రివేది తెలిపారు. అధికారంలోకి రావడానికి పగటి కలలు కంటున్న రాహుల్ గాంధీ భారత్ వ్యతిరేక శక్తులతో చేతులు కలుపుతున్నారని, బెర్లిన్‌లో జరిగిన భేటీ దీనిలో భాగమేనని భాజపా నేత ఆరోపించారు.

రాహుల్ నాయకత్వంపై కాంగ్రెస్‌లో అసమ్మతి

భాజపా, ఆరెస్సెస్‌ల సంస్థాగత బలాన్ని ప్రశంసిస్తూ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత దిగ్విజయ్ సింగ్ వ్యాఖ్యలు చేయడం రాహుల్ గాంధీ నాయకత్వంపై ఆ పార్టీలో పెరుగుతున్న అసంతృప్తికి నిదర్శనమని సుధాంశు త్రివేది తెలిపారు. ముడి వజ్రం వంటి నరేంద్ర మోదీ తాను ప్రకాశిస్తూ భాజపాను కూడా బలోపేతం చేశారని పేర్కొన్నారు. తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ మొదలుకుని రాహుల్ నాయకత్వం వరకు వైఫల్యాల వల్లే కాంగ్రెస్ పార్టీ భవితవ్యం అగమ్యగోచరంగా మారుతోందని విమర్శించారు.



రెండు నిమిషాల్లో.. రూ.కోటి విలువైన నగల చోరీ

ఇంటర్నెట్‌డెస్క్: మహారాష్ట్రలోని పుణెలో దొంగలు బీభత్సం సృష్టించారు. పట్టపగలే ఆయుధాలతో ఓ నగల దుకాణంలోకి చొరబడి.. కేవలం రెండు నిమిషాల్లో కోటి రూపాయల విలువైన ఆభరణాలను దోచేశారు. దీనికి సంబంధించిన దృశ్యాలు నెట్టింట వైరల్ అవుతున్నాయి. శుక్రవారం మధ్యాహ్నం బానర్ ప్రాంతంలోని వైష్ణవి నగల దుకాణంలో ఈ ఘటన జరిగింది. ఆ సమయంలో యజమాని సహా ఆయన కుటుంబసభ్యులు షాపులోనే ఉన్నారు. ఈ క్రమంలో ఐదుగురు దొంగలు రెండు బైకులపై వచ్చి ఆయుధాలతో వారిని బెదిరించి చోరీకి పాల్పడ్డారు. దొంగతనానికి కొన్ని రోజుల ముందు నుంచే నిందితులు ఈ ప్రాంతంలో రెక్కీ చేశారని, వారి కోసం గాలింపు చర్యలు చేపట్టామని పోలీసులు తెలిపారు.

కవచ్ లక్ష్యాన్ని చేరలేకపోయిన రైల్వే



దిల్లీ: దేశంలో ప్రధానమైనవైన దిల్లీ-ముంబయి, దిల్లీ-హావ్‌డా రైలు మార్గాల్లో 'కవచ్' ఆటోమేటిక్ రైలు రక్షణ వ్యవస్థను ఈ నెలాఖరులోగా ఏర్పాటు చేయాలన్న లక్ష్యాన్ని రైల్వే శాఖ చేరుకోలేకపోయింది. ఇది 2026లో పూర్తవుతుందనే ఆశాభావంతో అధికారవర్గాలు ఉన్నాయి. రైళ్ల ప్రమాదాల బారిన పడకుండా లోకోపైలట్లకు సహాయపడటంలో కీలకపాత్ర పోషించే కవచ్ వ్యవస్థను దేశీయంగా రూపొందించి దశలవారీగా విస్తరిస్తూ వస్తున్న విషయం తెలిసిందే. ఈ రెండు మార్గాల్లో పనులు 25% పనులు పూర్తయి, వాడుకునేందుకు వీలుగా సిద్ధంగా ఉన్నాయి. మిగిలిన చోట్ల ఆయా పరికరాలు, సామగ్రి అమరిక చాలావరకు పూర్తయింది. నిజానికి ఈ మార్గాల్లో పనులు 2025 మార్చికే పూర్తికావాలి. తర్వాత గడువును డిసెంబరు వరకు పెంచారు. దీనిపై కాంగ్రెస్ ఎంపీ మల్లు రవి అడిగిన ప్రశ్నకు రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ ఇటీవల లోక్‌సభలో బదులిచ్చారు. "దిల్లీ-ముంబయి మార్గంలో 738 రూట్ కి.మీ, హావ్‌డా మార్గంలో 633 రూట్ కి.మీ. మేర కవచ్ 4.0 ప్రారంభమైంది. మిగిలిన చోట్ల పనులు జరుగుతున్నాయి. 7,129 కి.మీ. మేర ఆప్టికల్ ఫైబర్ కేబుల్ పనులు, 800 టెలికం టవర్ల పనులు పూర్తయ్యాయి. 4,154 రైలింజన్లలో, 860 స్టేషన్లలో పరికరాల బిగింపు పూర్తయింది" అని వివరించారు. ద.మ.రైల్వేలో 1,465 రూట్ కి.మీ. మేర కవచ్ 3.2ను విజయవంతంగా పరీక్షించినట్లు రైల్వేశాఖ తెలిపింది. దేశంలో స్వర్ణ చతుర్భుజి మార్గాల్లో 15,512 రూట్ కి.మీ. మేర కవచ్ అమల్లోకి వచ్చింది.



క్రిస్మస్ సెలవుల సందర్భంగా ఆగ్రాలోని తాజ్‌మహల్ సందర్శనకు శనివారం పోటెత్తిన పర్యాటకులు

కెనడాలోని భారతీయ మహిళలకు..

'వన్ స్టాప్ సెంటర్'

టొరంటో: కెనడాలో ఆపదలో ఉన్న భారతీయ మహిళల కోసం ప్రత్యేక సహాయ కేంద్రం ఏర్పాటైంది. 'వన్ స్టాప్ సెంటర్ ఫర్ ఉమెన్ (ఓఎస్‌సీడబ్ల్యూ)'ను టొరంటోలో ప్రారంభించినట్లు భారత కాన్సులేట్ వెల్లడించింది. 24 గంటలపాటు అందుబాటులో ఉండే విధంగా హెల్ప్‌లైన్‌ను కూడా ఏర్పాటు చేసినట్లు పేర్కొంది. గృహహింస, దాడి, కుటుంబ వివాదాలు, దోపిడీ, న్యాయపరమైన సవాళ్లు ఎదుర్కొనే భారత పాస్‌పోర్టు కలిగిన మహిళలకు క్లిష్టమైన సమయంలో తోడుగా నిలిచే లక్ష్యంతో దీన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపింది. దీని ద్వారా బాధిత మహిళలకు తక్షణమే కౌన్సిలింగ్ ఇవ్వడం, మానసిక-సామాజిక మద్దతు అందించడం, ఆయా విభాగాల సమన్వయంతో చట్టపరమైన సాయం, సలహాలు అందిస్తామని వెల్లడించింది. కెనడా చట్టాలకు లోబడి ఓఎస్‌సీడబ్ల్యూ తోడ్పాటు అందిస్తుందని రాయబార కార్యాలయ వర్గాలు తెలిపాయి. మహిళా అధికారిణి నేతృత్వంలో ఈ కేంద్ర నిర్వహణ ఉంటుందని, వీటికి సంబంధించిన కాంటాక్టు వివరాలు కాన్సులేట్ వెబ్‌సైట్‌లో ఉన్నాయని తెలిపింది.

హాదీ సమాధి వద్ద తారిఖ్ రహ్మాన్ ప్రార్థనలు

ఢాకా: బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ (బీఎన్‌పీ) తాత్కాలిక అధ్యక్షుడు తారిఖ్ రహ్మాన్ శనివారం విద్యార్థి నాయకుడు షరీఫ్ ఉస్మాన్ హాదీకు నివాళులర్పించారు. భారీ భద్రత నడుమ ఢాకా విశ్వవిద్యాలయానికి చేరుకున్న ఆయన అక్కడి హాదీ సమాధి వద్ద ప్రార్థనలు చేశారు. దీంతో పాటు పక్కనే ఉన్న బంగ్లా జాతీయ కవి కజీ నజ్రుల్ ఇస్లాం సమాధి వద్ద కూడా ప్రార్థనలు చేసినట్లు డైలీ స్టార్ పత్రిక ఓ కథనంలో పేర్కొంది. మరోవైపు బంగ్లాదేశ్ ఓటరు జాబితా, జాతీయ గుర్తింపు కార్డు (ఎన్ఐడీ) కోసం రహ్మాన్ అధికారికంగా నమోదయ్యారు.

పాక్‌ను తేలిగ్గా తీసుకోవద్దు

కాంగ్రెస్ సీనియర్ నేత శశిథరూర్

ఇంటర్నెట్‌డెస్క్: పాకిస్థాన్‌లో మారుతున్న సైనిక వ్యూహాలు, అభివృద్ధి చెందుతున్న హైపర్ సోనిక్ క్షిపణి వ్యవస్థలను.. భారత్ తేలిగ్గా తీసుకోకూడదని కాంగ్రెస్ సీనియర్ నేత శశిథరూర్ హెచ్చరించారు. "పాక్‌తో ఉన్న గత అనుభవాల దృష్ట్యా ఏ పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలి. డ్రోన్లు, రాకెట్లు, క్షిపణుల తర్వాత హైపర్‌సోనిక్ సాంకేతికతపై పాక్ దృష్టిసారించింది. ఇది భారత్ తేలికగా తీసుకునే విషయం కాదు. పాక్‌లో ప్రజాస్వామ్యం నామమాత్రమే. ఇప్పటికీ సైనిక ఆధిపత్యమే" అని పేర్కొన్నారు.

వాయు కాలుష్యంతో ఒత్తిడి



దిల్లీ: వాయుకాలుష్యం శారీరక ఆరోగ్యాన్నే కాదని, మానసిక ఆరోగ్యాన్ని దెబ్బతీస్తుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా చిన్నారుల్లో జ్ఞాపకశక్తి తగ్గిపోవడం, ఏకాగ్రత పడిపోవడంతో పాటు అటెన్షన్ డెఫిసిట్ హైపర్ యాక్టివిటీ డిజార్డర్ (ఏడీహెచ్‌డీ) వచ్చే ప్రమాదముందని పేర్కొంటున్నారు. మానసిక ఆరోగ్యానికి, వాయు కాలుష్యానికి మధ్య ఉన్న సంబంధంపై జరుగుతున్న వివిధ పరిశోధనల గురించి పలువురు సైకియాట్రిస్టులు, సైకాలజిస్టులు వివరించారు. ఆ వివరాల ప్రకారం.. వాయు కాలుష్య ప్రభావానికి ఎక్కువగా లోనైతే ఆందోళన, కుంగుబాటు, జ్ఞాపకశక్తి క్షీణత మొదలైన సమస్యలు తలెత్తుతాయని తేలింది. కొన్నిసార్లు అల్జీమర్స్, పార్కిన్సన్స్ బారిన పడొచ్చు. అంతగా కాలుష్యం లేని నగరాలతో పోలిస్తే కాలుష్యంతో సతమతమవుతున్న దిల్లీలో ఒత్తిడి, ఆందోళనతో ఆసుపత్రులకు వస్తున్న వారి సంఖ్య 40 శాతం ఎక్కువగా ఉందని సైకియాట్రిస్ట్ డాక్టర్ అంజలీ మిగ్లానీ తెలిపారు. వాయు కాలుష్యాన్ని మెంటల్ హెల్త్ ఎమర్జెన్సీగా ప్రకటించి, ఆ కోణంలో విధివిధానాలను రూపొందించాలని ప్రభుత్వాలకు పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ జితేందర్ నాగ్‌పాల్, ఎయిమ్స్‌లో సైకాలజిస్ట్ డా.దీపికా దహిమా సూచించారు.

20లోగా భాజపా అధ్యక్ష ఎన్నిక!

నితిన్ నబీన్‌కే అవకాశం..



ఈటీవీ భారత్: భారతీయ జనతా పార్టీ (భాజపా) నూతన అధ్యక్షుడి ఎన్నికకు రంగం సిద్ధమవుతోంది. జనవరి 20వ తేదీలోగా అధ్యక్ష ఎన్నికను పూర్తి చేయాలని ఆ పార్టీ భావిస్తోంది. పార్టీ భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని యువతరానికి పెద్ద పీట వేయాలన్న వ్యూహంలో భాగంగా ఇటీవల కార్యనిర్వాహక అధ్యక్షుడిగా నియమితులైన 45 ఏళ్ల నితిన్ నబీన్‌నే ఈ పదవికి ఎంపిక చేయనున్నట్లు సమాచారం.

■ భాజపా అధ్యక్ష ఎన్నికల ప్రక్రియ జనవరి 15 తర్వాత వేగం పుంజుకోనుంది. దేశవ్యాప్తంగా ఉన్న పార్టీ రాష్ట్రశాఖల అధ్యక్షులకు దిల్లీ రావాలని పిలుపు వెళ్లనుంది. జనవరి 18 నుంచి 20 మధ్య మూడు రోజులపాటు ఎన్నికల ప్రక్రియ జరగనుంది. జనవరి 20వ తేదీ నాటికి కొత్త అధ్యక్షుడిని అధికారికంగా ప్రకటించే అవకాశముందని పార్టీ వర్గాలు తెలిపాయి.

ప్రభుత్వ ఖర్చుతో బాబా పర్యటన..

కాళ్లు మొక్కిన పోలీసు

- విమర్శలు గుప్పించిన ప్రతిపక్షం

రాయ్‌పుర్: ఛత్తీస్‌గఢ్ పర్యటనలో ఉన్న బాగేశ్వర్ ధామ్ అధిపతి ధీరేంద్ర శాస్త్రి అలియాస్ బాగేశ్వర్ బాబా కాళ్లకు ఓ పోలీసు అధికారి షూ, టోపీ తీసి నమస్కరించడం రాష్ట్ర రాజకీయాల్లో వివాదానికి దారితీసింది. పర్యటన సమయంలో బాగేశ్వర్ బాబా ప్రభుత్వ విమానంలో ప్రయాణించడాన్ని విపక్షాలు విమర్శిస్తున్నాయి. దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారడంతో అదికాస్త తీవ్ర చర్చకు దారితీసింది. ఎలాంటి అధికారిక, రాజ్యాంగపరమైన హోదా లేని బాగేశ్వర్ బాబా ప్రయాణానికి ప్రభుత్వ విమానాలను ఎలా ఉపయోగిస్తారని ప్రతిపక్ష నాయకులు ప్రశ్నించారు. పోలీసు అధికారి ఈవిధంగా మత ప్రబోధకుడి కాళ్లకు నమస్కరించడం సరైన చర్య కాదని కాంగ్రెస్ నేతలు విమర్శలు గుప్పించారు. వీడియోలో బాగేశ్వర్ బాబా రాయ్‌పుర్ విమానాశ్రయంలో విమానం దిగిన వెంటనే అక్కడ ఉన్న ఓ పోలీసు అధికారి షూ, టోపీ తీసి బాబా కాళ్లకు నమస్కరించినట్లు కనిపిస్తోంది. ప్రజల నుంచి పన్ను రూపంలో వచ్చిన డబ్బును రాష్ట్ర ప్రభుత్వం ఇలాంటి అనవసర ఖర్చులకు ఉపయోగిస్తోందని మండిపడ్డారు. పోలీసు అధికారిపై వస్తున్న విమర్శలపై రాయ్‌పుర్ సీనియర్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్(ఎస్ఎస్‌పీ) లాల్ ఉమేద్ సింగ్ స్పందిస్తూ.. ఘటన జరిగిన సమయంలో పోలీసు అధికారి పూర్తి యూనిఫాంలో లేరని.. అప్పటికే అతడు తన టోపీ, షూ తీసివేసినందున సర్వీస్ నిబంధనలను ఉల్లంఘించినట్లు కాదన్నారు.



ఉన్నావ్ నేరస్థుడికి పరోక్ష సహకారం

- దర్యాప్తు అధికారిపై అత్యాచార బాధితురాలి ఫిర్యాదు

దిల్లీ: ఉన్నావ్ అత్యాచార కేసులో దోషిగా తేలిన భాజపా మాజీ ఎమ్మెల్యే కులదీప్ సింగ్‌కు పరోక్ష సహకారం అందించేందుకు యత్నించిన దర్యాప్తు అధికారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ బాధితురాలు శనివారం సీబీఐకి ఫిర్యాదు చేశారు. ఆ అధికారి దురుద్దేశంతోనే దర్యాప్తును పక్కదారి పట్టించేయత్నం చేశారని, వాస్తవాలను మరుగుపరిచి బాధితురాలిని తనపై దురభిప్రాయం కలిగించేలా చేస్తూ నిందితుడికి రహస్యంగా తోడ్పాటునందించారని ఆ సీబీఐ ఫిర్యాదులో ఆమె పేర్కొన్నారు. తద్వారా కేసు నుంచి కులదీప్ సింగ్‌ను రక్షించాలన్నది అధికారి అసలు ఉద్దేశమన్నారు. దోషి కులదీప్ సింగ్‌కు దిల్లీ హైకోర్టు జీవిత ఖైదును నిలిపివేయడంతో పాటు షరతులతో బెయిల్ మంజూరు చేయడంపై విమర్శలు వెల్లువెత్తుతున్న నేపథ్యంలో తాజా పరిణామం చోటుచేసుకుంది. బాధితురాలి తండ్రి కస్టడీలో మృతి చెందిన కేసులోనూ కులదీప్ సింగ్ దోషిగా ఉన్నాడు. ఈ కేసులో కోర్టు పదేళ్ల శిక్ష విధించినందున కులదీప్ ప్రస్తుతం జైలు నుంచి విడుదల కాలేదు. ఆ దర్యాప్తు అధికారిపై గతంలోనే ఫిర్యాదు చేసినా ఇప్పటి వరకూ చర్యలు తీసుకోలేదని బాధితురాలు తెలిపారు.



ఉన్నావ్ అత్యాచార కేసు బాధితురాలికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ శనివారం పార్లమెంటు ఆవరణలో మహిళా సంఘాల ఆందోళన

ఆధునిక నేరాలను సమర్థంగా ఎదుర్కోవాలి

- హోం మంత్రి అనిత



హోం మంత్రి అనితను సన్మానించి, జ్ఞాపిక అందజేస్తున్న సీఐడీ విభాగాధిపతి రవిశంకర్ అయ్యన్నార్

ఈనాడు, అమరావతి: సైబర్ మోసాలు, డీప్ ఫేక్ వంటి నేరాలను ఎదుర్కొనేందుకు దర్యాప్తు అధికారులు ఎప్పటికప్పుడు అప్‌డేట్ కావాలని హోం మంత్రి అనిత అన్నారు. నేర నియంత్రణ, దర్యాప్తు, ఛేదనలో సాంకేతికతను విస్తృతంగా వినియోగించాలని సూచించారు. దోషులకు త్వరితగతిన శిక్షలు పడేలా చర్యలు తీసుకోవాలన్నారు. తాడేపల్లిలోని ఓ హోటల్‌లో శనివారం ఏపీ సీఐడీ వార్షిక నేర సమీక్షా సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన అనిత మాట్లాడుతూ.. పలు సూచనలు చేశారు. నేర పరిశోధనలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన 12 మంది అధికారులకు పురస్కారాలు అందించారు. సీఐడీ విభాగాధిపతి రవిశంకర్ అయ్యన్నార్, న్యాయ సలహాదారు లక్ష్మణరావు, సీఐడీ సిబ్బంది పాల్గొన్నారు.

డ్రగ్స్ కేసులో సినీ నటి రకుల్ సోదరుడు అమన్!

- పరారీలో ఉన్న నిందితుల కోసం పోలీసుల గాలింపు



అమన్ ప్రీత్‌సింగ్

ఈనాడు, హైదరాబాద్: అంతర్రాష్ట్ర డ్రగ్స్ ముఠాలతో సంబంధాలున్నట్లు విచారణలో తేలడంతో సినీ నటి రకుల్ ప్రీత్‌సింగ్ సోదరుడు అమన్‌సింగ్ కోసం పోలీసులు గాలిస్తున్నారు. ఈ నెల 19న హైదరాబాద్ బంజారాహిల్స్ సమీపంలోని మాల్ వద్ద ఈగల్, మాసబ్‌ట్యాంక్ పోలీసులు మాదకద్రవ్యాలు సరఫరా చేస్తున్న నితిన్ సింఘానియా, షర్నిక్ సంఘీలను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 43.7 గ్రాముల కొకైన్, 11.5 గ్రాముల ఎండీఎంఏ స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నిందితుల సెల్‌ఫోన్లలో దొరికిన సమాచారం ప్రకారం అమన్‌సింగ్ నెలరోజుల వ్యవధిలో ఆరుసార్లు డ్రగ్స్ కొనుగోలు చేసినట్లు నిర్ధారణకు వచ్చారు. ఆన్‌లైన్ ద్వారా వారికి నగదు చెల్లింపులు జరిపినట్లు గుర్తించారు. ఇతడితో పాటు ఓజీ సరఫరాదారుడు రిషబ్, కొనుగోలుదారులు వేదాంత్ యష్, సీహెచ్ ధర్మతేజ పేర్లను గుర్తించారు. ప్రస్తుతం వీరంతా పరారీలో ఉన్నారని తెలిపారు. అంతేకాకుండా పట్టుబడ్డ నిందితులు విదేశీ డ్రగ్ ముఠాలతో చేసిన చాటింగ్‌ను సైతం గుర్తించారు. గతేడాది నార్సింగి వద్ద డ్రగ్స్ కేసులోనూ అమన్‌సింగ్‌పై కేసు నమోదైంది. ప్రస్తుతం ఈ నలుగురు నిందితుల ఆచూకీ కోసం రెండు ప్రత్యేక బృందాలు గాలిస్తున్నట్లు డీసీపీ చింతమనేని శ్రీనివాస్ వివరించారు.

రూ.3 కోట్లు ఇస్తావా..

బెట్టింగ్ కేసు పెట్టమంటావా?

- ఎస్‌వోటీ పోలీసుల పేరిట 8 గంటలపాటు వ్యాపారి నిర్బంధం
- నిందితుల్లో నలుగురి అరెస్టు.. పరారీలో ఒకరు

ఈనాడు, హైదరాబాద్‌- మూసాపేట, న్యూస్‌టుడే: హైదరాబాద్‌లో ఓ రొయ్యల వ్యాపారి ఇంట్లో నకిలీ పోలీసులు హల్‌చల్ చేశారు. బెట్టింగ్ నిర్వహిస్తున్నట్లు సమాచారముందని బెదిరించి రూ.3 కోట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. దాదాపు ఎనిమిది గంటలపాటు నిర్బంధించారు. ఈ ఘటనలో పోలీసులు నలుగుర్ని అరెస్టు చేశారు. ఒకరు పరారీలో ఉన్నారు. పోలీసులు తెలిపిన ప్రకారం... ఏపీకి చెందిన రొయ్యల వ్యాపారి హరీశ్‌కుమార్ రాజు తన మిత్రుడు రాజిరెడ్డితో కలిసి మూసాపేటలో మెరీనా స్కై అపార్ట్‌మెంట్ల సముదాయంలోని ఒక ఫ్లాటులో అద్దెకుంటున్నారు. శుక్రవారం ఉదయం 11 గంటల సమయంలో ఐదుగురు వ్యక్తులు హరీశ్‌కుమార్ ఇంటికి వచ్చారు. 'మేం మాదాపూర్ ఎస్‌ఓటీ (స్పెషల్ ఆపరేషన్స్ టీమ్) పోలీసులం. మీరు బెట్టింగ్‌లు నిర్వహిస్తున్నట్లు సమాచారముంది. అందుకు అదుపులోకి తీసుకుంటున్నాం' అని చెప్పి భయపెట్టారు. కేసు కావొద్దంటే రూ.3 కోట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. తన వద్ద అంత డబ్బు లేదని వ్యాపారి చెప్పడంతో ఇష్టారీతిన కొట్టారు. ఇతరుల్ని అడిగి ఇవ్వాలంటూ బంధుమిత్రులకు ఫోన్లు చేయించారు. సాయంత్రం 7 గంటల వరకు నిందితులంతా అక్కడే ఉన్నారు. హరీశ్ తన సమీప బంధువు ఒకరికి కాల్ చేసి.. పోలీసులు తనను అదుపులోకి తీసుకున్నారని, వెంటనే డబ్బు కావాలని చెప్పారు. అవతలి వ్యక్తి అనుమానించి... మాదాపూర్ ఎస్‌ఓటీ కానిస్టేబుల్‌కు సమాచారం ఇచ్చారు. మాదాపూర్ ఎస్‌ఓటీ పోలీసులు ఘటనా స్థలానికి రాగా... అప్పటికే నిందితుల్లో ముగ్గురు పరారయ్యారు. మిగిలిన ఇద్దరినీ అదుపులోకి తీసుకున్నారు. వారిని విచారించగా.. మరికొందరి పేర్లు తెలిశాయి. ఎల్బీనగర్‌కు చెందిన స్థిరాస్తి వ్యాపారి నర్సింహరాజు(40), సరూర్‌నగర్‌కు చెందిన రవీంద్రబాబు(36), హబ్సిగూడకు చెందిన ప్రశాంత్(34), నరేష్(37), రవికుమార్(36) ఇందులో పాల్గొన్నట్లు గుర్తించారు. నర్సింహరాజు మిత్రుడొకరు హరీశ్‌కుమార్ రాజు నిర్వహించిన బెట్టింగ్‌లో నష్టపోయి ఆత్మహత్య చేసుకున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో ఆయనను బెదిరించి డబ్బు వసూలు చేయాలని నిందితులు నకిలీ పోలీసుల అవతారమెత్తారు. కేసు నమోదు చేసిన పోలీసులు... నిందితుల్లో నలుగురిని అరెస్టు చేశారు. ఒకరు పరారీలో ఉన్నారు. హరీశ్‌కుమార్ రాజు బెట్టింగ్‌లు నిర్వహిస్తున్నట్లు నిందితులు చెప్పారని, ఆ కోణంలోనూ దర్యాప్తు చేస్తున్నట్లు కూకట్‌పల్లి ఇన్‌స్పెక్టర్ కేవీ సుబ్బారావు తెలిపారు.

రేపు అర్ధరాత్రి అనంతరం వైకుంఠద్వార దర్శనాలు ప్రారంభం

తిరుమల, న్యూస్‌టుడే: తిరుమలలో వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని తితిదే ఏర్పాట్లు చేసింది. సోమవారం అర్ధరాత్రి అనంతరం 12.05 గంటలకు శ్రీవారి ఆలయాన్ని తెరిచి ఏకాంతంగా పూజలు నిర్వహిస్తారు. 1.30 గంటలకు శ్రీవారి వైకుంఠద్వార దర్శనాన్ని ప్రారంభించేందుకు అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు. వీఐపీ దర్శనాల అనంతరం మంగళవారం ఉదయం ఆరు నుంచి ఈ-డిప్‌లో టోకెన్లు కలిగిన భక్తులు శ్రీవారిని దర్శించుకోనున్నారు.

నలుగురు ఐఏఎస్‌లకు ప్రత్యేక ప్రధాన కార్యదర్శి హోదా

- పలువురు ఐఏఎస్ అధికారులకు పదోన్నతులు

ఈనాడు, అమరావతి: ఆంధ్రప్రదేశ్ క్యాడర్‌కు చెందిన పలువురు ఐఏఎస్ అధికారులకు పదోన్నతి కల్పిస్తూ ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. వారిలో 1996 బ్యాచ్‌కు చెందిన నలుగురు సీనియర్ ఐఏఎస్‌లకు ప్రత్యేక ప్రధాన కార్యదర్శి హోదా కల్పించింది. ముఖ్యమంత్రికి ముఖ్య కార్యదర్శిగా ఉన్న ముద్దాడ రవిచంద్రతోపాటు, కేంద్ర సర్వీసులో ఉన్న లవ్ అగర్వాల్, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల ముఖ్య కార్యదర్శి శశిభూషణ్‌కుమార్, ఆర్థికంగా వెనుకబడిన వర్గాల (ఈడబ్ల్యూఎస్) సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి కె.సునీతలకు ఎబౌవ్ సూపర్ టైమ్ స్కేల్ (లెవెల్ 17)కు పదోన్నతి లభించింది. వీరిలో రవిచంద్ర, శశిభూషణ్ కుమార్, కె.సునీత వారు ఇప్పుడు నిర్వహిస్తున్న పోస్టుల్లోనే ప్రత్యేక ప్రధాన కార్యదర్శుల హోదాలో కొనసాగుతారు.

● కేంద్ర సర్వీసులో ఉన్న 2001 బ్యాచ్‌కి చెందిన ఐఏఎస్ అధికారి సిద్ధార్థ జైన్‌కి ముఖ్య కార్యదర్శిగా (ఎబౌవ్ సూపర్‌టైమ్ స్కేల్- లెవెల్ 15)కు పదోన్నతి లభించింది. ● 2010 బ్యాచ్‌కి చెందిన నారాయణ భరత్‌గుప్తా, ఆమ్రపాలి కాటా, జె.నివాస్, గంధం చంద్రుడు, సి.నాగరాణిలకు సూపర్ టైమ్ స్కేల్ (లెవెల్ 14)కు పదోన్నతి లభించింది. వీరికి కార్యదర్శి/ కమిషనర్ హోదా లభించింది. వీరిలో ప్రస్తుతం కార్మికశాఖ అదనపు కార్యదర్శిగా ఉన్న గంధం చంద్రుడిని.. కార్మికశాఖ కమిషనర్‌గా ప్రభుత్వం నియమించింది. ప్రస్తుతం ఎం.వి.శేషగిరిబాబు పూర్తి అదనపు బాధ్యతగా ఆ పోస్టు నిర్వహిస్తుండగా, ఆయన నుంచి ఆ బాధ్యతలు తప్పించింది. మిగతా ముగ్గురిని వారు ప్రస్తుతం నిర్వహిస్తున్న పోస్టుల్లోనే కొనసాగించింది.

● 2013 బ్యాచ్‌కు చెందిన 13 మంది ఐఏఎస్ అధికారులకు సెలక్షన్ గ్రేడ్ (లెవెల్ 13)కు పదోన్నతి కల్పించింది. వారిలో హిమాంశు శుక్లా, కృతికా శుక్లా, పి.రవిసుభాష్, సగిలి షణ్మోహన్, ఎ.ఎస్.దినేశ్‌కుమార్, కె.విజయ, జి.లక్ష్మీశ, లోతేటి శివశంకర్, ఎం.వేణుగోపాల్‌రెడ్డి, ఎన్.ప్రభాకర్‌రెడ్డి, పి.రంజిత్‌బాషా, ఎస్.దిల్లీరావు, పి.రాజాబాబు ఉన్నారు. ప్రస్తుతం వీరిలో కొందరు జిల్లా కలెక్టర్లుగా, మరి కొందరు వివిధ విభాగాలకు అధిపతులుగా ఉన్నారు.

● 2017 బ్యాచ్‌కు చెందిన 10 మంది ఐఏఎస్ అధికారుల్ని జూనియర్ అడ్మినిస్ట్రేటివ్ గ్రేడ్ (లెవెల్ 12)లో ప్రభుత్వం నియమించింది.

● 2022 బ్యాచ్‌కు చెందిన 8 మందిని సీనియర్ టైమ్ స్కేల్ (లెవెల్ 11)లో నియమించింది.

వైకాపా నాయకుల అక్రమాలపై చర్యలు తీసుకోండి

- తెదేపా గ్రీవెన్స్‌లో బాధితుల ఫిర్యాదు

ఈనాడు, అమరావతి: వైకాపా హయాంలో గ్రామానికి చెందిన వైకాపా నాయకుడు రాజకీయ దన్నుతో.. తన భర్త పేరుతో ఉన్న భూమిని అక్రమంగా వేరొకరి పేరుతో ఆన్‌లైన్‌లో మార్పించారని సత్యసాయి జిల్లా వెంకటపల్లికి చెందిన నరసమ్మ ఫిర్యాదు చేశారు. సీకే పల్లిలో ప్రభుత్వం కేటాయించిన భూమి రికార్డులు తన భర్త మరణం తర్వాత అక్రమంగా మార్పించినవారిపై చర్యలు తీసుకుని, న్యాయం చేయాలని అర్జీ ఇచ్చారు. మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో శనివారం నిర్వహించిన ప్రజా విజ్ఞప్తుల కార్యక్రమంలో ఏపీ ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ డేగల ప్రభాకర్ బాధితుల నుంచి వినతులు స్వీకరించారు.

● వైకాపా నాయకురాలు తనను, తన చిన్న కుమారుడిని డబ్బుల విషయంలో వేధిస్తూ తప్పుడు కేసులు పెడుతూ, చంపేస్తానని బెదిరిస్తున్నారని శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా వడ్డిపాలెం గ్రామానికి చెందిన విజయమ్మ అర్జీ ఇచ్చారు. కోవూరు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదుచేసినా న్యాయం జరగలేదని వాపోయారు.

● చట్టబద్ధంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్న 25 సెంట్ల భూమిని నిషేధిత జాబితాలో చేర్చడం వల్ల బ్యాంకు రుణాలు పొందే అవకాశం లేకుండా పోయిందని ఎన్టీఆర్ జిల్లా రామచంద్రాపురం గ్రామానికి చెందిన రాణి వినతిపత్రం ఇచ్చారు.

● కౌలుకు తీసుకుని సాగుచేస్తున్న 1.30 ఎకరాల పసుపు పంటను గ్రామానికి చెందిన వ్యక్తి ఉద్దేశపూర్వకంగా విషపూరిత మందు చల్లి నాశనం చేశాడని, రూ.10 లక్షలు నష్టపోయానని బాపట్ల జిల్లా పెదపులివర్రుకు చెందిన సురేంద్ర అర్జీ ఇచ్చారు.

● దళిత, పేద కుటుంబాలు 20 ఏళ్లుగా సాగుచేస్తున్న భూమికి పట్టాలు ఇప్పించాలని వైఎస్సార్ కడప జిల్లా బొప్పాపురం గ్రామానికి చెందిన కుమారి, రాణమ్మ, లలితమ్మ వినతిపత్రం అందించారు.

● తన భర్త బతికుండగా కొన్న ఇంటిస్థలం హద్దురాళ్లను కొందరు రైతులు తొలగించి పంటలు సాగు చేసుకుంటున్నారని, సర్వే చేసి భూ సమస్యకు పరిష్కారం చూపాలని కోరుతున్నా రెవెన్యూ అధికారులు స్పందించడం లేదని కడప జిల్లా ప్రొద్దుటూరుకు చెందిన వాసవి సుమిత్ర ఫిర్యాదు చేశారు.

గుంటూరు జిల్లాలో మరో ఏడాది ఏఎంఆర్‌తో సీనరేజ్ వసూళ్లు

- ఉత్తర్వులు జారీచేసిన ప్రభుత్వం

ఈనాడు, అమరావతి: ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలో సీనరేజ్ వసూళ్ల గుత్తేదారుగా ఉన్న ఏఎంఆర్ ఇండియా లిమిటెడ్ సంస్థ మరో ఏడాదిపాటు కొనసాగేందుకు అవకాశం కల్పిస్తూ ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు జారీచేసింది. ఈ సంస్థ 2023, సెప్టెంబరు 29 నుంచి ఉమ్మడి గుంటూరు జిల్లాలో సీనరేజ్ వసూళ్లు చేస్తోంది. అప్పట్లో రెండేళ్ల కాలానికి రూ.252.10 కోట్లు చెల్లించేలా ఒప్పందం చేసుకుంది. ఆ గడువు ఈ ఏడాది సెప్టెంబరు 28తో ముగియాల్సి ఉంది. అయితే గత ఏడాది 97 రోజులపాటు సీనరేజ్ వసూళ్లు ఆపేశారు. దీంతో ఆ మేరకు మళ్లీ అవకాశం కల్పిస్తారు. వచ్చేనెల 3వ తేదీతో ఏఎంఆర్ సంస్థ గడువు ముగుస్తుంది. తాజాగా మరో ఏడాదిపాటు సీనరేజ్ వసూళ్లు కొనసాగించేందుకు అవకాశం కల్పించాలని ఏఎంఆర్ సంస్థ అభ్యర్థించింది. దీంతో ఏడాదిపాటు కాంట్రాక్ట్ గడువు పెంచుతూ, జీఎస్టీ కాకుండా రూ.128.15 కోట్లు చెల్లించాలని పేర్కొంటూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది.

ప్రభుత్వాసుపత్రుల్లో 784 మంది

పీజీ వైద్యుల నియామకానికి కసరత్తు

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో కొత్తగా 784 మంది పీజీ వైద్యులను జనవరి 1 నుంచి అందుబాటులోకి తెచ్చేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. 2022-23 విద్యా సంవత్సరంలో రాష్ట్ర కన్వీనర్ కోటా కింద వైద్య విద్య పీజీలో చేరి, గత నెలలో చదువు పూర్తిచేసిన వారికి సామాజిక, ప్రాంతీయ, జిల్లా, బోధనా సుపత్రుల్లో పోస్టింగులు ఇవ్వనున్నారు. వీరిలో జనరల్ మెడిసిన్‌లో 110 మంది, జనరల్ సర్జరీ 91, గైనిక్ 87, ఎనస్థీషియా 81, ఆర్థో 53, పీడియాట్రిక్స్‌లో 58 మంది చొప్పున ఉన్నారు. మిగిలినవారు రేడియాలజీ, ఆప్తమాలజీ, ఈఎన్‌టీ, డెర్మటాలజీ, ఇతర స్పెషాలిటీలతో పాటు నాన్ క్లినికల్ కోర్సులు పూర్తిచేసిన వారున్నారు. ఆప్షన్ల నమోదుకు ఈ నెల 29 వరకు అవకాశం ఇచ్చారు. కౌన్సెలింగ్ ద్వారా పోస్టులు పొందినవారు జనవరి 5లోగా విధుల్లో చేరాలని వైద్య ఆరోగ్య శాఖ నిర్దేశించింది. 2014 నుంచి 2017 వరకు కొనసాగిన ఈ విధానం.. వివిధ కారణాలతో ఆగిందని, వైద్యుల కొరత అధిగమించేందుకు పునరుద్ధరించినట్లు వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఏటా సీనియర్ రెసిడెంట్ల సేవలు అందుబాటులో ఉంచుతామని వెల్లడించారు. వీరంతా బోధనాసుపత్రులు, సెకండరీ వైద్యశాలల్లో ఆరు నెలలు చొప్పున ఏడాది పాటు పనిచేయాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. వీరికి ప్రభుత్వం రూ.80,500 గౌరవ వేతనం చెల్లిస్తుందని వెల్లడించారు.



కొత్త ఏడాదిలో ఈ వ్యసనాన్ని అలవర్చుకోండి

నూతన సంవత్సరంలో ఓ కొత్త వ్యసనాన్ని అలవర్చుకోండి. అదేంటంటే ప్రతిరోజూ మిమ్మల్ని మీరు మెరుగుపర్చుకోవడం. ఈ వ్యసనానికి అలవాటు పడితే ఇక మీ ఆరోగ్యానికి, పురోగతికి చేటు చేసే ఇతర వ్యసనాల్ని తప్పక త్యజిస్తారు.

– జస్టిన్ వెల్ష్, సోలోప్రెన్యూర్

ప్రశాంతంగా ఫార్మసీ కౌన్సిల్ ఎన్నికల ఓట్ల లెక్కింపు

ఈనాడు, అమరావతి: ఆంధ్రప్రదేశ్ ఫార్మసీ కౌన్సిల్ ఎన్నికల ఓట్ల లెక్కింపు విజయవాడలోని రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ భవనంలో శనివారం నిర్వహించారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఎన్టీఆర్ వైద్యసేవ సీఈవో దినేశ్‌కుమార్ పర్యవేక్షణలో ఉదయం నుంచి అర్ధరాత్రి వరకు ఈ ప్రక్రియ సాగింది. ఆరుగురు సభ్యుల స్థానాలకు 44 మంది పోటీపడ్డారు. 60,934 మంది ఓటర్లుగా నమోదుకాగా, గడువులోగా 28,847 ఓట్లు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఏపీ ఫార్మసీ కార్యాలయానికి చేరాయి. వాటిలో 21,152 చెల్లిన ఓట్లుగా గుర్తించారు. ఫలితాలను ఆదివారం వెల్లడించనున్నారు. ఏపీ ఫార్మసీ రిజిస్ట్రార్ విలియం క్యారీ, ఆయుష్ డీడీ ధనుంజయరావు లెక్కింపునకు ఏర్పాట్లు చేశారు. ఏపీ ఫార్మసీ కౌన్సిల్‌కు చివరిగా 2010లో ఎన్నికలు జరిగాయి.